# ధన్వంతరిగారి చికిత్స

మూలం
కు.వెం.పు



తెలుగు అనువాదం
శాఖమూరు రామగోపాల్

# ధన్వంతరిగారి చికిత్స

మూలం

**కు.వెం.పు**

తెలుగు అనువాదం

**శాఖమూరు రామగోపాల్**

# ధన్వంతరిగారి చికిత్స

మూలం

**కు.వెం.పు**

తెలుగు అనువాదం

**శాఖమూరు రామగోపాల్**

**అభిజాత్య కన్నడ-తెలుగు భాషా (అనువాద) సంశోధన కేంద్రం (రిజిష్టర్డ్)**
ఇం.నెం. 5–10, రోడ్ నెం. 21, దీప్తిశ్రీనగర్, మియాపూర్ పోస్ట్
హైదరాబాద్ – 500 049. ఫోన్ : 040–65520286

**ధన్వంతరిగారి చికిత్స**
మూలం : కు.వెం.పు
అనువాదం : **శాఖమూరు రామగోపాల్**
అనువాదం : **శాఖమూరు రామగోపాల్**
ఇం.నెం. 5–10, రోడ్ నెం. 21,
దీప్తిశ్రీనగర్, మియాపూర్ పోస్ట్
**హైదరాబాద్ – 500 049.**
ఫోన్ : 040–65520286

© All original Kannada writers/Translator

ధర : రూ. 100/-

ముద్రణ
××××××××

డి.టి.పి.
చేగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి
సెల్: 9989253506

ప్రింటర్స్
**×××××××**
××××××××

ప్రతులకు:
**శాఖమూరు రామగోపాల్**
ఇం.నెం. 5–10, రోడ్ నెం. 21, దీప్తిశ్రీనగర్,
మియాపూర్ పోస్ట్, హైదరాబాద్ – 49.
ఫోన్: 04065520286, మొబైల్:9052563666

ప్రచురణ/పంపిణీదారులు:
**అభిజాత్య కన్నడ - తెలుగు భాషా (అనువాద) సంశోధన కేంద్రం (రిజిష్టర్డ్)**
ఇం.నెం. 5–10, రోడ్ నెం. 21, దీప్తిశ్రీనగర్, మియాపూర్ పోస్ట్
హైదరాబాద్ – 500 049. సెల్ : 9052563666221

# విషయ సూచి

1. ధన్వంతరిగారి చికిత్స ............ 1
2. నేను చంపిన యువతి ............ 13
3. లక్ష్మణరావ్‌గారి అదృష్టం ............ 38
4. తబరుడి కథ ............ 51
5. చర్మకారుడు ............ 65
6. గోపాలస్వామి పుష్కరిణి మరియు జలనారాయణ ............ 72
7. జోగి అంజప్ప కోడి కత ............ 81
8. గాంధి ............ 93
9. బీజం ............ 102
10. చివరి క్షణాలలో ............ 114
11. మీసాల మామ ............ 134
12. కొన్ని పనికిమాలిన రాతలు ............ 147
13. అజ్ఞానపు చీకట్లలోని కీడు ............ 155
14. పండుగలోని కానుక ............ 183
15. ఉద్ధారం (బాగుపడటం) ............ 193
16. రణ రణ మ్రోగే అలారం వాచ్ ............ 201

**ఆచార్య కొలకలూరి ఇనాక్**
పూర్వ ఉపాధ్యక్షులు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం

ఇం.నం.4-282, సర్వోదయ నగర్
మీర్‌పేట, హైదరాబాద్-97
ఫోన్ : 040-24093433
సెల్ : 9440243433

# నిజం చెప్పొద్దూ!

శ్రీ శాఖమూరు రామగోపాల్‌గారు రెండు నెలల క్రితం దాకా నాకు తెలియరు.

శ్రీభాస్కర్ గారింట్లో కలిసేదాకా ఆయన్నాకంతాత్మీయుడనీ తెలియదు.

ఇప్పుడు తెలుసు!

ఏం తెలుసు?

శ్రీరామగోపాల్‌గారిది తెనాలి అనీ, హైదరాబాద్‌లో స్థిరపడ్డారనీ, మియాపూర్‌లో ఉంటున్నారనీ – తెలుసు.

ఇంకా ఏం తెలుసు?

ఆయన కర్నాటకలో కొద్దికాలం నివసించారనీ, రాయచూరు ప్రాంతంలో వ్యవసాయభూములున్నాయనీ, కన్నడం మాతృభాష అంత బాగా వచ్చుననీ, ఎం.ఎ. చదివారనీ, ఏం ఉద్యోగం చేయడం లేదనీ, పిల్లల్ని బాగా చదివిస్తున్నారనీ,

ఇంతేనా?

ఇంతేనా అంటే ఇంతేకాదు, ఇంకా తెలుసు. శ్రీరామగోపాల్‌గారికి తెలుగు కూడా కన్నడం అంత బాగా వచ్చుననీ, మంచి కథానిక అంటే ప్రాణమనీ, కన్నడంలోని మంచి కథానికలు తెలుగు వాళ్ళు చదివే సదవకాశం కలిగించాలనీ, అందుకు వాటిని తెలుగులోకి అనువదించాలనీ, అందుకు అహరహం సాహిత్య అనువాద తపస్సు చేస్తున్నారనీ,

పేరెప్పుడూ వినలేదే!

నిజమే! నేనూ వినలేదు. ఈ మధ్యే విన్నాను. ఆ పరిచయం పరమ ఆత్మీయంగా మారిందనీ, వందల కథలు అనువాదం చేశారనీ, ఆరు సంకలనాలుగా వింగడించారనీ, వాటిని ఆంధ్ర సాహిత్య ప్రపంచానికి అందించే కృషి నిర్విరామంగా చేస్తున్నారనీ,

అంత పట్టుదలగా ఉన్నారా?

ఉన్నారా ఏమిటి, పట్టుదలతో తలమునకలై ఉన్నారనీ, కథానిక చదవమంటారనీ, చదివి వినిపిస్తారనీ, చదివింప చేస్తారనీ, ఎండనక, తిండనక, కథానికాత్మ ఐ కదిలాడుతున్నారనీ,

సాహిత్యమంటే అంత ఇష్టమా?

అంత ఇష్టమా కాదు, ప్రాణం. కథానిక అనువాదంతో నిద్రలేచి, అనువాదం భుజించి, అనువాదంతో శయనించి, అనువాదంతో స్నేహం చేసి, కథానికల ఆత్మలతో కరచాలనం చేస్తూ, చేయిస్తూ, వివరిస్తూ, విశదీకరిస్తూ, కథానిక ఆవిర్భావం తెలుపుతూ మూల రచయిత ఔన్నత్యం చెబుతూ కన్నడ కథానికల్ని ఆంధ్రులు కంఠత పట్టేలా చేస్తున్నారనీ,

మీకా కథానికలు బాగా ఇష్టమైనట్లున్నాయి?

ఇష్టమా, ఇష్టమంటే చాలదు. శ్రీరామగోపాల్ గారు నన్ను ఆవహించారు. ఆ కథానికల వెంట నడిపించారు, పరుగెత్తించారు, పరవశింపచేశారనీ,

మీరెన్ని కథానికలు చదివారు?

పాతికదాకా చదివాననీ, మరో రెండు పాతికలు వారు చెబుతుంటే విన్నాననీ, అన్నీ చాలా ఇష్టమయ్యాయనీ,

మరీ ఈ పుస్తకం పేరేమిటి?

'ధన్వంతరిగారి చికిత్స' ఈపుస్తకంలోని ఒక కథానికగా రైతు స్థితిగతిమీద గొప్పగా రచించబడిన కథ అని కథను రచించినవారు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత అయిన కు.వెం.పు.గారిని

మంచి శిల్పం సరే! మంచి ఇతివృత్తం ఉన్న మిగిలిన కథలేమైనా ఉన్నవా?

లేకేమీ? అన్నీ, మంచి కథానికలేనని, ఇంతకాలంగా వచ్చిన కన్నడ సాహిత్యంలోని ఉత్తమ కథానికలు ఇవనీ, 'నేను చంపిన యువతి' చదివితే మీ గుండె తల్లడిల్లే ఇతివృత్తమనీ, 'చివరిక్షణాలలో' మనిషి ఆరాటం, విరక్తి హృదయం పిండుతుందనీ,

సరే, అనువాదం సంగతేమిటి?

అనువాదాలకేం, కథాత్మను పుష్కలంగా తెలుసుకొనే అవకాశం అవి కలిగిస్తున్నాయనీ, తెలుగు కన్నడ వాక్య నిర్మాణంలో ఏదో పొంతన ఉందనీ, తెలుగు చదువుతుంటే కన్నడం చదువుతున్నట్లు ఉంటుందనీ, తెలుగుపదాల స్థానాల్లో కన్నడ పదాలు స్వేచ్ఛగా ప్రవేశించాయనీ, అనువాదం శ్రీశాఖమూరు రామగోపాల్‌గారికి ఆరాధనగా, భక్తిగా,

పూజగా, తపస్సుగా సాగిందనీ, తపస్సులో తలపెరిగినా, గడ్డంపెరిగినా, తైల సంస్కారం లేకపోయినా, ఫరవాలేదనీ అనువాద మహాప్రవాహంలో ఆకులలములు అడ్డం పడ్డా ఫరవాలేదనీ, మహాయజ్ఞం నిర్విఘ్నంగా అనువాదకుడు చేశారనీ,

మీకీ పుస్తకం బాగా ఇష్టమయిందా?

అంతా ఇంత ఇష్టం కాదు, అమిత ఇష్టం.

ఎందుకు?

కన్నడ జీవితం తెలుస్తుందనీ, కన్నడ కథానిక స్థాయి అర్థమవుతుందనీ, సోదర సాహిత్యం తీరు తెన్నులు తెలుస్తాయనీ, అన్నదమ్ముల ఆత్మీయతలు అనురాగాలు, ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు అంతు బడతాయనీ,

ఇంకా?

చదవడమే.

శుభాకాంక్షలతో

20-03-2010 **కొలకలూరి ఇనాక్**

# నా మాట

ప్రియమైన పాఠకు(జనమేజయ)లకు

కన్నడ సారస్వత లోకంలో సాహితిప్రియులను జనమేజయ మహారాజుగా కీర్తిస్తారు. జనమేజయుడు తన పూర్వీకుల గాథను వినాలనే ఉత్సుకతో మహర్షుల నుంచి మహాభారతంను శ్రోతగా వినియున్నాడు కదా! జనమేజయుడు శ్రోతగానే మిగలక పాఠకుడిగా మారి యున్నట్లైతే మనకు పంచమవేదం (మహాభారతం) తో పాటుగా మరెన్నో ఉద్గ్రంథాలు బయటకు (వెలుగుకు) వచ్చేవేమో అనే సదభిలాషతో సాహిత్యాసక్తులను జనమేజయుడిగా పోల్చుతారు. శ్రోతను పాఠకుడిగా మార్చేందుకు అమితంగా కృషి చేస్తారు కన్నడ సాహితి ప్రముఖులు.

ఈ అనువాద కథా సంకలనంలో మేరు నగధీరులైన కన్నడ భాషాకథకుల కథల్ని మీ ముందు ఉంచుతున్నాను విశేష శ్రమతో. ఈ కథా సంకలనంకు విశిష్టమైన రీతిలో "ధన్వంతరిగారి చికిత్స" అనే పేరును పెట్టాను. జనుల (పాఠకుల) హృదయాల్ని కదిలించేదే, కబళించేదే కథకు పరమార్థం అనేది ఉంది కదా!

మూలభాషలో 'కెలవు బెవారిసి టిప్పణిగళు (కొన్నిపనికిమాలిన రాతలు)' అనే కథను రచించిన నాగరాజ వస్త్రారెగారు వృత్తిపరంగా ఆర్కిటెక్ట్‌గాను ప్రవృత్తిపరంగా కథా రచయితగానూ కన్నడభాషలో ప్రకంపనల్ని సృష్టిస్తున్నారు. 2009వ సంవత్సరంలో వీరి నుంచి జాలువారిన 'పరంపర' అనే సిద్ధాంత విమర్శనా వ్యాసం నుంచి వీరికి అనుకూలంగా, వ్యతిరేకంగా రెండు సాహితి శిబిరాలు ఏర్పడి ఆరుమాసాలు విస్తృతంగా సాహిత్యచర్చలు కన్నడ సారస్వత లోకంలో ఒక సమరం లాగ జరిగినవని నేను అంటే అదేమి మామూలు విషయం కాదు.

2006 లో కన్నడ ప్రభ ఎప్పటిలాగ జరిపే వార్షిక సంక్రాంతి కథల పోటీలో వస్త్రారెగారి నుంచి రచించబడిన 'కెలవు బేవారిసి టిప్పణిగళు' అత్యుత్తమమైన రెండో కథగా ప్రశస్తి పురస్కారంను పొందింది. ఆ కథను ఆ కాలంలో నేను ఒకటికి పదిమార్లు చదివి, హవ్యాసంగా తెలుగులోకి అనువదించి, ఆ మీదట ఆ కథ ప్రభావం నుంచి నా

తృతీయ పుత్రికను మాసబ్ట్యాంక్‌లో ఉండే JNTUలో, B.Arch.లో జాయిన్ చేయించాను.

మీ ముందు ఉంచిన ఈ పుస్తకంలో ఒక శతాబ్ది (1897–1997) లోని అత్యుత్తమ కథలతో పాటుగా 2005–2009 నడుమ కన్నడప్రభలోని అనుబంధ సంచికైన సాప్తాహిక ప్రభనుంచి మరి కొన్ని కథల్ని ఎంచుకొని ఈ కథల్ని తెనిగించాను. కథకులలో జ్ఞానపీఠ ప్రశస్తిని పొందిన కు.వెం.పు; మాస్తిగార్లతో జతగా ఆనంద; నవరత్న రామారావ్; పూర్ణచంద్ర తేజస్వి; ఎస్.వెంకటరావ్; బి.ఎల్.వేణు, బెసగరహళ్ళి రామణ్ణ, కాగినెలె గురుప్రసాద్; రాజశేఖర నీరమాన్వి; భాస్కర హెగ్డె; నాగరాజ వస్త్రారె; అమరేశ నుగడోణి; సోసలె గరళపురి శాస్త్రి; కడంగోడ్లు శంకరభట్టు; శ్రీమతి సరస్వతిబాయి రాజవాడె మొదలైనవారి శ్రేష్ఠ కథల్ని అనువాదం రూపంలో మీ ముందుకు త్రెచ్చాను.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని వాచనాలయం; అశోక్‌నగర్‌లోని సిటి సెంట్రల్‌లైబ్రరి; కర్నాటక సాహిత్యమందిరం; కన్నడ దినపత్రిక... నా అనువాద క్రీడకు దోహదకారి అయినవి.

మా కుటుంబంకు వంశపారంపర్యంగా ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలో వ్యవసాయ భూములున్నందున, ముఖ్యంగా మేము కర్షక జాతికి చేరినందున మరియు దివంగతులైన నా మాతృమూర్తి (స్వాతంత్ర్య సమరంలో హింది భాషలో విశారదను చదివిన మహిళ అయినందున) పదే పదే హింది కవి మున్షి ప్రేమ్‌చంద్‌గారి గురించి ప్రస్తావించుతున్నందున నా సాహితి కృషికి ప్రేరణ లభించింది.

(నావు వాసిసుత్తిరువ ఈ నెలద గాళి నీరు అన్న సేవిసుత్తిద్దరింద... ఇదర మహిమెయన్ను తెలుగు భాషికరిగె పరిచయిసి అంత నన్ను ఆజ్ఞాపిసిద్ధరింద) మనం ఉంటున్న ఈ నేలలోని గాలిని, నీటిని, అన్నాన్ని సేవించుతున్నందున... దీని మహిమను తెలుగు భాషికులకు పరిచయించు అని నన్నున్ను ఆజ్ఞాపించినందున ఈ కన్నడ కథలను తెనిగించి మీ ముందుకు త్రెచ్చాను.

(అనువాదకరు కొలె పాతకిగళు) అనువాదకులు హత్యల్ని చేసే పాపాత్ములు అనే కఠిణమైన మాట ఒకటుంది కన్నడ సాహిత్యవలయంలో. యథాతథంగా మూల రచయిత(త్రి) చెప్పినదాన్ని గ్రహించకనే తమ ఇష్టానుసారంగా అనుసృజన అనే పేరుతో మూలాన్ని మార్పు చేసి చెడగొట్టుతారు అనే అపప్రథ అనువాదకుల మీద ఉంది కన్నడ నాడులో. త్రికరణశుద్ధిగా నేను యథాతథ అనువాద క్రీడకే బద్ధుడ్నైయున్నాను.

(ఊట కౌరవరల్లి – హృదయ పాండవరల్లి ఎంబ విదుర నీతియంతె) తిండేమో కౌరవుల వద్ద – హృదయమేమో పాండవుల మీద అనే విదురుడి నీతిలాగ తిండేమో నా మాతృభాషైన తెలుగులో – హృదయమేమో కన్నడభాష మీద అన్నట్లుగా పరకాయ ప్రవేశం చేసి ఈ అనువాదంను తెనిగించాను.

జమీందారుగా పలువురి హృదయాలలో గుర్తించుకోబడి, జమీందారుగా జీవితాన్ని గడిపిన (మా పెదనాయన కుమారుడు) మా అన్న, మా వంశానికే దృవతారగా వెలుగులను విరజిమ్మిన కీర్తిశేషుడు శ్రీశాఖమూరు సాంబశివరావ్ గార్కి నివాళులర్పిస్తూ...

చివరిగా:

గురు జ్ఞాని, గురు దాని; గురు సర్వాంతర్యామి అన్నట్లుగా కనబడే పెద్దలు కొలకలూరి ఇనాక్ గార్కి,

పుస్తకంకు యోచనాపరంగా ముఖచిత్రాన్ని అందించిన.............

సుందరంగా డి.టి.పి.ని చేసిన భాస్కర్ (మను గ్రాఫిక్స్) గారికి

సవినయంగా శిరస్సన్ను భాగిసి వంధించుతూ.

కైమోడ్పులతో
ఇంతియే
మీ విధేయుడైన
**శాఖమూరు రామగోపాల్**
06/03/2010.

*Address :*
H.No.5-10
Road No. -21
Deepthisrinagar
Miyapur Post
Hyderabad-500 049.
Ph: 040-65520286
Mobile: 9052563666

# ధన్వంతరి గారి చికిత్స

విశ్వామిత్ర ఋషి నందనవనంలోని ఒక మూలలో, కల్పవృక్షంకు కొద్దిదూరంలో ఉన్న ఏదో అనామధేయమైన ఒక చెట్టునీడలో, వెనక్కి ముందుకు శతపథంగా తిరుగుతున్నాడు. నియతేంద్రుడైనా కోరిన తక్షణమే కోరికలన్నీ ఇచ్చేంతటి కల్పవృక్షం చెంతన ఉండేది (నిలిచేది) అపాయకరమని అతనికి  అనుభవం నుంచి తెల్సియుందిలే. మనస్సులో జనించే భావచింతాపేక్షలన్నీ – మంచిది చెడుది, అనుకూలమైనది ప్రతికూలమైనది – వాస్తవమైతే గతేంటి? రాజర్షి పట్టనుంచి బ్రహ్మర్షి పట్టంకు ఎగబ్రాకినా తన చిత్తంలో సాత్విక విషయం మీద అతిగా విశ్వాసాన్ని పెట్టుకొనేంతగా అహంకారిగా అయ్యుండలేదు అతను.

విశ్వామిత్రుడిలోని మనస్సు గంభీరంగా చింతామగ్నమై ఉంది. అలాగే కించిత్ ఉద్విగ్నంగానూ ఉంది. దూరంలో అమోదప్రమోదాలలో మునిగి మెరుస్తున్న దేవవిలాసులు, విలాసిణులు ఏ కారణంకనో  గహగహగా నవ్వుతున్నప్పుడు ఋషి తలెత్తి చూసాడు.  పెదాల్ని కొరుకుతూ క్రుద్ధుడైయ్యాడు. సువాసనల్ని వెదజిమ్ముతున్న పుష్పాలతో నిండియున్న తరులతల మధ్య రాసలీలలో మునిగిన రంభ, ఊర్వశి, తిలోత్తమ, ఘృతాచి, మేనక మొదలైన కామిని స్త్రీల చెంత కరాలింగన విన్యాసాలతో నర్తించి పాడుతున్న ఇంద్రాది దేవతల్ని చూసి సంయమి, వైరాగి అయిన విశ్వామిత్రుడిలో కంపరం పుట్టింది. ఆ కంపరంలో పేగుబంధం ఉండొచ్చేమో!  మేనకను చూడగా మహారోషం  ఉద్భవించింది ఆ ఋషికి. విశ్వం మొత్తానికి తెలిసేటట్లుగా తనను అవమానానికి గురి చేసింది కదా అని అనుకొన్నాడు.  అయితే ఋషి శపించలేదు. అమృతపానం నుంచి మదోన్మత్తులై శీలాన్ని పోగొట్టుకొని నర్తించుతున్న స్వర్గ నివాసుల్ని  జుగుప్సతో చూస్తూ మరలా తలను వంచుకొని శతపథంగా తిరగసాగాడు.

ఏమి స్వర్గమో ఏమిటో? శౌచాలయం కన్నా అథోగతిగా ఉంది!  నరకంలోనైనా యాతనలలోని  గాంభీర్యం ఉంటది. ఇక్కడ లఘుత్వానికి అడ్డు అదుపు లేదు. తిని త్రాగి మెరిసేది, తపస్సులను చేసుకొంటున్న  తాపసులను చెడిపేది, దానవులతో పోరాడి,

ఓడిపోయి త్రిమూర్తుల చెంతకు వెళ్ళి మొరపెట్టుకొనేది... ఈ మహత్కార్యాలలోనే వీళ్ళ బ్రతుకంతా పర్యవసానం అవుతుండేది కూడా లేదు; చిరంజీవులకు పర్యవసానం ఎక్కడుంది?

ఇవన్నిటిమీద విశ్వామిత్రఋషి ఆలోచించి కనికరంతో చిరునవ్వును నవ్వుతున్నప్పుడు ఆ దేవ అప్సరసల నృత్యాల్ని ఆ అమరగానంలోని ఘోషను మీరి సుదీర్ఘమైన ఎంతో క్లేశయుతమై హృదయాన్ని దహించేంతగా విలవిలలాడుతున్న ఒక ధ్వని నందనవనంలోని నేలనే బ్రద్దలు కొట్టినట్లుగా విన్పించింది.

ఋషి తన మీద పిడుగుపడినట్లుగా త్రుల్లడిల్లి నోటిని తెరిచి వణుకుతూ నిలుచుండగా "మరలా.. అదే ధ్వని... విలవిలలాడే ధ్వని" అంటూ నిట్టూర్చాడు.

ఆ ఆక్రందన విశ్వామిత్రుడ్ని ఎన్నో రోజుల నుంచి వెంటాడుతుంది. ఎక్కడ ఉన్నా, ఎంత ప్రొద్దులోనైనా, ఏమి చేస్తున్నా అది (ఆక్రందన) హఠాత్తుగా చెవిలోపడి స్థితప్రజ్ఞుడైన ఆ కుశిక తనయుడ్ని అస్థిర పరచుతుంది. కైలాసంకు వెళ్ళినప్పుడు అక్కడ విన్పించింది. అలాగే వైకుంఠంలో, సత్యలోకంలో కూడా విన్పించింది. నరకలోకంకు సంచారంకని వెళ్ళినప్పుడూ అక్కడుండే ఆర్తనాదాల్ని మీరి విన్పించింది. రహస్యమైనదిగా, అనిర్దిష్టమైనదిగా ఉంది ఆ ఆర్తనాదం.

ఆ ఆర్తనాదం, మజా చేసుకొంటున్న దేవతలకు కొంచంగానైనా విన్పించలేదు. వాళ్ళలో సిగ్గులజ్జా లేని పానలీల (సురాపానం) నిరాటంకంగా సాగిపోతుంది.

విశ్వామిత్రుడు ఆ ఆక్రందనలోని మూలాన్ని వెతికేందుకని ప్రయత్నాల్ని చేసినా అవి ఫలించలేదు. వైకుంఠంలో వశిష్ఠుడితో విచారించినప్పుడు ఆ ఆర్తనాదం తనకేమి వినబడుటలేదని, అది విశ్వామిత్రుడిలోని మనోభ్రాంతిజన్యం అవ్వొచ్చని చెప్పి, దాని పరిహారార్థంగా ఒక యజ్ఞాన్ని చేయమని ఉపదేశించాడు. అయితే విశ్వామిత్రుడిలో పాత నమ్మకాల మీద విశ్వాసం తప్పి పోయినందున వశిష్ఠుడి గొడ్డుదైన బుద్ధివాదంకు శరణం కాలేదు.

విశ్వామిత్రుడు ఆలోచిస్తూ తలెత్తి చూసినప్పుడు పరశురాముడు తనున్న చోటుకు వస్తున్నదాన్ని చూసాడు. రేణుకాతనయుడి ముఖంలో మబ్బులు కమ్మినట్లుగా ఉంది. వేగంగా విశ్వామిత్రుడి చెంతకు వచ్చాడు పరశురాముడు.

"కుశిక తనయా... నీకొక ఆర్తనాదం విన్పించిందా?" అంటూ విశ్వామిత్రుడి భుజాలమీద కుడిచేతిని పెట్టి ప్రశ్నించాడు.



విశ్వామిత్రుడు పరశురాముడితో తనకు అప్పటివరకూ కలిగిన అనుభవాలన్నిట్నీ చెప్పాడు. పరశురాముడూ తనకూ అవే అనుభవాలు కలిగినవని తెల్పి, అందుకు కారణాలు ఏమిటో తెల్సుకొనేందుకనే త్రిభువన సంచారంకు వెళ్తున్నదాన్ని చెప్పాడు.

వాళ్ళు మాట్లాడుకొంటున్నప్పుడు మరలా దేవతలు అప్సరసలు చేస్తున్న ఆనంద నినాదాలన్నిట్నీ మ్రింగి మీరిపోయేంతగా ఆ ఆర్తనాదం రక్తాన్ని గడ్డకట్టుకొని పోయేంతగా విన్పించింది. ఋషులిద్దరూ దిగ్భ్రాంతులై గడగడా వణుకుతూ నిలబడ్డారు! ఎవడ్నో ఒకడ్ని ముళ్ళపాన్పు (అంపశయ్య) మీద దిగంబరుడిగానే పడుకోబెట్టి, గుండెమీద పెద్దరాయిని ఎంతోకాలం వరకు వేసి, పెద్ద స్తుతినుంచి వ్రేట్లను వేసివేసి కొట్టితే, అతను ఎలాగున విలవిలలాడి ఆక్రందనల్ని చేస్తాడో అలాగుంది ఆ బీభత్సకరమైన ఏడుపు!

విశ్వామిత్రుడు పరశురాముడు... ఆ ఇద్దరిలోని కాళ్ళ వణుకుడు తగ్గిపోలేదు. అంతలో నారదుడు లోకాభిరామంగా హరికీర్తనను చేస్తూ ఆ మార్గంలో వైకుంఠం వైపుకు వెళుతున్నాడు. ఋషులిద్దరూ వేగంవేగంగా ఆ త్రిలోకసంచారి వద్దకు నడుచుకొని వెళ్ళి, తమకు ఎదురైన (కలిగిన) అనుభవంలోని కారణాన్ని, మూలాన్ని వివరించమని అడిగారు. నారదుడి ముఖంలో చిరునవ్వు మెరిసింది; కనులలో నీరూ తొణికిసలాడింది, ఆ పరస్పర విరుద్ధభావంలోని ఘటనల్ని చూసిన ఆ ఋషులిద్దరూ ఆశ్చర్యపోతుండగా "ఆ ఆర్తనాదం ఎంతోకాలం నుంచి నాకూ విన్పిస్తుంది! వింటున్నప్పుడంతా నా గుండె కలుక్కుమంటుంది. జీవాన్ని (ప్రాణాన్ని) పిండినట్లుగా ఉంటది. అందుకు కారణం నాకు సరిగా గుర్తుకాలేదు. ఆ ఆర్తనాదం వచ్చేదంటూ భూలోకంనుంచే అనేది బాగుగా గుర్తు" అని చెప్పి ఆ దేవర్షి కీర్తనను పాడుకొంటూ వెళ్ళిపోయాడు. ఇక అప్పుడు ఆ బ్రహ్మర్షులిద్దరూ ఆ కారణంను వెతికేందుకని భూలోకం వైపుకు వేగంగా వెళ్ళసాగారు.

భూమిని సమీపిస్తున్నప్పుడు విశ్వామిత్రుడు పరశురాముడు మూగోళ్ళైయ్యారు. గుర్తించేందుకు అసాధ్యమన్నట్లుగా వ్యత్యాసం కన్పడింది. వెనుక (పూర్వం) వాళ్ళు చూసిన కాలంలోని భూమికి ఇప్పటికాలంలోని భూమికి మధ్యన అజగజాంతర వ్యత్యాసం కనబడుతుంది. నాగరికతను మరియు సంస్కృతిని క్షణమాత్రంలోనే కోరుకొనేట్లుగా పాడుచేసే అనాగరికత మరియు హీనసంస్కృతి, ప్రాణాన్ని సంరక్షించే వైద్య విద్య జతగానే రోగకారకాలైన దుష్టపద్ధతులూ, సిరి చెంతనే బీదరికం, రైలు, మోటారు బండ్లు, విమానం, తంతి – తపాలా, విద్యుచ్ఛక్తి, తుపాకులు, నాటుబాంబులు, కాగితం, ముద్రణాయంత్రం ... ఇత్యాది ఇత్యాది వాట్ని చూస్తూ వాట్ని పొగుడుతూ విమర్శిస్తూ నవీనమైన నరుల వేషాలతో ఒక పెద్ద నగరంలోకి ప్రవేశించారు.

యంత్రాలతో నిండిన వాహన సంచారం, వేగంతో కూడిన మనుషుల పయనం, వ్యాపారాలలోని గందరగోళం, హోటెళ్ళలో నిల్చొని తినటం, విద్యుచ్ఛక్తిలోని తీగలున్న స్థంభాలలోని కిక్కిరితనం, చిత్రవిచిత్ర ప్రకటనల ఫలకాలు (ఫ్లెక్సీబోర్డ్లు), మద్యపాన నిరోధంకని ఏర్పాటు చేసిన కచేరి వెనుకనే కల్లు, సారాయి అంగడి, పోలీస్ స్టేషన్కు ఆనుకొని ఉండే ప్రక్కఇంటి మేడమీద పేకాటక్లబ్, గల్లీలలో ఎవరూ అసహ్యాన్ని చేయరాదు అని రాసిన బోర్డ్ క్రిందే సహించేందుకు అసాధ్యమైన దుర్గంధం, గలీజు, సినిమా, నాటకశాల, కార్ఖానాలు, స్కూళ్ళు, కలాశాలలు.... మొదలైన వాట్ని ఆశ్చర్యంగా, కుతూహలంగా, జుగుప్స మరియు సంతసంగా సమీక్షిస్తూ ఆ ఆర్తనాదంలోని మూలాన్ని వెతికేందుకు ముందుకు ముందుకే పోవసాగారు.

అలాగున వెళ్తూ ఒక దేవాలయం చెంతకు వెళ్ళారు. అక్కడున్న పూజారి, గుడిలో దేవుడు శిలామూర్తేనని భావించుకొంటూ పూజకని వచ్చిన భక్తులనుంచి డబ్బును వలచుకొంటున్నాడు. అక్కడున్న భక్తులలోని వ్యాపార మనోభావాల (తీరని కోరికల)ను చూసిన ఋషులిద్దరికీ నవ్వు వచ్చింది.

విశ్వామిత్రుడు పరశురాముడితో "రేణుకా తనయా.... చూసావా, ఈ పురోహిత వర్గం అప్పుడున్నట్లుగానే ఇప్పుడూ ఉన్నారు కదా! ప్రపంచం (యుగాలు) ఎంతగా మార్పుల్ని చేసుకొన్నా వీళ్ళు మాత్రం 'స్థాణురచలోయం' గానే ఉన్నారు కదా...." అని అన్నాడు.

"పాపం పురోహితులేమి చేస్తారు? అప్పటికాలంలోని ప్రభువులకు అనుగుణంగా అప్పటి పురోహితులు ఉండేవారు; ఇప్పటికాలంలోని ప్రజాదొరలకు అనుగుణంగా ఇప్పటి పురోహితులు ఉన్నారు" అంటూ పరశురాముడు క్షత్రియులమీద నిందను మోపాడు.

ఇంకొకచోట జనం ఒక కళామందిరంలో కిక్కిరిసియున్నదాన్ని చూసి అక్కడకు చేరి చూడగా హరికథ సప్తాహం నడుస్తుంది. ఆ భాగవతార్ భగవంతుడి కరుణ గురించి వింటున్నోళ్ళ కళ్ళలో నీరు వచ్చేటట్లుగా చెపుతున్నాడు. ఆ ఋషులిద్దరూ కొంచెం సేపు వింటూ నిలబడ్డారు. అంతలో ఆ హరిదాసు తపస్సులోని మహిమను గురించి ప్రస్తాపిస్తూ పరశురాముడి, విశ్వామిత్రుడి కథలను ప్రారంభించాడు. తమకే ఎంతగానో నూతనత్వంగా ఉన్న తమతమ కథల్ని ఆ ఋషులిద్దరూ నోరెళ్ళబెట్టి వినసాగారు. వారి మహిమ వారికి గుర్తే లేదు కదా!

"ఆ భాగవతార్ ఏ విశ్వామిత్రుడ్ని గురించి కథను చెపుతున్నాడు, కుసికతనయా?" అంటూ పరశురాముడు నవ్వుతూ అడిగాడు.



"అతను నన్నుగాని, నిన్నుగాని సత్యచరిత్రతో చెప్పట్లేదు పరశురామా... పురాణాన్నే చెపుతున్నాడు" అని అన్నాడు విశ్వామిత్రుడు.

మరొకచోట (రవీంద్రభారతి) ఒక పెద్ద సభ జరుగుతుంది. ముఖద్వారంలో రంగుబట్టలతో బంధూకుల్ని పట్టుకొన్న సిపాయిలు నిల్చియున్నారు. పట్టుకండువాలతో, క్యాప్లతో, హ్యాట్లతో, బూట్లతో బారు దుస్తుల్ని, అడ్డపంచెల్ని, ధోవతులను ధరించిన నానారకాల జనం అక్కడకు వెళ్తున్నదాన్ని చూసిన ఆ ఋషులిద్దరూ, ఆయా జనంలాగనే వేషాల్ని వేసుకొని లోనికి వెళ్ళారు. అక్కడికి చేరుకొన్నోళ్ళందరూ సుఖాసీనులై సాలంకృతులుగా సంతృప్తులై ఒకరినొకరు హస్తలాఘవం నుంచి స్పృశించుకొంటూ, పొగడుకొంటూ కుర్చీలలో ఆసీనులైన మీదట నర్తకి ఒకామె రంగస్థలంకు వచ్చి నర్తించసాగింది. ఋషులిద్దరూ కారణాల్ని కల్పించుకొని, కొద్దిసేపైన తరువాయి అక్కడ్నుంచి బయటపడ్డారు.

ఆ నగరంలో ఎక్కడెక్కడికి వెళ్ళినా ఆ ఆక్రందనలోని విచారంను ఎవరూ మాట్లాడుటలేదు. ఎవరికీ అది విన్పిస్తుందని ఆ ఇద్దరిలోనూ తోచలేదు. కొన్నిచోట్ల ఆ నగరంలోని సన్నివేశాలు ఎలాగున ఉన్నవంటే, తాము భూమికి వచ్చిన ఉద్దేశమే మరచిపోయేటట్లుగా ఆ ఋషులలో ఉంది.

నగరంలో వెతికి వెతికి విసుగేసి అక్కడినుంచి బయటకే బయల్దేరారు ఆ ఇద్దరు. నగరంలోని అట్టహాస రణగొణధ్వనులు చెవులనుంచి దూరమైనప్పుడు ఆ భీకరమైన ఆర్తనాదం మరలా స్పష్టంగా విన్పించసాగి, ఆ ఇద్దరూ తల్లడిల్లిపోయారు. ముందుకే పోవసాగారు. ముందుకే సాగిపోతుంటే ఆ ధ్వని ఇక సమీపం నుంచే వస్తున్నట్లుగా ఉంది. అడవి ప్రాంతం ప్రారంభమై దాన్నుంచి ఎంతో దూరం లోనికే నడిచారు. అది ఇప్పుడిక నిర్జనమైంది. మనుషులు తిరుగుతున్నట్లుగా ఎక్కడా కనబడుటలేదు. నడుచుకొని వెళ్తుంటే అడవి ఇంకా దట్టమై కొండకోనలతో పెనవేసుకొనిఉంది. కొండశిఖరానికి చేరినప్పుడు ఆ శిఖరానికి ఆవల ఉండే మైదానం నుంచి వినబడినట్లుంది ఆ అత్యంత యాతనామయమైన ఆ రోదన. ఆ ఋషులిద్దరూ ఎంతో భీతినుంచి ఒకరినొకరు పట్టుకొని మైదానంకు దిగారు.

అక్కడున్న ఒక చిన్న కమతంలో చివరిభాగాన గడ్డితో కట్టిన ఒక పూరిల్లు కళ్ళకు కనబడింది ఆ ఇద్దరికి. డొక్కలెండిన ఒక కుక్క మాత్రం ఒకట్రెండుసార్లు మొరిగి ఆ మీదట ఊరకుండిపోయింది. ఒక అడవిపంది తన పిల్లలతో మురికిలో పొర్లుతుంది.

చుట్టూ ఉన్న అనంతారణ్యం; గగనాన్నే చుంబిస్తున్నట్లుగా ఉన్న పర్వతశ్రేణులు నిశ్చలంగా నిశ్శబ్దాన్ని, ఏకాంతాన్ని పెంపు చేస్తున్నవి. ఎండ చుర్ చుర్ మంటుంది. ఆ నిశ్శబ్దంలో లోనుంచి వినబడుతున్న ఆ మహారోదనం భీషణంగా ఉంది.

విశ్వామిత్రుడు ఆ ఇంటి చుట్టూ కట్టిన తడికెల కంతలనుంచి దృష్టిని నిల్పి దీక్షగా చూసి, పరశురాముడ్ని తనలాగే చూడమని సంజ్ఞల్ని చేసాడు.

గుడిసె లోపల మసక మసకగా చీకటి ఉంది. ఆ ఇల్లంతా పొగబారి సాలెగూడులాగ అస్తవ్యస్తంగా ఉంది. పలుగు, పార, గుంటక, గొర్రు, జడ్డిగం, నాగలి, గొడ్డలి, మడ్డుకత్తి.... మొదలైన వ్యవసాయ పనిముట్లు అక్కడక్కడ చిందరవందరగా చెల్లాచెదురై పడియున్నవి. ఎండిపోయిన పశువుల పచ్చిమేత, సజీవంగా ఉన్న క్రిమికీటకాలు స్వరాజ్య సంపాదనను చేస్తున్నట్లుగా ఉంది ఆ ఇంటిలో. ఇంటి నడుమ నేలమీద పరచిన కంబళిమీద మురికిపట్టి చిరిగిన చిన్న పంచెను శరీరంలోని గుప్తాంగాలమీదే కప్పుకొని, ఆ మీదట పూర్తిగా నగ్నంగా ఉన్న రైతు ఒకడు పడుకొని గుండె భాగాన్ని రెండుచేతుల్నుంచి ఒత్తుకొంటూ ఘోరంగా పొర్లుతున్నాడు అటు ఇటు. తలను మాత్రం బయటకు పెట్టి బండల నడుమ నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తుండే పెద్దపాములాగ, అతని (మొరటుగా ఉన్న) దేహం గిలగిలా కొట్టుకొంటుంది. ఋషులిద్దరూ చూస్తుండగా అతని నోటినుంచి రక్తం భళ్ళు భళ్ళునే బయటకు చిమ్ముతుంటే అది నేలలో పడి ఆ భాగాన్నంతా తడిపింది. ఆ రైతుకు ప్రక్కనే చీలికపేలికలైన మురికిచీరను (మానంను కప్పిపుచ్చుకొనేంతగానే) కట్టుకొని, బక్కచిక్కి శల్యావస్థలో ఉన్న అతని భార్య తలమీద చేతుల్ని పెట్టుకొని కన్నీరు కార్చుతుంది. ఆ స్త్రీకి వెనకనే తలజుట్టు చెదిరి వికారంతో, పీచువళ్ళుతో బానకడుపును పొందిన నాల్గైదు సంవత్సరాల బాలిక ఒకతి నేలమీద ఒరిగి మూర్ఛబోయిన దానిలాగ నిద్రిస్తుంది.

ఆ స్థితిని చూసిన ఆ ఋషులిద్దరికీ గుండె బరువై, కనులనుంచి నీరు కారసాగింది... ఆ మహానగరంలో (రాజధానిలో) తాము చూచిన భోగభాగ్యాలతో కూడిన దృశ్యాల్ని గుర్తుకు త్రెచ్చుకొంటుండగా మనస్సు కుతకుతలాడింది ఆ ఇరువురిలో. తక్షణమే మెల్లగా తడికె తలుపును తెరచి, నెట్టి, తమ తలలకు ఆ ఇంటిలోని వాసాలు (బొంగులు) తగలనట్లుగా వంగి లోనికి వెళ్ళారు.

వాళ్ళిద్దరూ సామాన్య మానవులన్నట్లుగా వేషాలలో ఉన్నా, రైతుభార్య వాళ్ళను చూసిన తక్షణమే గావుకేక పెట్టి, చేతిని జోడించి "దండాలయ్యా, మీ కాళ్ళమీద పడ్తాను.



ఇప్పుడు నగదులేదు ఇంట్లో. నా మొగుడి రోగం బాగుపడితే తక్షణమే అప్పోసప్పో చేసి మీకు ఇవ్వాల్సింది ఇస్తాను! కనిష్టంగా నా పుత్రినైనా చూసి కనికరం చూపెట్టండి" అంటూ విలపించసాగింది.

తాము భూమిశిస్తును వసూలు చేసేందుకని వచ్చిన ప్రభుత్వ అధికారులం కాదని, ఋణవసూలుకని వచ్చిన షావుకారు మనుషులమూ కాదని... పరదేశంకు చెందిన ప్రయాణికులమని కష్టపడి తెలిపిన మీదట, ఆ రైతు మహిళ ఆ ఋషులిద్దరి పాదాల మీద పడి తన కష్టాన్నంతా చెప్పుకోసాగింది.

"ఏమి జబ్బు మీ ఆయనకు?"

"ఏమి జబ్బో ఆ భగవంతుడికే గుర్తు!"

"ఎన్ని రోజులనుంచి?"

"ఎంతో కాలంనుంచి ఉంది ఈ జబ్బు. ఒకసారి తగ్గిపోతే మరొకసారి ఎక్కువౌతుంది. ఎవరికి చూపించినా ఏమి జబ్బు అనేది అర్థంగావట్లేదు. అప్పటికప్పుడే ఎవరో గుండెమీద కూర్చున్నట్లుగా అయినప్పుడు ఆర్తనాదం మొదలు అవుతది. కీళ్ళలో ఇనుమును కాసిపోసినట్లుగా నెప్పులు ప్రారంభమౌతవి. అప్పుడప్పుడు నోటినుంచి ముద్దముద్దగా రక్తం పడుతది. వైద్యులయ్యారు; జోతిష్కులైయ్యారు; కనబడిన చెట్టు పుట్టకు మ్రొక్కును చేసుకొన్నాను. స్వాములారా....; భగవంతుడు కూడా మమ్మల్ని విస్మరించాడు" అంటూ ఆ స్త్రీ బిక్కిబిక్కి ఏడ్చింది.

"అలాకాదులే... భగవంతుడు మిమ్మల్ని మరిచేది లేదు. సమాధానం చేసుకో తల్లీ... మాకు చేతనైనంత సహాయం చేస్తాము మీకు" అంటూ ఆ ఋషులిద్దరూ ఆ రోగిని పరీక్షించారు.

హృదయం, శ్వాసకోశం, జఠరం, పేగులు, మెదడు.. మొదలైన సర్వావయవాల్ని చక్కగా పరీక్షించారు. ఎక్కడా ఒక నువ్వు గింజంతన్నా దోషంగాని, రోగంలోని విలక్షణమైన కారణాల చిహ్నాలుగాని కనబడలేదు. ఏ ప్రశ్నకు జవాబును చెప్పే స్థితిలో లేదు రోగి. గుండెమీద చేతిని నిల్పినప్పుడు మాత్రం పుండును ముట్టుకొన్నట్లుగా ముఖాన్ని మాడ్చుకొని మరలా ఎక్కువగా విలవిలలాడుతున్నాడు.

ఆ రోగస్థితిని చూచి ఋషులు భయపడ్డారు. బ్రహ్మవిద్యకన్నా అతి రహస్యంగా ఉంది ఆ రైతుకు అంటిన జబ్బు. ఏదైనా జరగనీ అని అనుకొంటూ, అక్కడికి దగ్గరలో

ఉండే ఒక ఊరినుంచి గవర్నమెంట్ డాక్టర్‌ను పిల్చుకొచ్చారు. ఆ డాక్టరు మోటారుగాడి వెళ్ళని పల్లెకు కచ్చితంగా వచ్చేది లేదని చెపుతున్నా, ఆ ఋషుల చేతులలో ఉన్న బంగారు నాణాల్ని చూసిన మీదట ముగుత్రాడును వేసిన కోడెగిత్తలాగ ఏమి తంట తకరారును చేయకనే వాళ్ళ వెనకే నడచి ఆ రైతు ఉండేటి కొంపకు చేరాడు.

అయితే అతను రోగి చెంతకు చేరిన వెమ్మటే, ఆ రోగికి గుండె నొప్పి ఎక్కువై గిలగిలా కొట్టుకొనేది, నెత్తురును కక్కేది అధికమైంది. డాక్టరు తొందరతొందరగానే పరీక్ష చేసి రోగంలోని లక్షణాలు తనకేమి గుర్తుగాకపోయినా, ఒకపెద్ద పొడుగైన ల్యాటిన్ భాషలోని పేరును చెప్పి, రంగునీళ్ళున్న ఔషధాన్ని ఇచ్చి వెళ్ళిపోయాడు. అతను దూర దూరంగా పోసాగుతుంటే అప్పుడు ఆ రోగి (రైతు) మొదట్లో (ఆ డాక్టరు రాక మునుపు) ఉన్న స్థితికి వచ్చాడు.

ఆ స్త్రీకి డాక్టరు బాబుమీద కొంచమూ నమ్మకంలేదు. పురోహితుడ్ని పిలవండని సూచించింది. ఎందుకంటే ఏదో రణపిశాచిలోని కుచేష్ట తన మొగుడు రోగంకు కారణమని ఆమె నిస్సందేహంగా నమ్మియుంది.

విశ్వామిత్రుడు ఆమె మాటకు ఒప్పుకోకపోయినా, పరశురాముడు “చూద్దాం... ఆమె మాటలోని నమ్మకంలో ఎంత నిజం ఉందో” అని భట్టుగార్ని పిలిపించాడు. అతనికీ రోగానికి కారణం కొద్దిగానైనా తెల్వకపోయినా ఒక పిశాచి పేరును చెప్పి, దానికి మాయమంత్రాన్ని వేసి నిలువరించానని చెప్పి బంగారునాణాల్ని దక్షిణగా తీసుకొని తృప్తితో వెళ్ళిపోయాడు.

అప్పుడు విశ్వామిత్రుడు పరశురాముడితో “ఈ పురోహితుల గుంపంతా ఒకటే విధం! దోచుకోవటం!! దోపిడి!!! దోపిడి మాత్రమే!!!! క్రితంలో వసిష్ఠుడు దోచుకొన్న విధంగానే ఇప్పుడూ ఈ పురోహితుడు దోచుకొన్నాడు కదా! అతనంటూ రఘువంశానికి శనిలాగ పట్టుకొని వ్రేలాడుతున్నాడు. ఇక్ష్వాకు, రఘు, దిలీపుడు, దశరథుడు, రాముడు... వీరందరి ప్రాణాల్ని పిండి పౌరోహిత్యాన్ని చేసి...! నేను చెప్పాను కదా... పురోహితుడ్ని పిలిచేది వద్దని నీతో” అని అన్నాడు.

ఋషులిద్దరూ ఆ గుడిసెలోనే ఉండిపోయి రైతుకు అంటిన రహస్యరోగంకు కారణాన్ని, ఔషధిని కనిపెట్టేందుకు ప్రయత్నించారు. అంతా నిష్ఫలమైంది వారి ప్రయత్నం.

బంగారు నాణాల్ని యథేచ్ఛగా ఇచ్చేటోళ్ళు ఆ రైతుకు చెందిన గుడిసెలో ఉన్నారనే సమాచారం వ్యాపించిన మీదట, చుట్టుప్రక్కల ఉండే ఊర్లలోని జనంకు, అధికారులకు



ఆ రైతు యోగక్షేమం మీద చింత (మమకారం) ఎక్కువై అప్పటివరకూ అక్కడకు అడుగుల్ని వేయని జనమంతా ఇప్పుడు ఆ గుడిసె చెంతకు వచ్చి అతని యోగక్షేమాల్ని తెల్సుకొంటూ పోవసాగారు.

అధికారులు వచ్చినప్పుడు, డాక్టరు, పురోహితుడు వచ్చినప్పుడు అప్పటికప్పుడే ఆ రైతులో గుండెనొప్పి విజృంభణం చేస్తుంది.

కొన్నిరోజులు అయిన మీదట ఒక దినాన కొత్త విచారం ఒకటి ధ్యానసమాధిలో ఉన్న విశ్వామిత్రుడి మదిలో మెరిసింది హఠాత్తుగా! ఆ రోగంలోని రహస్యాల్ని తెలుసుకొనేందుకు దేవతలకు వైద్యుడైన ధన్వంతరి ఒక్కడికే సాధ్యమని తెల్సిందతనికి. ఆ సూచన పరశురాముడికి సమ్మతమై, ధన్వంతరికి కబురుపెట్టారు. ధన్వంతరి సామాన్యవైద్యుడిలాగ వేషధారణ వేసుకొని శీఘ్రంగానే వారి వద్దకు చేరుకొన్నాడు.

రైతు గుండెలోని బాధను చూసి, రక్తం గడ్డకట్టుకు పోయేటట్లుగా ఉన్న ఆ రోదనను విని ఉక్కిరిబిక్కిరిఅయ్యాడు. అయినా ఆ క్షణంలోనే తనొక వైద్యుడనేది జ్ఞప్తిలోకి తెచ్చుకొని ధైర్యాన్ని పొంది రోగిమీద దేహ పరీక్షకని చేతిని నిలిపాడు.

విశ్వామిత్రుడు పరశురాముడు ఆ రైతు భార్యలాగనే ఆర్ద్రతతో పెదాల్ని బిగపెట్టి నిలిచి చూస్తున్నారు. రోగి చేస్తున్న రోదనం నడుమ ఆ నిరీక్షలోని నిశ్శబ్దంలో వాళ్ళు ఊపిరిని తీసుకొంటుంది వినబడుతుంది.

ఎంతో సేపు వరకూ పరీక్షించిన తరువాత ధన్వంతరి ఆ ఋషుల వైపుకు వ్యంగ్యంగా చూసాడు. రైతు భార్య ఆ దృష్టిలోని నిరాశను చూసి గొల్లుమని ఏడ్వసాగింది.

రైతుభార్య దృష్టికి మాత్రం ధన్వంతరి రోగిని చూస్తున్నట్లుగానే కన్పిస్తుంది తప్పితే, నిజంగా ఆ దేవ వైద్యుడూ, ఋషులు సంభాషించుకొంటున్నారు ఆ రైతుకు చెందిన రోగం గురించి.

“ఇది దైహిక రోగం కాదు” అన్నాడు ధన్వంతరి.

“ఆత్మకు చెందినదా?” అడిగాడు పరశురాముడు.

“అదేమికాదు” తల ఊపుతూ అన్నాడు ధన్వంతరి.

“అలాగైతే?” ఆశ్చర్యంతో అడిగాడు విశ్వామిత్రుడు.

“దేహానికి చెందిన రోగం అయితే దేహంలోనే ఉండాల్సి ఉంది. అయితే నేను శ్రద్ధగానే పరీక్షించాను. అక్కడ ఏమిలేదు. ఆత్మకు చెందినదైతే పాపరూపం నుంచి

కనబడాల్సియుంది. అయితే ఈ సరళ సామాన్య జీవనంతో నిండియుండే ఈ రైతుకు ఆ రోగం ఇంకా తగులుకోలేదు. అందుచేత"అని ధన్వంతరి చెబుతూ జేబునుంచి ఒక దివ్య యంత్రాన్ని బయటకు తీసి చూపిస్తూ (అది రైతు భార్య దృష్టికి అగోచరంగా ఉంది) "దీన్నుంచి చూస్తే రహస్యమేమియున్నా గుర్తొతది" అంటూ ఆ రోగికి కొంచం దూరానే నిల్చి దివ్యయంత్రం ముఖాంతరంగా సమీక్షను ఆరంభించాడు.

విశ్వామిత్రుడు పరశురాముడు నిలిచి తదేకంగా చూస్తుండగానే దివ్యయంత్రంలో కళ్ళను పెట్టి చూస్తున్న ఆ ధన్వంతరి వదనం ఎర్రబారింది. వక్షస్థలంలోని ఊపిరి పోరాటం మీదకూ క్రిందకూ పారసాగింది. ధన్వంతరి కనులనుంచి నీరు బొట్లు బొట్లుగా కారి బుగ్గల (చెంపల) మీదకు జారి నేలలోకి పడి ఇంకిపోయినవి.

"అయ్యో... అయ్యయ్యో, పాపాత్ములారా!" అని ధన్వంతరి ఏనుగు ఘీంకరించినట్లుగా అరిచాడు. అయితే మానవమాత్రురాలిగా ఉన్న ఆ రైతు భార్యకు అతను దగ్గినట్లుగా మాత్రమే విన్పించింది.

ఋషులిద్దరూ ఆ అరుపుకు ఎగిరిపడి "ఏమిటి? ఏమిటి? ఏమైంది?" అంటూ ధన్వంతరి చెంతకు పరిగెత్తారు.

ధన్వంతరి ఏమి మాట్లాడకనే యంత్రాన్ని ఋషులకు ఇచ్చాడు. ఋషులిద్దరూ యంత్రంలో కళ్ళను నిల్పి చూడసాగారు; చూసి భయాన్ని చెందారు.

రైతు గుండె మీద సమస్త చక్రాధిపత్యం మహాపర్వతంలాగ నిలబడియుంది. ఋషులు సందర్శించుకొని వచ్చిన ఆ ముఖ్యనగరం (రాజధాని) ఆ మహాపర్వతంలో శిఖరాగ్రాన రారాజిల్లుతుంది. అక్కడి దేవాలయాలు విద్యాలయాలు క్రీడామందిరాలు ప్రమోదవనాలు (ఉద్యానవనాలు) కర్మసౌధాలు (సెక్రటేరియట్) రాజప్రసాదాలు (రాజభవన్‌లు) తమ భారాలంతటినీ ఆ రైతు గుండెమీద మోపి, సంస్కృతి మరియు నాగరికత అనే కీర్తి నుంచి మెరుస్తున్నవి.

"అయ్యో.... అయ్యో... అయ్యయ్యో; ఇతను ఇప్పటివరకూ చావకుండా బతికిందే ఆశ్చర్యం.మందర పర్వతాన్ని మోసిన కృష్ణుడు కూడా నుజ్జుగుజ్జు అయ్యేవాడేమో... ఈ రాజ్యభారం అతని గుండెమీద పడియుంటే!" అంటూ పరశురాముడు అరిచాడు.

విశ్వామిత్రుడు రోషంగా పళ్ళను కొరుకుతూ "జమదగ్ని, నువ్వు క్రితంలో పరిపాలన చేస్తున్నోళ్ళందరినీ నిర్జామం (నాశనం) చేసి, సమతా ప్రచారానికి నీ జీవితాన్నంతా గడిపింది వ్యర్థం అయ్యింది కదా!" అని అన్నాడు.



"నువ్వు కూడా మేల్జాతి, అధమజాతి అనే భేద భావాల్ని పారద్రోలేందుకు బతుకునే ముడిపెట్టావు కదా! అదంతా వ్యర్థం అయ్యింది కదా" అంటూ పరశురాముడు మరలా ధన్వంతరి వైపుకు చూసి, "తొందరగా చెప్పు.. ధన్వంతరి, ఏమి చేస్తే ఈ రైతు బ్రతుకుతాడు?" అని అడిగాడు.

"గుండె మీదున్న రాజ్యభారాన్ని తొలగించి వేస్తే రోగం మాయమైపోతది" అన్నాడు ధన్వంతరి.

"లోకమంతా నిర్ణీయమై అరాజకత్వంతో అవ్యవస్థగా అయిపోతే?"

ధన్వంతరి కొద్దిగా కోపించుకొని కళ్ళను ఎరుపుగా చేసుకొని, "మీకు బుద్ధిలేదు! మొదలు రోగ నివారణ కానీయండి! ఆ పిమ్మట దృఢకాయుడైన ఆ ముగ్ధరైతే క్రిందకు జారి పడిన రాజ్యంలోని భారాన్ని గుండెమీదకు వేసుకొనే బదులుగా, భుజాలమీద పెట్టుకొని రాజ్యభారాన్ని నిర్వహిస్తాడులే" అంటూ ఆ ఇరువురిని గదిరించాడు.

తక్షణమే విశ్వామిత్రుడు పందెపు కోడెగిత్తలాగ బుసగొట్టాడు. ఆ బుసలనుంచి మహాభయంకరమైన క్రాంతి భూతాలు ప్రత్యక్షమై శిరస్సులను వంచి చేతుల్ని ముడుచుకొని "ఏమి చేయాలి" అని వేడుకొన్నవి.

"వెళ్ళండి, వెళ్ళి ఆ రైతు గుండె మీద ఉన్న నిప్పుల కుంపటిని (రాజ్యభారాన్ని) నేలకు దొర్లించండి" అని గర్జించి చేతిని ఊపాడు.

తక్షణమే ఆ రాజ్యంలో ఉల్కాపాతం ఉరుములు మెరుపులతో గాలివాన భూకంపాలు కలిగి ఉత్పాతం అయ్యింది. చూస్తుండగా రాజవేష్మం (ప్రభుత్వం) పడిపోయింది. దేవాలయాలలోని గోపురాలు మహారవం నుంచి క్రిందకు పడిపోయినవి...

.... రైతులోని రోదనం ఆక్రందనం ఆర్తనాదం తక్కువైపోతున్నట్లుగా కనబడింది. శ్వాసోచ్ఛ్వాస (ఊపిరి ఆట) సహజంగా ఆడసాగింది. అతని కనులలో సంతోషపు కాంతిరేఖలు బయటపడినవి... మరలా.... కొంచం సేపటిలోనే చూస్తున్నోళ్ళకు ఆశ్చర్యం కలిగినట్లుగా, నగుమోముతో పైకి లేచినిలబడి, ఆ ఋషులకు నమస్కారాన్ని చేస్తూ, వ్యవస్థను సాయదంతే (చావనట్లుగా) చేసే వ్యవసాయంను చేసేందుకని తన నాగలి, మేటి ఉండే కొట్టం వైపుకు బిరబిరా అడుగుల్ని వేయసాగాడు.

– 0 –

❁ ❁ ❁

(కువెంపుగారి నిజ నామధేయం కె.వి.పుట్టప్ప. 29-02-1904 మలెనాడుకు గర్భంగా ఉండేటి తీర్థహళి తాలూకాలోని కుప్పళ్ళిలో జన్మించారు. హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే ఆంగ్లభాషలో కవితల్ని రచిస్తూ "Beginer's Muse" (బిగినర్స్ మ్యూజ్) అనే చిన్న కవితా సంపుటాన్ని ప్రచురించారు. తర్వాత కన్నడంలో ఎం.ఏ స్నాతకోత్తర డిగ్రీని పొందే సమయానికి 'ఉద్దామకవి'గా మాన్యతను పొంది, కన్నడనాడులోని ఆబాల వృద్ధులందరికీ సుపరిచితులైయ్యారు. కు.వెం.పుగారి కార్యక్షేత్రం కావ్యక్షేత్రం అవి రెండూ ఎంతో విశాలమైనవిగా బహుముఖాలుగా ప్రజల ముందుకు వచ్చినవి. ఆడు ముట్టద గిడవిల్ల (మేక ముట్టని చెట్టేలేదు) అన్నట్లుగా కథ, కవిత, నాటక, లోకాభిరామం, ప్రబంధం, కథన కవనం, జీవన చరిత్ర, ఉపన్యాసం, విమర్శ, నవలారచన, ఖండకావ్యం, మహాకావ్యం, నిఘంటు నిర్మాణరచన... వీటన్నిట్లోనూ వారు సిద్ధిని పొందారు. "శ్రీరామాయణ దర్శనం" అనే మహాకావ్యానికి భారత ప్రభుత్వం నుంచి జ్ఞానపీఠ ప్రశస్తి పురస్కారాన్ని పొందారు.

కన్నడభాషా సాహిత్య సంస్కృతికి సంబంధించిన అనేక సంఘసంస్థలకు కు.వెం.పుగారు ఆధార స్తంభంగా నిలిచారు. మార్గదర్శకుడిగానూ ఉన్నారు. అఖిల భారత కన్నడసాహిత్య పరిషత్‌కు చెందిన 39వ సాహిత్య సమ్మేళనంకు వీరే విశిష్ట అధిపతిగా ఉండి ఆ కార్యాన్ని దిగ్విజయంగా నెరవేర్చారు.

మైసూరు విశ్వవిద్యాలయంలో కన్నడభాష అధ్యాపకుడిగా, ప్రాధ్యాపకుడిగా, శాఖావిభాగ అధిపతిగా, డీన్‌గా, వైస్ చాన్సలర్‌గా ఆ విశ్వవిద్యాలయంలో సేవల్ని అందించారు.

కు.వెం.పుగారు కథారచనలో కొద్దిగానే కథల్ని రచించగా, ఆ కథలు శ్రీసామాన్యుల హృదయాలలో చిరస్థాయిగా నిల్చినదాన్ని ఈ కథనుంచి మనం గ్రహించవచ్చు.

"ఒందు శతమానద 84 శ్రేష్ట సణ్ణ కతెగళు" అనే పుస్తకాన్ని నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయంలో చూచి ఈ కథను తెలుగులోకి అనువదించాను.

రైతు జీవనంలోని దుస్థితిని బహు మార్మికంగా విశదం చేసిన కు.వెం.పు గారు నిజంగానే ధన్యజీవి.

మద్రాసులో అమెరికన్ కాన్సలేట్‌లో పనిచేసిన దివాకరుగారు ఎంతో శ్రద్ధతో నిష్పక్షపాతంగా ఎంపిక చేసిన ఒక శతాబ్దంలోని 84 చిన్నకథలు అనే సంపుటిలో ఉన్న కథ ఇది. 03-08-2007; శాఖమూరు రామగోపాల్.



# నేను చంపిన యువతి

ఆరేడు సంవత్సరాల వెనకటి మాట! వేసవి సెలవులలో మా (మైసూరు) సీమనంతా చుట్టి రావాలని బయల్దేరాను. నాలో, మా సీమలో పేర్గాంచిన శిలాశిల్పాల వైఖరినంతా చిత్రరూపంలో సంగ్రహించాలనే ఒక పిచ్చిపట్టుకొంది ఎంతో బలంగా. సోమనాథపురం, బేలూరు, హళెబీడు ...మొదలైన స్థలాలలో ఉన్న దేవాలయాల వర్ణనలను పుస్తకాలలో చదివినప్పుడు "ఏమైనా కానీయ్! చావకనే బ్రతికి ఉంటే, ఒక రోజుగాకపోయినా ఏదో రోజునైనా వాటన్నిట్నీ కళ్ళారా చూసి వస్తాను!" అని అనుకొన్నాను. అందుచేత, నేను యాత్రా సంచారంకు వెళ్తున్నప్పుడు, నాలోని ఆశెల కలలు నిజమైనవి కదా... అంటూ ఉప్పొంగాను. ఇక్కడ, నేను ముందే చెప్పే విషయం ఏమిటంటే నా సంచారంను గురించి ఒక ఉపన్యాసమైతే కాదు – నా సంచారం మధ్యలో, ఒక ఊర్లో నడిచిన (జరిగిన) రెండు మూడురోజుల సంగతిని గురించే కదా...!

ఆ ఊరిపేరు 'నాగవళ్ళి'. నేను అక్కడికి చేరే వేళకు నా సంచారం (యాత్ర) ముక్కాలు భాగం పూర్తైంది అని అనొచ్చు. అంత సమయంకే సుమారుగా నూట ఏభై చిత్రాల్ని సేకరించాను. అన్నీ నేనే స్వయంగా తీసిన ఫోటోలే కదా!

నాగవళ్ళిలో కరియప్ప గారు అనే ఆయన పెద్ద కామందుగా ఉండేవ్యక్తి. ఆ ఊరికంతా ఆయనే యజమానిలాగ ఉండేవారు. నేను వారి ఇంట్లో బస చేసాను. కథ ఇక్కడినుంచి ప్రారంభం అని భావించొచ్చు.

నేను ఆ ఊరికి చేరినప్పుడు రాత్రి వేళలో సుమారుగా తొమ్మిదిగంటలై ఉండొచ్చు. నా సామానులన్నింటిని ఒక సంతలో బండిమీద వేసి, దాని వెనకే నడుచుకొంటూ వచ్చాను ఇక్కడికి. రాత్రి వేళలో ఆ ఎద్దులబండిలో కూర్చుని ప్రయాణం చేసేది నాకు సరి అని అన్పించలేదు. ఆ రాత్రి ఆ ఊరిలో దిగబడిపోదాం అని అన్పించింది. "ఉండేందుకు సరైన వసతి ఏదైనా ఉందా ఈ ఊర్లో?" – అని బండి ఆసామిని అడిగాను. అతను, కరియప్పగారి పేరు చెప్పి, "స్వామి మీరు ఆజ్ఞె ఇస్తే వారి వద్దకు వెళ్ళి అడిగివస్తాను. వారు ఎంతో అనుకూలం కలుగజేస్తారు" అని అన్నాడు. నేను 'సరే. సరే.. అలాగే" అని

అన్నాను. ఇక ఒక ఫర్లాంగు ఉంటదనంగా వారి ఇల్లు కనబడింది. నేను బండి దగ్గరే నిలిచాను. బండి ఆసామి క్రిందకు దిగి ఆ కరియప్పగారి ఇంటికి వెళ్ళి ఒకట్రెండు నిమిషాల తర్వాత ఇంకొక వ్యక్తితో వచ్చి "స్వామి, వీరే కరియప్పగారు" అని తెలిపాడు. కరియప్పగారు నా సమీపంకు వచ్చి ఎంతో నమ్రతా భావం నుంచి నమస్కరిస్తూ స్వామీ, "దయచేయండి... ఇది మీ ఇల్లేనని భావించుకోండి" అని చెప్పారు. అప్పుడు నేను వారికి కృతజ్ఞతా భావం నుంచి నమస్కరిస్తూ 'మీకు ఇబ్బందిని పెట్టున్నట్లుంది కదా" అని అన్నాను. దానికి వారు "స్వామి, ఎక్కడైనా ఉంటదా ఆ మాట! ఇబ్బంది ఎలాగున? తమరు పెద్ద మనస్సును చేసుకొని నా ఇంటికి వచ్చేందుకు ఒప్పుకొన్నారు కదా... అదే నా భాగ్యం! ఇబ్బంది సబ్బంది అని అనకండి; ఇక రండి" అంటూ తన ఇంటివైపుకు చేతిని చూపించి, బండి ఆసామిని పిల్చి "ఒరేయ్ తిమ్మయ్యా... బుద్ధివంతుడి సామాన్నంతా అరుగుమీదకు తీసుకురా" అంటూ చెప్పారు.

నేను వెళ్ళి వారి ఇంటి లోపల ఉన్న అరుగుమీద పరిచిన తుంగచాప మీద కూర్చున్నాను. కరియప్ప గారిది పెద్ద సంసారం. ఇల్లంతా శోభతో తొణికిసలాడుతుంది. నేను వెళ్ళి కూర్చున్న మీదట, లోపలినుంచి ముగ్గురు నలుగురు పిల్లలు బయటకు పరిగెత్తుకొచ్చి, కుతూహలంతో నా చుట్టూ నిలిచారు. నా హ్యాట్, బూటు అంతా వాళ్ళకు తమాషాగా (వింతగా) కనబడి ఉండొచ్చు!

అరుగుకు ఒక ప్రక్కన ఒక గది ఉంది. ఇంటిపనోళ్ళు దాని తలుపుల్ని తెరిచి కసువు చిమ్మి, చాప మంచంవేసి, ఒక దీపం త్రెచ్చి ఉంచారు అక్కడ. ఆ బండి ఆసామి నాసామాన్నంతట్ని ఆ గదిలో పెట్టి వచ్చాడు. అతనికి ఇవ్వాల్సిన బాడుగను (కిరాయిని) ఇచ్చి పంపేసాను. కరియప్పగారు నాతో "బుద్ధివంతుడా, ఇక దుస్తుల్ని మార్చుకోండి" అని అన్నారు. నేను లేచి గదిలోకి వెళ్ళి, నేనేసుకొన్న బట్టల్ని విప్పి మైసూరు పట్టుధోవతిని, షర్ట్‌ను వేసుకొని బయటకు వచ్చాను. అంత సమయంలోనే ఎవరో లోపలినుంచి వేడినీళ్ళను తెచ్చారు. కాళ్ళు, చేతుల్ని, ముఖంను కడుక్కొన్నాను. ఇక ఒక అరగంటలో భోజనం చేసాను. మరలా బయటకు వచ్చి అరుగుమీద కూర్చుని, తాంబూలం వేసుకొని కబుర్లలో పడ్డాను. నా సంచారంలోని విషయాన్నంతా వారికి (కరియప్పగారి) వివరంగా తెలిపాను. నేను వారి ఇంట్లో బసచేసింది వారికెంతగానో సంతోషంకు కారణమైంది. అది వారి మాటలలో, ప్రవర్తనలో కనబడుతుంది. వారితో మాట్లాడుతుండగా, వారి స్వవిషయాల్ని కొద్దిగా తెల్సుకొన్నాను. ఎంతో నెమ్మది స్వభావంను కలిగిన వ్యక్తి కరియప్పగారు. నాలుగు వందల రూపాయల్ని భూమి శిస్తుగా కట్టుతారట. ఇంటి నిండా జనం. జీతగాళ్ళు,



పనోళ్ళు, – పశువులు, వేటిలోనూ కొరతలేదు. ఇంటిని పెద్దదిగా కట్టించుకొన్నారు. ఆ ఊరికంతా పెద్ద భవనం వారిదే. అంతటికన్నా మిగులుగా నా మనస్సులో నిలిచింది వారిలోని నిష్కపటమైన నమ్రత. అది ఆ గ్రామవాసులకు ఎంతో స్వాభావికం అన్నట్లుగా నగరవాసినైన నాకు తోచుతుంది. మొత్తానికి, వారి గృహంలో నాకు ఎంతగానో ఉపకారం (సేవ) లభిస్తది అని అనుకొన్నాను.

## 2

భోంచేసిన తర్వాత ఎంతోసేపు మాట్లాడలేదు. దారిలో నడుచుకొంటూ వచ్చినందున నాకు కొద్దిగా అలుపైంది. వారికి ఆ విషయం తెల్పి, గదిలోకి వెళ్ళి, దీపాన్ని ఆర్పి పడుకొన్నాను.

ఉదయంలో మెలకువ వచ్చినప్పుడు సుమారుగా ఆరున్నర – ఏడుగంటలు కావొచ్చు. అంత ప్రొద్దుకే నా గది బయట నీళ్ళు సిద్ధమై ఉన్నవి. ముఖం కడుక్కొని గదిలో కూర్చున్నాను. కరియప్పగారే చేతిలో ఒక లోటా పాలను పట్టుకొచ్చారు. వారి ఇంట్లో కాఫీ త్రాగే అభ్యాసం లేదు. నాకు పాలు త్రాగే అభ్యాసం లేదు. ఎలాగో వారు అదంతగా ఆదరంతో తెచ్చినదాన్ని వద్దు అనకూడదని త్రాగాను. ఆ మీదట వారిని అక్కడే కూర్చోబెట్టుకొని సంచారం (యాత్ర)ను చేసి త్రెచ్చిన చిత్రాలన్నిట్నీ చూపించి, వాటి విషయంమీద నేను తెల్సుకొన్న (నేర్చుకొన్న) దాన్ని చెప్పాను. విసినంతనే వారికైన సంతోషంను, ఆశ్చర్యంను నేను వివరించలేను. వారు నన్ను చూస్తూ "బుద్ధివంతుడా, మీరు ఒప్పుకొంటే – ఇక్కడే ఈ ఊరికి దగ్గరలోనే ఒక దేవస్థానం ఉంది. రంగప్ప గుడి అది – ఎంతో పురాతనమైంది– ఎంతో సుందరమైనది! ఎంతో దూరాన లేదులే" అని అన్నారు. నా చెవులు నిక్కబొడుచుకొన్నవి.

"ఎక్కడ?" అని అడిగాను.

"ఇక్కడే, ఇక్కడికి రెండు మైళ్ళదూరంలో కాలుదారిలో ఒక గుట్ట ఎదురౌతది. దానిచెంతనే ఆ గుడి ఉంది."

నేను బేలూరులో తీసిన ఫోటోలకు కొన్ని వివరణ వాక్యాల్ని రాసేదుంది. అంతేగాకుండా నా అర్ధాంగి లక్ష్మికి ఒక ఉత్తరం రాసేదుంది.

"సరే, అలాగైతే రేపు ఉదయంలో అక్కడికి వెళ్ళి వస్తాను, ఈ రోజు కొద్దిగా వ్రాసుకొనేదుంది" అని చెప్పాను.

"తమ చిత్తం... అలాగే కానీయండి" అని బదులిచ్చాడు.

❁ ❁ ❁

ఆ రోజు నేను తీసిన ఫోటోలకు టీకా–వివరణల్ని రాసే దాన్లోనే పన్నెండుగంటలు అయ్యింది. భోజనం అయిన మీదట లక్ష్మికి ఉత్తరం వ్రాసే దాన్లో నిమగ్నమైయ్యాను. నా సంచారంలో ఖాళీ దొరికినప్పుడల్లా ఆమెకు ఉత్తరాల్ని వ్రాస్తుండేవాడ్ని. ఆ ఉత్తరాలనిండా నా సంచారంలోని విషయాలే – నేను చూసిన దేవస్థానంలు – వాటిముఖ్య విశేషాలు, వాటి వర్ణన మొదలైనవే ఉండేవి. నా సంచారంలో లక్ష్మిని వదిలి వచ్చిన విషయం నిత్యమూ నన్ను వదలకనే అనుసరిస్తుండేది. ఎన్నోసార్లు అయ్యో! ఈ సొగసుల్ని చూసేందుకు నా లక్ష్మి (అర్ధాంగి) లేదు కదా! ఆమె నా చెంతనే ఉండుంటే వీటి సొగసులు ఇంకా ఎక్కువయ్యేవేమోకదా....అని అనుకొంటుండేవాడ్ని. నిన్న నేను నాగవల్లికి వచ్చింది, అక్కడ కరియప్పగారి ఆదరణీయమైన ఆతిథ్యం, ఉపచారం... వారి సంతానం, మనమ సంతానం, అంతటినీ వ్రాసి– రేపు మరడిబెట్టలోని రంగన్న గుడికి వెళ్ళాల్సియున్న దాన్ని తెలుపుతూ – ఆ తర్వాత మా దాంపత్యంలోని మా మాటల్ని (ప్రీతి విషయాల్ని) వ్రాసి, ఉత్తరంను ముగించాను. ఆ గ్రామంలో పోస్టాఫీసు లేదు. ఒక పోస్ట్‌బాక్స్ మాత్రం ఉంది. వారంకు రెండుసార్లో, మూడుసార్లో బేలూరు నుంచి ఆ పోస్టాఫీసులో పనిచేసే వ్యక్తి వచ్చి ఆ ఉత్తరాల్ని తీసుకొని వెళ్తుండేవాడు. వివరంగా అడిగితే ఆ విషయం తెల్సింది. అయితే పోస్ట్‌బాక్స్‌లో వేయిద్దామని ఆలోచిస్తూ, గది నుంచి బయటకు వచ్చాను. నేను బయటకు రాగా, గదికి కొంచెం దూరంలో వసారాకున్న స్థంభంకు ఒరిగికొని (వాలుకొని) వయస్సులో ఉన్న ఒక తరుణి కూర్చుని ఉంది. కామందుకు కుమార్తెగా అయ్యుండొచ్చుని కనబడింది. నేను బయటకు వచ్చి పనోడెవరూ కనబడనందున ఏమి చేయాలనేది తోచక నిలిచాను. నన్ను చూసిన ఆ యువతి తక్షణమే లేచి నా వద్దకు వచ్చి ''ఏమి కావాలి బుద్ధివంతుడా! ఆజ్ఞ ఇవ్వండి''అని అడిగి, కొద్దిగా నగుమోమురాలులాగా ఉంది. ఆ పల్లె పడుచులోని వినయంను, సరళత్వంను చూసిన నాకు సంతోషమైంది. నేను చెప్పాను ఇలాగున... "ఏమి లేదమ్మా, ఈ ఉత్తరం పోస్ట్ చేయాలి. ఆ పోస్ట్ బాక్స్ ఎక్కడుందో నాకు తెల్వదు. చెప్తావా అదెక్కడుందో?"

ఆమె నవ్వుతూ నా వైపుకు రెండు అడుగుల్ని వేసి –

'అదెందుకు మీకు శ్రమ. ఆ ఉత్తరంను ఇటు ఇవ్వండి నా దొరా – నేను వెళ్ళి పోస్ట్ డబ్బాలో వేస్తాను" అంది.



ఆమె మాటల్నివిని, ఆమెతో ఇంకా నాలుగు మాటల్ని మాట్లాడాలనిపించింది!...

"నీకు కష్టమేమోకదా?" అన్నాను.

"అయ్యో బుద్ధివంతుడా! అది నాకెందుకు కష్టమౌతది? మీరు గొప్పోరు!"

"అలాగైతే నీకు కష్టం కాదా?"

"లేదు, లేదులే నా దొరా! ఇటు ఇవ్వండి, ఆ ఉత్తరంను"

– ఇలాగున చెప్పి, రెండు చేతుల్ని చాపింది. నేను ఉత్తరాన్ని ఆమె చేతిలో పెట్టి "నీ పేరేంటి?" అని అడిగాను.

"నా పేరు చెన్ని (చెన్నమ్మ)" అంటూ కొద్దిగా సిగ్గుపడుతూ నా నుంచి వెళ్ళిపోయింది.

చక్కటి పేరు – అనుకొన్నాను. చెన్ని చక్కగా మాట్లాడింది. ఆమె ముఖంలో ఉన్న నమ్రతాభావం – కళ్ళలో, ఆమెలోని నవనీతమైన హృదయంలోని నిర్మలఛాయ – మాటలలో పల్లెపట్టులలో తొణికిసలాడే లాలిత్యం, ఇవి ప్రతియొక్కటి నా మనస్సులో నాటినవి.

❁ ❁ ❁

ఆ రోజు మధ్యాహ్నం భోజనం అయిన మీదట కొంచెంసేపు పడుకొన్నాను. మెలకువ వచ్చినప్పుడు సుమారుగా నాలుగు గంటలైంది. ముఖం కడుక్కొందామని గది నుంచి బయటకు వచ్చాను. పునః (మరలా) ఆమె; నేను మొదట్లో చూసిన చోటే స్తంభకు వాలుకొని కూర్చుని ఉంది. నేను బయటకు వచ్చినదాన్ని చూసిన తక్షణమే చాపుకొన్న కాళ్ళను మడుచుకొని , ఏదో ఒక విధమైన అన్యమనస్సునుంచి చీర కొంగులో ఉన్న దారంప్రోగును పీకసాగింది. నాకు నీళ్ళు కావాల్సి ఉంది. అక్కడ అడిగేందుకు ఆ యువతి తప్పితే మరెవరూ లేరు. ఇప్పటికే ఒకసారి ఆమెతో మాట్లాడి ఉన్నాను. ఇప్పుడు ఆ సాన్నిత్యం నుంచి ఆమెనే "చెన్నమ్మా... కొంచం నీళ్ళు కావాలి...ముఖం కడుక్కొనేందుకు" అని అడిగాను. "అలాగే అలాగే నా దొరా" అంటూ ముసిముసిగా నవ్వుతూ ఏదో ఒక సంభ్రమంతో లోపలికి వెళ్ళింది. చెన్నమ్మ పుట్టుకతోనే మందహాసురాలిగా (సుహాసినిగా) ఉండొచ్చేమో! నేను చూసినప్పుడల్లా ఆమె ముగ్ధ ముఖం చిరుదరహాసంతో చిందులాడుతుంది. మా నగరంలోని యువతుల మందహాసంలను అనేక సందర్భాలలో చూసాను. అయితే ఆ మందహాసాలు సాధారణంగానే ఉండి, పెద్ద పెద్ద వృక్షాల్ని పడద్రోసి దుమ్ము ధూళిని రేపే సుడిగాలులలాగ ఘర్జించి, ప్రచండ ఘోషల్ని పెట్టే సునామి లాగ,

అల్లకల్లోలాల్ని రేపే అలలులాగ ఆయా మందహాసాలు ఉంటుండేవి. ఈ పల్లెపడుచు చెన్నమ్మలోని మందహాసం అటువంటిది కాదు. అది, మృదువుగా అక్కడ తిరిగి ఇక్కడ చిగురుటాకులలో జొరబడి, పూలగుత్తులలో దూరి పరిమళాన్ని మోసుకొచ్చే చల్లటిగాలి లాగ – హృదయంలో చిన్న చిన్న తరంగ మాలల్ని పుట్టించే సరళమైన దరహాసమే ఆమెలో ఉంది కదా! సుడిగాలిలో చిక్కుబడిపోతే మొత్తానికి దుమ్మే! కళ్ళకు, నోటికి, ముఖానికి దుమ్మే! ఆ నగర యువతులలోని సుడిగాలిలో సౌరభంలేదు. ఈ పల్లెపడుచు నవ్వులో? ఓ! అది మల్లె పువ్వుల లాగనే! మల్లెపూలలలో ఎంతగా శుభ్రత! లెక్కలేని పరిమళం!... ఇటువంటి ఆలోచన నాలో అయినప్పుడు చెన్నమ్మ నీళ్ళను తెచ్చింది. కాళ్ళు చేతులు ముఖం కడుక్కొని గదికి వెళ్ళేలోపే చెన్నమ్మ కొద్దిగా ఉపాహారంను, ఒక లోటాలో పాలను తెచ్చిపెట్టి వెళ్ళిపోయింది. చిరు తిండిని తిన్నమీదట బయటకెళ్ళి షికారు చేసి వద్దామని నా మురళిని, కెమెరాను తీసుకొని గదినుంచి బయటకు వచ్చాను. బయటకు రాగా చెన్నమ్మ అదే స్థలంలో కూర్చుని ఉంది. నేను ఆ భవనం నుంచి ఒక ఫర్లాంగు దూరం బయటకు వచ్చాను. ఎటువైపుకు వెళ్ళాలి అనే యోచన అయ్యింది. ఆ పెద్ద ఇంటికి వెనకనే కరియప్ప గారికి తోట ఉందనేది జ్ఞాపకంకు వచ్చి అక్కడికి వెళ్ళాలని నిశ్చయించుకొన్నాను. అయితే దారి తెల్వదు. ఏమి చేయాలని యోచిస్తుండగా చెన్నమ్మనే అడుగుదామని అనుకొంటూ వెనక్కి తిరిగి "ఏవమ్మా... మీకు తోట ఉందట కదా, దాన్నే చూడాలని అనుకొంటున్నాను. దారి ఎటో చెపుతావా?" అంటూ అడిగాను. ఆమె "అలాగే, నా దొరా" అంటూ లేచివచ్చి, నన్ను ఇంటి వెనకకు తీసుకొని పోయి, ఒక కాలిబాటను చూపి "ఇదే దారి... మా తోటకు దొరా" అని అంది. "సరి, సరి... ఇక నేను అటు వెళ్తాను" అని చెప్పి బయల్దేరాను. ఆ కాలిబాట ప్రక్కన ఉన్న చిన్న ఆకుతోటల్ని దాటి ఒక పెద్దతోటకు వెళ్ళాను. అక్కడ గాలివీసి నేను కట్టుకొన్న మైసూరు జరీ పట్టు ధోవతిలోని అంచు కూరగాయల పాదుకు వేసిన కంచెకు చిక్కుకోగా, దాన్ని విడిపించుకొనేందుకని వెనక్కి తిరిగాను. చెన్నమ్మ! నేను ఆమెనుంచి దాటి ఎక్కడకు బయటకు వచ్చానో అక్కడే ఆమె నిలిచియుంది. నేను బహుశః దారి తప్పవచ్చేమోనని ఆమెలో సంశయం ఉంటుందేమోనని భావించుకొన్నాను.

ఇక సుమారుగా వంద గజాల్ని దాటిపోగా తోటకు చేరాను. అది ఎంతో సుందరమైన తోట. విశేషంగా చెప్పాలంటే అది వక్కలతోట. ఇంకా కొన్ని పండ్లచెట్లు ఉన్నవి. స్వాభావికంగా రమ్యమైన ఆ తోటలోని సొగసు, ఆవేళలో, సాయం సమయంలోని సూర్యుడి బంగారు కిరణాలు ఆ చెట్లమీద పడిన ఆ సుందర నయన మనోహర దృశ్యాలు నూరారు రెట్లుగా ఎక్కువై కనబడుతుంది. తోటలోకి ప్రవేశించి ఇరవై అడుగుల్ని వేసే లోపున ఒక



విశాలమైన బావిని చూశాను. అది ఏతం బావి. ఒక ప్రక్కన బావి అడుగులోని నీటివరకూ దిగి వెళ్ళేందుకు అనువుగా దిగుడు మెట్లు ఉన్నవి. బావి చుట్టూ సుమారుగా భూమికి రెండు అడుగుల ఎత్తులో రక్షా కవచంలాగ రాతి గోడ ఉంది. నేను వెళ్ళి ఆ గోడ మీద కూర్చుని, తోట్లోని అందాల్ని ఆస్వాదించసాగాను.

## 3

కొంచం సేపు నా మనస్సుకు ఆ తోటలోని అందాల్నుంచి కలిగిన సంతోషంలో, ఏదో వర్ణించలేనటువంటి దివ్యసుఖాన్ని అనుభవించసాగాను. తోట్లో చల్లగాలి వీస్తుంది. బావిచుట్టూ నానారకాల పూలచెట్లు ఉన్నవి. వాటి పరిమళాలంతా చల్లగాలిలో తేలిపోతున్నవి ఎక్కడెక్కడికో. నానాజాతి పక్షుల కలకల కంఠనాదంలు ఆకాశం నుంచో చెట్లనుంచో పొదల మాటునుంచో వినబడుతున్నవి. నా హృదయమూ పక్షుల లాగనే పక్షిలాగ అయ్యింది. పూలలో పువ్వులాగ అయ్యింది. కవులు తాము కాంచని (చూడని) స్వర్గాన్ని ఎందుకు వర్ణిస్తారో!–అన్పించింది. ఎక్కడ దివ్యసుఖం ఉంటదో అక్కడే స్వర్గం!– నా హృదయం ఆనందం నుంచి నిండిపోయి ఉప్పొంగి ప్రవహిస్తోంది. దాని ప్రవాహంలో మురళిని (వేణువును) ఊదసాగాను. మురళిలోని ఒకొక స్వరమూ నూరు స్వరాలులాగ తోట అంతా వ్యాపించింది. నా వేణుగానంకు నేనే ఉబ్బిపోయాను. ఒకట్రెండు కీర్తనల్ని వేణువునుంచి గానంచేసి, ఆ తర్వాత నోటినుంచి ప్రారంభించాను. తోట అంతా నేనొక్కడ్నే అనే ధైర్యంతో నోటికి వచ్చినట్లుగా పాడుతున్నాను. అంతలో నా వెనక గుళుగుళు అంటూ శబ్దమైంది. నేను తక్షణమే పాటను పాడేదాన్ని నిల్పేసి వెనుకకు తిరిగి చూసాను. చూడగా అదే ఆ యువతి – చెన్ని; మెట్లమూలకంగా క్రిందకు దిగి బిందెలలో నీటిని నింపుతుంది. నేను చూస్తున్నప్పుడు (నా పాట ఆగినప్పుడు) ఆమె తలెత్తి చూసింది. నాకు ఎంతో సిగ్గైంది. నేను నగరానికి చెందిన నాగరికుడ్నని వీళ్ళు గౌరవం పెట్టుకొన్న దాన్ని, ఇప్పుడు నల్లనయ్య గొల్లనయ్య లాగ వేణువు ఊదుతూ నోటికి వచ్చినట్లుగా అరుస్తున్న (పాడుతున్న) దానికి సరిపోయింది! అని అనుకోసాగాను. నేను మెట్ల వైపుకు వీపు పెట్టి కూర్చున్నందున ఆమె వచ్చింది తెల్వలేదు. నా సంగీత ఉత్సాహంలో ఆమె గాజుల సవ్వడి, కాలిఅందెల సవ్వడి.... వీటిని విన్పించుకోలేదు. అప్పటి నాస్థితి అంటూ సిగ్గుకు కారణమైంది. ఒక క్షణం నాలో నేనే "ఆ ఏమౌతదిలే" అనుకొన్నాను. అయినా మనస్సు సమాధానం పొందట్లేదు. నా పిచ్చిగానంకు నాకు నేనే నవ్వుకోసాగాను. ఇక వేణువును ప్రక్కనబెట్టి కెమెరా చేతిలోకి తీసుకొని దాన్ని చూస్తున్నోడిలాగ నటించసాగాను. ఆమె బిందెలలో నీళ్ళను ముంచుకొని మెట్లను ఒక్కొక్కదాన్నే ఎక్కివస్తున్నట్లుగా బోధపడింది.

మెట్లన్నిట్నీ ఎక్కిన మీదట ఆమె కాళ్ళ సప్పుడు పెద్దగా వినబడలేదు. నాలో, ఇక ఆమె ఎంత త్వరగా వెళ్ళిపోతదో అన్పించింది. కాళ్ళ సప్పుళ్ళ బదులుగా చేతిగాజుల గలగలల సప్పుళ్ళు వినిపించినవి. మరలా ఆమె ముఖాన్ని చూసేందుకు సిగ్గైంది. అయినా, తిరిగి చూసాను! ఆమె చక్కగా చింతపండు త్రొక్కతో తోమిన (కడిగిన) రెండు ఇత్తడి బిందెలలో నీటిని నింపుకొని మెట్లను ఎక్కి ఆ బిందెల్ని బావికున్న రాతిగోడ మీద పెట్టింది. ఆ సమయంలోనే నేను మరలా ఆమెను చూసాను. నా నుంచి జాలువారిన విచిత్రమైన సంగీతం నుంచి ఆమెలో వచ్చిన నవ్వు ఇంకా ఆమె ముఖంమీదే నడయాడుతుంది. నాకు ఎంతగానో లజ్జ అయ్యింది. ముఖాన్ని త్రిప్పుకొని, కూర్చున్నోడ్ని లేచాను. ఏమో మాట్లాడినట్లైంది ఆమె. నా మనస్సులో ఉన్న గందరగోళం నుంచి అది ఏమిటనేది తెల్వలేదు. మరలా ఆమె వైపుకు తిరిగి "ఏమిటమ్మా?" అని అడిగాను. అందుకామె "పాటల్ని పాడుతున్నారా, నా దొరా?" అని అడిగింది. ఆమె నుంచి వచ్చిన ఈ ప్రశ్నెకు నా మనస్సులో అయిన కలకలం, అవమానం ఆ దేవుడికే గుర్తు? ఏమి చెప్పాలో తక్షణమే గుర్తుగాక "ఆ... ఊ" అంటూ పళ్ళను ఇకిలిస్తూ, ఆ మీదట "అయిపోయిందమ్మా – పాడేది" అన్నాను. ఆమె అడిగిన ప్రశ్నె నాకు అపహాస్యంగా తోచినా, దాన్నుంచి నాకు కోపం కలగలేదు. కోపం ఎందుకు రావాలి! నేను పాడింది లిల్లాయి పాటల్ని! నాలో అప్పటి మనస్సులోని స్థితిలో అది (ఆ గానం) అపహాస్యంగా కనబడి ఉండేది త్రప్పితే నిజంగానే, హసన్ముఖియైన ఈ పల్లెపడుచుకు (ముగ్ధరాలికి) నన్ను హాస్యంచేసే అభిప్రాయం ఉండేది లేదని నాకు తోచింది. ఎలాగో అయ్యింది అయిపోయింది, ఇక ఈ తోటనుంచి బయట పడ్డామని, మురళిని కెమేరాను చేతిలోకి త్రీసుకొని, ఒకట్రెండు అడుగుల్ని వేసాను. అంతలో "నా దొరా" అని పిల్చింది. "మరలా ఇదేంటి నా దొర" అనుకొంటూ తల త్రిప్పాను. ఆమె నిండైన ఒక బిందెను తలమీద ఎత్తి పెట్టుకొంది. ఇంకొకటి ఆ రాతి గోడ మీద ఉంది. నేను తలను తన వైపుకు త్రిప్పినదాన్ని చూసి, ఆ మిగిలిన బిందెను చూపిస్తూ "నా దొరా, ఈ బిందెను కొంచెం ఎత్తిపెట్టుతారా?" అంటూ, సిగ్గుతో సంకోచంగా అడిగింది. నేను "ఓ! అలాగే" అని చెప్పి చేతిలో ఉన్న కెమేరాను వేణువును గోడ మీదపెట్టి, ఆ బిందెను ఎత్తి ఆమె నడుం మీద పెట్టాను. నేను ఇంతగానే సహాయపడింది ఆమెకు ఎంతో గొప్పగా కనబడియుండొచ్చు. ఆమె ముఖం ఎంతో సంతోషంగా ఉంది. ఇంటి దార్ని పట్టుకొని మెల్లగా ఐదారు అడుగుల్ని వేసింది. నిండియున్న ఆ నీళ్ళ బిందెల బరువుకు నెమ్మదిగా వెళ్తున్న ఆ నిండు జవ్వని ఆ దినంలోని సాయం సమయంలో ఉన్న సూర్యుడి బంగారు కిరణాలలో అత్యంత మనోహరంగా జక్కనాచార్యుడు చెక్కిన శిల్పసుందరిలాగా కనబడింది నా కళ్ళకు. తక్షణమే నామనస్సులో



ఆమెలోని ఆ నిలువు భంగిమ నుంచి ఒక ఫోటో తీయాలనే ఆశె పుట్టింది. కెమేరా సిద్ధం చేసుకొని, ఆ యువతి ఏమనుకొంటదో అనే ఆలోచనే లేకుండా, "చెన్నమ్మా" అంటూ పిలిచాను. ఆమె బరువు భారం నుంచే మెల్లగా తిరిగి "పిలిచారా, నా దొరా?" అంటూ అడిగింది, నేను 'హ్హుం' అంటూ ఆమె సమీపంకు వెళ్ళి "చెన్నమ్మా, నువ్వు ఒక్క క్షణం అలాగే నిలబడుతావా?" అని అడిగాను. ఆమెకు కొద్దిగా ఆశ్చర్యం అయ్యుండొచ్చు. ముఖంలో ఆ చిహ్నాలు కనబడుతూ ఆ సాయంసంధ్యలో సూర్యుడికి అభిముఖంగా అలుపుతో నిలబడి పోయింది. ఆమె ముఖంమీద విసుగే లేని ఆ ముగుళు నవ్వు ఆ బంగారు కిరణాలలో ఎంతో ఘనంగా ప్రకాశిస్తుంది. నేను ఆమెను ఫోటోతీసి, "ఇక నువ్వు వెళ్ళమ్మా" అని అన్నాను. ఆమె కుతూహలం నుంచి "అదేమి చేసారు బుద్ధివంతుడా?"అంటూ అడిగింది. ఆమెకు తెల్సేటట్టుగా చెప్పేది ఎలాగున? "రేపు చెప్తానులే" అని బదులిచ్చాను. ఆమె నా నుంచి తిరిగి నిధానంగా ఇంటివైపుకు అడుగుల్ని వేసుకొంటూ వెళ్ళిపోయింది.

## 4

ఆ రాత్రి భోజనం అయినమీదట గదికెళ్ళి పాన్పుమీద పవళించాను. తొందరగా నిద్రపట్టలేదు. సాయంకాలంలో తోట్లో నడిచిన విషయం ఇకనూ మనస్సులోనే మెదులుతుంది. నాలో నేనే నవ్వుకొంటూ – లక్ష్మికి (నా భార్యకు) ఈ విషయంను చెప్తే ఏమంటదో! ఎంతగా పడి పడి నవ్వుతదో! – అనుకొన్నాను. నాలో నవ్వు ఇంకా ఎక్కువైంది.

❁ ❁ ❁

రాత్రి నిద్రకు జారినప్పుడు ఎంతో వేళైనట్లుంది. ఉదయంలో లేచినప్పుడు ఎనిమిది గంటలైంది. అదెంతో తొందరగా ముఖం కడుక్కొని, తిండి తీర్థాల్ని ముగించుకొని, మరడిబెట్టలో ఉన్న రంగన్న గుడికి వెళ్ళేందుకు సిద్ధమైయ్యాను. భూ కామందు ఒక పనోడ్ని ఇచ్చాడు. అతని చేతిలో కావాల్సిన పరికరాలన్నిట్నీ పెట్టి బయల్దేరాను. మరడి బెట్టలో ఉన్న దేవస్థానంలో, నా పనులన్నీ చక్కబెట్టుకొని తిరిగి వచ్చేందుకు సిద్ధమైనప్పుడు మధ్యాహ్నంలో సుమారుగా ఒంటిగంటైంది. వెనుదిరిగి వస్తున్నప్పుడు కాలిబాటకు కొద్ది దూరంలో పచ్చిక బయళ్ళలో పశువులు మేస్తున్నవి. అక్కడక్కడ రైతులు పొలాలలో, మడులలో పనులను చేసుకొంటున్నారు. వారి చెంతనే పశువులను కాసే పిల్లలలో ఒకడు పాటను పాడేదాన్ని ప్రారంభించాడు. అతనికి ఎవర్నుంచి రాగస్వరాల మీద ఆక్షేపణలు ఉంటవి? జోరుగా భలే గట్టిగా రాగంను ఆలపించసాగాడు. నాకెంతగానో తమాష కలిగింది. కొంచంసేపు నిలిచి విందామనుకొన్నాను. అయితే నాతోపాటుగా

పనోడొకడున్నాడు కదా! నాలోని కౌతుకంకు అతను నవ్వుకొంటాడేమోననే సంకోచం నాలో ఉంది. అంతేగాకుండా, నిన్న సాయంకాలంలోని నా వ్యవహారం గుర్తుకొచ్చి ఆగలేదు నేను.అలాగే సుందరి చెన్నమ్మ జ్ఞప్తిలోకి వచ్చింది. ఆ పల్లె పడుచులోని స్వాభావికమైన మధుర దరహాసం (నవ్వు) నా కళ్ళముందు మయూర (నెమలి) నాట్యంను చేయసాగింది. తళతళగా మెరుస్తున్న ఆ నిండైన బిందెల్ని మోస్తూ వాటి బరువు (భారం)కు అలుపు నుంచి ఒయ్యారంగా ఆమెలోని నింపాదైన నడక నా కళ్ళకు ఒత్తినట్లుగా గుర్తుకు రాసాగింది. చెన్నమ్మ ఆ భూకామందుకు పుత్రికగా ఊహిస్తున్నాను తప్పితే నిజమైన విషయం ఆమె గురించి తెల్వదు. తెల్సుకోవాలనే కుతూహలంనుంచి పనోడ్ని అడిగాను.

'మీ యజమాని ఇంట్లో ఉండే ఆ యువతి ఎవరయ్యా?" అని అడిగాను.

పనోడు నిలబడిపోయి నా వైపుకు తిరిగి చూస్తూ, "ఏ యువతి బుద్ధివంతుడా" అని అడిగాడు. నేను ఆ జవ్వని గురించి అడిగింది ఆ పనోడికి గుర్తుకాలేదు. "అదేనయ్యా చెన్నమ్మ అని పిలుస్తారు కదా.. ఆమె గురించే"అన్నాను నేను. నా వైపుకే చూస్తున్న ఆ పనోడు నా నుంచి వచ్చిన ప్రశ్నెను విని అదోలా నవ్వి ముఖాన్ని మరో దిక్కుకు పెట్టుకొని "ఎందుకు బుద్ధివంతుడా?" అంటూ అడిగాడు! నాకెంతో అవమానమైందని అన్పించింది. సిగ్గా అయ్యింది. ఈ పనోడు నా ప్రశ్నెలో ఏదో దురభిప్రాయంను చూసినట్లుగా అయ్యింది కదా!- అనుకోగా నా మనస్సులో ఒక క్షణం ఎంతో గలిబిలి అయ్యింది. లక్ష్మి తప్పితే మరిక ఏ స్త్రీ నా జీవితంలో లేదని ఈ మూర్ఖుడు తెల్సుకొనేది ఎలాగున? అతనేమో వ్యంగ్యంగానే నవ్వి "ఎందుకు బుద్ధివంతుడా?" అని అడిగాడు కదా! నేను "ఎందుకో కాదయ్యా- ఉత్తిగనే అడిగాను- అడగకూడదా?" అన్నాను.

"అయ్యో! దానికేముందిలే బద్ధివంతుడా..పర్వాలేదు! ఆమె యజమానైన కరియప్పగారి పుత్రి" అన్నాడు.

ఇంకొక ప్రశ్నె నా నాలిక తుది వరకూ వచ్చింది. అయితే ఆపుకొన్నాను! "ఎవరు" అని అడిగినందుకే నవ్విన ఇతను "ఇక పెళ్ళైందా ఆమెకు" అని అడిగితే, మరిక ఏమి అనుకొంటాడో! అనే భయం పుట్టి ఊరకుండిపోయాను.

❀ ❀ ❀

ఇంటికి చేరి స్నానం చేసి భోజనం ముగించుకొని, నిన్న సాయంకాలంలో తీసిన చెన్నమ్మకు చెందిన ఫోటో నుంచి నాలుగు అచ్చుల్ని (ప్రింట్‌లను)తీసాను. ఫోటోప్రింట్‌లు చక్కగా వచ్చినవి. ఆ ఇంట్లోని వారంతా ఆ ఫోటోలను చూసి ఎంతగానో ఆనందించారు.

❀ ❀ ❀



మధ్యాహ్నంలో తిన్న భోజనం వేళ మీరింది. అందుచేత ఆ రాత్రి ఆకలి వేయలేదు. రాత్రి భోజనం చేయనని ఇంట్లో వారికి తెలియజేసాను. నిద్ర కూడా తొందరగా వచ్చేటట్లుగా కనబడలేదు. ఏమిచేసేందుకు తోచక కొంచం దూరం వాయువిహారం (వాకింగ్) చేసి వద్దామని బయల్దేరా. మరలా గదికి చేరేటప్పటికి రాత్రి తొమ్మిది గంటలైంది. ఇంకా నిద్ర దూరానే ఉన్నట్లు తోచింది. దీపం వెలిగించి మంచం వేసుకొని, దానిమీద ఆరామంగా (విశ్రాంతిగా) పడుకొని ఏదో కాదంబరిని (నవలను) తీసుకొని చదవసాగాను. సుమారుగా పది నిమిషాలు చదివి ఉండొచ్చు. అప్పుడు గదికున్న తలుపుకు ఏదో తట్టినట్లైంది. గాలి ఏమో నెట్టుందని అనుకొన్నా. పునః (మరలా) పుస్తకాన్ని చదవసాగాను. మరలా తట్టుతున్న సప్పుడు అవుతుంది. ఈసారి మెల్లగా తట్టినట్లుగా ఉంది. పడుకొనే ఉన్న నేను "ఎవరయ్యా అది?" అంటూ అడిగాను. జవాబులేదు. ఒక క్షణం అయినమీదట మరలా, ఎవరో తట్టినట్లుగా కలగసాగింది. ఇక లాభం లేదని లేచి కూర్చుని "ఎవరది?" అంటూ ప్రశ్నించాను. చేతి గాజుల గలగలల సవ్వడి వచ్చింది. జతగా క్షీణ(మెల్లగా) స్వరంతో "నేను,చెన్నని.. చెన్నమ్మను" అనే పలుకూ వచ్చింది! నాకు ఆశ్చర్యమైంది. ఇంత రాత్రిలో ఆమెకు నా దగ్గర ఏమి పనిబడింది?.. ఏమైనా కానీయ్, విచారించుదాం అని అనుకొంటూ లేచి, తలుపు తెరిచి బయటకు ముఖాన్ని పెట్టి "ఏమిటమ్మా?" అంటూ అడిగాను. నా గదిలోని వెలుతురు క్షీణం (కొద్ది)గా ఆమె దేహం మీద పడ్తుంది. ఆమె చేతిలో ఒక వెండి పళ్ళెం (కంచం), దాన్లో ఐదారు అరటిపళ్ళు, లడ్డులు,ఒక లోటా నిండా ఆవిర్లను క్రక్కుతున్న పాలు – ఉన్నవి. నేను "ఏమిటమ్మా"అని అడిగినదానికి ఆమె "బుద్ధివంతుడా, మీరు ఈ పూట భోంచేయలేదుకదా! అందుకే ఈ ఉపాహారం తీసుకొచ్చాను.... నా దొరా" అని అంది. నాలో అప్పుడు కొద్దికొద్దిగా ఆకలి ఉందనేది కలగసాగింది. "ఎంతో సంతోషం... సుమీ" అని చెప్పి, ఆమె చేతి నుంచి ఆ కంచం తీసుకొని మంచంకు సమీపంలో పెట్టేందుకు వెళ్ళాను. చెన్నమ్మ నా వెనకే గదిలోకి వచ్చింది! నా గుండె ధసక్ మంది (అదిరింది)! ఆ సమయం అలాంటిది కదా! నేను కంచంను మంచం ప్రక్కన ఉంచి, మరలా ఆమె వైపుకు తిరిగి, "ఇంకేం వద్దమ్మా. నువ్వు ఇక వెళ్ళొచ్చు" అని అన్నాను. ఆమె నవ్వుతూ "నేనుంటే ఏమిటి పండితుడా.. తమరు (మీరు) తినకూడదా?" అని అడిగింది. నేను 'హో తినచ్చు. అందుకని కాదు నేను అన్నది. అయితే ఇప్పుడు నాకు ఇంకేమి వద్దు. అంతేగాకుండా, ఇంత సమయంలో నువ్వొక్కదానివే ఇక్కడ ఉంటే...' నా మాటల్ని పూర్తి చేసే లోపే ఆమె నా గదికున్న తలుపుల్ని మూసి చిలకం (గొళ్ళెం)ను వేసింది! ఆమె నా గదిలోకి వచ్చిన తక్షణమే నా మనస్సులో ఉన్నటువంటి మబ్బు మబ్బైన (మసకు మసకైన) ఏదో భావన ఇప్పుడు

కొద్ది కొద్దిగా స్ఫోటకం చెందేది ప్రారంభమైంది. ఆమె తలుపును వేసినదాన్ని చూసి అప్పటికప్పుడే నా వళ్ళు వణికింది. చమట బిందువులు ముఖం మీదంతా నిల్చినవి. గొంతు తడారిపోయి ఉమ్మిని మ్రింగసాగాను. కష్టంగా "యోయ్... ఎందుకమ్మా... తలుపు వేసావు?" అని అడుగుతూ, వాట్ని తెరిచేందుకు రెండడుగుల్ని వేసాను. చెన్నమ్మ సర్రనే తలుపుకు అడ్డంగా నిల్చి, దరహాసం చేస్తుంది. నా మోకాళ్ళు గడగడా వణుకుతున్నవి. సరి, సరి! ఇంకేమి సంశయం మిగలలేదు! ఆమె అభిప్రాయం నా ఎద (హృదయం) మీద నిప్పుల కుంపట్ని పెట్టినట్లైంది. నా మనస్సులో నేను అనుకొన్నాను. "ఈమేనా పల్లెపట్టులోని ముగ్ధ యువతి" అని ఈసడించుకొన్నాను.

## 5

నాకు నిల్చేందుకు కాళ్ళే లేనట్లుగా ఉంది.వెళ్ళి మంచం మీద కూర్చుని, రెండు చేతుల్నుంచి తలను పట్టుకొని ఆలోచించసాగాను. ఇక ఇక్కడ ముందే నడిచిన విషయాలను తెల్పేందుకు మొదలే, వేరే ఒకట్రెండు మాటల్ని చెప్పాలనిపిస్తుంది. వినండి పాఠకులారా... ఆరోజు రాత్రి నన్ను ఈ పాప కూపం నుంచి త్రప్పించి రక్షించినోళ్ళెవరంటే నా భార్య లక్ష్మీనే కదా! ఆమెలోని ప్రేమ అనే కోట నన్ను పూర్తిగా బంధీగా చేసుకొని ఉంది. నేను, ఆమె సతిపతిగా ఒకటైనప్పటినుంచి ఇప్పటివరకూ, నేను ఆమెలో చూడనిది ఇంకెక్కడా వేరే మహిళలో చూడలేను అనేలాగ చేసింది లక్ష్మి. రూపంలోగాని, గుణంలోగాని, ప్రేమలోగాని, నేను ఆమె మీద పెట్టిన దృష్టిని వేరే వైపుకు తిరిగించే అవసరం లేదు. లక్ష్మి నాతో జతగా ఆ రోజున లేకపోయినా, నేను ఆ రాత్రిలో ఉన్న సన్నివేశంలో...అరక్షితమైన నా మనస్సు ఆ పల్లెపడుచు మీద మరలి ఉంటే, దాన్లో ఆశ్చర్యం ఉండేది లేదు అని నాకు ఇప్పటికీ బోధ అవుతుంది. ఈ విషయం జరిగినప్పుడు నాలో యౌవ్వనంలోని ప్రాథమిక దశే ఉంది. దృఢకాయుడిగా ఉండేవాడ్ని.నా అందాన్ని నేను చెప్పుకొనేది సమంజసం గాకపోయినా, కురూపిని మాత్రం కానని ఖండితం (కచ్చితం)గా చెప్పగలను. విషయం చక్కగా తెలపాలంటే చెన్నమ్మనూ వర్ణించాల్సిందే! ఆమెకు ఇరవై సంవత్సరాలకన్నా ఎక్కువ ఉండదు వయస్సు! ఎంతో పొడవుగాకనే, అటు పొట్టిగానూ గాకనే మధ్యస్తంగా ఉండే ఆకృతి. ఆమె శరీర వర్ణం ఎరుపు. ముఖం సలక్షణమే అని కచ్చితంగా చెప్పగలను. నిండు ప్రాయం నుంచి బిగించిన మైకట్టు. ఆమె పెదాల మీద నేను చూసినప్పుడల్లా దరహాసం ఎంతగానో స్వాభావికం (సహజం)గానే కనబడుతుంది. కళ్ళలో ఇంకా బాలికావస్థలోని మెరుపు మిలమిలా మెరుస్తుంది (తాండవిస్తుంది). ముగ్ధ దరహాసం, ఆ మిలమిల మెరుపులు పరస్పరం ఒకదానికొకటి



కలగలిసిపోయి ఒక అపూర్వమైన మాధుర్యంలో ఆమె రూపం లీనమౌతుంది. మనస్సును అపహరించేందుకు (దోచేందుకు) కావాల్సిన అన్ని సాధనాలు (పరికరాలు) ఆమెలో ఉన్నవి. ఒక మాటలో చెప్పాలంటే రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ.... వీరందిరినీ మీరిన సౌందర్యం ఆమెలో ఉంది. ఇక ఈ వర్ణన చాలదన్నట్లుగా ఆ రోజు రాత్రి ఆమె నడత "పల్లెపట్టులోని ముగ్ధయువతి" నుంచి కొంచం దూరంగా అయ్యింది.

నేను మంచం మీద కూర్చున్న తక్షణమే ఆ ఆలోచనలు ఒక్కొక్కటిగా, పదిపదిగా, నూరు నూరుగా దూసుకొంటూ రాసాగినందున, నా తల నూనెగానుగలో ఇరుక్కుపోయినట్లుగా ఉంది. నా మనస్సు కటిక చీకట్ల సముద్రంలో మునిగినట్లు తోచింది. నోరు బిగిసుకుపోయి, గొంతు నొక్కుకుపోయి ఉమ్మిని మ్రింగేది కష్టమైంది. నేను ఈ యువతిలో కామంను కెలికానని (రేగించానని) కలలో కూడా కానలేదు (చూడలేదు)! నా విషయంలో ఈమెకు ఆశె పుట్టిన పక్షంలో, దానికి నేను ఏ విధంలోనూ ప్రోత్సాహంను ఇవ్వలేదని, ఎక్కడ కావాలన్నా నిల్చి, ఏ ప్రమాణం చేయమన్నా చేయగలను! ఈమె మదవతి అయితే కాదు! దాన్ని ఆమె చూపించి పెట్టింది లేదు.జాణతనం నుంచే ఇటువంటి పనికి (సంగమంకు) ముందుకొచ్చినట్లు లేదు కదా! అయితే ఇదే తరహా పిచ్చి? ఇదీ ఒక తరహాలో కామ ప్రేరిత పిచ్చేకదా! ఇంట్లోవాళ్ళకు తెలిస్తే ఏమిటిగతి? నేను పెద్దమనిషినని (బుద్ధివంతుడ్నని) వీళ్ళ ఇంట్లో ఆతిథ్యాన్ని పొందానుకదా! ఇప్పుడు ఈ నడిరాత్రిలో ఈమె నేను రతిమన్మథులుగా ఒకటై – నా గదిలో!..... మర్యాద ఉండేటట్లుగా కనబడదు. వచ్చిన రీతే.... దొంగలాగ వచ్చింది కదా! ఈమెకు వివాహం అవలేదు? నా మనస్సులో ఎంతో జుగుప్స అయ్యింది. ఇప్పుడు ఒకటొకటిగా, నాకు ఆమె నుంచి నిన్న సాయంకాలంలోని నడవడిక అంతా అర్థంగాసాగింది. ఆమె ఆ ప్రొద్దులో నా వెనకే తోటకు ఎందుకొచ్చింది?.. నీళ్ళబిందె.... శుద్ధ నెపమే!.. నీళ్ళబిందెను నా చేతినుంచి ఎందుకు ఎత్తించుకొంది?....పోనీ, నేను, నీటిబిందెను ఎత్తి నడుంకు చేర్చేటప్పుడు ఆమె నడుంచుట్టూ నేను చేతిని తాకించకపోయినా, నా చేతికి తన చేతిని తాకించింది కదా! అప్పుడు ఆ చర్య ఏదో ఆకస్మికంగా నాకు తోచింది. ఇంకొక విషయం ఆమె మొదటిబిందెను ఎత్తుకొనేందుకు వంగినప్పుడు ఆమె చీరకొంగు పూర్తిగా జారింది. నేను ఆమెను, ఆమెలోని వక్షోజసంపదను ఆ అవస్థలో చూసినప్పుడు ఆమెలో లజ్జ (సిగ్గు)లోని చిహ్నం ఏదీ కనబడలేదు! బిందెను తలమీద పెట్టుకొని, నిధానంగానే చీరకొంగును పైకి లాక్కొంది. ఇవన్నిట్లోనూ, అప్పుడు నేను ఈమె ముగ్ధతను (అమాయకత్వంను) చూస్తున్నాననే భావించుకొన్నాను త్రప్పితే, ఇవన్నీ నా కోసమని ఈమె విసిరిన వలలోని ఒక భాగం... అని తెలియకనే ఉండిపోయాను.

ఆ ఆలోచనలనుంచి అల్లకల్లోలమైన నా మనస్సు అదెంతో కష్టంతో స్థిమితం (కంట్రోల్)కు తెచ్చుకొని ఈ సంకష్టం నుంచి ఎలాగున బయటపడాలని ఆలోచించ సాగాను. కోపంను చూపించేది చేయగూడని పని; పైపెచ్చు ప్రమాదంనే సృష్టించొచ్చనే భయం నాలో కల్గింది. వేరే ఏదైనా ఉపాయం నుంచి ఈమెను మెల్లగా బయటకు సాగనంపాలని యోచించాను. అయితే ఉపాయం ఏమిటి?ఎలాగున మాటను ప్రారంభించేది? లేకపోతే గట్టిగా ముసుగుదన్ని పడుకోనా?... అంటూ ఆలోచించాను. అది అయ్యే పనికాదు. ఈమె ఇక్కడ ఉన్నంతవరకూ, నా గుండె మీద నిప్పులకుంపటే ఉన్నట్లుగా ఉంటది. ఇంకొక ఆలోచన తోచింది. అదే సరైనదిగా అనుకొన్నాను. ఏదో దాన్ని చేసి, ఆమె కోరుతుంది ఎంతో చెడుది, ఎంతో నీచమైంది– ఎంతో పాపం– అని, ఆమె మనస్సుకు చక్కగా నాటేటట్లుగా చెప్పి ఉపాయంతో బయటకు పంపాలని అనుకొన్నాను. దేవుడు, నగరవాసినైన నా నుంచి ఈ పల్లెపడుచుకు పతివ్రతా ధర్మంమీద ఒక ఉపన్యాసం ఇచ్చే సమయంను తెచ్చి ఇచ్చినందుకు, నాలో నాకే నవ్వు వచ్చినట్లైంది. ఎలాగో తలెత్తి చెన్నమ్మ వైపుకు చూసాను. చెన్నమ్మ ఇంకా తలుపుకు ఒరిగే నిలబడియుంది. నా ముఖంలో ఉన్న నవ్వును చూసి ఆమె కూడా నవ్వింది. నా ముఖంలో ఆమె ప్రోత్సాహ భావనలను ఏమైనా కనుగొన్నదేమో అనే భయం కలిగి, తక్షణమే నా నవ్వును ఆపుకొని, మెల్లగా "చెన్నమ్మా" అంటూ పిలిచాను."ఏమిటి, నా దేవుడా" అని చెన్నమ్మ అంటూ, రెండు మూడు అడుగుల్నివేసి, నాకు కొంచం దూరంలో నిలిచింది. నేను "కూర్చో" అన్నాను. ఆమె నా మంచం మీద కూర్చుంది! నేను కొద్దిగా దూరం జరిగి, ఒకట్రెండుసార్లు ఉమ్మిని మ్రింగి, పునః (మరలా) "చెన్నమ్మా" అని అన్నాను.

"ఏమిటి... నా దొరా?" అంటూ మృదువుగా అడిగింది. ఆమె నడవడిక ఇంతగా విపరీతంగా ఉన్నా, ఆమె ధ్వనిలో ఇంకా ముగ్ధత (అమాయకత్వం) ప్రవహిస్తుందనే నాకు బోధపడుతుంది. నేను ప్రారంభించా!

"చెన్నమ్మా, చూడు; నువ్వు ఇట్లా చెయ్యొచ్చా?"

"ఎలాగున బుద్ధివంతుడా"

"ఇలాగున –నడిరాత్రిలో – దొంగలాగ వచ్చి..."

నేను మాటల్ని పూర్తి చేయలేదు; అంతలోనే ఆమె

"దొంగలాగ రాలేదులే! నా దేవుడా!" అంది.

"అలాగంటే?"



ఆమెనుంచి మాటలు బయటకు రాలేదు. నేను అన్నాను ఇలాగున;

"చూడు, నీ ఇంట్లో వాళ్ళకు తెలిస్తే , నీకు మర్యాద ఉండదు, నాకూ ఉండదు"

"వాళ్ళేమీ అనేది లేదు నా దేవుడా" అని నెమ్మదిగా అంది.

నాకు ఈ వాక్యం ఆశ్చర్యంను కల్గించింది! అడిగా;

"ఏమన్నావ్?"

"వాళ్ళు ఏమీ అనేదిలేదు.. అదే వాక్యాన్ని పునః ఉచ్ఛరించింది.

"చూడు, వారు అననీ, అనకపోనీ... ఇది నేను ఒప్పుకోని పని. చెన్నమ్మా, నాకు పెళ్ళైంది,. ఇంకొకరి భార్యను చెడిపేది లేదు..."

"అయ్యో! బుద్ధివంతుడా.. ఇలాగున ఎందుకు అంటారు! నేను ఎవరి భార్యను కాదు నా దేవుడా..నేను జోగినిని"

"ఏమిటి? ఏమిటి? ఏమంటున్నావ్?"

"నన్ను జోగినిగా వదిలారు.. నా దేవుడా"

"జోగిని! జోగిని!! అలాగంటే"

"దేవుడికని వదిలారు.. దొరా!"

నేను ఎక్కడా చూడలేదు, వినలేదు. దేవుడికి వదలటం... జోగిని... మొదలైన అనిష్టపు మాటల్ని వినియున్నాను అంతే. అయితే ఈ అనిష్ట పదంలోని అర్థాన్ని తెలుసుకోలేదు ఇంతవరకూ. నాకు మొదట్లో ఉన్న భయం, బెదురు తప్పిపోయి కుతూహలం ఎక్కువైంది. విషయం సారస్యంగా ఉందని, దీని సంగతంతా తెల్సుకొందామనే కుతూహలం నుంచి

"దేవుడికి వదలిరా? ఎవరు?" అని అడిగాను.

"మా అమ్మా.. అయ్యానూ"

"అదెందుకు నిన్ను దేవుడికి వదిలారు?"

"బుద్ధివంతుడా, ఇప్పటికి ఎనిమిది సంవత్సరాల క్రితం నాకు ఎంతో జబ్బుచేసింది. అప్పుడు మా అమ్మా, నాయనా మరడిబెట్టలోఉన్న రంగనాథస్వామికి మ్రొక్కు చేసుకొని, నాకు గుణం (నయం) అయితే, ఆ దేవుడి పేరుమీద నన్ను జోగినిగా వదుల్తామని మ్రొక్కుకున్నారట. నాకు గుణమైంది, బుద్ధివంతుడా."

"అలాగైతే నువ్వు పెళ్ళి చేసుకొనేదే లేదా!"

"లేదులే బుద్ధివంతుడా"

"ఇలాగే ఉంటవా"

"ఔను, నా దొరా"

"వేశ్యలాగనే"

ఈ నా చివరి మాటను వినిన ఆమెకు, తన హృదయంలో ఒక పిడిబాకును (కత్తిని) గుచ్చినట్లైంది. ఒక్కక్షణంలోనే ఆమె చెంపలు ఉబ్బినవి. ముక్కు పుటాలు, పెదాలు అదురుతున్నవి. కోపం చేసుకొన్న స్త్రీ ముఖంలో ఒకవిధమైన భీషణత (ఉగ్రత) ఉంటది. ఆమె ముఖమూ ఆ భీషణం (భీకరం)లో తేలుతున్నట్లుగా కనబడసాగింది. కత్తికి ఉండే మొనలాంటి దృష్టినుంచి నన్ను పొడుస్తూ

"బుద్ధివంతుడా... తమరు (మీరు) ఈ మాటను పలకకూడదు!" అంది.

ఆమెలో అయిన మార్పులను చూసి, నాకెందుకో కొద్దిగా దిగ్భ్రమం అయ్యింది. ఉమ్మిని మింగుతూ ..

"ఏమి మాటను?" అంటూ అడిగాను.

"నేను వేశ్యను కాదు.... తెల్సుకోండి అంతే!"

నాకు ఇంకాస్తగా ఆశ్చర్యమైంది. "పెళ్లి లేదు! నడవడికె చూస్తే విచిత్రం!! అయినా వేశ్యను కాదని అంటుంది!" నాలో కొంచం కోపం వచ్చినట్లైంది. నేను అడిగా...

"అదిగాకుండా మరేంటి? నువ్వు అందరిలాగ పెళ్ళి చేసుకొని, పతివ్రతలాగ సంసారం చేసేదాన్ని వదిలి ఇలాగున నడిరాత్రిలో మీద పడేందుకు వచ్చి..."

"అయ్యో బుద్ధివంతుడా, మీకు ఇంకా తెల్వలేదా? జోగినీలు పెళ్ళి చేసుకొనేందుకు కుదురుతదా, నా దొరా"

"ఎందుకు కాగూడదు?"

"మొక్కును చెల్లించుకోవాలి కదా... బుద్ధివంతుడా! లేకపోతే మొక్కు పాడైపోతది కదా!"

'పెళ్ళి చేసుకొంటే మొక్కు చెల్లించుకొనేది కలగదా?"

"లేదు నా దొరా. ఒకర్ని వివాహమాడితే మీ అంతోళ్ళ సేవ ఎలాగున చేసేది కుదుర్తది బుద్ధివంతుడా? మానం వస్తదా (ఉంటదా)?"



"సరి, సరి; ఇంకొకరి సేవ ఎందుకు చేయాలి?"

"మరి? దేవుడికి మొక్కును చెల్లించేది వద్దా?"

"ఇలాగునా చెల్లించేది? దేవుడి పేరుమీద వేశ్యాతనం చేస్తూ...."

తక్షణమే మరలా ఆమె కోపం చెంది

"బుద్ధివంతుడా, ఆ మాటను నాతో అనకండి!.. అనకండి" అంటూ ఒత్తి పలికింది.

"చూడు...నేను నీ మొగుడ్ని కాదు, నువ్వు ఇంత రాత్రిలో నా చెంతకొచ్చావు కదా.. ఇది ఎవరు చేసేపని? 'వేశ్యలే కదా' అనేది మాత్రం చెప్పొచ్చు కదా!"

'నేను వేశ్యను కాను బుద్ధివంతుడా! మేము (జోగినులం) ముమ్మాటికి వేశ్యలం కాదు! వేశ్యలకు డబ్బుమీద ఆశె, నా దొరా! వాళ్ళు అతిథుల్ని చూసేది లేదు. వారికి మొక్కు గిక్కు ఏమీ ఉండవు. ఆ వేశ్యావృత్తే వాళ్ళకు జీవనంగా ఉంటది."

"మరి నువ్వు?"

"మేము (జోగినులం)! డబ్బు గిబ్బు ముట్టుకొనేది లేదు, నా దొరా! అంతా ఇంతా జనాన్ని దగ్గరకు చేర్చుకొనేది లేదు. మీ అంతటి కులీనులను ఎవర్నైనా మా దేవుడు చూపిస్తే, వారి సేవను చేసి మొక్కు చెల్లిస్తుంటాము. మమ్మల్ని (జోగినులను) వేశ్యలని అనకండి, నా దేవుడా...!"

"అలాగైతే నీలోని ఈ 'సేవ' నీ తల్లిదండ్రులకు గుర్తా?"

"లేదులే బుద్ధివంతుడా! వారు మొక్కును మొక్కుకొన్నోళ్ళు... వాళ్ళకు తెల్వకుండా ఉంటదా!"

"సరి, సరి; వాళ్ళేమో పంపించి యుండొచ్చు నిన్ను నా దగ్గరికి. అయితే, నేను దీనికి ఒప్పుకొంటానో లేదో అనేది వాళ్ళకేమి గుర్తు? ఏ ధైర్యంతో నిన్ను నా దగ్గరకు పంపించారు?"

ఈ ప్రశ్నెకు తక్షణమే జవాబు రాలేదు ఆమె దగ్గరనుంచి. మందహాసంతోనే మెడను ఒక భంగిమలో ఊపి, వాలు కనులనుంచి చూస్తూ,

"మీరు అడిగారట... మా పనోడ్ని... నేను ఎవరు.... ఏమిచేస్తాను.. అని!" అంటూ కొద్దిగా సిగ్గుపడుతూ చెప్పింది.

ఇప్పుడు నాకు అర్థమైంది. నేను ఆమెను గురించి పనోడ్ని అడిగినప్పుడు అతను వ్యంగ్యంగా నవ్వి "ఎందుకు బుద్ధివంతుడా" అని అన్నది గుర్తుకొచ్చింది! "అయ్యో భగవంతుడా" అని అనుకొన్నాను.

"ఔను చెన్నమ్మా! అడిగాను అంతే; ఉత్తిగనే తెల్సుకుందామని అడిగా! అంతే చెన్నమ్మా....! నా భార్య లక్ష్మి మీద ఒట్టు. వేరే ఏ ఆశా నాలో నీ మీద లేదు."

"అయ్యో! వదిలేయండి నా దేవుడా, ఇప్పుడేమైంది? దీనికంతా మీరు ఒట్టుగిట్టు వేసుకోకండి!"

"అలాగున కాదు చెన్నమ్మా, నువ్వే చెప్పు... దూరమైన మానమర్యాదలు మరలా వస్తవా?"

చెన్నమ్మ మిన్నకుండిపోయింది. (మౌనరాలైంది)

"చెప్పు...సుమీ"

"లేదు, నా దొరా.. పోయిన మానమర్యాదలు వచ్చేది లేదులే"

"అలాగైతే విను, మహిళకు మానమే ప్రాణం కదా! మానం పోగొట్టుకొన్న మహిళ కుక్కకన్నా హీనం కదా...! మనుషజాతికి ఉండేవే మానమర్యాదలు. నువ్వు ఆ మానంను ఇలాగున అమ్ముకోగూడదు. చెన్నమ్మా! మానం పోగొట్టుకున్న స్త్రీకి నరకంలోనూ జాగా ఉండదని అంటారు.. తెల్సిన విజ్ఞులు (పెద్దలు)"

"బుద్ధివంతుడా, మీరు చెప్పేది లగ్నమై భర్త ఉన్నామెకే సరి అవుతది నా దొరా. వారు మా లాగనే అయితే, వారిని జాతినుంచి వెలివేస్తారు! మాకు అలాగున కాదు నా దేవుడా; మమ్మల్ని దేవుడికి వదిలారు కదా... మాకు మీలాంటి కులీనుల సేవే ఉంటది...!"

"అయ్యో! చెన్నమ్మా, నీకు తెల్వదు. ఇప్పుడు నేను చెప్పేది విను. దేవుడి పేరు మీద స్త్రీ తన మానంను పోగొట్టుకుంటే అది అతనికి ప్రీతేనా? దేవుడిమీద మొక్కును చేసుకొంటే, ఆ దేవుడి సేవనే చేయి, ఎవరు వద్దంటారు. అది వదిలి ఇలాగున మానం పోగొట్టుకొనేది ఉంటదా?"

"బుద్ధివంతుడా, తమలాంటి కులీనులే మాకు దేవుళ్ళు. మీకు సేవ చేస్తే అదే మా పాలిట పుణ్యం."

ఆమె నుంచి వచ్చిన ఆ మాటల్ని విని, నా హృదయం నుంచి "అయ్యో భగవంతుడా! నీ పేరున, నిన్ను మెప్పించేందుకు ఎంత అన్యాయం....ఎంత పాపం!... నడుస్తుంది"



అనే ఘోషణ నా నుంచి బయటకొచ్చింది. కొంచంసేపు ఏమీ మాట్లాడకనే నాలో నేనే ఆలోచించసాగాను.

ఇదేంటి ఈ జనుల మౌఢ్యం! ప్రపంచంలో ఇంతగానున్న అసహ్యకరమైన వాడిక (పద్ధతి) ఉంటదా? దేవుడికి వదిలేదేమో సరి, వినియున్నాను. అది వారి వారి చిత్తంలోని భక్తి! అయితే ఈ పాడు పని? ఇలాగేనా... ఈ జనం దేవుడికి మొక్కును అప్పగించుకొనేది? భగవంతుడి దివ్యమైన మహిమమీద, ఈ జనం ఇటువంటి హేయ (నీచ) మైన కార్యాన్ని చేస్తున్నారు కదా!...వీళ్ళ (జోగినిల) గతేంటి? ఈ యువతి కచ్చితంగా ఏమి తెలియని పల్లెపట్టులలోని అమాయక యువతే సరి! జారిణు (వేశ్య)ల లక్షణమే వేరే విధం; ఈమె (జోగిని) రీతే వేరే వేరే విధం. ఈమె తన జనంలోని అసహ్యకరమైన వాడికె (పద్ధతి) కు బలైన ముగ్ధరాలు! తను చేస్తున్న కార్యం (పని) నుంచి దేవుడికి మొక్కును చెల్లిస్తున్నాననే దృఢమైన నమ్మకం ఈమెలో ఉంది. అయ్యో! భగవంతుడా! తల్లిదండ్రులే తమ చేతులనుంచే తమకు చెందిన ముక్కుపచ్చలారని ఆడపిల్ల జీవంను పాపం మడుగులో ముంచేసారు కదా!... వాళ్ళ గతేంటి? ఈమె గతేంటి? వాళ్ళేమో తాము చేసుకొన్న మొక్కునుంచి కూతురు బయటపడింది (ఆరోగ్యవంతురాలైంది) అని అనుకోవచ్చు. అయితే, ఇప్పుడు ప్రతిరోజూ ఈమె చేస్తున్న పని నుంచి, ఈమె జీవంకు ఆత్మరూపమైన స్త్రీత్వమే చస్తుంది (నశిస్తుంది) కదా! దీన్ని వీళ్ళు తెల్సుకొనే విధం ఎలాగున? అప్పుడు, బాలికగా ఉన్నప్పుడు ఒక దినం, ఒక క్షణంలో చనిపోయే బదులు, ఇప్పుడు ప్రతిరోజూ, క్షణం క్షణం కొద్ది కొద్దిగా చస్తుంది కదా! దీన్ని ఈమె తెల్సుకొన్నదా? లేదు, లేదు!... అదే ఆశ్చర్యం నాలో.! తను చేస్తున్న పని సరైనదనే – దేవుడికి అప్పగించిన కార్యమని – అతను (భగవంతుడు) బ్రతికించిన జీవం (ప్రాణం)ను ఇలాగున గడిపితే అది అతనికి (భగవంతుడికి) ఇష్టమైన సేవే అనేదాన్ని ఈమె గాఢంగా (దృఢంగా) నమ్మింది కదా! వివాహమైన స్త్రీలో ఏ కృత్యాన్ని (పనిని) ఈమె చెడ్డదని భావిస్తుందో, ఆ కృత్యాన్నే తన జీవితధర్మం అని (జోగిని జీవిత ధర్మమని) అనుసరిస్తుంది కదా! ఈకృత్యానికి ఈమె తల్లిదండ్రులు అనాలోచితంగా సహాయపడుతున్నారు! పాపం! వాళ్ళైనా ఏమిచేస్తారు? వాళ్ళు తమ జాతిలోని వాడికెకు (పద్ధతికి) బలైయ్యారులే...!

ఎందుకో దారుణమైన ఈ ఆలోచన నుంచి నా గుండె పగిలినట్లై, పెద్దగా ఎగశ్వాసల్ని పెట్టాను. చెన్నమ్మ ఉత్తిగనే చీరకొంగును మెలిబెడ్తుంది. నేను నిట్టూర్చిన దాన్ని విని నా వైపుకు చూసింది. ఆమె ముఖంమీద అప్పటికే ఏదో న్యూనతాభావం కనబడుతుంది. ఈ ప్రొద్దుకు (వయస్సుకు) ఎక్కడైనా ఎవర్నో లగ్నమాడి, నలుగురిలాగ తనూ సంసారంను

చేసుకొనేది వదిలి, ఈ ముగ్ధరాలు (అమాయకజీవి) తన వాళ్ళ నుంచి ఏదో అసహ్యకరమైన వాడికెకు (సంప్రదాయంకు) బలైంది కదా! .. అనే ఏదో ఆపుకోలేని ఒక బాధ నుంచి నా హృదయం తల్లడిల్లి, కళ్ళలో నీళ్ళు నిండుకోసాగినవి.

"చెన్నమ్మా, నువ్వు పూజించే దేవుడే నిన్ను కాపాడాలి" అని చెప్పి, కళ్ళను తుడుచుకొన్నాను. చెన్నమ్మకు నా కన్నీళ్ళను చూసి కొద్దిగా కలతచెంది ఉండొచ్చు. ఆమె నా దగ్గరకు జరిగి వచ్చింది. ఆమె అలాగున నా దగ్గరకు చేరినప్పుడు నేను దూరంకు జరిగేది నా మనస్సు ఒప్పుకోలేదు. ఆమె మనసా పాపిష్టురాలు కాదు. అజ్ఞానంలోని పాపంకు ఆమె దేహం (శరీరం) మాత్రం పాలుదారైంది(భాగస్తురాలైంది). కలువరేకుల నడుమ ఒకటై నిల్చి, వజ్రంలాగ తళతళలాడే నిర్మలమైన మంచు బిందువులాగ, ఆమెలోని ఆత్మా పరిశుద్ధంగా ఉందిలే. ఆమె సరళత్వంను చూసిన నాకు అత్యంత కనికరం పుట్టింది. ఆమెను చూసినప్పుడల్లా, ఆమె విషయంను యోచించినప్పుడల్లా, నాలో ఆరిపోయిన (తడారిపోయిన) కళ్ళలో మరలా నీళ్ళూరుతుంది. నా కన్నీరుతో ఆమె కలుషితమైన దేహంను కడగాలని అన్పించింది. నా దేహమూ, ఆత్మా ఆమెకని అత్యంతగా స్నేహమయమైంది. మెల్లగా ఆమె చేతిని పట్టుకొన్నాను. నా వళ్ళు కొద్దిగా వణికింది. చేతిని వదలకనే అలాగే ఆమె చేతి వేళ్ళను సవరించుతూ "చెన్నమ్మా" అని మెల్లగా పిలిచాను. నాలోని స్నేహం, నాలోని కనికరం ఆమె ఆత్మలోకి జొరబడిందని నాకు తోచింది. నేను చేతిని పట్టుకొని ఆమె పేరును పలికిన తక్షణమే, ఆమె ఇంకాస్తగా దగ్గరకు జరిగి, తల త్రగ్గించి, ఎంతో మృదువుగా "ఏమిటి నా దేవుడా" అని అడిగింది. ఆమె ముఖం మీద ఏదో ఒక విధమైన ఆలోచనో – కలవరమో కనబడుతుంది. నేను ఆమె ముఖాన్నే చూస్తూ అడిగా....

"చూడు చెన్నమ్మా, నేను నీ దేవుడ్ని నువ్వు అంటున్నావు కదా...."

"ఔను, నా దొరా, మీరు నా దేవుడు"

"అలాగైతే, నేను చెప్పినట్లుగానే నువ్వు వినాలి కదా..."

"మీ చరణదాసిని నేను. చెప్పండి నా దేవుడా"

"నువ్వు ఇకముందు (మీదట) ఈ పాపం పనిని చేయగూడదు, తెల్సిందా?"

"మరి, మ్రొక్కు?... దేవుడికి?"

"అయ్యో!.... ఆ మ్రొక్కు పాడుబడనీ! చూడు, ఇప్పుడు నేను నీ దేవుడ్ని అన్నావు కదా! దీనికి ముందే ఇంకెవరి సేవనూ చేయలేదా?"



చెన్నమ్మ మాట్లాడలేదు. తలను క్రిందకే వంచింది.

"చూడు, దీనికి ముందే గతంలో నువ్వు ఎవరెవరి సేవల్ని చేసావో కదా! ఒకడు తిన్న ఎంగిలిని ఇంకొకరికి పెట్టొచ్చా? దేవుడికి (నాకు) ఈ ఎంగిలి నైవేధ్యం మ్రొక్కా? చెన్నమ్మా, నీకు తెల్వదు.. బుద్ధిలో పసితనం పోలేదు నీలో... ఇది ఎంతో పాపకరమైంది... తెల్సి ఉంటే ఎప్పటికీ నువ్వు ఈ పాపంలోని కార్యాన్ని చేసేదానివి కాదు. కొద్దిగా ఆలోచించి చూడు... నీకూ వేశ్యకూ ఏమిటి వ్యత్యాసం? ఆమెకు అది జీవనం; నీకు, జీవనంకు కొరతలేదు. అయితే, పాపం మాత్రం మీ రెండు వర్గాలకు ఒకటే! భగవంతుడు ఈ పాపంను ఎప్పటికీ ఒప్పుకోడు!"

చెన్నమ్మ మౌనంగా చెప్పిన దాన్నంతా విన్నది. మొదట్లో ఉన్న భ్రాంతి, కలవరంలోని చిహ్నం ఆమె ముఖంనుంచి జారింది. కొద్ది కొద్దిగా ముఖం వాడింది. దేహమూ క్రుంగింది. దృష్టి నేలను పట్టుకొంది (నేల చూపుల్నిచూస్తుంది). మెల్లగా ఆమె చేతిని కదుపుతూ 'చెన్నీ' అంటూ పిల్చాను. తలెత్తి నా వైపుకు చూసింది. ఆమె దృష్టిలో (చూపులలో), దారితప్పి తిరుగుతున్న చిన్న శిశువులోని అసహాయకత్వంలోని ఛాయ కనబడుతుంది. నా మాటలు – సరైనవే అని భావించుకొని యుండొచ్చు.

"చెన్నీ, నేను చెప్పింది సరైంది కాదా?" అంటూ అడిగాను.

చెన్నమ్మ నోటిని పెగల్చలేదు. తలను మరలా తగ్గించింది. నేను చూస్తున్నట్లుగానే రెండు కన్నీటి చుక్కలు పళపళా ఆమె చెంపలమీద జారిపడినవి. అదే ఆమె నాకు చెప్పిన మౌనమైన జవాబుగా అయ్యింది. ఆమెలోని శుభ్రమైన ఆత్మను అలుముకొన్న అజ్ఞానంలోని తెరను (పరదాను) తీసి విసిరేయాలనే జవాబ్దారి పని నాలో ఉంది! ఏదో స్థలాన్ని చేరాల్సి ఉందని ఒక మార్గాన్ని (దారిని) పట్టుకొని, దాన్లో అడుగులను వేస్తూ, అడుగును వేసినప్పుడల్లా, ఆ స్థలం దగ్గరపడుతుందని భావించి, నమ్ముతూ ఎంతో దూరం నడిచి వెళ్ళిన మీదట, ఎవరైనా ఆ దార్లో కనబడి, మేము వెళ్ళాల్సిన చోటుకు అది దారి కాదని, ఆ దారిలో నడిచినదంతా మేము వెళ్ళాల్సియున్న స్థలం నుంచి దూరమైందని చెప్తే, ఎలాగుంటదో! నేను నా మాటలనుంచి చెన్నమ్మలోని హృదయంలో కొద్దిగా ఎక్కువ తక్కువగా అదే విధమైన భావనలను నాటాను.

చెన్నమ్మ ఎంతగానో రోదించింది (ఏడ్చింది). నేను ఆమెను సముదాయిస్తూ.. "చూడు, చెన్నమ్మా! నిన్నుచూస్తుంటే నాకు కోపంగాని, అసహ్యంగాని లేదు. చెప్పు, నా మీద కోపించుకొన్నావా?" అంటూ అడిగాను.

ఎంతగానో నొచ్చుకొన్న ధ్వనినుంచి చెన్నమ్మ లేచింది. "లేదు నా దొరా" అని అంది.

"సరి, సరి; నీకు నామీద నిజంగానే కోపం లేదా...?"

"అయ్యో! నా దేవుడా! అలాగున అనకండి! మిమ్మల్ని చూస్తే, నా దొరా, మీ కాళ్ళమీదపడి వెళ్ళిపోతానని అంటుంది నా ప్రాణం" అంటూ నా కాళ్ళను పట్టుకొని, తన నుదురుకు వాట్ని తాపించుకోసాగింది. నేను ఆమె చేస్తున్నదాన్ని ఆపి, ఆమెను పైకిలేపి, "సరే, అలాగైతే ఎక్కడ నీ చేయి? నా హృదయంమీద చేయివేసి ఒట్టు వేయ్– ఇక మీదట ఈ పాడు పనిని వదుల్తానని– అను" అంటూ అడిగాను.

చెన్నమ్మ నా హృదయం మీద చేతిని పెట్టింది. ఆమెలోని ముగ్ధమైన బాధ చెందిన చూపు నా కళ్ళలో జొరబడి హృదయంలోకి దిగింది. బాధ చెందిన చూపు – బాధతో ఉన్న ధ్వని కంపించుతూ మెల్లగా పలికింది...

"దేవుడా... నా దొరా...ఇక మీదట ఈ పనిని ... చేసేదిలేదు."

నా గుండెమీదున్న ఏదో బరువు దిగినట్టై పెద్దగా నిట్టూర్చాను. అప్పటికి రాత్రి ఎంతో ప్రొద్దైంది. అయినా, నిద్ర మాత్రం వస్తున్నట్లుగా కనబడలేదు. మనస్సులో శాంతి నెలయూరింది. చెన్నమ్మ ఒకసారి ఆవులించింది. నాకు అదే అవకాశమై "చెన్నీ, ఇక నువ్వు వెళ్ళి పడుకో తల్లీ" అని చెప్పి లేచాను. ఆమె కూడా లేచింది. తలుపు వరకూ ఆమెతో వెళ్ళి నేనే తలుపు తీసాను. తలుపు వద్ద మరలా ఆమె చేతిని పట్టుకొని, నా వైపుకు త్రిప్పుకొని – "చెన్నీ, చెన్నమ్మా భగవంతుడి మీద ఒట్టు... నాకు నీమీద కోపం లేదు.. ఎక్కడుంటది అది నాలో... నువ్వు నా తోడబుట్టినదానివి" అని చెప్పి, నా రెండు చేతుల నుంచి ఆమె ముఖాన్ని పట్టుకొని, నుదుటిమీద సోదరుడిలాగ ఒక ముద్దు పెట్టాను. చెన్నమ్మ వెళ్ళిపోయింది.

## 6

ఏదో గడబిడకు మెలకువ వచ్చింది. చూడగా... భూకామందు కరియప్పగారు! వారే కేకల్ని పెట్టి నన్ను లేపారు. వారు లోపలికి ఎలాగున వచ్చారో తెల్వలేదు.బహుశః, రాత్రి తలుపులకు చిలకం (గొళ్ళెం) వేసేది నేను మరిచిపోయి ఉండొచ్చని అనుకొన్నాను.

"ఏమిటి కరియప్పగారు?" అంటూ కళ్ళను నులుముకొంటూ లేచాను.



"అయ్యో! ఎలా చెప్పేది బుద్ధివంతుడా! అయ్యో.... నా ముద్దుబిడ్డ! నా చెన్నమ్మ!" అంటూ మాటను పూర్తిచేయకనే కరియప్పగారు క్రిందపడిపోయి గిలగిలా కొట్టుకోసాగారు. ఏదో ఒక తరహాలోని అవ్యక్తమైన భీతినుంచి నా గుండె పగిలి రక్తంచిమ్మినట్లుగా నాకు అయ్యింది. అంతలో ఇక ఎవరో వచ్చి 'యజమాని, చెన్నమ్మ తోట్లోని బావిలో పడి..."

వారు చెప్పి ముగించేలోపు నా జీవం ఆగలేకుంది. మంచం నుంచి లేచి పిచ్చోడిలాగ, తోటలోని బావి వైపుకు దౌడు పెట్టాను (పరిగెత్తాను). బావి దగ్గర పది పన్నెండు మంది గుంపుగా నిలబడింది చూసాను. ఇంకా బతికి ఉండొచ్చేమో – అనే పిచ్చి ఆశె! అయ్యో పిచ్చి ఆశె సరేనా! రాత్రే ఆమె వెళ్ళి దూకి ఉండొచ్చు. ఇప్పటిదాకా ప్రాణం ఉంటదా! అనే నిరాశ! దగ్గరకు వెళ్ళి నిలబడ్డాను. అందరూ దారి వదిలారు. చూసా! అయ్యో! భగవంతుడా! అదెంతటి దృశ్యాన్ని చూసాను! గుండెలోని రక్తం కళ్ళకు చిమ్మి బయట పడుతున్నట్లుగా అయ్యింది నాలో! కళ్ళు మూసుకుపోయి కటిక చీకటే నాలో ఆవరించింది.

❁ ❁ ❁

అంతే నాకు జ్ఞాపకం. పునః మెలకువ అయినప్పుడు అక్కడ నిలబడినోళ్ళలో ఒకరిద్దరు నా తలకూ ముఖంకు చల్లటి నీళ్ళను చిలుకరిస్తున్నారు. నా ముక్కునుంచి రక్తం పడుతుంది. నేను ఏదాన్ని లక్ష్యపెట్టలేదు. శవం దగ్గరకు వెళ్ళి, ప్రాణంలోని చిహ్నం (గురుతు) ఏమైనా ఉంటదేమోనని... ఎంతో ఆశె నుంచి చూసాను. అయ్యో! ఉత్తిగనే భ్రాంతి కదా! నా భ్రమను చూసి (అవలోకించుకొని) నాలోనాకే "అయ్యో పిచ్చోడా!" అని అన్పించింది. ఆమె దేహంలో దాగికొన్న ఆ అమలమైన హిమకణం ఆరిపోయింది. పుణ్య పాప తర్కం నుంచి బయటకు వెళ్ళిపోయింది ఆమె. అమృతం ఇంకిపోయి మిగిలినది విషంలోని చుక్కలే కదా!

ఇక ఎక్కువసేపు అక్కడ ఉండలేదు. నిధానంగా అతిథి గృహం (చెన్నమ్మ ఇంటికి) వైపుకు నడిచాను.

## 7

అదేరోజు సాయంకాలం నేను ఆ ఊరును వదిలాను. వెళ్ళేందుకు ముందు చెన్నమ్మకు చెందిన భవ్యమైన, రమ్యమైన, అందమైన ఫోటోను వారి ఇంట్లో వదిలేసి వచ్చాను. అంతటి యువతిని పోగొట్టుకొన్న ఆ ఇంట్లో వాళ్ళకు ఆ ఛాయాచిత్రం ఏమి సమాధానం (ఊరడింపు)ను కల్గిస్తుందో నాకు తెల్వదు!

దారి బారుకూ యోచనలే. పోలీసోళ్ళేమో "ఆత్మహత్య" అని రికార్డ్‌లో వ్రాసుకొన్నారు. అయితే యదార్థంగా నేనే ఆమెను చంపినట్లుగా నాలో ఉంది! ఏమి చేసినా ఆ భావన నన్ను విడిచేటట్లుగా కనబడుటలేదు. నేను చెప్పినదంతా ఆమె మనస్సుకు నాటి, ఉండేదానికన్నా చనిపోయేదే మేలు అన్నట్లుగా ఆమెకు అన్పించియుండొచ్చు.నేను ఆమెను నా గది నుంచి బయటకు పంపినప్పుడు, ఆమె మనస్సు చావునుంచి ఆ భావంతో నిండియుందని ఇప్పుడు నాకు కనబడుతుందిలే. ఈ ఆలోచన వచ్చిన తక్షణమే నా గుండెను చీల్చి ఎవరో కుతకుతలాడే కాసిన సీసం పోసినట్లుగా నాలో ఉంది! నేను ఆ అవేళ (సమయంగాని సమయం)లో ఆమెను పంపించకనే ఉండుంటే, ఆమెలోని .. చావాలనే .. సంకల్పం దూరమైయ్యేదో ఏమో! బ్రతికి ఉండేదో ఏమో! ఆమె మనస్సుకు జీవం మీద ఆశను వదులుకోవాలని మంచిచెడుల బోధను చేసినోడ్ని నేనే కదా.....! దాంట్లో అనుమానం ఏమీ లేదు! నాకు నిజంగా ఏమి అధికారం ఉంది? వారి ధర్మ-అధర్మాల్ని తులనం (తూచేందుకు) చేసేందుకు నేను ఎవర్ని? నా మాటలు ఒకటొకటి ఆమెను బావి వరకూ దొబ్బుకొంటూ వెళ్ళి ఉండొచ్చు. ఆ తర్వాత, ఆమెను బావికి నెట్టింది నా మాటలే కదా.... నేనే కదా! అయ్యో! నేనే ఆమెను నా చేతులనుంచే చంపినట్లైంది కదా! భగవంతుడి ఎదురులో దీనిలో ఒకరోజు గాకపోయినా మరొక రోజులోనైనా నేను జవాబును చెప్పాల్సిందే. ఏమని చెప్పేది?....

యోచనలకు అంతమే లేనట్లుగా ఉంది నాలో.

రేపు ఊరుకు (నగరంకు) చేరుతాను. ఈ కథనంతా చెప్తే ఏమంటదో నా లక్ష్మి!

- 0 -

(కన్నడ భాషలో ఒక శతాబ్దంలోని అత్యుత్తమ 84 కథలలో ఈ కథ చేరబడియున్నందున, ఈ కథను తెలుగు పాఠకులకని అనువదించినాను. శ్రేష్టసాహితియైన దివాకర్‌గారి నేతృత్వంలో సంకలనం చేయబడిన "ఒందు శతమానద అత్యుత్తమ సణ్ణ కతెగళు" అనే శిరోనామంతో ఉన్న పుస్తకంను ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయంలో చూచి అనువదించాను.

కథను మూలభాషలో రచించినవారు 'ఆనంద' అనే మారు పేరును కలిగియున్న అజ్జంపుర శ్రీ సీతారాంగారు. వీరు 27-09- 1907 లో అనవట్టి అనే గ్రామంలో జన్మించి షిమోగా, బెంగళూరులలో విద్యాభ్యాసం చేసి ఎన్నో సంవత్సరాలు ప్రభుత్వ



కార్యాలయాలలో ఉద్యోగం చేసి, చివరికి సాహిత్య సేవకని స్వచ్ఛందంగా పదవి విరమణ చేసారట. 'నాను కొంద హుడుగి" అనే పేరుగల ఈ కథను 1928లో రచించి ప్రచురించబడగా ఈ కథలోని మూల విషయం కన్నడనాడులో ఎంతగానో సమాజంలోని అనిష్టాల మీద పెద్ద దుమారంనే కలిగించినదట. స్వప్రతిభ నుంచి మరియు స్వానుభవం నుంచే వీరి కథలు సాహితి లోకంలో కన్పించినందున కన్నడ భాషిగరు వీరిని సదా స్మరిస్తుంటారు.

04-04-2008

శాఖమూరు రామగోపాల్

# లక్ష్మణ్‌రావ్‌గారి అదృష్టం

**బా**ళేహళ్ళి లక్ష్మణ్‌రావ్‌కు 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నుడికారంలోని అర్థం ఎంతగా ఆలోచించినా మనస్సుకు ఒప్పటంలేదు. అతనికి ఇరవై ఐదు సంవత్సరాల వయస్సు ఉంది. బాల్యంలో అతని తల్లైన సాకమ్మ "మా లచ్చమణ్ణ పొడువుగా పెరిగేదాన్ని ఎప్పుడు నిలిపేస్తాడో" అంటూ బాధపడుతుండేది. ఆ బాధనుంచే చచ్చిందో ఏమో మనకైతే తెల్వదు. అతని ఇంట్లో సవతి తల్లి, చెల్లెలు అతని పోషణలో ఉన్నారిప్పుడు.ఆ ఊర్లో అతనిలాగ బలాడ్యుడైన వేరొకడు ఎవడూ లేడు. ఆరు అడుగుల ఎత్తు; విశాలమైన ఛాతి; బలిష్ఠంగా బారుగా ఉండే భుజాలు; టేకు చెట్టునుంచే చెక్కబడినట్లుగా స్తంభాలలాంటి కాళ్ళు; మంచి కోడెగిత్తకు ఉండేటి మూపురం లాగ మెడ; దాని మీద సరళ స్వభావాన్ని చూపించే ముఖం; ముఖంలో ఎక్కువ తక్కువగా కానటువంటి గడ్డంలోని వెంట్రుకలు; ఎల్లప్పుడూ కొద్దిగా జడత్వంతో మంచితనమూ కలగాపులగం అయి కనిపించే ముఖభావం అతని నుంచి మనకు కనబడుతుండేది.

అతనికి ఆరు ఎకరాల పొలం, మరలా చిన్నదైన ఒక కొబ్బరితోట ఉంది. స్వంతంగానే సాగువళి(సేద్యంను) చేస్తుండేవాడు. "ఇతను మూడు ఎద్దులను పొందియున్నాడు. ఒక జత ఎద్దులతో, మరలా లచ్చమణ్ణ మూడో ఎద్దుగా ఉన్నాడు కదా" అని ఊర్లోవాళ్ళు అంటుండేవారు. ఈ మాటల్ని అతను మొదటిసారి విన్నప్పుడు తన స్వాభావిక లక్షణమైన చిరుదరహాసంతోనే "భైరణ్ణా... నువ్వు తమాష చేస్తున్నట్లుంది కదయ్యా... ఎద్దులకైతే మంచి మేతతోనే నేనే మేపుతున్నాను. నాకు మేతను ఎవరు వేస్తారయ్యా? నేను గడ్డిగ్రాసం నుంచే పొట్టను నింపుకొనేదుంటే, రాగిపంటనంతా అమ్మి నా చెల్లెలికి ఒక మంచి పట్టు పరికిణిని కొని ఇస్తుండేవాడ్ని కదా" అని అన్నాడు.

"బాళేహళ్ళి' కి డిప్యూటీ కమీషనర్ వచ్చినప్పుడు గ్రామస్థులందరూ వారిని చూసేందుకు (కల్సేందుకు) వెళ్ళారు. ఆ కమిషనర్ సార్ వచ్చే మార్గంలోని అంచున లక్ష్మణరావ్ పొలం ఉంది. లక్ష్మణరావ్ తను చేస్తున్న పొలం నుంచి లేచి సార్‌ను చూసేందుకు నిలబడ్డాడు. ఆ సార్ ఆజానుబాహుడైన అతడ్ని చూసి సుబేదార్ వైపుకు



తల త్రిప్పి- "What a magnificient fellow" (ఎంతటి పుటకైన రుస్తుం యువకుడు) అని ఆశ్చర్యంగా అన్నాడు. దానికి ప్రతిగా సుబేదారు "He is a very very poor fellow sir (అతను ఎంతో బీదోడు సార్)" అని అన్నాడు. ఆ దొర నవ్వి "Oh But if health is wealth, he is richer than you or I(ఆరోగ్యమే మహాభాగ్యమైతే అతను మనకన్నా ఎంతో భాగ్యవంతుడే)" అని చెప్తూ పాపం, అదే వేళలో పొట్టలో ఏవో గుడుగుడు (డుకు డుకు) శబ్దాలు వస్తున్నందున, ముఖాన్ని సొట్టగా చేసుకొని వేగం వేగంగా కక్కస్ దొడ్డికని వెళ్ళిపోయారు దొరవారు. అదైన మీదట కరణంగారు లక్ష్మణరావ్‌తో "ఆరోగ్యమే మహాభాగ్యమని ఆ పెద్దసార్ చెప్పారు కదా; నీకేమి కొరతుంది లక్ష్మణ్‌రావ్" అంటూ ఆట పట్టించాడు.

లక్ష్మణరావ్‌కు "ఊర్లో భాగ్యవంతుడైన కాళేగౌడకు అజీర్ణవ్యాధినుంచి మంచి తిండినే తినక బాధపడుతుంది, అలాగే లక్ష్మీపుత్రుడైన రంగయ్యశెట్టి బానకడుపు వస్తుందని అరిటాకులో వడ్డించిన భక్ష్యాల్ని సరిగా తినకనే ఇంతకు మునుపెన్నడో బంధువుల ఇంట్లో పానకం త్రాగినందున వాంతులు వచ్చినవని చెప్పుకొంటూ బాధ పడుతుంది" గమనంలోకి వచ్చింది. నాకైతే ఎప్పుడూ నకనకలాడే ఆకలి బాధ తప్పేటట్లు లేదు కదా! ఎవరైనా ఏదో శుభకార్యంకని భోజనానికి పిలిస్తే, కరువుబోతోడు తిండిపోతోడని అనుకొంటారనే భయంనుంచి కడుపారా భుజించకనే అసంతుష్టుడై ఇంటికి చేరుతుండేవాడు అతను. తన చెల్లెలికి వివాహాన్ని చేయాలని జన్మతః బ్రాహ్మణుడైనందున యాచనకు వెళ్తే (భిక్షను పొందేందుకు వెళ్తే) ఈ బకాసురుడు ఇంటిముందుకు వచ్చాడు కదా అని అంటారేమోననే భయం అతనిలో ఉండేది. అంతేగాకుండా మొగోడిగా, బలిష్టుడిగా ఉండి కనబడినోళ్ళ దగ్గర చేతిని చాపి అడుక్కొనేది మంచిగా ఎట్లా ఉంటది? అని భావిస్తుండేవాడు. ఆరోగ్యమే మహాభాగ్యం ఎలాగున అనేది అతనికి తెలియట్లేదు.

ఒకరోజు సాయంకాలాన, ఉదయం నుంచి చేస్తున్న పొలం పనిని నిల్పేసి, ఎప్పటిలాగనే ఊరికి బయటఉండే తోటలోని బావి చెంతకు వెళ్ళి కాళ్ళు చేతుల్ని కడుక్కొని తడి (మడి) వస్త్రాన్ని ధరించి సంధ్యావందనం చేసి, ఆ తర్వాత ఉతికి ఆరేసిన బట్టను కట్టుకొనేందుకని సిద్ధమైయ్యాడు. అప్పుడు నలుగురు కంబళ్ళను కప్పుకొని నిలబడియున్నారు అక్కడ. అతను సంధ్యావందనంను చేస్తున్నప్పుడు వాళ్ళు అక్కడకు వచ్చియుండొచ్చేమో! లక్ష్మణ్‌రావ్ ఒకసారి వారి వైపుకు చూచి, తనపాటికి తను అన్నట్లుగా బట్టల్ని కట్టుకొని ఇంటికి వెళ్ళేందుకు సిద్ధమైయ్యాడు. అప్పుడు కంబళ్ళను కప్పుకొన్నోళ్ళలో ఒకడు "పంతులుగారు.. నిలవండి (ఆగండి)" అని అన్నాడు. లక్ష్మణ్‌రావ్ ఆగిపోయి 'ఎందుకు?' అని ప్రశ్నించాడు.

"మీకు పూజను చేసేందుకు వస్తదా .... పంతులుగారూ?"

"ఏమి పూజ అయ్యా?"

"ఏదైనా అనుకోండి.... హనుమదేవుడి పూజ, భేతాళ, మారెమ్మ, కాళి.. మొదలైన దేవతలకు చేసే పూజలు వస్తవా మీకు?"

లక్ష్మణరావ్‌కు దుర్గాస్తోత్రం, పురుషసూక్తం...ఈ రెండుమాత్రమే వస్తవి. ఎవరైనా అబ్రాహ్మణులు పూజకని పిలిస్తే దుర్గాస్తోత్రాన్ని పఠించి... హ్రీం... హ్రీం... అంటూ ఉచ్చరించి, గంటను మ్రోగించి, మంగళారతిని చేస్తుండేవాడు. అందుచేత ధైర్యంగా

"వస్తవి అయ్యా" అని అన్నాడు.

"అలాగైతే ఈ రోజు మా ఊరికి వచ్చి పూజ చేసి వెళ్ళండి. మీకు డబ్బు, దక్షిణ ఇస్తాం" అని కంబళిని వేసుకొన్నోడు అన్నాడు.

'ఇప్పుడైతే నేను వచ్చేందుకు కుదిరేది లేదయ్యా'

ఆ పల్లెవాసి 'ఇప్పుడే రావాలి' అని మొరటుగా అన్నాడు. అతని స్వరంలో కొంచం జబర్‌దస్త్ కనబడింది.

లక్ష్మణ్‌రావ్ తేలికగా నవ్వుతూ 'ఏందయ్యో బెదిరించేందుకు చూస్తున్నారా? నన్ను లాక్కొని వెళ్ళేది అదేమంత సులభం కాదులే. ఒకవేళ బలవంతంగా పట్టుకొని వెళ్ళారని అనుకోండి. నా చేతినుంచి బలవంతంతో పూజ చేపించి, మంత్రాల్ని చెప్పించేందుకు కుదురుతదా" అని అన్నాడు.

'మీతో కుస్తీ చేసేందుకు రాలేదు పంతులూ. మేము చెప్పే మాటను వినండి. మా జాతిలో ఈ రోజు నడిరాత్రి శక్తిపూజ చేసేదుంది. పూజను సద్బ్రాహ్మడి నుంచే చేయించేది ఉంది. మీకు సరిగానే మర్యాదల్ని చేస్తాము' అని అభ్యర్థించాడు అతను.

'ఏమి దక్షిణ ఇస్తారయ్యా మీరు?'

వాళ్ళు ఒకరి ముఖాల్ని మరొకరు చూసుకొన్నారు. లక్ష్మణ్‌రావ్‌తో మాట్లాడుతున్నోడు ఇంకొకడి చెంతకు వెళ్ళి గుసగుసలగా ఏవేవో మాట్లాడి అనంతరం 'మేము కోరుకొన్నట్లుగా పూజను మీరు చేస్తే ఇరవై రూపాయల్ని దక్షిణగా ఇస్తాం' అని చెప్పాడు అతను.

లక్ష్మణ్‌రావ్ ఆశ్చర్యాన్ని చెందాడు. ఒకరాత్రి పూజ పనికి ఇరవై రూపాయలు! ఇది నిజమేనా?



'అయితే కొన్ని షరతులు ఉన్నవి పంతులు. మీ కళ్ళకు గంతల్ని కట్టి తీసుకెళ్తాం. పూజ అయిన మీదట తిరిగి కళ్ళకు గంతల్ని కట్టే ఇక్కడకి తీసుకొచ్చి వదుల్తాం. మీరేమి భయపడేది లేదు.. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పేది లేదని మాకు ఒట్టు వేయాలి.'

లక్ష్మణ్‌రావ్‌లో కొద్దిగానైనా భావనాశక్తి ఉందుంటే ఈ షరతుకు ఒప్పుకొనేవాడు కాదేమో. చురుకైనోడైతే ప్రశ్నల్ని వేసి, ఆ షరతులోని మర్మం ఏమిటి అనేది కనుగొనేందుకు ప్రయత్నించి ఉండేవాడేమో. కొంచం భయభీతి ఉందుంటే అతను బెదిరిపోయి, ఆ పూజకు వెళ్ళేందుకు నిరాకరించేవాడేమో! అయితే అతను చాణాక్షమతి, బుద్ధివంతుడు, భయస్తుడు కాదు కదా! అయితే దరిద్రంలో మాత్రం ముందు పథంలోనే ఉండే స్థితి ఉంది కదా అతనిలో. ఈ విచారాలన్నిట్లోనూ అతనికి ఇరవై రూపాయల మొత్తంలోని మెరుపే అతని మనస్సులో ముఖ్యమై నిలిచింది కదా!

'పాడుపనుల్ని చెప్పితే నేను చేసేటోడ్ని కాదు; నేను పుట్టింది బ్రాహ్మణకులంలో. అందుచేత పూజను సరిగా చేసేదాంట్లో నానుంచి ఏమి అడ్డంకులు ఉండవు. అయితే మొదలు రూపాయల్ని ఇవ్వండి.'

కొద్దిగా వాళ్ళ నడుమ చర్చలు నడిచినవి. సగం డబ్బు తక్షణమే ఇస్తామని మిగిలిన సగం డబ్బును పూజ అయినమీదట ఇచ్చేందుకు ఒప్పందం అయ్యింది. లక్ష్మణరావ్ పదిరూపాయల్ని పుచ్చుకొని దాన్ని నడుంలో భద్రంగా దోపుకొన్నాడు. ఆ తర్వాత కొద్దిగా ఆలోచనను చేసి, 'కొంచం వేచియుండండి, ఈ డబ్బును ఇంట్లో ఇచ్చి వస్తాను – మీరు కావాలనుకొంటే నాతో రండి' – అన్నాడతను.

ఆ మాటకు మొదటగా ఇతనితో మాట్లాడినోడు నవ్వి 'మీకు మామీద నమ్మకం లేకున్నా చింతలేదు. మాకు మీమీద పరిపూర్ణంగా నమ్మకం ఉంది. వెళ్ళిరండి. ఫర్వాలేదు' అన్నాడతను.

లక్ష్మణరావ్ పరిగెడుతూ వెళ్ళి తన ఇంట్లో చిన్నమ్మ చేతిలో ఆ డబ్బు ఉంచి వేగంగానే తిరిగివచ్చాడు.

కంబళ్ళను కప్పుకొన్నోళ్ళలో ఒకడు తన నడుంకు చుట్టుకొన్న బట్టను విప్పి దాన్ని లక్ష్మణరావ్ కళ్ళకు కట్టాడు బిగువుగా. ఆ తర్వాత భయపడకండని చెప్పి లక్ష్మణరావ్‌ను పది పన్నెండు చుట్లు గిరిగిరా త్రిప్పాడు. గిరగిరా త్రిప్పేదాన్ని నిల్పినప్పుడు అతనికి ఏ దిక్కులో ముఖాన్ని పెట్టుకొంది ఊహించేందుకు అసాధ్యమైంది. తర్వాత అతని మణికట్టు మీద వాళ్ళు తమ చేతుల్ని నిల్పి అతడ్ని పొలాల గట్లమీద, వాగు వంకల నుంచి

నడిపించుకొని వెళ్ళారు. నేరుగా నడిచాడో చుట్టూ తిరిగి నడిచాడో ఏ దిక్కులో నడిచాడో అనే వివేచనమే అతనిలో లేనట్లుంది ఇప్పుడు. ఇలాగున ఎంతోసేపు నడిచారు. అక్కడక్కడ నిలిచి మరలా ఎనిమిది సార్లు గిరగిరా త్రిప్పటం మరలా నడవటం, ఇలాగున నడిచి, చివరికి ఒకచోటున నిలిపి, అతని కళ్ళకు కట్టిన గంతల్ని విప్పారు.

అప్పటికి ఎంతగానో చీకట్లు ముసిరినవి. చుట్టూ ఎత్తులో కంచెను వేసిన తోట. దాన్లో ఒక వృక్షం క్రింద ఒక గుడిసె ముందు లక్ష్మణ్‌రావ్ నిలబడియున్నాడు. గుడిసెలోపల దీపం వెలుగుతుంది. అతడ్ని వెంటేసుకొని వచ్చినోళ్ళు వాళ్ళలో వాళ్ళే మాట్లాడుకొంటూ అతడ్ని గుడిసెలోకి తీసుకెళ్ళారు. గుడిసెలో ఒక ప్రక్కన కుంకుమరాశి గోపురంగా ఉంది. దాని ముందు ఒక చంద్రాయుధంను పాతారు. సమీపంలో ఒక పళ్ళెంలో పూలు, పత్రాలు (ఆకులు), సాంబ్రాణి, కర్పూరం, గంధం.... మొదలైన పూజాసామగ్రి ఉంది.

'పంతులుగారు.. మీరు ఇక్కడే కూర్చోండి. నడిరాత్రిలో పూజ చేసేదుంటది. అది మా కులాచారం. మీరు నిద్రపోవాలనుకుంటే నిద్రించండి... మేము సరైన వేళకు మేల్కొలుపుతాం...' అంటూ మొదటగా బేరం కోసమని మాట్లాడినోడు చెప్పాడు ఆ విధంగా.

'అలాగేలే. అయితే నాకు ఆకలి ఎంతగానో ఉంది; తిండి ఏమైనా ఉందుంటే బాగుంటది' అన్నాడు లక్ష్మణరావ్.

ఆ గుంపులో ఉన్నోడొకడు నవ్వుతూ 'బ్రాహ్మలకు ఎప్పుడూ తమ ఉదరం గురించే జ్ఞానం (ధ్యాస)' అంటూ ఒక గెల అరిటిపండ్లను త్రెచ్చి ఇచ్చాడు.

ఆ మీదట వాళ్ళు వెళ్ళిపోయారు. లక్ష్మణరావ్ ఆ అరటిగెలనంతా తినేసాడు. ఆ తర్వాత చుట్టూ చూసాడు. ఆ గుడిసె మధ్యలో కుంకుమరాశి; దాని ముందు చంద్రాయుధం; ఆ తర్వాత ఒక తెల్లటివస్త్రం విప్పిపడేసినట్లుగా ఉంది. అదేమి వస్త్రం (పట్టు పీతాంబరమా) అనేదాన్ని చూసేందుకు మొదట్లో అన్పించకపోయినా మరిక ఏమి పనిలేనందున అది పడియున్న చోటుకు వెళ్ళి చూద్దామని లేచాడు. అతను లేచి నిలబడిన సప్పుడుకు బయట్నుంచి 'ఉత్తిగనే కూర్చుండేది లేదా' అని ఒకతను అరుస్తూ చెప్పాడు. లక్ష్మణరావ్‌కు ఇప్పుడు గుడిసె బయట ఎవరో కాపలా కాస్తున్నారని తెల్సి వచ్చింది. అతని మనస్సులో కుతూహలం మరియు ఒక తరహాలో భీతి మొదలైంది. ఇవి క్షణం క్షణంకూ బలపడుతూ, అతడ్ని ఊరకనే ఉండేందుకు ఒప్పలేదు. అతను సప్పుడు చేయకనే ఎంతో జాగ్రత్తతో తలుపు చెంతకు చేరుకొని చూడగా, అక్కడ బలంగా ఉన్నోడొకడు మద్దుకత్తిని పట్టుకొని



కాపలా కాస్తున్నాడు. లక్ష్మణరావ్ పిరికోడు కాదని మొదలే చెప్పుకొన్నాం కదా! అయినా అతడి వళ్ళంతా జుం అని రోమాంచనమైంది. ఆ తర్వాత 'జరిగేదేదో జరగనీ; ఆ మూలలో ఉన్నదేంటో చూడాల్సిందే' అనుకొంటూ నిశ్శబ్దంగా అక్కడికి దేగుకుంటూ వెళ్ళి దానిమీద చేతిని నిలిపాడు. అతను ధైర్యశాలిగా మరియు మందబుద్ధి వాడుగా ఉంటుండటంతో బెదురు (గావు) కేకల్ని పెట్టలేదు. అక్కడ పడియుంది ఒక మనిషి శరీరం. అయితే ఆ దేహం కదలక మెదలక నిశ్చేతనంగా పడియుంది. దగ్గరకు చేరి చూస్తుండగా గంజాయి వాసన వస్తుంది. ఆ మనిషికి గంజాయి నుంచి కలిగిన మత్తు నిద్ర అనేదానికి సందేహం లేదు. అతడ్ని ఒకట్రెండుసార్లు కదిలించి చూసినా ఏమి ప్రయోజనం కనబడుటలేదు.

అంతలో బయట ఎవరో మాట్లాడుతున్న శబ్దాలు విన్పించినవి. అది ఒక స్త్రీ నుంచి వస్తున్న ధ్వని.

"అయ్యో పాపం, ఏ ఊరోడో ఏమో! చేయాల్సిందేనా?"

"నోర్మూసుకో.. పో.. ఇక్కడ్నుంచి."

ఒకరెవరో వెళ్ళిపోయిన శబ్దం; మరలా కాపలా కాస్తున్నోడి పథసంచలనల శబ్దాలు త్రప్పితే మరేమి లేనట్లుగా నిశ్శబ్దం.

లక్ష్మణరావ్‌లోని మందబుద్ధి చలించసాగింది. ఎప్పుడో విన్న నరబలుల కథలు జ్ఞాపకాలుగా అతనిలో రాసాగినవి. ఈ గిరిజనులు తమ కులాచారంకు అనుగుణంగానో లేకపోతే నిధి నిక్షేపం (లంకెబిందెలు) దొరుకుతవేమో అనే ఆశెలనుంచో, మరిక ఏ పురుషార్థంకనో ఒక నరబలిని చేయాలని అనుకోవొచ్చేమో కదా! ఒక మనిషిని ఎలాగో త్రెచ్చి మత్తు పదార్థాలనుంచి జ్ఞానాన్ని తప్పించి బలిని చేసేందుకు అట్టిపెట్టుకొని ముహూర్తం కని చూస్తున్నారు కదా! ఇలాగున తోచింది అతని బుద్ధికి. వారు తనకు ముందస్తుగా ఎంతో డబ్బును ఇచ్చింది, తనను తీసుకొచ్చేటప్పుడు తనకు దారి గుర్తులు ఉండకూడదని వాళ్ళు చేసిన తంత్రం, అతనికి ఇప్పుడు అర్థం కాసాగింది. నరబలిని చేసేందుకు వెనుకంజ వేయని ఆ జనం, తనను ఆ పూజా విధానంకనే ప్రాణాల్ని తీయకుండా ఉంచారేమో అనే శంక కల్గింది. నడిరాత్రికి పూజ అని చెప్పారు. నడిరాత్రికి ఇంకా రెండు గంటలుంది. తన ప్రాణాన్ని కాపాడుకోవాలనుకుంటే తక్షణమే సాహసాన్ని చేయాలి. బయట ఒకతను మాత్రమే కాపలా కాస్తున్నాడు. ఎందుకు ప్రయత్నించగూడదు పారిపోయేందుకని?

మరలా అతనికి ఇంకొక ఆలోచన వచ్చింది. గంజాయి మత్తునుంచి మత్తులో పడియున్న ఆ బడవాయిని (తప్పులేనోడ్ని) వదిలి తను వెళ్ళిపోతే అది మానవత్వమే అగుతదా? అయితే, అతడ్ని లేపేది ఎలాగున? ఎంతగా కదిలించినా అతనికి మెలకువ రావట్లేదు కదా! ఈ విధంగా ఆలోచిస్తుంటే హఠాత్తుగా ఒక ఉపాయం కనబడింది (తోచింది). కనబడిన తక్షణమే దాన్ని అమలు చేసాడు.

మెల్లగా దేగుకొంటూ చంద్రాయుధాన్ని చేతిలోకి తీసుకొని దీపాన్ని ఆర్పేసాడు. బయట ఉన్నోడు దీపం ఎందుకు ఆరిపోయిందోనని దఢాల్నే లోనికి ప్రవేశించాడు. తక్షణమే లక్ష్మణరావ్ చంద్రాయుధంకున్న పిడి నుంచి అతని తలమీద బలంగా ఒక వ్రేటు వేసాడు. ఆ వచ్చినోడు సప్పుడు చేయకనే క్రిందకు పడిపోయాడు. లక్ష్మణరావ్ తడబడుతూ వెళ్ళి గుడిసె మూలన బండరాయిలాగ మత్తులో ఉన్న ఆ మనిషిని ఎత్తుకొని తన భుజం మీద వేసుకొని కుడిచేతిలో చంద్రాయుధాన్ని పెట్టుకొని ఆ గుడిసె నుంచి బయటకు పరిగెత్తాడు.

బయట అమావాస్య చీకటి. లక్ష్మణరావ్‌కు దార్లో ఏముందనేది తెలియట్లేదు. దేవుడా.. నువ్వే గతి అని అనుకొంటూ మనస్సులో దేవుడిమీద భారాన్ని మోపి నోటిని బిగబట్టి ముందుకే పరిగెత్తాడు. కొంచం సేపటిలోనే సుమారుగా ఒక అరమైలు దూరంకు పోయి యుండొచ్చు. అంతలో వెనుకనుంచి జనాల కేకలు వినబడుతున్నవి. అటు ఇటు కాగడాలలోని వెలుగులు మరియు వెతుకుతున్నోళ్ళ అరుపులు అతని గమనానికి వచ్చినవి.

'తోటలో ఉండొచ్చు! మరిక ఎక్కడకు పోగలడు? అక్కడే వెదుకుదాం..'

'లేదు లేదు; ఊరివైపు పారిపోయి ఉండొచ్చు'.

'ఊరివైపుకు ఎందుకెళ్తాడు? సూటి (నేరు)గానే వెళ్ళి యుండొచ్చు'

'అడుగో అడుగో రండర్రా... అక్కడ కూలబడినోడు అతనే.. అయ్యో అది చెట్టు మొదలు కదా!'

అలాగున మాట్లాడుతూ అటుఇటు తిరుగుతూ వెతుకుతున్నా, అతని వెనుకే కొద్ది దూరంలోనే వస్తున్నారు ఆ జనం.

లక్ష్మణరావ్‌కు మొదట్లో ప్రాణాన్ని నిలుపుకోవాలనే చింతన (ధ్యాస)తో అదంతగా ఆయాసం కలగలేదు. ఆ తర్వాత మీద ఉన్నోడు బాలుడేమి కాదు. గడ్డిపోచకు గడ్డిపోచ భారం అనేది కలగసాగింది అతనికి. వెంటాడేవాళ్ళకు దొరకకూడదని, ఒకవేళ దొరికితే



ఆ దుష్టజనంలో ఒకరిద్దరినైనా చంపి, తను చనిపోవాలని అతని మనస్సులో దృఢంగా నిశ్చయించుకున్నాడు. వెంటాడుతున్నోళ్ళు తూర్పు దిక్కుకు తిరిగితే, అతను పశ్చిమ దిక్కుకు తిరిగేది... ఇదే అతనిలోని ఫలాయన మూలమంత్రంగా ఉంది ఇప్పుడు. ఈ కారణం నుంచే కొద్దిసేపటిలోనే అతనికి తను ఏ దిక్కుకు పరిగెడుతున్న జ్ఞానం త్రప్పిపోయింది. వాళ్ళు దగ్గర దగ్గరకు వస్తున్నారు. ఇతను వారినుంచి సాధ్యమైనంత దూరంలోనే పారిపోతున్నాడు. అయితే ఎంతో అలసిపోయాడు. కళ్ళకు ఏమి కనబడుట లేదు. మునుపెన్నడు చూడని ప్రాంతం. అలుపు నుంచి కాళ్ళు వణుకుతున్నవి. ఎదురు రొప్పుల్ని పెట్టున్నందున గుండె ఠపీమని పగిలిపోతుందేమో అనే భావన ప్రారంభమైంది అతనికి. చెవులలో వానాకాలంలో శబ్దాల్ని చేస్తూ పెద్ద ప్రవాహంలో పోయే వాగు చేస్తున్న ఘోషలాగ ధ్వని పుట్టింది. వెంటాడుతున్నోళ్ళు సమీపానికి వస్తున్నారు. ఇక అతనిలో తప్పించుకొనే ఆశ లేదు ఇప్పుడు. అయినా హఠాత్తుగా కళ్ళను కొద్దిగా మూసుకొని, ఒక చేతిని మత్తులో ఉన్నోడిమీద బిగువుగా నిల్పి, మరొక చేతిలో చంద్రాయుధాన్ని గట్టిగా పట్టుకొని పరిగెత్తాడు. ఒక తోటలోకి ప్రవేశించాడు. నాలుగు అడుగుల్ని ముందుకు వేసినప్పుడు భూమి నోటిని తెరిచి అతడ్ని మ్రింగింది అనే భావన వచ్చి క్రింద పడ్డాడు. ఎంతో లోతుకు పడిపోయినట్లుగా అతని మనస్సుకు అన్పించింది. అనంతరం అతను మూర్ఛబోయాడు.

## 3

లక్ష్మణ్‌రావ్‌కు తెల్లారుఝాములో మెలకువ వచ్చింది. తూర్పున వెలుగు కిరణాలు రాసాగినవి. రాత్రి జరిగినదంతా కలే అనే భావం అతనిలో కలిగి ఇక లెగుద్దాం అని లేచేందుకు ప్రయత్నిస్తుంటే వంటినెప్పులు, ముళ్ళు రాళ్ళ నుంచి తగిలిన దెబ్బలు మంటను పెట్టినట్లుగా అతనిలో బాధల్ని పెట్టసాగినవి. మరలా కూలబడిపోయి అయ్యో అంటూ పడుకొన్నాడు. అయ్యో అనే ప్రతిధ్వని బావిలోంచి వచ్చినట్లుగా శబ్దం విన్పించింది. లక్ష్మణరావ్ ఆ మామిడితోటలో బావిని త్రవ్వాలని తీసిన పెద్దగోతిలో పడిపోయాడు క్రితం రాత్రిలో. ఆ గొయ్యి సుమారుగా మనిషంత ఎత్తుగానున్న గుంతగాఉన్నా, దాన్నిండా పుడిపుడిగా మన్ను ఉన్నందున అతనికి ఎక్కువగానేమి గాయాలు కాలేదు. వెంటాడుతున్నోళ్ళు ఆ తోట్లోని వేరేభాగం నుంచి లోపలికి చేరుకొని, ఆ ఆత్రంలో ఈ గుంతను చూడకనే ముందుకే వెళ్ళిపోయి ఉండొచ్చేమో కదా!

లక్ష్మణరావ్ తాను మోసుకొని వచ్చినోడి వైపుకు చూచాడు. అతనింకా మత్తులోనే ఉన్నాడు. సుమారుగా ఇరవై సంవత్సరాలు ఉండొచ్చు అతనికి. పుష్టికరంగా ఉన్నాడు.

అతడి దుస్తుల్ని చూస్తుంటే శ్రీమంతుడేమో అన్నట్లుగా కనబడుతున్నాడు. లక్ష్మణరావ్ ఒకట్రెండుసార్లు అతడ్ని చక్కగా త్రిప్పి లేపేందుకు ప్రయత్నిస్తుంటే అతను కొద్దిగా కళ్ళను తెరిచి వెర్రోడిలాగ చూసి మరలా నిద్రలోకి జారాడు.

లక్ష్మణరావ్‌కు తను ఎక్కడుంది గుర్తుకాలేదు. రాత్రి తనను వెంటాడినోళ్ళు మరలా వస్తారేమోననే భీతి అతని మనస్సుకు నాటింది. తను మోసుకొచ్చిన మనిషి ప్రాణానికి అపాయం ఏమికాలేదు ఇప్పటివరకూ. ఈ గుంతనుంచి బయటపడి, ఎవర్నైనా సహాయం కోసమని పిల్చుకొచ్చి అతడ్ని తీసుకొని సురక్షితమైన స్థలానికి వెళ్ళేది ఉత్తమమని తోచి, అక్కడ్నుంచి లేచి ఎంతో ప్రయాసతో ఆ గుంతలోనుంచి బయటకు వచ్చాడు. ఆ తోటకు సమీపాన కొద్ది దూరంలోనే నీడను ఇచ్చే రావిచెట్ల సాలు (లైను)గా పంక్తిలాగ కనబడింది. అక్కడికి చేరుకోగా అది కోలార్‌నుంచి మదనపల్లెకు వెళ్ళే రాజమార్గంగా కనబడింది. అక్కడ అతను నిలబడగా ఎన్నో జట్కాబండ్లు ఆ మార్గంలో ఉదయంలో రైలుకు వెళ్ళే వాళ్ళను ఎక్కించుకొని వెళ్తున్నవి. లక్ష్మణరావ్ ఆ మార్గం (రోడ్)లో నిలిచి 'బండిని ఆపండయ్యా' అంటూ అడుగుతుంటే, అతని స్థితిని చూసిన కొంతమంది పిచ్చోడని ఊహించుకొంటూ వెళ్ళిపోయారు. ఇంకా కొంతమంది ఇతను అడుక్కొనేందుకే ఈ వేషంలో ఉన్నాడని అతని వైపుకు చూడనట్లుగా నటిస్తూ వెళ్తున్నారు. మరికొంతమంది తాము చేయాల్సిన కార్యాలలోని (పనులలోని) భావనలలో నిమగ్నులైనందున ఇతను పెట్తున్న కేకలకు తమ చూపుల్ని నిలపకనే వెళ్ళిపోయారు. చివరికి ఒక బండి ఆగింది. దాన్లో సుఖాసీనుడైనోడు పోలీస్‌ఇన్‌స్పెక్టర్ దస్తగిరిసాబ్. వారు తమ స్థూలకాయాన్ని సాధ్యమైనంతగా జాగ్రత్తలతో ఆ గాడి (జట్కాబండి) నుంచి దించి గోరింటాకుతో రంగును మార్చుకొన్న గడ్డాన్ని మాలీసు (నిమిరికొంటూ) చేసుకొంటూ –ఏయ్, ఎవరయ్యా నువ్వు? మనిషివా... దెయ్యమా....! ఇటు రారో" అంటూ గదిరాడు.

లక్ష్మణరావ్ సార్ చెంతకు వచ్చి క్లుప్తంగానే రాత్రి తను మూఢజనం చేతికి చిక్కి వారినుంచి త్రప్పించుకొని బయటపడింది; మరియు వాళ్ళు నరబలిని చేసేందుకు గంజాయి మత్తుతో ఉన్న ఒకడ్ని ఎత్తుకొని వచ్చింది; ఆ మనిషి ఇక్కడకు దగ్గర్లోనే ఒక గుంతలో పడియున్నదాన్ని తెలిపాడు.

రైటర్ నారణప్ప జట్కా బండినుంచి దిగి ఇన్‌స్పెక్టర్ చెంతకు వచ్చి 'ఇతను పిచ్చోడు కావచ్చు; లేకపోతే ఇతనే అతడ్ని చంపి తను బయటపడేందుకే ఇలాగున మాట్లాడొచ్చు; ఇతడ్ని దస్తగిరి (లాకప్ లోకి నెట్టే) చేసేదే ఉత్తమం' అని హిందూస్తాని భాషలో పలికాడు.



"నోర్మూసుకో బేవకూఫ్. ఇదంతట్నీ నేను దర్యాప్తు చేస్తాను. ఒరేయ్, నడువురా.. ఆ శవం పడియున్న చోటుకు; మొదలు శవం దొరకాల్సి ఉంది" అన్నాడు దస్తగిరిసాబ్ నారణప్పతో.

వీళ్ళు అనుకొంటున్న మాటలు లక్ష్మణరావ్‌కు తెల్వకపోయినా, వాళ్ళ అభిప్రాయంను గ్రహించి, ఇన్‌స్పెక్టర్‌ను నారణప్పనూ తోటలో ఉన్న గుంత చెంతకు పిల్చుకొని వెళ్ళాడు. ఆ గుంత లోపలికి దస్తగిరి సాబ్ వంగి చూడగా 'ఓఓ, లాష్ (శవం) ఇక్కడుంది. నారణప్పా... నువ్వు ఆ శవాన్ని బయటకు ఎత్తుకొని రా...' అంటూ హుకుం చేసాడు. నారణప్పకు ఆ ప్రాతఃకాలంలో లాష్ (శవాన్ని) ను ఎత్తేందుకు అదంతగా ఉత్సాహం కలగలేదు.

'శవాన్ని మహజరు (పంచాయ్తి) చేసేవరకూ శవాన్ని (లాష్) ఎత్తకూడదని ఇంగ్లీష్ పీనల్‌కోడ్, ప్రొసీజర్ కోడ్, పోలీస్‌రూల్స్.... వీటన్నిట్లో స్పష్టంగా రాసి చెప్పబడియున్నవి కదా సార్' అంటూ రెండు అడుగుల్ని వెనక్కే వేసాడు.

ఇన్‌స్పెక్టర్‌కు పిచ్చి కోపం వచ్చింది. వారి నోటినుంచి పుంఖానుపుంఖంగా బూతులు, దూషణలు రాసాగినవి. అంతలో లాష్ (శవం) గుంతలోపల లేచి కూర్చుని రెండుసార్లు ఆవులించి, కళ్ళను నులుపుకొంటూ ఆశ్చర్యంగా పైకి క్రిందకూ చూడటాన్ని చేయసాగినప్పుడు ఆ ఇన్‌స్పెక్టర్ నుంచి వాగ్బాణాల పరంపర ఆగిపోయి ఆ రైటర్‌ను కాపాడింది.

రైటరూ, లక్ష్మణరావ్ చేరి అతడ్ని గుంతలోనుంచి చేతుల్ని పట్టుకొని పైకి లాగారు. అతడ్ని విచారించగా, "తన పేరు మల్లప్ప అని తను 'కనగొందికొప్ప' ఊరుకు వెళ్తుండగా... తన బుద్ధి ఇంకా తన స్వాధీనంలో లేదని, పాత జ్ఞాపకాలు ఇంకా ఏమి గుర్తుకు రావట్లేదని వళ్ళంతా నెప్పులతో తలైతే పగిలిపోతున్నట్లుగా ఉందని...." అంతగానే చెప్పాడతను. లక్ష్మణరావ్ గుంతలో పడిన చంద్రాయుధాన్ని చూపించి, దాన్నీ బయటకు తీసారు.

దస్తగిరి సాబ్ ఆ రోజున ఆ వేళలో ట్రావెలర్స్ బంగళాలో విడిది చేసిన డిప్యూటి కమీషనర్ సార్‌ను చూసేందుకు వెళ్తున్నాడు. ఈ కేస్ తనకు దొరికింది తన అదృష్టంగా భావించుకొన్నాడు. రైటర్‌కు బండిలో జాగాను చూపెట్టకనే, లక్ష్మణరావ్‌ను మల్లప్పనూ కూర్చోబెట్టుకొని దొర (సార్) విడిది చేసిన బంగళాకు పయనమైపోయాడు. అలాగే నడుదారిలో కాలికి శరణాగతుడైన రైటరు విచారం (విషయం) మీద పాఠకులు చింతపడాల్సింది లేదులే. నారణప్ప అనుభవస్తుదు, ఉపాయశీలి అయినోడు కదా!

వెనుకనే వస్తున్న ఒక జటకా బండిలో ప్రయాణిస్తున్న ముసల్దాన్ని అక్కడే దింపేసి ఆమె స్థానంలో అతను కూర్చుని ఇన్‌స్పెక్టర్ వెనకనే వేగం వేగంగానే వారూ వచ్చి దొర బంగళాకు ముట్టారు అనాయాసంగా.

ఆ పెద్ద బంగళాలో ఆ ఇంగ్లీష్ దొర ప్రాతఃకాలంలో బన్, బిస్కెట్స్, తేనెతో టిఫిన్ తిని వరండాలో కుర్చీమీద హాయిగా కూర్చునియున్నాడు. అప్పుడు దస్తగిరి సాబ్ వారి ఎదురుగా నిలబడి మిలిటరి సలామ్ చేసాడు. మిలిటరి సలామ్ అంటే ఏమనుకొంటూన్నరో పాఠకులారా.... ! అధికారి ఎదురు, గూటంకు కట్టేసినట్లుగా నేరుగా నిల్చేది, ముఖంలో ఏదైనా భావం, బుద్ధి, చేతనం... మొదలైనవి ఉండుంటే వాట్ని తక్షణమే వదిలి, నల్లరాతితో చెక్కిన తిరుపతి వెంకటరమణుడి లాగ స్థిరంగా నిలిచియుండేది, పెదాల్ని కదల్చకనే జోడించుకొని ఒక నిమిషం కంటిరెప్పల్ని కొట్టకనే ఆకాశమండలాన్ని చూసి, ఏక్‌ధమ్ కుడిచేతిని పైకెత్తి "Long live the Queen" (రాణిగారు చిరస్థాయిగా వర్థిల్లుగాక) అనేది ఉంటది. దస్తగిరి సాబ్ ఈ భరత శాస్త్రాన్ని చక్కగా అభినయించిన తక్షణమే ఆ ఇంగ్లీష్ దొర 'ఏమిటి ఇన్‌స్పెక్టర్' అని అడిగాడు.

"తమ క్రింద పనిచేయటం ఎంతో ఖుషీని కలుగజేస్తుంది సార్" వగైరా వగైరా సామాన్యమాటలతో అభినందనలను చెప్పి, ఆ తర్వాత "దొంగల ప్రాంతంలో ఉండే ఔట్‌పోస్టుకు ఒక నికార్సైన జమేదారుడి అవసరం ఎంతగానో అత్యవసరంగా ఉంది సార్' అని వేడుకొన్నాడు.

"మంచిది; మంచిదేలే నీ అభిప్రాయం.. ఎవరైనా సరైన వ్యక్తి మీ నిగాలో ఉన్నాడా?"

"ఉన్నాడు సార్. సైయద్ మకదుం ఉన్నాడు. అతను సర్వీస్‌లోనే ఉన్నాడు. ఎంతో ఉక్కు పిండం. అతను 'పీరనపాళెం'లోని స్టేషన్‌కు ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పుడు ఎంతో నియమ నిష్టలతో ఉద్యోగ నిర్వహణను చేసాడు. ఆ ప్రాంతంలో రాత్రైతే చాలు దొంగల బెడద విపరీతంగా ఉండేది. మన మకదుం సాబ్ ఎంతో ధైర్యంతో ఆ దొంగల జబర్దస్తీకి బెదరక ఆ ప్రాంతాన్ని సురక్షితంగానే కాపాడాడు సార్."

ఆ ఇంగ్లీష్ దొర నవ్వి 'భేష్, శాభాస్' అంటూ 'మరిక ఏమి ఇతర విశేషాలు' అని మరలా అడిగాడు. దస్తగిరి సాబ్ "ఈ రోడ్‌లో ఆరోమైలుకు దగ్గరుండే తోటలో ఒక ఖూని కాకపోతే ఆత్మహత్యా ప్రయత్నం నడిచింది సార్. వాళ్ళను అరెస్ట్ చేసి, హుజూర్.. మీ సన్నిధికి తెచ్చి హాజరు పరిచాను" అని చెప్తూ 'పిల్చుకొనిరా' అని నారణప్పకు చెప్పగా, అతను మల్లప్పను లక్ష్మణరావ్‌ను హాజరు పరిచాడు.



దస్తగిరి సాబ్ ఆ మొఖద్దం (కేసు)లోని తప్సీల్ (డిటైల్స్)ను వివరంగా, లోతుగా విచారించనందుకు డిప్యూటీ కమీషనర్ రూలు ప్రకారం మాట్లాడేందుకు కొద్దిగా సంకోచాన్ని చెందినందున జరిగిన కథనంతా లక్ష్మణరావే చెప్పాల్సి వచ్చింది. అతని సరళమైన మాటల వివరణను వింటున్న ఆ ఇంగ్లీష్‌దొర ఆదరణతో, అభిమానంతో నిమిష నిమిషానికి ఎక్కువౌతున్న ప్రేమ నుంచి విన్నాడు. ఆ తర్వాత మల్లప్పను విచారించగా తను 'లింగదహళ్ళికి షావుకారైన మరిగంగణ్ణగారి ఏకైక పుత్రుడ్నని, ఇంటిలో కోపగించుకొని స్నేహితుడి ఊరికి వెళ్ళి నాల్గైదు రోజులు ఉండివద్దామని బయల్దేరింది; రెండుమూడు రోజుల ప్రయాణం తర్వాత జాగ్రత్తగా ముందున్న మజిలీకి చేరాలని కాలుదారిని పట్టుకొని పోతుండగా దారితప్పి పోయాను ఎక్కడికో. మిట్టమధ్యాహ్నమైంది. ఎంతగానో అలిసి, ఆకలిదాహంతో ఒక చెట్టు నీడన కూర్చున్నాను. అప్పుడు ఎవరో ఇద్దరు తను కూర్చున్న చోటుకు వచ్చి మాట్లాడించారు. ఆ తర్వాత తమ ఊరుకి వచ్చి విశ్రాంతిని చేసుకొని (పొంది) వెళ్ళండి అంటూ పిల్చుకొని వెళ్ళారు. అక్కడ ఒక ఇంట్లో కూర్చున్నాను. నాకు ఎంతో దాహంగా ఉంది. నీళ్ళను త్రాగేందుకని అడిగాను. కాచిన పాలను ఒక చెంబునిండా తెచ్చి ఇచ్చారు. గటగటా త్రాగాను నేను. ఆ తర్వాత జరిగిందేమి జ్ఞాపకంలో లేదు. మరలా మేల్కొన్నప్పుడు తోటలో ఉన్న గుంతలో పడియున్నాను' అంటూ చెప్పాడు అతను.

ఆ ఇంగ్లీష్‌దొర లక్ష్మణరావ్ వైపుకు తిరిగి 'నువ్వు బాళేహళ్ళికి చెందిన రుస్తుం కదా?" అని అడిగారు.

'ఔను సార్... నేను బాళేహళ్ళికి చెందినోడినే' అని జవాబిచ్చాడు లక్ష్మణరావ్.

ఆ దొర ఇన్‌స్పెక్టర్‌తో 'మంచిదే అయ్యింది. వీరి నుంచి ఫిర్యాదును తీసుకొని, ఆ తోట, ఆ ఊరు, ఆ జనం.... వాటన్నిట్ని బయటకు లాగండి (శోధించండి)' అని ఆర్డర్‌ను పాస్ చేసాడు.

ఎంతగా విచారణ చేసినా ఆ నరబలిని చేద్దామనుకొన్న స్థలాన్నిగాని, ఆ మూఢజనాన్ని గాని కనుగొనలేకపోయాడు దస్తగిరి సాబ్.

ఆ ఇంగ్లీష్ దొరకు లక్ష్మణ్‌రావ్ మీద అభిమానం ప్రారంభమైందని ఆ సంగతిని మొదటే సూచించానుకదా నేను! ఆ దొరవారు అతడ్ని పిల్చి హెడ్‌కానిస్టేబుల్‌గా ఉద్యోగాన్ని ఇచ్చి కొంతకాలం తమ దగ్గరే జిల్లా కేంద్రంలోనే నియమించాడు. ఆ తర్వాత అతడ్ని దొంగలకు ప్రసిద్ధమైన ఒక ప్రాంతంలోని స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేసాడు. అక్కడ లక్ష్మణరావ్

ధైర్యంతో శ్రద్ధతో  విధుల్ని నిర్వహించి మంచి పేరును గడించాడు. అతని చెల్లెలికి వివాహంను ఆ ప్రాంతంలోనే నెరవేర్చాడు. ఆ వివాహ సమారంభంకు 'లింగదహళ్ళి' షావుకారైన మరిగంగప్పగారు తమ పుత్రుడి సమేతంగా సంసారంతో వచ్చి అతని చెల్లెలకు ఒక శేరు బంగారాన్ని  నగల రూపేణా బహుమతిగా ఇచ్చాడు.

సంపద, హోదా పెరుగుతూ వచ్చినట్లుగానే లక్ష్మణరావ్ లోని బుద్ధి కూడా చురుకైనదన్నట్లుగా అతను ఇంగ్లీష్ భాషనూ నేర్చాడు. చతురమతిగా అన్పించుకొన్నాడు.

'మనం ఇప్పుడు ఇక ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావ్‌గారి విషయం చెప్పుకోవచ్చేమో కదా!"

ఔను కదూ....!

\- 0 -

(కన్నడ భాషలో ఈ కథను రచించినవారు శ్రీయుత నవరత్న రామారావ్‌గారు . 1932లో ఈ కథ అచ్చు అయినదట. రామారావ్ 29-05-1877లో జన్మించారట. మైసూరు సంస్థానంలోని సివిల్ సర్వీస్ పరీక్షలో పాసై వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగ బాధ్యతల్ని నిర్వహించి మైసూరు మహారాజా వారి నుంచి 'రాజసేవాప్రసక్త' అనే బిరుదును పొందారట.)

24-07-2009

శాఖమూరు రామగోపాల్



# తబరుడి కథ

తబరుడికి పిచ్చి పట్టిందని 'మూడిగెరె'లోని జనం అనుకోసాగారు. మొత్తం 'మూడిగెరె'లోని పట్టణంలో ప్రస్తుతమున్న పిచ్చోళ్ళలో తబరుడు ఇరవైఐదో వాడుగా ఆ లెక్కలోకి చేర్చుకోబడ్డాడు.

'మూడిగెరె'లో  ఎవరైనా పిచ్చోళ్ళుగా మారితే, ఎవరూ ఆశ్చర్యాన్ని చెందేది లేదు. ఎందుకంటే ఈ పిచ్చోళ్ళు అప్పటికప్పుడే తలలను చెడగొట్టుకొని  ఒక్కరోజులోనే పిచ్చోళ్ళుగా మారిందిలేదు. వీళ్ళంతా అత్యంత స్వాభావికంగానే  క్రమేణ పిచ్చోళ్ళుగా మారిపోతుండేవాళ్ళు. జనం వీళ్ల పిచ్చి చేష్టల్ని నిరీక్షిస్తూ, వాళ్ళు పిచ్చోళ్ళుగా మారిన తదుపరి "అయ్యో పాపం"అంటూ కరుణను, జాలిని చూపి సమాజంలోకి చేర్చుకొనేందుకు ఒప్పుకొంటుండేవారు. మొత్తంగా ఈ పిచ్చోళ్ళకూ 'మహమ్మద్ బీన్ తుగ్లక్'కు ఉండే చరిత్రగానే ఒకొక చరిత్ర  ఉంటుండేది.

తబరుడు మూడిగెరె అనే చిన్న పట్టణంలోని జనంకు బాగా పరిచయం ఉన్న వ్యక్తే. అతను గవర్నమెంట్ ఉద్యోగస్తుడిగా బ్రిటీషోళ్ళ పరిపాలనా కాలంలోనే సర్వీస్‌లో చేరుకొన్నాడు. బ్రిటీషోళ్ళ శిస్తు నియమాలు, విధి విధానాలు... మొదలైన వాట్ని పొగుడుతూ పాత జ్ఞాపకాలను సజీవంగానే నిలుపుకొని, వాట్ని నెమరేసుకొంటున్న మూడిగెరెలో ఉండే ఇద్దరు వ్యక్తులలో డాక్టర్ డి'సిల్వా ఒకరైతే, తబరుడు ఇంకొకడిగా ఉన్నాడు కదా! ఆ ఇద్దరిలో  ఏ ఒకరైనా తమ తమ పాత జ్ఞాపకాల్ని ఎవరితోనైనా చెప్పుకొంటుంటే, అది నిజమో అబద్ధమో అనేందుకు సాక్షిగా పరస్పరం ఒకరు ఇంకొకరి పేరును ఉదహరిస్తుండేవాళ్ళు.

బ్రిటీషోళ్ళ పరిపాలనా కాలంలో తబరుడు  వంతెన వద్ద టోల్‌ట్యాక్స్‌ను వసూలు చేసే నౌకరిలో  చేరినప్పుడు అతనికి నెత్తిమీద కొప్పు వచ్చినట్లుగా అన్పించింది. అందరూ అతనికి మర్యాదను ఇస్తుండేవారు. కాయగూరలు, ధాన్యం, చేపలు... మొదలైన వాట్ని మూడిగెరెకు రవాణా చేసేటోళ్ళు ఆ టోల్‌ట్యాక్స్ జతగా ఆయా సరుకుల్ని తమకు తోచినట్లుగా అతనికి ఇస్తుండేవారు.

అప్పుడు దేశంలో (ఇండియాలో) ఎంథటిదో అయిన ఆందోళన ఆరంభమైంది. అది స్వాతంత్ర్య సంగ్రామం. రెండో ప్రపంచ యుద్ధంలోని సెగలు చల్లారక మునుపే ఈ స్వాతంత్ర్య సంగ్రామంలోని వేడి సెగలు పైపైకే ఎగబాకావి. తబరుడికి ఆ టైమ్‌లోనే పెళ్ళైంది. మంగళూరు సమీపాన అప్పి (అప్పమ్మ) అనే ఒకామెను వివాహమాడాడు. ఇద్దరూ ఆ బ్రిడ్జ్ చెంతన కూర్చుని స్వాతంత్ర్య సంగ్రామం గురించి ఎన్నోసార్లు ముచ్చటించుకొంటుండేవారు. బ్రిటిషోళ్ళ విరుద్ధంగా పోరాడుతున్న గాంధి అనే మనిషి పేరు అప్పుడు ఎంతగానో ఎక్కువగా విన్పిస్తుండేది. తబరుడికీ అతని భార్యకు ఎందుకు ఈ పోరాటం అనేది స్పష్టంగానైతే తెల్వలేదు. నిఖరంగా బ్రిటీషోళ్ళు ఈ దేశాన్ని వదిలి వెళ్ళిపోవాలనేది ఆ పోరాటంలో ఉద్దేశంగా అయ్యుండొచ్చేమో అనేది ఆ దంపతులకు కొద్దిగానైతే గుర్తే! తబరుడు దేశభక్తుడేమి కాదు. అయితే నల్లోళ్ళ (ఇండియన్స్) నడుమ వికారులన్నట్లుగా తిరుగుతుండే ఈ తెల్ల తోలోళ్ళు ఎందుకు తమ జనం (ఇండియన్స్) నడుమ నెమ్మదితో ఉండగూడదు అని మాట్లాడుకొంటుండేవారు ఆ దంపతులు. గాంధివాదంలో కూడా ఏదో సత్యం ఉంది అనేది అతనికి అన్పించింది. అయితే సహాయ నిరాకరణంతో పన్నులను కట్టకుండా ఉండేది, టెలిఫోన్ తీగల్ని కత్తిరించేది... ఇత్యాది కార్యక్రమాలలోని స్వరూపాల్ని పరిగణనలోకి తీసుకొన్నప్పుడు మాత్రం తబరుడిలో జుగుప్స కలుగుతుండేది. అతను ఉత్తిగనే తనలో తనుగా, భార్యతో అభిప్రాయ భేదాల్ని సూచించి ఊరుకుండేది లేదు. ఏదో ఒక పక్షం వైపు ఉండాల్సియుంది. టోల్‌ట్యాక్స్‌ను కట్టకనే ధిక్కరించి జనం తిరుగుతుండేదాన్ని తబరుడు చూస్తూ ఊరుకొనేది లేదు. తబరుడు గాబరా పడ్డాడు. “ఈ గాంధి కొంప నాశనంగాను” అని గొణుక్కున్నాడు. ఏమేమో చేసి మూడిగెరెలోని సర్క్యూట్ హౌస్‌లో దాని కీపర్ పోస్ట్‌ను సంపాదించి ఆ టోల్‌గేట్ నుంచి విముక్తుడైయ్యాడు. తెల్లదొరలు.... వారి శుశ్రూష, సేవ మొదలైన వాట్ని ఎంతో దగ్గర నుంచి చేసిన తబరుడికి, వాళ్ళు కూడా చూసేందుకు వేరే తరహాలో ఉన్నా, మనలాంటి మానవులే అనేది తెల్సింది.

ఈ మధ్యలో సత్యాగ్రహంలోని సెగలు ఎక్కువ కాసాగింది. ఎవరెవరో పెద్దోళ్ళ పిల్లలంతా తమ తమ చదువులను, ఇళ్ళను వదిలిపెట్టి, గాంధీతో కూడి లడాయికి చేరుకొన్నారనే వార్తలు వినబడుతుండేవి. లాఠిచార్జ్, తుపాకికాల్పులు, సత్యాగ్రహం (క్విట్ ఇండియా సమరం) నడుస్తుంది. తబరుడిలో ఏమేమి స్పష్ట అభిప్రాయాలు ఈ ఆందోళన మీద లేదు. టెలిఫోన్ తీగల్ని కత్తిరించారనేది విన్నప్పుడు గాంధి మీద కోపం కలుగుతుండేది. తుపాకి గుళ్ళతో ఇండియన్స్‌ను చంపారని విన్నప్పుడు బ్రిటీషోళ్ళ మీద కోపం వస్తుండేది.



స్వాతంత్ర్య పోరాటంలోని ఉధృతి ఇంకా ఎక్కువై తాలూకాలకు, గ్రామాలకు చేరుకొంది. తబరుడిలో బ్రిటీష్ అధికారుల చేతిక్రింద మనఃపూర్వకంగా పనిని చేసేది ఏమిటో ఒక తరహాలో భయాన్ని పుట్టించసాగింది. దీనితో పాటు బ్రిటీష్ అధికార్లు మొక్కాం (బోర్డింగ్)ను చేసేందుకు సర్క్యూట్ బంగళాకు తమకు జతగా ఆంగ్లో ఇండియన్స్ బట్లర్లనూ వెంటేసుకొని వస్తుండేవారు. ఆ బట్లర్లు తబరుడ్ని ఎంతో తుచ్ఛంగా, అనుమానంతో చూస్తుండేవారు. తబరుడిలో ఇది మరింతగా అసహనీయమైన ప్రవర్తనంగా అన్పించింది. అప్పమ్మకు తబరుడిలో ఉన్న అసహనాన్ని చూసేది ఇష్టంగాక, భర్తతో తాలూకాఫీసుకు ట్రాన్స్‌ఫర్ చేయించుకోమని సలహా ఇచ్చింది.

తబరుడు తాలూకాఫీసుకు జవానుగా అయ్యే సమయంలో ఇండియాకు స్వాతంత్ర్యం లభ్యమైంది. తెల్లోళ్ళ ముఖాలు ఒకొటొకటిగా తగ్గిపోసాగావి. భారతీయ దేశబాంధవుల పరిపాలన ఆరంభమైంది. తాలూకు ఆఫీస్‌కు జతగా తాలూకు అభివృద్ధి ప్రణాళికా మండలి, కాఫిబోర్డ్, అబ్కారి డిపార్ట్‌మెంట్.... ఇవన్నీ ప్రారంభించబడినవి ‘మూడిగెరె’లో.

తబరుడు ఏ డిపార్ట్‌మెంట్‌కు చెందినోడు. ఎంత జీతంతో (ఎంత పే స్కేల్‌తో) ఏ నౌకర్ని ఇవ్వాలి అనే దానిమీద నిరంతరమైన జిజ్ఞాస ఆరంభమైంది క్రొత్త ప్రభుత్వానికి. ఎక్కడ్నుంచి ఎక్కడికో అనేక డిపార్ట్‌మెంట్స్‌కు ట్రాన్స్‌ఫర్ అయిన తబరుడు చివరకి మున్సిపాలిటి నౌకరోడని తీర్మానించబడింది. మూడిగెరె మున్సిపాలిటీలో నౌకరు అని తీర్మానించబడి, ఆ పదవిలోని సమవస్త్రాలు (యూనిఫాం) తబరుడికి చేరుకోవాలనుకొంటే అనేక సంవత్సరాలే గడిచినవి. ఇప్పుడు తబరుడు రిటైరైయ్యే వయస్సుకు చేరుకొన్నాడు. తబరుడిలోని జీవితంలో రాబోయే బుద్ధివికల్పత మీద (మెంటల్‌నెస్) ఏ మున్సూచన కనబడుతున్నది ఏదీ లేదు. తబరుడి మనస్సులో ఎన్నోసార్లు చింతలూ, ఆటంకాలు జనించినా, అతని నౌకరి పనులలోని గజిబిజిలలో ఎన్నో సమయాలలో అసంబద్ధతలు ఉన్నా, అవేవి అతని మనస్సుకు ఉన్మాదం గాకనే, మూడిగెరెలోని మున్సిపాలిటీ పరిపాలనా వైఖరినుంచే ఉద్భవించి వస్తుండేవి.

తబరుడికి రిటైరయ్యే చివరి రోజులలో కాఫి డిపో వద్ద కాఫిగింజల మీద పన్ను (ట్యాక్స్)ను వసూలు చేసే ఉద్యోగానికి మార్చారు.

స్వాతంత్ర్యం వచ్చి ఇరవై ఐదు సంవత్సరాలు అయ్యింది. గాంధి కేవలం జ్ఞాపకాలలోకి నెట్టబడ్డాడు.

తబరుడు పన్నులను వసూలుచేసే డ్యూటీకి జాయిన్ అయ్యే రోజే కాఫీగింజల డిపో మేనేజర్ కాఫీగింజల్ని ఇక్కడినుంచి బయటకు పంపుతున్నందుచేత ఈ గింజల్ని

"ఎక్స్‌పోర్ట్" అని పరిగణించి పన్నునుంచి మినహాయింపు ఇవ్వాలని వాదం చేసాడు. ఆ మినహాయింపు ఉందోలేదో, అది సరైనదో కాదో అని డిపోమేనేజర్‌కు మున్సిపాలిటీ వాళ్ళకు వివాదం ఆరంభమైంది.

ఈ మధ్యలో పట్టణంలో కాఫి పుడిని అమ్మే వ్యాపారైన రామణ్ణ కాఫీ గింజల్ని డిపోలో ఒకసారికొని త్రెచ్చేటప్పుడు, మరలా వాట్ని పుడిచేసి అమ్మేటప్పుడూ రెండు సందర్భాలలోనూ తననుంచి డబుల్‌గా ట్యాక్స్ కట్టించుకొంటున్నారని ఆక్షేపణను చేయసాగాడు. కాఫి గింజల్ని పండించే తోటల యజమానులు ట్యాక్స్‌ను (ఎగ్రికల్చర్ ట్యాక్స్) కట్టేది లేదని విరోధించసాగారు. తబరుడు ఈ విరోధాల మూలాన ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. గాంధి చనిపోయినా అతడి ఉద్యమం నిరంతరంగా ముందుకే పోతున్నట్లుగా తబరుడికి అన్పించింది. తబరుడు ఈ వాగ్వాదాల నడుమ ఒకరిద్దరు రైతులకు వ్యాపారులకు రసీదుల్ని రాసాడు. అయితే ఆ రైతులు, వ్యాపారస్తులు డబుల్ ట్యాక్సేషన్ వివాదం మూలాన ట్యాక్స్‌ను కట్టేదిలేదని చెప్పారు.

మున్సిపాలిటీ ఛైర్మన్ తబరుడితో, 'నువ్వు పన్ను వసూలు చేయలేకపోతే రసీదుల్ని ఎందుకు రాసావు? నువ్వే నీ జీతం నుంచే ఆ మొత్తాన్ని చెల్లించు" అంటూ అతనికి జుల్మానా విధించాడు. తబరుడి జీతంలోని అరవై రూపాయలనుంచే అతను రాసిన ఆ రసీదుల డబ్బు మొత్తం మూడు వందల అరవై రూపాయలను కట్టాల్సియుంది. తనకు కష్టాల్ని కలిగించిన తన చేతినే అతను శపించుకోసాగాడు.

తబరుడి భార్యైన అప్పమ్మ తన మొగుడు రిటైరయ్యే వేళకు రోజునుంచి రోజుకు కృశించసాగింది. తబరుడేమో "పాపం పిల్లలు కలగలేదనే చింతతో రోజురోజుకూ కృశిస్తుందేమో... ఆమెదేమి తప్పులేదు... ముఖ్యంగా చెప్పుకోవాలనుకొంటే దేవుడు వరమీయలేదు మాకు... దానికన్నా ముఖ్యంగా నాకూ పిల్లలు కలగాలి అనే దాంట్లో దేవుడు నా నుదుటన రాయలేదు" అని చుట్టుప్రక్కల ఉన్నోళ్ళతో చెప్పుకొంటుండేవాడు.

అప్పమ్మకు గిట్టని వాళ్ళెవరో మందుబెట్టియుంటారని తబరుడి బుర్రలో ఎవరో ఇంకొక అనుమానాన్ని నాటారు. తబరుడు ఆమెకు నానావిధాలైన పరీక్షల్ని చేయించాడు. ఆమె మూత్రంలో పనస గింజల్ని నానబెట్టించి, వాట్ని అరగదీసి, దాన్నే లేపనంగా వాడమని ఆమెకు ఇచ్చాడు. ఇలాగున ఎన్నో నాటు వైద్యాల్ని చేసినా ఏమి ప్రయోజనం కలగలేదు. చివర్లో తన దగ్గరున్న డబ్బునంతా నాటుమందును ఇచ్చే జుబేదా బీబికి ఇచ్చి అప్పమ్మకు ఔషధాన్ని తయారుచేయించాడు.



జుబేదా బీబి వాంతులకని ఏదో భస్మాన్ని ఇచ్చి, అప్పమ్మ వాంతులు చేసుకొన్నప్పుడు ఆ వాంతిలో ఎంతటిదాన్నో కెలికి, ఇదే రహస్యం అని చూపెట్టింది. ఏమేమో చూర్ణాల్ని, భస్మాల్ని ఇచ్చి "వీట్ని నీ భార్యకు తినిపించు... నీ భార్య ముఖం ఇక నాలుగు రోజులకే ఎలాగున నవనవకాంతులతో ఉంటదో చూడు" అని చెప్పింది. అప్పమ్మ ముఖం ఈ బీబి చమత్కారపు మాటలకు నిజంగానే ఎరుపెక్కింది. అయితే ఆ చూర్ణాలు తినేది అయిపోయినా అప్పమ్మలో మాత్రం ఏ ఫలితమూ కానరాలేదు.

తబరుడు తన పత్నికి అంటిన రోగం మీద రోగనిర్ధారణకు ప్రయోగాల్ని చేయించుతున్నప్పుడు మూత్రంకు నల్లచీమలు ముట్టుకొన్నదాన్ని గమనించి, ఏదో మూత్రదోషం ఆమెకు ఉండొచ్చని భావించుకొన్నాడు.

తబరుడిలో ఇప్పుడు తను తన అర్ధాంగిని ఇంతగా ప్రేమించుతున్నానా? అనే ఆశ్చర్యం పుట్టసాగింది. ఆమెకు జబ్బు అంటుకోక మునుపు ఈ విషయం (ప్రీతించే) తబరుడిలో గుర్తుకాలేదు కదా!

తబర డాక్టర్ డి'సిల్వా గారి దగ్గరకు అప్పమ్మను తీసుకెళ్ళాడు. సిల్వాగారు ఆమెకు డయాబెటీస్ (చక్కెరరోగం) ఉండొచ్చేమోనని అనుమానించాడు. కొన్ని పరీక్షలు చేసిన తర్వాత వారి అనుమానం నిజమే అయ్యింది.

"ఇదేంటయ్యా ... శ్రీమంతులకు వచ్చే రోగం ఇది. రాజమహారాజులకే గాక, మనకాలంలో ఒకరిద్దరు బ్రిటిష్ దొరలకు వచ్చింది ఈ రోగం. నీ భార్యకు ఎందుకు అంటుకొంది ఈ రోగం? నీకూ శ్రీమంతుడైయ్యే యోగం ఉందేమో!" అని వినోదంగా మాట్లాడుతూ నాలుగు రకాల మాత్రల్ని రాసి ఇచ్చాడు. రోగం ఇంకా ఎక్కువైతే ఇంజెక్షన్లను తీసుకోవాల్సివస్తదని చెప్పాడు.

తబరుడు భార్యతో "చూడవే... రాజులకు, రాణులకు వచ్చే రోగం నీకు అంటుకొందట. తెల్ల దొరల పదవి దొరకకపోయినా, వాళ్ళకు వచ్చే రోగం అయినా నీకు వచ్చింది కదా...! అదే సంతోషం" అని అన్నాడు.

సిల్వగారు తబురుడు చేరి ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి లార్డ్ మౌంట్‌బాటెన్ వరకూ... ఆయా తెల్ల దొరలకు అంటిన చక్కెర రోగం నుంచి.... వాళ్ళు పరిపాలించిన ఆ కాలంలోని దర్బారు వరకూ అన్నిట్నీ ఎంతో సమయం వరకూ ముచ్చటించుకొన్నారు. అప్పమ్మకు ఆ గతకాలపు చరిత్రలోని మాటలు ఏమిటి అనేవి తెల్వలేదు.

ఆ మీదట తబరుడులో "ఈ రోగం నుంచి డబ్బు వచ్చేది ఉండనీ... ఉన్న డబ్బూ కరిగిపోయి భిక్షను వేడుకొనే గతి పట్టింది కదా!" అంటూ ఆశ్చర్యపడ్డాడు. మూడిగెరె మున్సిపాలిటీకి ప్రజాపాలన కాలావధి ముగిసిపోయి, ఎన్నికైన మండలి విసర్జించబడింది. మరలా నూతనంగా ఎలక్షన్లను జరపాల్సి ఉంది. మున్సిపాలిటీ భాధ్యతల్ని తహశీల్దారుకు అప్పగించింది ప్రభుత్వం.

తనే రాసిన రెండు మూడు రసీదుల డబ్బును జమచేయనందుకు తక్షణమే ఈ డబ్బును కట్టాలని లేని యెడల జీతంను ఆపేస్తామని తాలూకాఫీసునుంచి తబరుడికి నోటీస్ అందింది. తబరుడు తహశీల్దారు వద్దకు వెళ్ళి జరిగిందంతా చెప్పుకొన్నాడు. తహశీల్దారు తబరుడి ఘోషంతా విని, తను ఇంతకుముందే ఆ రశీదుల డబ్బును తబరుడే వసూలు చేయాల్సిన డబ్బు అని, తబరుడే ఆ డబ్బును వేరొక రీతిలో దుర్వినియోగపరుచుకొన్నాడని ఫైల్‌లో రాసిందాన్ని చెప్పాడు. ఇప్పుడు ఖచ్చితంగా తబరుడే మూడొందల అరవై రూపాయల్ని చేతి నుంచి కట్టాలనేది మాత్రం ఖచితమైపోయింది.

ఆ తహశీల్దారునుంచి అప్పుడు ఆ మాటల్ని విన్న తబరుడిలో తన జీవితకాలంలోనే మొదటిసారిగా విపరీతమైన అవమానం కలిగి బాధపడ్డాడు.తను ఆ రీతి మనిషిని కాదని, బ్రిటిషోళ్ళ పరిపాలనలో నౌకరిని చేసానని ఏ ఏ దక్ష అధికార్ల వద్ద తను పనిని చేసిన పట్టీని విప్పాడు. ఆ కాలంలో ఇలాగున క్రిందిస్థాయిలో చాకిర్ని చేసే నౌకర్ల మీద ఒకే ఒక అబద్ధపు ఆపాదనల్ని మోపేవారు కాదని, అప్పట్లో ఆ ఆఫీసర్ల లోని హుందాతనం, జబరుదస్తు, నీతి నియమాలు, క్రమశిక్షణ....మొదలైనవాట్ని ఆ తహశీల్దారు ముందు పొగిడాడు. "కావాలంటే డాక్టర్ డిసిల్వా గారిని అడగండి. ఈ ముసలోడు చెప్పేది నిజమో అబద్ధమో" అన్నాడు తబరుడు.

తహశీల్దారుకు ఈ ముసలోడి పాతకథలు అవసరం లేదు. అర్జీకాలంలు; రుజువులు; క్వారీస్; నోటీసులు... ఇత్యాదివన్నీ ఆ తహశీల్దారులోని అన్ని అవయవాలకూ, గ్రహణశక్తికీ వ్యాపించియున్నవి. ఏ అర్జీలోని ఏఏ కాలంలకు నింపేందుకు కుదరని ఈ ముసలోడి జ్ఞాపకాలు ఎవరికి కావాలి? బ్రిటీషోళ్ల పరిపాలనను పొగుడుతూ తనకు తెల్వనట్లుగానే ప్రస్తుతంలోని ఈ నల్లదొరల పాలనను బేరీజులోకి తెచ్చుకొన్నాడు తబరుడు.

తహశీల్దారు ఏమి చేసాడో ఏమో.... మొత్తంగానైతే తబరుడి నెలజీతాన్ని ఆపేసాడు.

తబరుడి వద్ద డబ్బులేదు. భార్యకు మందు ఇప్పించేందుకూ డబ్బు లేదు. ఎక్కడో ఎవరివద్దో కాళ్ళా వేళ్ళాపడి డబ్బు సమకూర్చుకొని భార్యకు రాగిసంకటిని ఏర్పాటుచేసుకొన్నాడు.



పెన్షన్ ఇస్తారేమో అడిగిచూడు అని ఎవరో చెప్తే తబరుడు తహశీల్దారు వద్దకు మరలా వెళ్ళాడు. "అప్లికేషన్ ఇవ్వు... పైకి పంపిస్తాను" అని చెప్పి మరో మాటను పలకకనే ఫైళ్ళలో మునిగిపోయాడు.

మున్సిపాలిటీకి ఎలెక్షన్లు దగ్గరపడుతుంటే పోటీకి నిలిచిన అభ్యర్థులు ప్రజల వద్దకు తిరగసాగారు. వాళ్ళలో ఒకడైన బంటప్ప "నీకెందుకు పెన్షన్ లేదు... రా చూసి వద్దాం.. గవర్నమెంట్ మీద కేసు వేద్దాం" అని తబరుడితో అంటున్న అతనికి అంతో ఇంతో సమాజసేవ చేసేందుకు తబరుడి మూలకంగానే ఒక అవకాశం ఒదిగి వచ్చింది.

బంటప్పతో కల్సి తహశీల్దారు వద్దకు తబరుడు వెళ్ళినప్పుడు "తబరుడు ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్‌కు చేరినోడో, పెన్షన్ స్కీమ్‌కు చేరినోడో అనేది స్పష్టం కాలేదు... అందుచేత పై వాళ్ళకు రాస్తాను" అని తహశీల్దారు చెప్పాడు.

తబరుడితో అన్ని లెక్కల్ని కట్టి ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్‌కు చేరినట్లైతే సుమారుగా ఆరేడు వేలరూపాయలు వస్తవని బంటప్ప చెప్పాడు. బంటప్ప నుంచి వచ్చిన మాటలు తబరుడిలో సంతోషాన్ని కలిగించినవి. తన భార్యకు వచ్చిన రోగం నిజంగానే రాజరోగమే అయ్యుండొచ్చు. ఎందుకంటే డబ్బు వచ్చే యోగం కనబడుతుంది కదా అని అనుకొన్నాడు. తొందరగా డబ్బువస్తే "మంచి ఔషధాల్ని ఇప్పించి భార్య రోగాన్నైనా బాగు చేయించుకోవచ్చనే ఆశ" మిణుకుమిణుకుగా ప్రజ్వరిల్లసాగింది.

తబరుడు తనకు ఫించెన్ డబ్బు వస్తదని ఎవరెవరి దగ్గరో చేబదుళ్ళను చేసి, రోజూ తాలూకాఫీసు వద్ద వేచి చూడసాగాడు. అప్పమ్మ స్థితి నిదానంగా పాడైపోసాగింది. తబరుడు మొదట్లో తన భార్యకు మూత్రం నుంచి చక్కెర పోతుంటే దండగేంటి? ఆమె మొదలే చక్కెర రోగి. చక్కెరపోతే మంచిదే కదా అని అనుకొంటూ ఉపేక్షించాడు ఆమె రోగాన్ని. ఇప్పుడు అప్పమ్మ మంచాన బడే స్థితికి జారింది.

అప్పమ్మ ఏవో పనులను చేస్తూ తూలిపడి కాలి బొటనవ్రేలుకు గాయాన్ని చేసుకొంది. తబరుడు ఇంటికి వచ్చినప్పుడు ఏదో ఆకుపసరును రాసుకొని, కట్టు కట్టుకొని కుంటుతూ నడుస్తుంది. ఆ రోజు తబరుడు సంతోషంలో ఉన్నాడు. తాలూకాఫీసులోని గుమాస్తా "పైకి పంపిన లెటర్‌కు జబాబు వచ్చిందని పదిహేడు వేల రూపాయల ప్రావిడెంట్‌ఫండ్ రావొచ్చు"ని చెప్పాడు.

తహశీల్దారు తబరుడితో అతను బ్రిటీషోళ్ళ జమానాలో ఏయే డిపార్ట్‌మెంట్స్‌లో నౌకర్ని చేసిన దానికి సరైనదాఖలాల్ని తీసుకొనిరా అని చెప్పాడు. ఆ పనిలోని భీకరత్వాన్ని

తెలవని తబరుడు తనకు రాబోయే పదిహేడు వేల రూపాయలను గుర్తుకు తెచ్చుకొంటూ ఉప్పొంగిపోయాడు.

అర్ధాంగితో ఇందంతట్నీ సవిస్తారంగా చెప్తూ "డా॥డి'సిల్వా గారు అదేంతటిదో ఇంజెక్షన్ ఇప్పించితే నీ జబ్బు చిటికె వేసేలోపే నయమౌతుదని చెప్పారు కదా... చూడవే నీ నసీబులో ఏముందో" ప్రీతిగా అంటూ ఆ పదిహేడువేల రూపాయల్ని నెమరేసుకొంటూ ఉప్పొంగాడు.

"స్వామి.... ఒక సర్టిఫికెట్ ఇవ్వండి. నా డబ్బు గవర్నమెంట్ దగ్గర ఉంది. అన్నం లేదు. ఇంటిది మంచాన పడింది" అని తన కష్టాలను చెప్పుకొని తను వెనుకటి కాలంలో డ్యూటీ చేసిన కార్యాలయాలన్నింట్నీ సందర్శించాడు. ఒకొక రుజువు, సర్టిఫికెట్లతో తబరుడి ఫైల్ "బిల్డ్ అప్" అవసాగింది. వెళ్ళి సంపర్కించిన అన్ని కార్యాలయాలలో కూడా తన గతకాలంలోని వైభవాలను, ఆ తెల్లదొరల పాలనలో నీతిని పొగుడుతుండేవాడు. ప్రతియొక్కరు అతడి మాటల్ని అత్యంతగా సానుభూతితోనే వింటుండేవారు. "ఆ కాలం (ఆ రోజులు) అలాగున ఉండేదా?" అంటూ అందరూ నిట్టూర్పులను వదిలేవారు.

పురసభ ఎలెక్షన్‌లో కౌన్సిలర్‌గా నిలబడిన బంటప్ప డబ్బు వచ్చేది తబరుడికి ఆలశ్యం అయితే అతని చార్జీలను తనే పెట్టుకొని బెంగుళూరు వెళ్ళి మంత్రిగారి వద్ద చెప్పుకొని వద్దాం... రా, రమ్మని అడిగాడు. తబరుడిలో తను బెంగుళూరుకు వెళ్తే, అప్పమ్మకు గంజి కాసిపోసేవాళ్ళు ఎవరు అనేది ఒక సమస్యగా అయ్యింది. ఎందుకంటే అప్పమ్మ కాలివేలుకు తగిలిన గాయం మానక ఇప్పుడామె లేచి తిరిగే స్థితిలో లేదు. ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను మోసుకెళ్ళినప్పుడు, ఆ డాక్టర్లు ఆమె కాలి బొటనవ్రేలుకు గ్యాంగ్రిన్ అయ్యింది, దాన్ని కత్తిరించి తీసేయాలని చెప్పారు.

ఆ మాటల్ని విన్న తబరుడు ఎగిరి పడ్డాడు. "వీళ్ళ ఇళ్ళు పాడుబడిపోనీ... ఒక వ్రేలుకు గాయం అయినదంటే కాలునే కత్తిరించివేస్తామని అంటున్నారు కదా.... తలకు దెబ్బ తగిల్తే గొంతునే కత్తిరించినట్లుగా ఉంది వీరి మాటలు" అని అనుకొంటూ ఆయుర్వేద వైద్య పండితుల వద్ద దీనికేమైనా ఔషధం ఉందేమో చూద్దాం అని అప్పమ్మను తిరిగి ఇంటికి తీసుకొచ్చాడు.

తబరుడి ఫైల్ పూర్తయ్యే లెవెల్‌కు వచ్చింది. అతను తిరిగే విధానాన్ని, శ్రద్ధను చూసిన ఆ తాలూకా ఆఫీసులోని జవానులు, గుమాస్తాలు "ఈ ముసిలోడికి తల చెడింది... ధన పిశాచం పూనుకొంది" అంటూ మాట్లాడుకోసాగారు.



తబరుడు మూడిగెరెలోని వడ్డీ వ్యాపారస్థుడైన సుబ్బుశెట్టి దగ్గరకు ఒకసారి వెళ్ళి "నాకు ప్రభుత్వం నుంచి డబ్బు వచ్చేది ఉంది. దయచూపి ఆ వచ్చే డబ్బు ఆధారం మీద కొద్దిగా డబ్బు ఇవ్వండి. భార్యకు అనారోగ్యం ఉంది" అని విన్నవించుకొన్నాడు. ఆ విన్నపాన్ని విన్న సుబ్బుశెట్టి "అయ్యో... గవర్నమెంట్ డబ్బూ, స్మశానంలోని శవం రెండూ ఒకటే... నీ భార్యను వదిలేయి... నువ్వు చచ్చే మునుపే ఆ డబ్బు వస్తదేమో చూడు" అని శకునం చెప్పినట్లుగా తబరుడికి చెప్పి, అతని నీరసముఖాన్ని చూడలేక "పోతేపోనీ" అంటూ నాలుగు రూపాయల్ని ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. ఆ నాలుగురూపాయలకు చేతిని చాచి దొరికిందాన్ని తీసుకొందామనే లోభం తబరుడిలో లేదు.

'దేవుని మీద ఒట్టు. నేను బీడీలకని భిక్షను అడిగేందుకు రాలేదు. నాలుగు రూపాయలను తీసుకొని నేనేమి చేసుకొనేది చెప్పండి. పెద్ద మనస్సు ఉంటే ఇవ్వండి" అంటూ వెనుదిరిగిపోయాడు. తబరుడికి ఆ శెట్టినుంచి వచ్చిన మాటలలో ఏదో సత్యం ఉందనేది అర్థమైంది. ఫైల్‌కు జతగా భార్యకు కలిగిన పుండు ఒక పందెంగా కనబడింది. బొటనవ్రేలుకు అంటిన పుండు పాదాన్నంతా వ్యాపించుకోగా అప్పమ్మ బాధతో విలవిలలాడుతుంది.

తహశీల్దారు తబరుడితో ఫైల్‌ను తనపైనున్న ఆఫీసుకు పంపానని చెప్పాడు. మరల మూడోరోజున తబరుడు వెళ్ళినప్పుడు తహశీల్దారు రేగిపోతూ "మూడురోజుల క్రితమే పంపిన ఫైల్, ఈ రోజున తిరిగివచ్చేందుకు ఆ ఫైల్ ఇక్కడే ఈ ఆఫీసుకు వెనకున్న గదికి పంపించానని అనుకొంటున్నావా? బెంగళూరు వరకూ ఆ ఫైల్ వెళ్ళి రావాల్సియుంటది" అని కటువుగా పలికాడు.

"అయ్యిందేదో అయ్యింది... బెంగుళూరుకు వెళ్ళివద్దాం... నువ్వొక నయాపైసా ఖర్చు చేయొద్దు... నేనే ఖర్చుల్ని పెట్టుకుంటా.. నేను చేసే ఉపకారానికి బదులుగా మీ వీధిలో ఉండే ఓట్లును నాకు వేయించితే చాలు" అని అన్నాడు బంటప్ప తబరుడితో.

తబరుడు ఊరును వదిలి వెళ్తే, అప్పమ్మకు గంజిని కాసేవాళ్లు ఎవరూ లేరు. బెంగుళూరు వెళ్ళేందుకు ముందస్తు ఏర్పాట్లు అన్నట్లుగా జిల్లాకేంద్రమైన చిక్కమగళూరికి వెళ్ళి ఫైల్ ఎక్కడివరకూ వచ్చిందనేది చూసి వద్దాం అని బంటప్ప, తబరుడు నిశ్చయించుకొన్నారు.

తబరుడు, బంటప్ప చిక్‌మగళూరు లోని కలెక్టర్ ఆఫీసుకు వెళ్ళారు. తబరుడి ఫైల్‌లోని వివరాల్ని ఆ ఇద్దరూ అడుగుతుంటే, ఆ గుమాస్తా "మీరెందుకు ఇక్కడికి

వచ్చారు. ఫైళ్ళన్నీ 'థ్రూ ది ప్రాపర్ చానెల్' లోనే రావాలి " అని అరిచాడు. "నడవండి బయటికి" అంటూ జవాను నెట్టేసాడు ఆ ఇద్దర్నీ.

వాళ్ళిద్దరూ ఆ కలక్టేట్ ఆఫీస్ నుంచి బయటకు పోదామని అనుకొంటుంటే ఆ ముఖ్య గుమాస్తా (హెడ్‌క్లర్క్) జవానును పంపి తబరుడు నొక్కడ్నే పిలిపించుకొని "బంటప్పలాంటి రాజకీయాలోడ్ని వెంటేసుకొని తిరగొద్దని, డబ్బు వ్యవహారమైనందున ఎంతో జాగ్రత్తతో ఉండాలని, ఇరవై ఐదో సంవత్సరంలోని స్వాతంత్ర్యదినాచరణ ఉత్సవం ఉన్నందున ఫైల్ బెంగళూరుకు వెళ్ళేది ఆలశ్యం కావొచ్చని చెప్తూ తబరుడి వెన్నుమీద ఆప్యాయంగా తట్టాడు.

బంటప్పతో కల్సి తబరుడు ఊరికి తిరిగివచ్చినప్పుడు, ఆ ఇంట్లోని మసక మసక చీకట్లలో అతని భార్య గొల్లు గొల్లున ఏడుస్తూ, "విషాన్ని మ్రింగి ప్రాణాన్ని వదుల్తాను" అని అంది. తబరుడు ఆమె ఏడుపుకు కంగారైయ్యాడు. "ఇంకేంటి.... మన ఫైల్ పాసై డబ్బు వస్తదని, ఎంత డబ్బు ఖర్చైనా పర్వాలేదు... బెంగళూరుకు తీసుకెళ్ళి జబ్బును నయం చేపిస్తాను" అని చెప్తూ ఆమెను సంతోషపరిచేందుకు ప్రయత్నించాడు.

మరుసటిరోజున తబరుడు, బంటప్ప.... ఆ ఇద్దరూ చేరి అప్పమ్మను ఆస్పత్రికి మోసుకెళ్ళారు. డాక్టర్ అప్పమ్మ కాలును చూసిన తక్షణమే ఆమెను సకలేశపురంలోని పెద్దాసుపత్రికి తీసుకెళ్ళమని, ఆమె కాలును తక్షణమే మోకాలు చిప్పవరకు కత్తిరించి తీసేయకపోతే ఆమె ఇక ముందు బతికేది లేదని చెప్పారు. దిగ్భ్రాంతుడైన తబరుడు అప్పమ్మను వాపస్సుగా తీసుకొని వస్తున్నప్పుడు తహశీల్దారు వద్ద పనిచేస్తుండే జవానైన జవరయ్య కల్సి, "నీ ఫైల్ వచ్చింది.. నీకు చెప్పి రమ్మని తహశీల్దారు నన్ను పంపించాడు" అని తెలిపాడు.

అప్పమ్మను బతికించుకోవాలనే ఏదో క్షీణమైన ఆశొకటి తబరుడ్ని తహశీల్దారు వద్దకు వెళ్ళేటట్లు చేసింది. తబరుడి ఫైల్ చిక్‌మగళూరు నుంచి తిరిగి వచ్చిందని ఎవడో గుమాస్తా ఏదో ఒక క్వ్యారీని వేసి వెనక్కి పంపాడని, కరణం – పటేల్ ఆ ఇద్దర్నుంచి తబరుడు తమ గ్రామానికే చెందినోడు అనేటట్లుగా (ఆ ఇద్దర్నుంచి) చెరొక సర్టిఫికెట్ కావాలని ఆ గుమాస్తా ఆ ఫైల్‌లో రాసాడు...." అని తహశీల్దారు తబరుడితో చెప్పాడు.

దుఃఖంతో తబరుడు ఇంటికి చేరుకోగా, అతని భార్య "నొప్పిని సహించు కోలేకపోతున్నా.. మందు గిందు ఏమివద్దు.... నాలుగు అణాల ఎలుకల నివారణ మందును తీసుకురండి" అని అరిచింది. అతి క్రూరమైన వ్యంగ్యం ఏమిటంటే తబరుడి దగ్గర ఆ నాలుగు అణాలు లేనేలేవు కదా...!



తబరుడిలో 'ఛి... ఛీ.. ఆ తెల్లదొరల కాలలో జీవితం ఎంత బంగారంగా ఉండేది. ఉన్న పళంగా ఉండేందుకు ఇళ్ళ స్థలాన్ని మంజూరు చేసారు. ఎంతో మధురమైన హృదయాల్ని కలిగినోళ్ళు ఆ దొరలు. ఖుషీ కలిగితే మొత్తం కార్యాలయంలోని సిబ్బందికి ఇనామ్ ఇస్తుండేవారు కదా!" అంటూ ఆ బ్రిటిష్ దొరల కాలాన్ని గుర్తుకు తెచ్చుకోసాగాడు. "ఆ కాలంలోని రోజులు మనోళ్ళ పరిపాలన కన్నా నిజంగా స్వచ్ఛంగా ఉండేది.. కంత్రీ వెధవలు.. దేశాన్ని పాలిస్తారంట... ఇచ్చేది తెల్వదు.... పుచ్చుకొనేది తెల్వదు.... రికార్డ్లు కావాలంట.... సర్టిఫికెట్లు కావాలంట" అంటూ స్వదేశీ పరిపాలనను తిట్టసాగాడు.

ఫైల్ పైనుంచి క్రిందకు, క్రిందనుంచి పైకి తిరగసాగింది. ఇలాగున అనేక రోజులు గడ్చినవి. నిదానంగా సుబ్బుశెట్టి చెప్పిన మాటల్లోని సత్యం తబరుడి అనుభవంలోకి వచ్చింది. భార్యను బతికించుకొనే ఆశె, డబ్బు దొరుకుతుందనే ఆశెతో జతగూడి కరిగిపోయింది.

కొన్ని రోజుల తర్వాత ఉదయాన తహశీల్దారు తబరుడ్ని రమ్మని కబురంపాడు. తబరుడు వెళ్ళగా, ఆ తహశీల్దారు ముఖం ఏదో అనంతమైన యాతనలో చిక్కుకొన్నట్లుగా కనబడసాగింది. అతడి కంఠం బొంగురుపోయి "నీ గురించి పోలీస్ రిపోర్టు అడిగారు. నువ్వు ఆ నక్సలైటోడైన బంటప్పను జతగా చేసుకొని చిక్‌మగళూరు కలెక్టర్ ఆఫీసులో ఏదో గొడవ చేశావట" అంటూ తిట్టసాగాడు. చివరిగా "నీ కష్టాల్ని చూస్తుంటే నాకూ కనికరమే కలుగుతుంది. దేవుడు ఇంతగా కష్టాల్ని కలిగించినా, నీకు బుద్ధే రాలేదు. ఈ రోజున నేను ఒక ప్రిఫరబుల్ రిపోర్ట్‌ను రాస్తాను. ఇరవై ఐదో స్వాతంత్ర్య దినాచరణలోని రజితోత్సవాలకు నీనుంచి డబ్బు ఇచ్చేది ఉంది" అని అన్నాడు. తబరుడి ముఖంలో మందహాసం కన్పించింది."నాకు వచ్చే డబ్బునంతట్నీ ఆ ఉత్సవంకు దానంగా తీసేసుకోండి స్వామి" అని అన్నాడు. తహశీల్దారుకు తబరుడి నుంచి వచ్చిన ఈ జవాబులో (వాక్యంలో) ఏదో అస్వాభావికత్వం (మర్మం) ఉందని తెలుసుకొన్నాడు.

మానవులే సంఘజీవనంలో పోలీసులులాగ, ఆఫీస్ సిబ్బందిలాగ, కరణాలు – పటేళ్ళలాగ, జవానులు లాగ ... ఇలా నానా రకాలుగా విభజించుకోబడి, తామే ఎంతెంతటి వోగా గీచిన (నోట్సు రాసిన) ఫైళ్ళను అంతరాత్మలు లాగ సంరక్షిస్తూ, ఒక నిర్దయతో ఉండే అర్థహీనమైన వ్యూహంలోని జాణతనం నిదానంగా తబరుడికి కనబడసాగింది. బక్కచిక్కిన, చితికిపోయిన, దిగువస్థాయిలో ఉండే మానవుల మానవీయతను కరకరా నమిలి, మింగేస్తూ ఉండే ఒక సైతాన్ వ్యూహం కనబడింది అతనికి. మనిషిని చంపి, ఎండుచేపలాగ ఎండబెట్టి, ఫైళ్ళ లోపల మడిచిపెట్టి, దెయ్యం లాగ నిలిచిన తహశీల్దారు,

ఆయా ఫైళ్ళను పట్టుకొంటూ ఎంతెంతటివో సంజ్ఞెలను, సైన్‌లను చేస్తుండేవాడు. నుగ్గు నుగ్గె, పుడిపుడిగా మారిన జీవాత్మలు (రిటైరైనోళ్ళు) డెస్క్ నుంచి డెస్క్‌కు బిగించి కట్టిన ఫైళ్లలోపలే సాగిపోతుండేవి కదా...!

ఈ రీతిలో ఉన్న రౌరవ నరకంలోని కార్ఖానాను చూసిన తబరుడి కళ్ళనుంచి తట తటా (జలజలా) నీరు కారసాగింది. తన కోసమని, తన భార్య కోసమని, తనంతటి జీవిగానే ఉండే తహశీల్దారు కోసమని, తన స్థాయిలోనే ఉండేటి జవానైన జవరయ్య కోసమని అతనిలో దుఃఖం పెల్లుబికి వచ్చింది.

జవాను తబరుడి చేతిని పట్టుకొని మెల్లగా బయటకు వెంటబెట్టుకొని వదిలిపెట్టాడు. తబరుడిలో బుద్ధి తేలికబడేందుకు ఎంతో సమయం పట్టింది. జవాను జవరయ్య అతడ్ని బయట వదిలిపెట్టినప్పుడు ఉన్న భంగిమలోనే ఎంతోసేపు అలాగునే ఉండిపోయాడు తబరుడు.

తబరుడు ఎలాగో భార్యను సకలేశపురంలోని సర్కారి ఆసుపత్రికి మోసుకెళ్ళినప్పుడు, అక్కడున్న సిబ్బంది తబరుడితో రిటైర్డ్ గవర్నమెంట్ నౌకరోడనే సర్టిఫికెట్ తీసుకురావాలని, మున్సిపాలిటీ నౌకరోడు కూడా గవర్నమెంట్‌కు చెందిన ఉద్యోగి ఔనో, కాదో అనే స్పష్టతతో ఉన్న జి.ఓ.ను తీసుకురావాలని చెప్పారు.

ఏమి చేసేదిలేక తబరుడు తన భార్యను మరలా తన ఊరికే తీసుకొని వస్తున్నప్పుడు, అప్పమ్మకు నొప్పి, బాధల నుంచి మూర్ఛ రావడం జరిగింది. నోటినుంచి నురుగు వస్తుంది.

తబర వేటమాంసంను అమ్మే షాప్ వద్దకు వెళ్ళి, కటికోడైన యూసఫ్‌తో "నా భార్య కాలును మోకాలు వరకూ నరికి ఇవ్వగలవా?" అని అడిగాడు.

నరికిపెట్టిన మూడునాలుగు మేకపొట్టేళ్ళ తలలు ఆకాశం వైపుకు ఒక విధమైన భయంకర ఖాళి చూపుల్నే చూస్తున్నట్లుగా ఆ తలలు ఆ విధంలో కనబడసాగావి.

"ఏమిటీ... నీ భార్య కాలును కత్తిరించి చారును (పులుసును) చేసుకొంటావా?" అంటూ యూసఫ్ కిసుక్కున నవ్వాడు. అక్కడున్న ఐదారుగురు 'హె హ్హె హ్హె' అంటూ యూసఫ్‌కు జతగా నవ్వారు.

పారేసిన జంతువుల వ్యర్థమాంసాన్ని తిని కొవ్వు పట్టిన కుక్కొకటి లటలట అంటూ ఒక మూలిగను కొరుకుతుంది. వ్రేలాడదీసిన పొటేల్ మాంసం ఎర్రగా మిరమిరా



మెరుస్తుంది. మరొకచోట పొట్ట పేగులు మరితరవాట్ని పెట్టుకొని అమ్ముతున్న ఒక బక్కచిక్కిన బాలిక వాటిమీద ముసిరిన ఈగల్ని పారదోలేందుకని శతపథంగా ప్రయత్నిస్తుంది. ఒక మురికి బట్టను అటుఇటు ఊపుతుంది.

తబరుడిలో అప్పటికప్పుడే ఒక అనుమానం పుట్టి, తనెప్పుడో తీరికొనిపోయి (చనిపోయి) ప్రేతప్రపంచం అనే ఒకదాంట్లో వ్యవహరిస్తున్నానని అతనిలో కలిగింది.

భార్య చనిపోయినప్పుడు తబరుడు నవ్వుతున్నాడట. మూడిగెరెలోని జనం తబరుడికి పిచ్చి పట్టిందనేది నిర్ణయించుకొనేందుకు ఆతృతను చెందసాగారు. ఎందుకంటే, ఆ తర్వాత అతని సమస్యలు వేరొక ప్రపంచానికి చేరుతవి అనేది ఆ పురజనంకు ఉండేటి భావనగా ఉంది.

ఎక్కడో కొంతమందికి మాత్రం అతడ్ని చూసినప్పుడు మన వ్యవస్థలోని భీకరమైన విరాట్ రూపం మెరుస్తుండగా, ఏదో తెలియని భీతితో ఆ చూసినోళ్ళు గడగడా వణుకుతుండేవాళ్ళు.

స్వాతంత్ర్యోత్సవంలోని రజితపండుగ సమయాన తబరుడికి పిచ్చి పట్టుకొంది కేవలం ఒక ఆకస్మిక ఘటనగానే అని అనుకొంటూ అందరూ గుంపుగా చేరి స్వాతంత్ర్యాన్ని పొగిడి ప్రసంగాల్ని చేస్తుంటే, తబరుడు వెనకటి బ్రిటీషోళ్ళ పాలననే పొగుడుతుండగా, అక్కడ ఆ ఉత్సవం దగ్గర ఉన్నోళ్ళంతా తబరుడిలోని పిచ్చి మాటలను (నిజాల్ని) చూసి నవ్వారు.

తబరుడికి పిచ్చి పట్టిందని విన్నప్పుడు తహశీల్దారు గారు మరింతగా చింతాక్రాంతుడైయ్యాడు. తబరుడు డ్యూటీలో రిటైరైయ్యే ముందు, అతను చివరిగా రాసిన రసీదుల బాకి మూడొందలు సర్కారి ట్రెజరీకి రావాల్సియుంది. తబరుడి నుంచి సంతకంను పెట్టించుకొని అతనికొచ్చే ప్రావిడెంట్ ఫండ్ నుంచి దాన్ని పొందుదామని అనుకొన్నాడు ఆ తహశీల్దారు. అతని నడత మీద రిపోర్ట్‌ను పంపిస్తూ, అతను బాగానే యున్నాడని అతని నుంచి రావాల్సిన ఆ రసీదుల తాలూకు మొత్తాన్ని అతను స్వంత ఉపయోగానికి ఉపయోగించుకోలేదని, మన పాలనలోని దోషం నుంచే ఆ డబ్బు జమగూడలేదని ఆ తహశీల్దారు రిపోర్ట్‌ను రాసాడు.

తబరుడికి పిచ్చిపట్టిందనేది విన్న ఆ తహశీల్దారుకూ ముమ్ముందు అతను రిటైరైతే ఆ బ్యూరోక్రసీలోని చిత్ర విచిత్ర రీతుల నుంచి పిచ్చి పట్టేది ఒక బాకీగా మిగిలిపోయింది.

- 0 -

(మూలం కన్నడ భాషలోని 'తబరన కథ', మూల రచయిత : కు.వెం.పుగారి పుత్రుడైన దివంగత పూర్ణచంద్ర తేజస్వి గారి నుంచి జాలువారిన కథ ఇది. ఒక శతాబ్ది (1987-1997)లోని అత్యుత్తమ కన్నడ కథలలో ఈ కథ చేరబడినందున అనువాదంకు స్వీకరించాను.

02-07-2006

శాఖమూరు రామగోపాల్



# "చర్మకారుడు"

"రండి... రండి, మహాస్వామి"

"సరి.... సరి, లోపాన్ని సరిగా చూడు"

"హ్హుం.... మీరు చెప్పాలా  ఆ మాటను స్వామి, కుట్టుతాలే'

"ఎంతివ్వాలో"

"ఐ.. పనిని చూసి ఇవ్వండి మహాశివా!"

"అది సరే, నువ్వే చెప్పు"

"తమ సంతోషం... పండితుడా"

"ఓయ్, ఓయ్.... ఆ చివర్న కొంచం బాగా కుట్టు మరొకసారి"

"ఒక క్షణం నిదానించండి స్వామి"

"అదిగో, అటు చూడు... ఎడం ప్రక్కన"

"హ్హుం, సరిజేసాను స్వామి"

"ఎంతివ్వాలి?"

"నేను చెప్పాను కదా... పండితుడా"

"ఏమిటోయ్"

"తమ ఇష్టమని"

"హ్హుం... సరి సరి.. పుచ్చుకో ఈ డబ్బును"

"మంచిది మహా శివాయః .... నేను అడగాలా ఈ డబ్బును?"

'నీ పేరేంటోయ్?"

"ఎందుకు స్వామి?"

"కాదులే, అడిగాను అంతే... ఉత్తిగనే"

"రాజ అండి... రాజయ్య అండి...."

❁ ❁ ❁

అప్పటికప్పుడే మెలకు వచ్చింది. భయంగా కళ్ళను తెరిచి చూసా. ప్రక్కన కమల! ముసిముసిగా నవ్వుతూ

"అదేమన్నారు"

"ఏమిటి?"

"ఔను... ఏదో అంటున్నారు?"

"ఏమిటే అలా అడుగుతున్నావు?"

"ఏమి లేదులే.. అదేంటో రాజ.... రాజ.. రాణి అంటున్నారు అంతే..."

"నీకు బుద్ధి లేదోయ్.... పడుకో సుఖంగా"

"నిజంగానే ఎవతినో పలవరిస్తున్నారండి"

"చూసావటోయ్.... ఆమెను?"

"సరిసరి. కలవరిస్తున్నారని అంటున్నానండి...."

"పోవే, పిచ్చి పిచ్చిగా మాట్లాడొద్దు..."

కమల తన సంశయాన్ని వదిలేసి నిద్రలోకి జారింది. నాకు మరలా నిద్రపట్టలేదు. బలవంతాన కళ్లను మూసుకొన్నా... సాయంత్రాన నేను కాలిజోళ్ళను కుట్టించుకొనేందుకు వెళ్ళింది తక్షణమే జ్ఞాపకాన్కి వచ్చింది. నేను వెళ్తున్నప్పుడు దార్లో చర్మకారుడొకడు పనిలేనందున తన ఘంటాన్ని గూటంమీద తట్టుతూ అదేదో వైష్ణవ దాసరి పదాల్ని పాడుకొంటున్నాడు. నన్ను చూసి నవ్వుతూ ఘంటాన్ని క్రిందపెట్టి – "రండి మహాస్వామి" అంటూ, తన పనిని ముగించి నేనిచ్చిన అర్ధఅణాకే తృప్తిచెందాడు. అదంతా జ్ఞాపకంకు వచ్చింది. ఒకసారి ప్రక్కకుతిరిగి చూసా. నా అర్ధాంగి గాఢనిద్రలో ఉన్నట్లుంది. ఎంత అందమైన ముఖం! తలెత్తి ఆమె ముఖాన్నే దిట్టించి (దీక్షగా) చూసా. నన్ను మాట్లాడించినప్పుడు ఉన్న మందహాస నగుమోము ఇకనూ ఆమెలో లాస్యమాడు తున్నట్లుగా ఉంది. కొద్దిగా దూరంగా జరిగి, తిరిగి నిద్రకని కళ్ళను మూసుకొన్నాను. అదే చిత్రం మదిలో మెలగసాగింది. ఘంటంను గూటంమీద తట్టుతున్న శబ్దాలు, చెల్లాచెదురైన జుట్టు, ఎండ వేడిమినుంచి కమిలిన రాజయ్య ముఖం! అదే, అతనిదే అయిన దరహాస ముఖం. మరలా (పునః) నన్నే చూస్తూ "రండి... మహాస్వామి" అంటున్నట్లుగా కలుగుతుంది నాలో.

రాజయ్య తనింట్లో – పాడుబడిన గుడిసెలో – నిద్రిస్తుండొచ్చేమో? అతను, అతని పెళ్ళాం, అతని పిల్లలు? ....నాలాగానే? ఛీ... ఛీ. ఏమిటీ స్వామ్యం (పోలిక)! నేనెక్కడ... అతనెక్కడ? చెప్పుల్ని కుట్టేవాడు రాజయ్య.... ఇక్కడ నేను.... నా శ్రీమతి, సొగసైన భవనం, మెత్తటి పానుపు, కోరుకొంటే కావల్సినన్ని పదార్థాలు. ఇవి ఏవి అతనికి లేవు; ఔను కదూ! అతని కర్మ. నేనెంతటి పిచ్చోడ్ని! అతను ఎవరు? నేనెవర్ని?... బీదరికం



... బీదరికం... అతడ్ని వెంటాడుతూ అతనిలో ఉంది... అతని జీవితం అదే కదా.. ఇదంతా కేవలం విధి లిఖితం. అయినా.. అయినా ... ఇదేంటిది?నా కళ్ళనుంచి నీరే! దుప్పట్ని తడుపుతుంది; ఆగేటట్లుగా లేదు కదా...!

## 2

మరుదినం ఉదయాన ఎంతో ప్రొద్దైన తర్వాత లేచాను. ఆ ప్రొద్దంతా అదెందుకో మనస్సు సమాధానస్థితిలో లేదు. ఏమి చేద్దామనుకొన్నా విసుగే ఉంది. కాలాన్ని ఎట్లా గడిపానో తెల్వలేదు. సాయంకాలంలో వీధి దీపాల్ని వెలిగించే వేళకు మరలా రాజయ్యను వెతుక్కొంటూ అదే స్థలానికి వెళ్ళాను. దూరంలో అతను కూర్చున్న దాన్ని చూసి కావాలనే చెప్పుకు ఉన్న ఒక చివరి భాగాన్ని పీకాను. పరిచిన చర్మం చూరు (ముక్క)ల నడుమ, ఒక చిరుగులు పడిన గోనె పట్టా మీద రాజయ్య ఖుషిలాగ కూర్చుని ఉన్నాడు

"రాజయ్యా" అన్నాను.

"ఆ.... ఆ... ఏమిటి, మహాస్వామి?"

"ఊడిపోయింది..."

"ఐ, ఇదేంటి పండితుడా.... నిన్ననే కదా కుట్టింది?"

"ఔను, ఈ రోజు మరలా కుట్టు..."

రాజ నా ముఖాన్ని ఒక క్షణం దిట్టించి చూసాడు. చేతిలో ఉన్న ఘంటాన్ని మెల్లగా క్రిందపెట్టి అతడి ముందు నేను విడిచిన కాలిజోడును తీసికొని వెనక్కి ముందుకు త్రిప్పి చూసి నీటిలో అద్దాడు. తలను వాల్చుకొని తొడమీద ఆ చెప్పును పెట్టుకొని కుట్టాడు. కుట్టటం అంతా అయిన మీదట –

"ఏమి ఇవ్వాలోయ్?" అన్నాను.

"ఏమి వద్దు పండితుడా?" నవ్వుతూ అన్నాడు. కొద్దిసేపు నిశ్శబ్దం. నేను మెల్లగా జేబులోకి చేతిని పెట్టి, ఒక రూపాయి బయటకు తీసాను. అతను దాన్ని చూసి ఆశ్చర్యచకితుడై నన్ను దీక్షగా చూసాడు.

"తీసుకో, రాజ (రాజయ్య)"

".........."

'ఏమి దిగులు పడబోకు, తీసుకో"

"వద్దు పండితుడా"

"ఎందుకోయ్"

"తమరు దేవుడు లాంటోరు స్వామి, తమనుంచి తీసుకొనేదుంటదా?"

"పర్వాలేదు, తీసుకో"

"ఇంతెందుకు మహాస్వామి?"

"నువ్వు తీసుకో, నేను చెపుతాను"

రాజ చేతుల్ని కట్టుకొని, దీక్షగా నా ముఖాన్నే చూసాడు. "లే.... లెగువ్, నావెనకే రా" అన్నాను. అతను లేచి భయపడినోడిలాగ ఒక అడుగు వెనకే నిలిచాడు. నాకు అర్థమైంది. "భయపడకు రాజయ్యా, నిన్నేమి చేయను" అన్నాను. అతను చిరుగులు పడిన తన గోనెపట్టాను భుజాలమీద వేసుకొని, పనిముట్లను ఒక తోలు సంచిలో వేసి భుజానికి చేర్చుకొన్నాడు. నాతో వచ్చేందుకు సిద్ధమైయ్యాడు. ఒకసారి చుట్టూ తిరిగిచూచాను. చీకట్లు; మసక మసకు; అంతటా మౌనమే. చలిగాలి.

"రాజా" అన్నాను.

"ఏమిటి మహాస్వామి?"

"నీ ఇల్లు ఎక్కడ?"

"అక్కడ.... దూరంలో ఆ ఈత చెట్లదాపున"

"ఇల్లా.... గుడిసా"

"గుడిసే... మహాస్వామి గుడిసే"

"నువ్వు నడువు ముందుకు. నేనొస్తాను అక్కడికి"

"అక్కడికి ఎందుకు పండితుడా?"

"నువ్వేమి భయపడకు రాజయ్యా... నీ ఇల్లును చూడాలి, అంతే"

"వద్దు మహాస్వామి"

"ఎందుకోయ్?"

"తమంతటివాళ్ళు .... చూడకూడదు మహాస్వామి... గరీబోళ్ళ బస్తి అది"

"చూడాలి.. విశ్వంలోని అంతట్నీ చూడాల్సిందే"

"అక్కడ చూసి ఏమి చేసేదుంది మహాస్వామి?"

నేను జవాబు ఇవ్వలేదు. కొద్దిసేపైన మీదట ...

"రాజ" అని అన్నాను.

"ఆ.... ఆ"

"నీకెంతమంది పిల్లలు?"



"అరుగో.. వారే నా పిల్లలు"

"నీ భార్య?"

"లేదండి మహాస్వామి, వెళ్లిపోయింది."

"ఏమిటి? అలాగున అంటే"

"పోయింది పండితుడా.... తీరుకొని పోయింది బాలింతరాలుగా ఉన్నప్పుడు"

"ఎన్ని సంవత్సరాలు అయినవి?'

"ఎన్ని సంవత్సరాలో జ్ఞప్తికి లేవు"

"పిల్లలు పెద్దోళ్ళా చిన్నోళ్ళా?"

"చిన్నోళ్ళే మహాస్వామి"

మాట్లాడుతూ దూరంలోని ఒక పాడుబడిన గుడిసెను చూసాను. రాజయ్య తొందర తొందరగా నడిచాడు. పదిగజాలు ముందుకే వెళ్ళిన అతను నిల్చి వెనుదిరిగి "అదిగో.. అదే నా ఇల్లు పండితుడా" అని చూపెట్టాడు. ఎక్కువౌతున్న ఆ చీకట్లో ఈ గుడిసెను చూసా..ఎంతో పాతదై పాడుబడిన గుడిసె అది. ముందుభాగం కూలి పడిపోయేటట్లుగా ఉంది. ఒక చాపనే తడికెలాగ ఆ గుడిసెకు ఉన్న ద్వారంకు కప్పబడిఉంది. లోపలినుంచి చిన్నగా వెలుతురు వస్తుంది.రాజ వెళ్ళి తలుపును వెనక్కి నెట్టాడు. లోపలినుంచి చిరుగుల బట్టలతో బీదరికాన్ని నిరాశెల్ని నింపుకొన్న ఇద్దరు పిల్లలు బయటకు వచ్చారు. రాజయ్య పిల్లల వైపుకు తిరగకనే నన్నే చూస్తూ

"మీరు రాకుండా ఉండాల్సింది మహాపండితుడా" అని అన్నాడు.

"ఎందుకోయ్?"

"నేను దలితుడ్ని... మాదిగ కులస్తుడ్ని"

కొద్దిసేపు నిల్చి యోచించాను. మనస్సులో ఆర్ద్రత నిండింది.

"రాజ"అన్నాను.

"ఏమిటి మహాస్వామి?"

"ఇదిగో తీసుకో"

"దేన్ని పండితుడా"

"తీసుకో (పుచ్చుకో), డబ్బును తీసుకో, నీ పిల్లలకి'

"వద్దు వద్దు మహాస్వామి"

"వద్దనకు, తీసుకో ఈ పైకంను"

కొద్దిసేపు నిశ్శబ్దం. రాజయ్య నిష్పంద నయనాలతో నన్నే చూస్తూ – "ఈ రోజు వద్దు స్వామి, రేపు ఇవ్వండి " అన్నాడు.

అతను గద్గద స్వరంతో అన్నట్లుగా ఉంది ఆ ధ్వని. నేను రెండడుగుల్ని వెనక్కి వేసి నిదానంగా వెనుకకు తిరిగాను.

"చీకటి ఎంతగానో ఉంది స్వామి, నేనూ మీతో అక్కడిదాకా వస్తానులే" అన్నాడు అతను.

"అవసరం లేదులే, నువ్వు ఎందుకు అక్కడిదాక"అన్నాను.

అయితే అతను వినలేదు.

## 3

మరుసటి సాయంత్రం చీకట్లు పడబోతుండగా రాజయ్యను వెతుక్కొంటూ అతను పనిని చేస్తుండే చోటుకు వెళ్ళాను. అక్కడ అతను లేదు. ఇక అతనుండే గుడిసె వైపుకు బయల్దేరాను. ఒక్కడ్నే వెళ్తున్నాను. దారి గుర్తే కదా! గుడిసె కనబడింది. అయితే లోన్నుంచి వెలుగు వస్తుండడం లేదు. 'రాజా' అని గట్టిగా కేకను పెట్టా. జవాబులేదు. ఇంకా ముందుకే వెళ్ళి తలుపు వద్ద నిలిచి మరలా కేక పెట్టాను. నిశ్శబ్దం, నిశ్శబ్దం. గుడిసెకున్న తడిక తెరిచి యుంది. కేక పెట్టూ లోపలికి అడుగు పెట్టాను. చల్లటిగాలి లోపలినుంచి సుడులు సుడులుగా బయటకు వచ్చింది. గుడిసెలోన, బయటా ఎటుచూసినా కటిక చీకటే. చుట్టుప్రక్కల గాలించాను. అరిచాను. నిశ్శబ్దమే! "రా... జ" లేదు అనుకొంటూ బయటకు వచ్చాను. తలుపుముందు నిలిచి తలెత్తి పైకి చూసాను. భూమ్యాకాశంనుంచి "రాజ" లేడన్నట్లుగా మారుధ్వని వచ్చినట్లైంది. ఒక గడియ వరకూ నిశ్శబ్దంగా, నిష్పందనయనాలతో ఆ శూన్యాన్నే చూస్తూ శిలామూర్తిలాగ నిలిచాను.

❁ ❁ ❁

రాత్రి పానుపు (పడక) మీద పడుకొన్నప్పుడు కమల దగ్గరకొచ్చి నిలబడింది. బాహ్యంలో శూన్యంలాగ ఉంది. హృదయంలో ఆ సాయంత్రం నడిచిన (జరిగిన) దంతా గాఢతరంగా చిత్రించబడినట్లు ఉంది. ఓర్చుకోలేక అణిచేందుకు ప్రయత్నించాను. సాధ్యం కాలేదు. నేనెంత పిచ్చోడ్ని! అతడి చేతికి ఆసరాగా నిలుద్దామని భావించా. అతనిలోని దారిద్రాన్ని పారద్రోలేందుకు తహతహలాడాను. ఆ పనులను చేసేందుకు నేను ఎవర్ని? నా నుంచి తనకు విధికి వ్యతిరేకమైన కష్టం కలగొచ్చేమోనని అతను భావించి



యుండొచ్చేమో! నేను అతని ధార్మిక మనోభావాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నానని కలలో కూడా గమనించలేదు. ఇది అతనికి తెల్వకుండా పోయిందా? తెలిస్తే నానుంచి ఉపకారం వద్దనేవాడా? ఔనౌను. కాదనుకొన్నాడు (వద్దనుకొన్నాడు). నా ఉపకారంలోని బరువు అతనికి అనవసరంగా అన్పించియుండొచ్చు. అతనిది నిష్కామకర్మలోని జీవితం. శ్రమించి పొట్టను నింపుకొనే విధంలో, కష్టాల్ని సహించుకొంటూ దిగమ్రింగుకొనే ముందుకు సాగే తత్త్వం అతనిలో ఉంది కదా! అయ్యయ్యో అతని స్వభావంకు విరుద్ధంగా నడిచాను నేను. నా నుంచి అతను ఈ స్థలాన్ని వదిలి వెళ్ళిపోయాడు ఎక్కడికో?

ఈ జ్ఞాపకాలు నా హృదయాన్ని కలిచివేసినవి. ఎంతో దూరం వరకూ ఈ భావం నన్ను విప్లవపంథా వైపుకు లాక్కెళ్ళుతున్నట్లుగా బోధపడుతుంది. మనస్సు క్షతగాత్రమైంది. మెల్లగా కళ్ళను తెరిచాను. కమల మంచం చెంతన ఒరిగి బాష్పపూరిత లోచనాలతో ఉంది. అంతఃకరణ కరిగింది. లోన ఒక చిత్రం. బయట ఒక చిత్రం. ఒకదాని కొకటి విరుద్ధం. అర్ధాంగిని చూస్తూ మెల్లగా పలికాను.

"అంతా అతడి లీల!"

– 0 –

(కన్నడంలో ఈ కథను రచించినవారు 'భారతీప్రియ'గారు. వారి నిజ నామధేయం శ్రీఎస్.వెంకటరావ్‌గారు. వారు 1911లో మైసూరులో జన్మించి పత్రికోద్యమంలో పేరును గడించారట. 1932లో ఈ కథను రచించి కన్నడ సారస్వత లోకంలో ఒక సంచలనం సృష్టించారట వీరు. ఒక శతాబ్దంలోని అత్యుత్తమ 84 కన్నడ కథలలో ఈ కథ 'మోచి' అనే పేరుతో ఉన్నదాన్ని గమనించి తెలుగులోకి అనువదించాను.

29-07-2009,

శాఖమూరు రామగోపాల్.

# గోపాలస్వామి పుష్కరిణి మరియు జలనారాయణ

ఏఊరి చరిత్రను చూసింది ఎవరూ లేరు.... విన్నది మాత్రం ఉందిలే. అలాగనే నేను వినిన అపురూపమైన కథ ఒకదానిని మీముందు ఉంచుతాను ఇప్పుడు. ఇతిహాస ప్రసిద్ధమైన పర్రకాబాద్ సంస్థానం టిప్పుసుల్తాన్ వశం అయినప్పుడు దీనినే తన రాజధానిగా ఎందుకు చేసుకోగూడదు అనే అభిప్రాయం అతడిలో ఉండటంచేత అక్కడే ఒక రాజభవనాన్ని, మిలిటరి బ్యారెక్స్ (బారకాస్)ను నిర్మించే ఊపుతో ఉండేవాడు. అదెందుకో టిప్పుకు పర్రకాబాద్ అంటే పంచప్రాణం. ఈ పర్రకాబాద్ గొప్పదనం ఏమిటి? మదకరి నాయక మీకు గుర్తే కదా! మదకరి నాయక ఏలిన చిత్రదుర్గ సంస్థానమే 1779లో హైదరాలి ఖాన్‌కు వశం అయ్యింది కదా! అప్పుడు హైదరాలి కొడుకైన టిప్పు మహాశయుడు చిత్రదుర్గాన్ని పర్రకాబాద్ అని మరునామకరణం చేసాడు. మైసూరు దేశంకు ఒక మండలంగా (సుభెగా) మలచబడింది చిత్రదుర్గం. తనకు పరమ ఆప్తుడైన షేక్ ఆయాజ్‌ను సుభేదారుడిగా నియమించాడు టిప్పు. బాధ్యతల్ని చూచుకొనేందుకు సుభేదారు ఉన్నా అప్పుడప్పుడు మైసూరు నుంచి టిప్పు పర్రకాబాద్‌కు వచ్చి వెళ్తుండేవాడు. ప్రార్థన కోసమని బడామకాన్ ఉన్నా తనొక భవ్యమైన మసీదును నిర్మించేందుకు టిప్పు నిర్ణయించుకొన్నాడు. హుచ్చంగమ్మ దేవాలయంలోని ఐదు అంతస్తులలో మూడిటిని తొలగించి, వాటిలోని అందమైన గట్టిముట్టుగా ఉన్న రాళ్ళను ఉపయోగించేకొనే వైనాన్ని సూచించినోడు షేక్ ఆయాజ్‌నే. టిప్పు నుంచి ఆజ్ఞె జారిఅయ్యింది. ఆ ఆజ్ఞను ఎదురించేవాళ్ళు ఎవరు? అలాగున ఆ గుడిని పాడుజేసి జుమ్మామసీదును నిర్మించే క్రమం జరిగింది. దేవాలయంలోని అంతస్తులను తొలగించే సందర్భంలో అపారమైన నిధి దొరికింది అనే పుకార్లు వ్యాపించినవి.

పాలెగార్లు దేవాలయాలలో దేవతా విగ్రహాల్ని ప్రతిష్ఠించేటప్పుడు నవ రత్నాల్ని, నగ నాణ్యాల్ని నింపి ప్రతిష్ఠాపన చేస్తారని షేక్ ఆయాజ్‌డి మదిలో నిధి నిక్షేపాల ఆశల్ని నాటినోడు కోశాధికారైన ఆదినారాయణ మాత్రమే సుమా! అయినా షేక్ దేవాలయాలలోని



నిధులకని వెళ్ళేందుకు వెనుకంజ వేసాడు. అయితే, టిప్పుకు తెల్వకుండానే ఒక పాలు నిధిని తనెందుకు కబ్జా చేసుకోకూడదు అనే తప్పుడు సలహాలకు లొంగాడు. ఆ ఆశెలకు గాలిని ఊదినోడు ఆదినారాయణే. అతడ్ని నమ్మేందుకు షేక్‌కు బలమైన కారణం ఒకటుందిలే. నారాయణ మాజి ప్రధాని కళ్ళీ (దొంగ) నరసప్పకు బంధువైనోడు. మదకరి నాయకకు అంతఃశత్రువుల జతగా పరాయి మండలాలైన తరీకెరె, జరిమలె, హరపనహళ్ళి, రాయదుర్గ, గుడేకోట పాళెగార్ల నుండి ప్రమాదం పొంచియుండేది. స్వపక్షంలో ప్రధాని కళ్ళి నరసప్పయ్య, కుంభీపాలనాయక ఇటువంటోళ్ళ దండునుంచి శత్రుత్వం పొంచియుండేది. నరసప్ప రహస్యంగా హైదరాలితో సంపర్కం పొందిన దాన్ని గుర్తించిన మదకరి నాయక నరసప్పను ప్రధాని పట్టం నుంచి పదచ్యుతి గావించాడు. ఈ కారణంతో హైదరాలితో జతగట్టి నరసప్పయ్య చిత్రదుర్గం లోని రహస్య మార్గాల జాడలను తెలిపి దుర్గ పతనానికి కారణమైయ్యాడు. అంతోడికి దాయాదైన ఆదినారాయణకూ అధికారం, సంపదల మీద వ్యామోమం ఉండకుండా ఉండేది సాధ్యమేనా? ఇందుచేత తనకు సమాన మనస్కుడైన సుభేదార షేక్ ఆయాజ్ ఆప్తత దొరికినప్పుడు నారాయణ చిత్రదుర్గంలోని నిధి శోధనల జాతకాన్ని విప్పాడు. నిధి శోధనం టిప్పుకు తెల్వనట్లుగా మరియు అధికారి వర్గ జనసముదాయం దృష్టికీ రానట్లుగా నడిచేది ముఖ్యమైంది ఆ ఇద్దరికి. అధికార్లకు ఎంగిలి మెతుకుల్ని విసిరితే తోకల్ని ముడుచుకొని నిష్క్రియాపరులుగా ఉంటారు. అయితే చిత్రదుర్గంలోని జనంకు తమ నేల, జలం, భాష, ఇతిహాసం, సంస్కృతి, ధర్మం వీటిమీద తీవ్రమైన అభిమానం ఉందిలే. టిప్పు పర్రకాబాద్ అని మరునామకరణం చేసినప్పుడు పెద్దగానే ప్రతిభటనం నడిచింది. కోటగుమ్మాన్ని ఫతే దర్వాజు అనే మారుపేరుతో పిలిచినప్పుడు జనం లోలోపలే కుతకుతలాడారు. చిత్రదుర్గాన్ని జయించిన హైదరాలి సైన్యం కోటగుమ్మం మూలకంగానే పట్టణంలోకి ప్రవేశించినందున ఆ ద్వారానికి ఫతే దర్వాజ (విజయద్వారం) అని మరు నామకరణం చేసాడు. అంతేకాదులే.... బ్రాహ్మణులు నివసించే వీధులలోనే నివసించండి అని మహమ్మదీయ సైన్యాలకు టిప్పు సూచనలను ఇచ్చాడు. త్యాగరాయ మఠం, రాఘవేంద్రస్వామి మఠం, శృంగేరిమఠం.. వీటి చుట్టు ప్రక్కల ఆ మహమ్మదీయుల బిడారాలు ఉండేవి. మసాలవాసనలతో, కోడి రెక్కల బొచ్చుతో ఆయా వీధులు నిండేవి. బుద్ధివంతులు ఆదినారాయణ మాదిరిగా బతికేటి గుట్టును తెలుసుకొన్న పిదప లౌక్యంతో తురకలను సాహెబ్‌గారు, ఖాన్‌గారు అంటూ సలామ్‌కొట్టూ అధికారి ముస్లింలకు అసహనం కలగనట్లుగా ఆ కాఫీర్ల సేవలకని సదా సిద్ధమైయ్యారు. ఇటువంటి మార్పులలో కోశాధికారైన ఆదినారాయణ మహా చాణాక్షమతి. "జనంతో మమేకం, పాలక వర్గంతో గంటుమూట" పొందేటి ఉపాయమార్గాల్ని అపాయం

కలగనట్లుగా నేసే విధానాన్ని సహజసిద్ధంగానే అబ్బిపుచ్చుకున్నాడు. దేవాలయాల్ని ముట్టుకొనేందుకు (దోచుకొనేందుకు) సుభేదారు భయపడినప్పుడు ఆదినారాయణ వేరొక మార్గాన్ని షేక్ ఆయాజ్ తలలో నింపాడు. "చెఱువులు, పుష్కరిణులు, బావులలో పూడికల్ని తీయించితే వాటినుంచి ఎంత లాభం వస్తది నారాహేణ్?" అనిషేక్ కోపంతో ప్రశ్నించాడు. "లాభం ఉంది మహాప్రభో. పూడికల్ని తీయించితే క్రొత్తనీరు సంగ్రహం అవుతది... ఇప్పుడున్న చెఱువులు, బావులు,పుష్కరిణులు శతశత మానాలనుంచి శుచికానందుచేత నీరు మలినం అయ్యింది కదా! స్నాన పానాదులకు ఉపయోగిస్తే రోగాలు వస్తవి అని ప్రచారం చేయించుదాం... పూడికల్ని తీయించేది జనక్షేమం కోసమనే టాంటాం వేయిద్దాం... ఎలాగూ వెంకణ్ణ శాస్త్రికి ఆ పనిని అప్పగిస్తే మీ ఔదార్యం మరియు ప్రజాహితంలోని గొప్పదనం మీద గుణగానం చేసి జనంలో ఒక భ్రమను సృష్టిస్తాడు" అని నారాయణ షేక్‌ను నమ్మించసాగాడు. "జనం మన మాటల్ని సున్తారె (వింటారా) అంటావా?" అని షేక్‌కు అనుమానం. "సున్తారె సాబ్... వినకపోతే బుజ్జగించేది ఎలాగున అనేది నాకు గుర్తే సాహెబ్. మాటలకు లొంగకపోతే కత్తిని ఎత్తామంటే ఖలాస్" అంటూ లౌక్యంతో చెప్పాడు ఆదినారాయణ. "పూడికలకని లక్షలలో వరహాల్ని ఖర్చు బెట్తే టిప్పుసుల్తాన్ ఊరికనే వదుల్తాడా?" షేక్‌కు లోనెక్కడో సంశయాలమూట. "వదిలేయండి... చిత్రదుర్గంలో వైణిక శ్రేష్ఠులు, సిరివంత వ్యాపారస్తులు, బంగారపు అంగడి వాళ్లు, సారాయి గుత్తెదార్లు, బట్టల వ్యాపారుల దండే ఉంది కదా! సత్కార్యమని వాళ్ళనుంచే చందాల్ని వసూలు చేద్దాం.. ఒప్పుకోకపోతే సుంకాల్ని పెంచుతామని బెదిరిద్దాం...మీరు నాకు అనుమతి ఇచ్చి చూడండి సాహెబ్... మిమ్మల్ని నగలు, నాణ్యాలతో అభిషేకిస్తాను" అని ఆదినారాహేణ్ ఒత్తిడ్ని చేయసాగాడు. షేక్ ఆయాజ్ స్వభావతః ప్రామాణిక వ్యక్తే అని హైదరాలి అతడ్ని సుభేదారుడిగా నియమించేందుకు ఒప్పుకొన్నాడు. అయితే సహవాసదోషం మూలంగా దురాసెకు బలైన షేక్ వెనకడుగు వేస్తూనే "జనాన్ని ఒప్పించే భారం నీది నారాహేణ్" అని అన్నాడు. "ఎందుకు సాహెబ్– భయాన్ని చెందుతావు? కోటకు కొత్వాల్‌గా ఉన్న కామరాజుకు పని అప్పగిస్తాను. అతని వెనకే బడుద్దాయిల దండే ఉంది.. వస్తాదుల దండూ అతని చెంత నుందిలే"అని షేక్‌లో ధైర్యాన్ని నింపాడు ఆదినారాయణ.

పట్టణ పరిపాలనకు చెందిన వాళ్ళను సభకు పిలిపించారు. ఊర్లోని పట్టణశెట్టి, వర్తకులు, గణ్యవ్యక్తులను పిలిపించారు. పట్టణంలోని చెఱువులు, బావులు, పుష్కరిణులలో పూడికెల్ని తీయించితే అవి శుభ్రపడి, అంతర్ జలం వృద్ధిచెంది కొత్తనీరు చేరటంతో ఆరోగ్యానికి మంచిదని వెంకణ్ణశాస్త్రి నుంచి అధ్యక్షోపన్యాసాన్ని ఇప్పించారు. ఇదొక



మహత్కార్యమని వింటున్న సభికులలో అసహనం కలిగినా ఆదినారాయణను పొగడ్తలతో ఆకాశానికి ఎత్తాడు వెంకణ్ణశాస్త్రి. మొదట్నుంచి చిత్రదుర్గంలోని జనం నిధానస్తులుగా, నిరభిమానులుగా, నిర్లిప్తులుగా ఉండేవారు. ప్రతిఘటించే మనోభావాన్ని మదకరి నాయకన నిర్గమనం తర్వాత ఎక్కడనో తాకట్టు పెట్టారు. ఇందుచేత శాస్త్రి ఉపన్యాసానికి తలలు ఊపుతూ చప్పట్లను చరిచారు. కామరాజు మరియు అతని పటాలం పూడిక పనుల కోసం సామాను సరంజామాలను జోడించుకోసాగారు. చుట్టుప్రక్కల పల్లెలనుంచి స్త్రీ పురుషుల కూలి సమూహం వేంచేసింది. చేతి నిండా పని, దోసెడు నిండా రొక్కం దొరుకుతుందనే సంతోషం ఆ పల్లెజనంలో ఉంది కదా! పగలు రాత్రి ఒకే జోరుతో శ్రమదానం.

మొదటగా చంద్రవళ్ళి చెఱువుకు పూడికెను తీయటం ద్వారా పనులు ప్రారంభమైనవి. చెఱువు నాలుగు దిక్కులలో ఏతాల్ని నిర్మించి కోడెగిత్తల్ని కట్టి లాగించటం మరియు మహిళలు కడవలు మూలకంగా నీటిని ఖాళీ చేసే విధానాన్ని అనుసరించారు. ఈ కార్యాన్ని చూసేందుకని మొత్తం చిత్రదుర్గంలోని జనం జమైయ్యారు. ఆ చెఱువు చెంతే కూలిజనంకు రాగి ముద్దలతో, పప్పుచారుతో భోజనాలు. అధికార్లకు మాంసాహారం, విప్పసారాయితో విందువ్యవస్థ. చెవి, ముక్కు రోగాలకు నాటు పండితుడైన హిరణ్యకశిపు ఆదినారాయణకు పరమ ఆప్తుడైనందుచేత మరియు తనని తానే జలతజ్ఞుడని భావించుకొన్నందున పూడిక పనుల వలన రాబోయే ప్రయోజనాల్ని కంఠపాఠంగా ఒప్పచెప్పటమే గాకుండా చేతిరాతలతో బొగ్గుల సుద్దతో పట్టణంలోని వివిధ కూడళ్ళలో గోడలమీద రాసి నారాయణను బలపరచసాగాడు. చెఱువులోని నీరు ఖాళీ అవుతుంటే రాత్రి వేళలలో నమ్మకస్తులైన కొద్దిమంది కూలీలతోనే పనులు జరుపబడేవి.

పనులు జరుగుతున్నవి. సరైన కాగడాలు వెలుగుతున్నవి. చెఱువులో బయపడిన శతమానాల వెనకటి కాలంలోని పంచలోహాల విగ్రహాలు, ఫిరంగి గుండులు బయటకొచ్చిషేక్ ఆయాజ్‌డి దివాన్‌ఖానాకన్నా ముందే ఆదినారాయణ దేవిడికి తరలించబడినవి. కూలీలకిచ్చే కూలిమీద నిగా ఉండేదేకాని, మిగతా విషయాల లెక్క పండితులకు అక్కర్లేదు. అధికార్లు తమకు దొరికిన వాట్ని తీసుకుని పోతున్నప్పుడు అది తప్పు అనే భావన వారిలో లేదు. వేలలో వరహాల ఖర్చుంటే, చిట్టా పుస్తకాలలో లక్షలలో ఖర్చు వెచ్చాన్ని రాస్తుండేవారు. సుభేదారుడైన షేక్‌కు, కోశాధికారైన ఆదినారాహేణ్‌కు సమపాళ్ళలలో దొంగ లెక్కల వరహాల మూటలు పంచబడేవి. మిగిలిన అధికార్లకు ఎంగిలిని విసిరితే దానికే తృప్తి చెందేటోళ్ళు. పూడికపనులు జోరుగా సాగాయి. ఘనకార్యమనే జనం భావించేవారు.

చంద్రవళ్ళి చెఱువు తర్వాత సంతలో నున్న పుష్కరిణి మీద ఆదినారాహేణ్ దృష్టి పడింది. అదీ ఖాళీ అయ్యింది. దాన్నుంచి దొరికినవి ఏమిటంటే అస్థిపంజరాలు మాత్రమే. అయితే లెక్కల పుస్తకంలో గొప్పగానే ఖర్చు వెచ్చం నింపబడింది. తర్వాత చెన్నకేశవస్వామి పుష్కరిణి, వెంకటరమణస్వామి పుష్కరిణి, చంద్రమౌళీశ్వర కొలను, చెన్నక్కబావి, దళవాయి కొలను ఇలా ఒకటొకటి జలయజ్ఞం పుణ్యాన నీరు బయటకు ఎత్తబడి ఖాళీ అవుతూ, ఖాళీ చేయించే అధికారి జనం ఇళ్ళలోని భోషాణాలు నింపబడుతుండగా, చిత్రదుర్గంలోని జనం భయపడసాగారు. ఎందుకు భీతిల్లారంటే రాయలసీమకు చివరిగా ఉండేటి చిత్రదుర్గం ఎప్పుడూ వరుణుడి అపకృపకు బలైయ్యే ప్రాంతం గనుక, వానలు కురవకపోతే ఎముకల గూడులాగ ఖాళీయైన కొలనులు, పుష్కరిణులు, బావులు నిండేది ఎలాగబ్బా అనే చింతలో జనం కూరుకుపోసాగారు. గుసగుసలతో , పిసపిసగా మాట్లాడుకొంటూ తమలో తామే బాధపడసాగారు. ఈ వార్తలు గాలిలో తేలాడి అదెలాగో వెంకణ్ణశాస్త్రి చెవులకు తాకినప్పుడు, అతడు కామరాజు చెవిలో ఈ విషయాల్ని ఊదాడు. జనంలో జనించిన అనుమానాల్ని చిగురులోనే తుంచేయ్యాలని, అవేగనుక బలపడి పెద్ద మానుగా పెరిగితే కష్టం కలుగుతదని భావించి భవ్యమైన సమారంభం ఒకదాన్ని కోట బురుజు చెంత ఏర్పాటు చేసారు. నాట్యాన్ని, సంగీతాన్ని ఏర్పాటు చేసారు. జనం వచ్చారు. మనోరంజన కార్యక్రమాన్ని చూసారు. సాక్షాత్ సుభేదారుడే నారాయణను వాచామగోచరంగా పొగుడ్తూ 'జల నారాహేణ్' అనే బిరుదు ఇచ్చి, పూడికెల్ని తీసే పనులను ముందుకే సాగించనీయండి అని చెప్పితే, కామరాజు బలగం జయజయ ధ్వనులను చేసి ఆ సభను జయప్రదం గావించారు. ఈ సంవత్సరం భారీగా వర్షఋతువు ఉంటదని, చెఱువులు, బావులు, పుష్కరిణులు నిండుతవని పంచాంగాన్ని తిరగేసి చూసి భవిష్యాన్ని చెప్పింది వెంకణ్ణశాస్త్రి గాకుండా చెవి, ముక్కు రోగాల నాడి పండిత హిరణ్యకశిపునుంచే ఆ భవిష్యత్ మాటలు వస్తుంటే, హాజరైన ఆ సభికులలో ప్రశ్నించే ధైర్యం ఎవరిలోనూ కానరాలేదు.

కోటక్రింద ఉన్న దొడ్డపేట, సంతపేటకు చెందిన జనం నీరు లేక విలవిలలాడారు. శ్రీరామచెఱువు, తిమ్మప్ప నాయకన కుంటను చూపించింది ప్రభుత్వం. జనం నిధానత్వం, సమాధాన తత్వం కలవారవటం చేత ఏదోలా సహించుకోసాగారు. చెఱువు పూడిక పనులు జరుగుతున్నప్పుడు విగ్రహాలు బయటపడినవి. కొలనులను శుభ్రం చేసినప్పుడు నగలు, నాణ్యాలు దొరికినవి కదా అని తమలో తామే అందాజు చేసుకోసాగారు. బయటపడిన వస్తువులు నేరుగా పరిపాలించే నవాబుకు చేరాలి. నవాబేమో మైసూరులో ఉంటాడు. అక్కడ పులుల్ని వేటాడుతూ హాయిగా ఉంటే ఇక్కడ ఎలుకలు పందికొక్కులు దుర్గలోని కోటనే కొరుక్కుతింటున్నవి కదా అని నిట్టూర్చసాగారు. ఇంతటి సహనామూర్తుల నెత్తురు కుతకుత ఉడికే రోజులు దగ్గర పడసాగాయి.

కోటకు పైనున్న విస్తారమైన గోపాలస్వామి పుష్కరిణిలో నీరును తోడి పూడికెను తీయించే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేయాలని సంకల్పించినప్పుడు జనం ఔరౌరా అని బెంబేలు పడసాగారు. గోపాలస్వామి పుష్కరిణి ఖాళి అయ్యితే కోటపైన నివసించే సంసారాల గతేంటి? కోట సౌందర్యంకు ప్రథమపంక్తిలో ఉన్న ఈ పుష్కరిణి ఖాళీ అవ్వాల్సిందేనా? ప్రశ్నెలు జనం మెదళ్ళలో భూతాకారంగా రూపుదాల్చినవి. పుష్కరిణిలోని నీటిని ఖాళీ చేయించినా, ఆ నీటిని వీధిపాలు కాకుండా అక్కచెల్లెలులాగ పిలవబడే మడుగులలో సేకరించి, నిలుపుతాం అని ప్రశ్నించే వారి నోళ్ళను మూపించారు. వానలు నాలుగైదు సంవత్సరాలు రాకున్నా, ఆ పుష్కరిణి ఎండటంగాని, అడుగుభాగమైన పాతాళాన్ని చేరిందాన్ని గాని చూసినోళ్ళు ఇంతవరకూ ఎవరులేరు చిత్రదుర్గంలో. అటువంటి గోపాలస్వామి పుష్కరిణిని ఖాళీ చేయించితే మనుషులకు మాత్రమే కాదు జలచరాలకు, పక్షులకు, పశువులకు దాహాన్ని తీర్చుకొనేందుకు ఎక్కడికి వెళ్ళాలి? జనం, పరిసరప్రాణులు, దయ, ధర్మం వీటిమీద మాటల్ని చర్చించుకొంటూ మథనపడసాగారు. నాటువైద్యుడు పుష్కరిణిలో నీరు మలినం చెందింది; తాగినోళ్ళు రోగాల బారిన పడ్తారు. జలకాలాటలు చేస్తే వంటికి చర్మవ్యాధులు సోకుతవి అని బెదిరించాడు. నూటికి నూరుపాళ్ళు పుష్కరిణిలో పూడికెను తీయించుతాం అని స్వయంగా బిరుదాంకితుడైన జలనారాహేణ్ హుంకరించాడు. అయితే జనం ఎందుకో ఈసారి ప్రభుత్వ మాటలకు కోపగించారు. సిద్ధపురుషులు స్నానాలు చేసిన పవిత్ర తీర్థం ఇది. దేవతా విగ్రహాలను పండుగ పర్వదినాలలో శుచిస్నానాల్ని చేపించే గంగాజలం ఇది. ఇక్కడున్న జనం ఈ నీరు ఖాళీ అయితే మీ ఉచ్చను తాగి బతకాలా? అనే భావనతో రేగిపోయారు. వీధులలోకి వచ్చారు. ప్రతిభటించారు. సైనికుల్నుంచి తన్నుల్ని, దెబ్బల్ని పొందారు. "పుష్కరిణిలో ఎక్కడుంది పూడిక? మీ తలలలోనే మట్టినిండి పూడిక చేరిందిలే భోషడిగాళ్ళారా" అంది ఒక వృద్ధమహిళ. ఇది ప్రకృతినుంచి నిర్మించబడిన బండల అడుగు భాగాల్నుంచి ఉద్భవించిన పుష్కరిణి. దీనిలో ఎక్కడనుంచి వచ్చి చేర్తది వండ్రుమట్టి. జీవజలాన్ని ఖాళీ చేయించిన పాపం మీకు తగులుకొంటది పాపాత్ములారా అని అన్నాడు ఒక చెట్టి. ఇలాగనే తలొక మాట అన్నారు. సుభేదార్ ఖాతరు చేయలేదు ఆ మాటల్ని. కోశాధికారి కించిత్ లొంగలేదు. దీనికొక కారణం ఉందిలే. ప్రాచీనకాలం నాటిది ఈ పుష్కరిణి? యుద్ధం నడుస్తున్నప్పుడు తమ భర్తలు విగతులైతే, రాణి వాసపు స్త్రీలు తమ దుస్తులు, బంగారపు నగలతో పుష్కరిణిలోకి

దూకి తనువులు చాలించేది ఉందిలే.అపారమైన నిధి శత్రువుల పాలుగారాదు అని భావించి పుష్కరిణిలో వాటిని విసిరింది ఉందిలే అనే నమ్మకం జనంలో ఉండేది. పౌర్ణమి నడిరాత్రిలో కాంచన రథమే తేలుతది అనే జనం నుంచి జనించిన మాటలు ఉన్నందుచేత ఆదినారాయణ పుష్కరిణిలో పూడికెను తీయించేందుకు పంతం పట్టాడు. పుష్కరిణిలో ఉన్న అపారమైన నిధి దొరికితే ఈ ఊరినే విడిచేస్తా అని అనుకోసాగాడు. సుభేదార ఎంతైనా పరదేశస్తుడు. తన సుల్తానుకు విషయం గుర్తైతే తన గతేంటి అనే దిగులు షేక్ అయాజ్‌డి మదిలో ఉండేది."ఈ విషయం సుల్తానుకు తెలిపి కార్యానికి భంగం తెచ్చే మొనగాడు చిత్రదుర్గలో పుట్టనే లేదు. ఒక వేళ అంత మొనగాడు పుట్టి ఉంటే వాడ్ని ఖతం చేద్దాం మహాప్రభో" అని సంతోషపరిచాడు జలానారాహేణ్. "ఇతిహాస తజ్ఞుల అభిప్రాయం కనుక్కో? జనంకు వారినుంచి బుద్ధిని వినిపించు" అని షేక్ కలవరంతో అన్నాడు. విజ్ఞుల (తజ్ఞుల) సభను నడిపే శాస్త్రాన్ని చేసాడు జలనారాహేణ్.

పనిని అడ్డుకొనేందుకు గుంపును కట్టుకొని అడ్డం పడిన నరసింహ జెట్టిని పిలపించారు. ఉత్సవాంబ ఆలయంలో సభ ఏర్పాటు గావించబడింది. ఇతిహాస తజ్ఞులైన త్రిమూర్తులను ప్రశ్నించినప్పుడు ఆశ్చర్యకరమైన జవాబు బయటకొచ్చినవి. "పుష్కరిణిని ఖాళీ చేయనివ్వండి.... దాని పాతాళపు అంచుల్ని చూసి ఆ సొగసును ఆస్వాదించుదాం" అంటూ ఆ తజ్ఞులు నవ్వారు. "పుష్కరిణిలో అపారమైన నిధి ఉంది కదా" అన్నాడొకడు. "శిలా శాసనమో, స్మారకమో, నగ – నాణ్యాలో ఉండొచ్చు.... ఏమి దొరికినా అవన్నీ ప్రభుత్వానికి చేరుతవి అని అనుకొంటే, ఈ కార్యానికి విరుద్ధంగా ప్రతిభటించరాదు" అన్నాడు మూడోవాడైన విజ్ఞుడు. మీ వాదన అలాగనే ఒకప్రక్కన ఉంచనీయండి. గోపాలస్వామి పుష్కరిణి నిండి గట్టు అంచును మీరి ప్రవహిస్తేనే దాని క్రిందనున్న మంచినీళ్ళ బావి నిండుతది. అది నిండిన తర్వాత సంతపేటలోని కొలనుకు నీరు చేరుతది. .. అవును కదా తిక్కపండితులారా" అంటూ నరసింహ జెట్టి జోరుగా అరిచాడు. నరసింహ జెట్టి వాదనకు అనుకూలంగా, వ్యతిరేకంగా వాదనలు రాసాగాయి. దీనితో రేగిపోయిన ఆదినారాయణ షేక్ ఆయాజ్‌డి చెవిలో ఏదో చెప్పాడు. నరసింహ జెట్టికి తాము ఇచ్చిన ప్రశస్తి పారితోషికాల్ని తక్షణం వాపస్సు చేయమనే ఆదేశాన్ని ఇచ్చి జెట్టిని అవమానించాడు ఆ నిండు సభలో షేక్. అయితే సంస్థానంకు జెట్టిగా అమూల్యమైన సేవను చేసిన నరసింహ జెట్టి భయపడలేదు. "ప్రశస్తి, పారితోషికాల్ని నువ్వు కాదు నాకు ఇచ్చింది. ఇచ్చిన ప్రభువు మదకరి నాయకుడే. వారే వచ్చి అడిగతే వాపస్సుగా ఇచ్చేస్తాను" అంటూ తొడగొట్టాడు జెట్టి. పరాక్రమంలోని చిన్నతనంతోనో, వృత్తిలోని



మాత్సర్యంతోనో మిగిలిన చిన్న చిన్న జెట్టీలు నరసింహ జెట్టిని ఈ విధంగా రుద్రనర్తనంతో చూసిన తర్వాత భయం చెంది నరసింహజెట్టి ప్రవర్తన ఖండించతగింది అనేదాన్ని చేయలేకపోయారు. జెట్టి నిండుసభలో తిరగబడినప్పుడు షేక్ తోకను ముడుచుకొంది నిజంగానే జరిగింది. నారాయణచెట్టి కూడా ఉగ్రుడై ఉరిమురిమి ఆదినారాయణ విరుద్ధంగా మాట్లాడాడు. ఈ సభకు ముందు మహిళ ప్రమోదాబాయి నాయకత్వంలో ముగ్ధమహిళలు అనేకులు ఖాళి బిందెల్ని పట్టుకొని రాగా, గోపాలస్వామి పుష్కరిణిలో ఏతంలు కట్టబడసాగాయి. కోడెగిత్తల్ని కట్టారు. తొంభైయ్యో పడిలో ఉన్న ముది మహిళ ఈ అనాహుత కార్యానికి నోటిని కొట్టుకొంటూ అసమ్మతిని సూచించింది.

మరుసటిరోజే పూడికెను తీసే కార్యం మొదలైంది. "ఎన్ని సంవత్సరాలు శ్రమించినా ఈ పుష్కరిణిలో నీరు ఖాళీ అయ్యేది లేదు" అని అనుకొంటూ ఉసూరన్నారు పనిజనం. ఇది ఇలా నడుస్తుండగా ఆశ్చర్యమైన సంగతి ఒకటి జరిగింది. ఒకరాత్రి టిప్పుసుల్తాను నుంచి పనులను నిలిపేయమనే ఆజ్ఞను సేనానియైన భక్షి మోసుకొని దుర్గానికి వచ్చాడు. 'యా అల్లా' అంటూ షేక్ ఆయాజ్ వణికితే, నారాయణ ముఖానికున్న రూపురేఖలే మారిపోయాయి. సేనానితో మృదుమధుర మాటలకు దిగి నవాబు అంతరంగాన్ని తెలుసుకొనే ప్రయత్నానికి దిగారు ఆ ఇద్దరూ. నవాబు చాలా కోపంగా ఉన్నారు. కుల బాంధవుడిగా షేక్ ఆయాజ్‌కు క్షమాదానం దొరికినా, నీకంటూ ఉరిశిక్షే ఖాయం అని సేనానైన భక్షి కటువుగా పలికాడు. పూడిక తీసేటప్పుడు రొక్కంను గోల్‌మాల్ చేసియుంటే "దొంగ లంజాకొడుకా' అని అనేవాడేమో. నీనుంచి చాలా అపరాధాలు నడిచినవి. కోశాధికారిగా ఉండి డబ్బును మింగటం, సార్వజనికుల నుంచి దౌర్జన్యంగా చందాలు వసూలు చేయటం, పనిచేసేటి అమాయక కూలి మహిళలతో అక్రమ లైంగిక సంబంధాల్ని నడపటం, భూముల్ని కబ్జా చేయడం, సంపాదనకని ఆస్తి వ్యవహారాలలో మధ్యవర్తితనం చేయటం, గిట్టని వాళ్ళమీద దాడుల్ని చేయించడం ఇలాగున పదిపరకా గురుతరమైన అపరాధాలు నీమీద మోపబడి ఉన్నవి. టిప్పు సుల్తాను ఇప్పటికే మైసూరు నుంచి ఇక్కడికి వచ్చేందుకు బయల్దేరారు. మూడురోజులలో పత్రకాబాద్ చేరుకోవచ్చు. ఇక నీవు మీ దేవుడ్ని నీ ప్రాణం కోసం రక్షించమని ప్రార్థించుకో అని అన్నాడు భక్షి. జలనారాయణ జలజలా చెమటలతో తడిసిపోయాడు. తన కిక్కడ బతుకులేదు అనేది ఖాయపరచుకొని సుల్తాన్ వచ్చేలోపే చేతికి చిక్కినదాన్ని దోచుకొని పరారైయ్యేందుకు నక్షను (యోచనను) సిద్ధం చేసుకోసాగాడు. అయితే రొక్కాన్ని అక్రమంగా లెక్కించేటప్పుడు తనతో పాలు పంచుకొన్న షేక్ తన మీదే నిఘా పెట్టేందుకు ఆజ్ఞను చేసాడని గ్రహించిన మీదట

ప్రాణం మీద ఆశె పోయింది అతనిలో. చెఱువులోనో, బావులలోనో, పుష్కరిణలోనో దూకి చద్దామంటే అన్నీ ఖాళీగానే ఉన్నవికదా! గోపాలస్వామి పుష్కరిణికి ఇప్పుడు పహరా పెట్టారు. మిగిలిన దారి ఏమిటంటే నడురాత్రిలో మేల్కొని దొంగ సొరంగం మూలకంగా బయటపడడమే సరైందని తలపోస్తూ నిద్రకు జారాడు ఆదినారాహేణ్. మరుసటిరోజు రాజమహల్‌కు రావాలని షేక్ నుంచి ఆజ్ఞె జారీ అవ్వగా, సైనికులు నారాయణ కోసమని అతడి ఇంటికి వెళ్ళారు. జలనారాహేణ్ ఇల్లు తాళంకప్పతో రారాజిల్లుతుంది. ఎక్కడెక్కడో అతని కోసం వెతికారు సైనికులు. ఆదినారాహేణ్ దొరకనందుచేత అతని మీదే మొత్తం అపరాధాన్ని మోపి తను బయటపడే యోచనను సిద్ధం చేసుకొన్న షేక్‌కు ఖానాపీనా రుచించలేదు. ఇక్కడి సంగతులన్నింటిని టిప్పుకు చేరవేసిన గూఢచారి షణ్ముగం లోలోపలే నవ్వుకొంటుంది జెట్టి నరసింహకు త్రప్పితే మిగతా వారికి ఎవరికీ తెల్వదు కదా!

టిప్పు సాహెబ్ దండుతో వేంచేసాడు. షేక్‌నుంచి వచ్చిన భవ్య స్వాగతానికి పొంగలేదు తొణకలేదు టిప్పు. "ఓహ్.... బద్మాష్ జలనారాయణ కహాహైరె నమక్ హరామ్? గర్జింజాదు టిప్పు. అతడు పరారైన విషయాన్ని షేక్ నుంచి తెలుసుకొన్నాడు. "ఆ చోర్ నారాయణ ఎక్కడున్నా బంధించి నాముందు నిలబెట్టే వరకూ నేను పట్రకాబాద్‌ను వదిలేది లేదు... జావ్రె సాలె" అంటూ షేక్ మీద పళ్ళను పటపటా కొరికాడు. షేక్ దేహం అల్లాడింది. ఎవడో ఒక సైనికుడు పరిగెత్తుకొంటూ వచ్చి 'ఆదినారాయణ దొరికిండు హుజూర్' అంటూ రొప్పసాగాడు. "ఓ సువ్వర్ (పందిగాడ్ని) కో పకడ్కె లావ్" అంటూ టిప్పు రీవితో నించొన్నాడు. "పట్టుకొని తీసుకొచ్చేందుకు కుదర్లేదు జనాబ్. తమరే ఖుద్ రావాలి.. ఆయియే" అంటూ దారిని చూపించాడు సైనికుడు. టిప్పు అడుగుల్ని వేయసాగాడు. కాళ్ళు నేరుగా గోపాలస్వామి పుష్కరిణి చెంతకు వచ్చి నిలిచినవి. అక్కడ జలనారాయణను చూసాడు. పులిలాంటి స్థైర్యం ఉన్న టిప్పు ఆ నారాహేణ్ కళేబరాన్ని చూసి బెదిరాడు.

- 0 -

(కన్నడ భాషకు చెందిన "గోపాలస్వామి హొండవూ జల నారాయణనూ" కథను తెలుగు భాషలోకి అనువదించటం చేసాను. మూలకథను రచించినవారు బి.ఎల్.వేణు. కన్నడప్రభ తన పాఠకుల కోసమని ఆదివారం అనుబంధ సంచికలో ప్రచురితమైన దాన్ని నేను తెలుగు పాఠకుల కోసమని ఈ కథను అనువదించాను.

07-10-2007,

శాఖమూరు రామగోపాల్,



**జ్ఞానపీఠ ప్రశస్తి పురస్కార గ్రహీత దివంగత మాస్తి వెంకటేశ అయ్యంగార్ గారి "అంజప్పన కోళి కథె" కన్నడ కథకు అనువాదం**

# జోగి అంజప్ప కోడి కథ

మా ఊళ్ళోని పాత తరం వాళ్ళలో అంజప్ప ఎంతో ప్రాయమైనోడు. ఏదైనా విషయప్రస్తాపన వస్తే, అంజప్ప తను కుర్రోడిగా ఉన్నప్పుడు అది ఇది జరిగింది అని చెపుతాడు. ఆయన చెప్పే సమాచారాన్ని చూసినోళ్ళు ఇప్పుడెవరూ ఇక్కడ జీవించి యుండలేదులే. సిపాయిల తిరుగుబాటు ఐన కాలంలో అంజప్ప కుర్రోడట. ఇప్పుడు ఆయన వయస్సును అడిగితే వంద సంవత్సరాలు ఉంటవేమోనని చెపుతాడు. ఇట్లాగున గడిచిన పది సంవత్సరాల నుంచి అదే వంద సంవత్సరాలు అనేది అతని నోటినుంచి వస్తుంది కదా! ముఖ్యంగా పెద్ద వయస్సు చేతనే అంజప్ప అన్ని సందర్భాలలో కూడా ఎంతోళ్ళకైనా బుద్ధిని చెప్పే అధికారాన్ని పొందియున్నాడు. ఈ పెద్దరికంలో ఇతరులకు ఏమైనా సందేహాలు ఉన్నా, అంజప్పలో లేశమాత్రమూ లేదులే. 'ఇలా చేయకండి... అలా చేయండి" అని అంజప్ప చెబితే, ఎవరైనా ఆ మాటల్ని ఒప్పుకోకపోతే "ఏంటయ్యా ఇది... మీ నాయన బాలుడిగా ఉన్నప్పుడు నా గడ్డం నెరిసింది... నా మాటలు నీకు తేలికగా కనబడుతున్నవా" అని ప్రశ్నించే వాడు. వయస్సు మూలకంగా విస్తారమైన అనుభవాల ఫలంగా అతను చెప్పేటి బుద్ధివాదం మంచిదిగానే ఉండేది. వయస్సులో జాంబవంతుడిగా, బుద్ధిలో హనుమంతుడిగా ఉండేవాడు అంజప్ప.

మూడు రోజుల క్రితం అంజప్ప రంగప్పగారి ఇంటికి వచ్చాడు. రంగప్పను మా తాలూకాలో బెంచ్ మ్యాజిస్ట్రేట్ (గౌరవయుతమైన పదవి) గా నియమించబడి కొన్ని రోజుల క్రితమే ఆర్డర్ వచ్చింది. మా ఊరిలోని జనం అందరికీ ఇదెంతో సంతోషకరమైన విషయంగా ఉంది. మా కరణంగారు శిక్షలను వేసేటి అధికారం పొందారనేది ఒక గొప్ప సుద్ధిగా ఉంది మా పల్లెలో. పల్లెజనానికి శిక్షను విధించే అధికారం ఎంతో గౌరవయుతమైన శక్తి అనే భావం గాఢంగా ఉందికదా! ఎంతలేదన్నా ఈ అధికారాన్ని పొందిన వ్యక్తి ఒక సుభేదారుడితో సమానం అనే లెక్క ఒకటుందిలే. పూర్వం సుభేదారుడికి మరియు అతనికన్నా పైనున్నోళ్ళకు మాత్రమే పల్లె జనాన్ని శిక్షించే అధికార తాహతు

ఉండేది. ఇప్పుడు సర్కారోళ్ళు ఆ అధికారాన్ని సుభేదారు నుంచి లాగేసుకొన్నారట. అందుచేత ఇప్పటి ఈ అధికారాన్ని పొందినోడు సుభేదారు కన్నా గురువింద గింజ వీసం ఎత్తు, బరువులలో పై అధికారాన్ని పొందాడనేది జనంలో ఒక భావనగా వృద్ధి చెందింది. గ్రామంలో కురువృద్ధుడైన అంజప్ప తన ఊరి కరణంకు లభించిన ఈ మర్యాదైన పదవి సమాచారాన్ని విని, రంగప్పను మాట్లాడించేందుకు మరియు కొద్దిగా బుద్ధిని చెప్పేందుకు అతడి గృహానికి వచ్చాడు.

అంజప్ప వస్తున్నదాన్ని చూసిన రంగప్ప "రా....రా.... అంజప్ప... కూర్చో" అని అన్నాడు.

"ఏమయ్యా, రంగప్పా.... నీకు బెంచ్ మ్యాజిస్ట్రేట్ పని దొరికిందట.... ఎంతగానో సంతోషం" అని అన్నాడు అంజప్ప.

"సంతోషాన్ని అటుంచు అంజప్పా. పుణ్యానికి చేసే కార్యం అది. డబ్బు, దస్కం ఏమి రాదులే..." అన్నాడు రంగప్ప.

అంజప్ప : "డబ్బు రాదా? ఎందుకు రాదు డబ్బు?"

రంగప్ప : "ఈ నౌకరనేది బెంచ్ మ్యాజిస్ట్రేట్.... హుందాతనంకనే నౌకరీని చేయాలి.... దీనికి సర్కారోళ్ళు జీతాన్ని ఇచ్చేది లేదు."

అంజప్ప : "జీతం లేకపోయినా గౌరవ భత్యం ఉంటది కదా... లంచాలు ఉంటవి కదా.... జీతం కన్నా గౌరవ భత్యమే గొప్పదిలే..."

రంగప్ప : "అదంతా పూర్వకాలంలో... ఇప్పుడు లంచం గించం నడిచేదిలేదు.."

అంజప్ప : "తీసుకొనేవాళ్ళు తీసుకొంటూనే ఉంటారులే. ఆ విషయాన్ని అలా వదిలేయి.... ఇప్పుడు నీకు కోపం వస్తే సుభేదారుడ్ని ఆపి జుల్మానా వేసే అధికారం ఉందా... లేదా?"

రంగప్ప : "నువ్వే మెజిస్ట్రేట్‌గా ఉంటే అలాగనే చెయ్యొచ్చు... నేను కరణాన్ని కనుక నాతోటి బ్రిటిష్ నౌకరోడికి జుల్మానా వేస్తే మొదటికే మోసం వచ్చి నన్ను ఉద్యోగం నుంచి తీసేస్తారు."

అంజప్పకు ఇది సబబేనని అన్పించింది. 'అవునవును' అని అంటూ తన సంచి నుంచి ఆకు, వక్కను బయటకు తీసుకొనేదాన్లో నిమగ్నమైయ్యాడు. అంజప్ప సంచిలోని ఆకులు, వక్కలు అతనిలాగే వయస్సు అయినవిలే. అతను ఆకుల్ని వేసుకునేటప్పుడు



అయ్యో ఇది ఖర్చు అవుతవని భావిస్తూ, బాగా పాతబడిన ఆకులనే తాంబూలం కొరకని వాడేవాడు. పాతవాటిని విసిరేది అతనికి ఇష్టం లేదు. వాడిన ఆకుల్ని వినియోగంలోకి తెచ్చుకొనే లోపలే ఈ కొత్త ఆకులు వాడిపోయి పాత ఆకుల స్థానంలో జమైయ్యేవి. సంచిలోని వాడిపోయిన ఆకులను, వక్కను సున్నంతో కలగలిపి నోట్లో వేసుకొంటూ "నీకొక మాట చెప్పేందుకని వచ్చాను" అని అన్నాడు అంజప్ప

రంగన్న : "ఏమి మాట... అంజప్ప? చెప్పు ... ఎంతో అనుభవస్థుడివి నువ్వు... మా అంతోళ్ళకు చెప్పేటి నూరారు మాటలు నీ దగ్గర ఉంటవిలే.."

అంజప్ప : "అందుకనే నేను వచ్చింది.... నువ్వు మ్యాజిస్ట్రేట్‌గా అయ్యావు కదా... ముద్దాయిలు నీ దగ్గరకు వచ్చినప్పుడు వీళ్ళు సత్యవంతులు; ఇక వీళ్ళు దొంగలు అనేది సరిగా తెలుసుకొని శిక్షలను విధించు. ఆ పోలీసోళ్ళు, వకీళ్ళు చెప్పేటి మాటల్ని విని శిక్ష విధించకు. ఈ ముఖ్య విషయాన్నే నీకు చెప్పేందుకని వచ్చాను."

రంగప్ప : "అది సరేలే... అయితే సత్యవంతులు, దొంగలు అనేది పరుల వాదనల నుంచే తెలుసుకోవాలి మ్యాజిస్ట్రేట్. స్వతహాగా మ్యాజిస్ట్రేట్ నేరపరిశోధనను చేయలేడుకదా...!"

అంజప్ప : "మ్యాజిస్ట్రేట్ అన్న మీదట నిజం ఏమిటి అని యోచించి ఎదురులో నిలిచినోడ్ని ఏమిటి ఈ ఫిర్యాదు అని విచారణ చేయాలి..."

రంగప్ప : "అంజప్పా.... నువ్వు కోపించుకోను అని అంటే, నిన్నే ఒక మాట అడుగుతాను.."

అంజప్ప : "అడుగు... కోపం నాకెందుకు?"

రంగప్ప : "నీ మీద ఎప్పుడైనా మ్యాజిస్ట్రేట్ విచారణ జరిగిందా?"

అంజప్పు : "సరిగానే అడిగావు... అందుకేలే నేనొచ్చింది నీ దగ్గరకు... ఒక కోడిని దొంగిలించాననే ఫిర్యాదును నా మీద మోపారు. దొంగిలించలేదనేది నా వాదం... దొంగిలించావనే ఆ కక్షిదారులు అన్నారు. ఇరవై రూపాయలు జుల్మానా లేకపోతే పక్షం రోజులు జైలు వాసం అని అన్నారు... జుల్మానా కట్టి బతుకుజీవుడా అని బయటపడ్డాను."

రంగప్ప : "నువ్వేకోడిని దొంగిలించావని వాళ్ళు ఎట్లా ఫిర్యాదు చేసారు? కోడి నీ దగ్గరే ఉందా....?"

అంజప్ప : "నా దగ్గరే ఉంది కోడి. నా దగ్గర ఉన్నప్పుడే నేను దొరికిపోయాను."

రంగప్ప : "దాన్ని (కోడిని) దొంగలించినట్లుగా ఉంది కదా..."

అంజప్ప : "దాన్నే నేను చెప్పేది... కోడి నా దగ్గరే ఉంది. అయితే నేను దాన్ని దొంగిలించలేదు."

రంగప్ప : "అలాగైతే ఈ ఫిర్యాదునంతా సవివరంగా చెప్పు.... వింటాను" అని అడగగా అంజప్ప చెప్పసాగాడు ఇలాగున.

ఈ ప్రహసనం (కత) నడిచి సుమారుగా నలభై సంవత్సరాలు అయ్యుండొచ్చు. అంజప్పకు నడి వయస్సు. అప్పట్లో అతను తన కులవృత్తికని ఊరూరా తిరుగుతుండేవాడు. జోగుళోళ్ళ వృత్తి అంటే సొగసుగా వేషాన్ని వేసుకొని, ఎడం భుజానికి జోలిని, కుడి భుజంకు 'కిందరి' వాయిద్యాన్ని వేళ్ళాడేసుకొని తాతకాలం నుండి నేర్చిన పాటల్ని పాడుతూ ఊరంతా భిక్షను పొందే విధంగా ఉండేది. అంజప్ప తాత – ముత్తాతల కాలంలో భిక్షను పొందేదేకాని నేలను దున్నేదిలేదు. ఇప్పుడు కాలం చెడిపోయి జోగుళోళ్ళూ వ్యవసాయాన్ని చేస్తున్నారుకదా! అంజప్ప దీన్నే బ్రాహ్మణులు నగరపేటలలో పాదరక్షల అంగళ్ళను పెట్టుకొన్నట్లుగా వర్ణిస్తుండేవాడు. భిక్షను వేడికొనేది నీచవృత్తే అని మనం అనుకోవచ్చు. అంజప్ప ఈ మాటను ఒప్పుకోడు. జోగి అంటే అదేమి ఊరికనే అయ్యేదా? ఇరవై సంవత్సరాలు నాయన జతగానో, మేనమామ జతగానో 'కిందరి'ని మోస్తూ పాడే పాటలకు, కీర్తనలకు జతగా శ్రుతి కలిపి పాడుతూ, వృత్తిని నేర్చుకొనేది అంటే మాటలా? ఏ యువకుడైనా నాగలి వెనుకే నిలిచి ఎద్దుల తోకను మెలిబెడుతూ చోచో అనచ్చు. పాటలను నేర్చుకోవాలంటే మృదు నాలుక ఉండాలి... బుద్ధి ఉండాలి. ఓంకారం అందరికీ వస్తదా.... లక్ష్మి అనేది అందరికీ వస్తదా.... 'లక్ష్మి'ని లచమి అని అంటారు కదా! ద్రౌపది దేవి అనేది అదంత సులభంగా నాలుకకు తిరుగుతదా... నేను వృత్తిని నేర్చుకొంటానని చెప్పినప్పుడు నా వయస్సు ఇరవై ఐదు సంవత్సరాలు. ఆ పిదప మా నాయన ఇప్పుడు పర్వాలేదులే... నువ్వు ఒక్కడివిగానే వెళ్ళొచ్చు అని అన్నాడు. జోగిగా అవ్వాలంటే ఇప్పుడు మనం బి.ఎ. డిగ్రీ పొందాలంటే ఎలాగో అలాంటిదే జోగి వృత్తి మరియు వయస్సున అర్హత అని చెప్పుకుపోసాగాడు అంజప్ప. మా చుట్టుప్రక్కల అరవైయ్యో, డైబ్భైయ్యో గ్రామాలలో అంజప్ప తిరుగుతుండేవాడని నాకు తెలిసొచ్చింది. జోగిగా అయినోడు ఇల్లొదిలి వెళ్ళాలంటే అందరి భిక్షువులు లాగ వెళ్ళేది సాధ్యమే కాదు. నాటకంలో రాజు పాత్రను వేసేటోడు ఎలాగున ముఖానికి, బుగ్గలకు, పెదాలకు, మీసాలకు రంగులు



వేసుకొంటాడో అలాగునే పాడేందుకు వెళ్ళే జోగి సాంప్రదాయ ప్రకారంగా అలంకారాన్ని చేసుకోవాల్సి యుంటది. జోగి శైవుడు కాదు, వైష్ణవుడు కాదు కదా! క్షుద్రదేవతలను పూజించేది లేదు. తనకున్న పరిధిలోనే దేన్నీ వదిలేది లేదు. అందుచేత అతడి ముఖం మీద విభూతి, కుంకుమ, పసుపు మూడు రంగులూ ఉండాల్సిందే. జతగా కాటుక. జోగికి కళ్ళు బహుక్రూరంగా ఉంటవికదా! అందుచేత జనానికి కీడుకలగకుండా ఉండేందుకని అతను కంటికి కాటుకను పెట్టుకొనే తిరగాలి. దాన్లోకూడా ఆ కీర్తనలను పాడే వేళలో భీముడిగా, హనుమంతుడిగా పాత్రలలోని పద్యాలను పాడుతున్నప్పుడు కళ్ళకు కాటుక లేకుండా ఉంటే ఈ తీక్షణమైన దృష్టి ఏమైనా జనంకు తగిలితే వాళ్ళు అక్కడే మూర్ఛపోగలరు. ముఖానికి ఒక అలంకారం అన్నట్లుగానే ధరించే బట్టలకు ఒకరీతి ఉండాల్సిందే. తలపంచ మూడు రంగులకు తక్కువ గాకుండా రంగు రంగుల పీలికలతో చేసిందై ఉండాలి. అంజప్ప వయస్సులో సుందర రూపుడిగానే ఉండేవాడు. జోగి వేషాన్ని వేసుకొని అతను పాడుకొంటూ వస్తే ఊళ్ళోని మహిళలు, పిల్లలు అతడ్ని కూర్చోబెట్టుకొని పాటలను పాడించుకొని భిక్ష వేసి పంపేవారు. "నేను ఎన్నో కీర్తనలను పాడాను.... ఎంతోమందిని సంతోషపరిచాను" అని అంజప్ప అప్పుడప్పుడు చెబుతుండేవాడు. ఇప్పటికి నలభై సంవత్సరాల వెనక ఇతడి జోగి వృత్తి ఎంతో ఉచ్ఛస్థితిలో ఉండేదట. ఇతను ఎంతోమందికి తన నైపుణ్యం మూలాన అవసరమయ్యే వాడట ఆ కాలంలో.

ఇతను వెళ్తున్న ఊళ్ళలో 'కాళాపుర' ఒకటిగా ఉంది. నేను ఊరి పేరును నిజంగా చెప్పటం లేదు. నేను చెప్పేది ఒక ఊహాపోహ ఊరు మాత్రమే సుమా: కాళాపూర తగు మోతాదులో పెద్దదైన ఊరే. అందుచేత అంజప్ప అక్కడికి వెళ్తే రెండు మూడు రోజులుండేది వాడికైంది. చూడటానికి అంజప్ప సుందరరూపి అని ముందే చెప్పాను కదా! ఇతను అలంకారాన్ని చేసుకొని పల్లెకు వెళ్తే, ఇతని రూపాన్ని మెచ్చే పల్లెపడతులు నాటకంలో సుందరుడైన నటుడ్ని మెచ్చే అభిమానులుగా ఇతడ్ని ఆ లెక్కతోనే జమ కట్టేవారు. కొంచం వయస్సుమీరిన మహిళలైతే, వాళ్ళతో జతగా కూర్చొని మాట్లాడేది అంజప్పడిలో ఉండేది. ఎందుకంటే ఇతనితో ఆ స్త్రీలు మాట్లాడితే వాళ్ళను గదిరించేవాళ్ళు లేరులే. కొంచం చిన్న తరుణంలో ఉండే స్త్రీలైతే అంజప్ప వెనకడుగు వేసేవాడు. ఇంటిలోని యజమాని "ఏమయ్యా.... జోగి...! భిక్షను తీసుకొని వెళ్ళేదాన్ని వదిలి ఇంటి ఆడోళ్ళతో మాటల్ని మాట్లాడుతున్నావు కదా.... బయటకు నడువు" అని గదిరిస్తుండేవాళ్ళు. కొంటె మనస్సున్నోళ్ళు "ఏమిటి జోగప్పా.... నీ లీలలు" అంటూ నవ్వేవాళ్ళు. భిక్ష నుంచే జీవించే

ఈ జోగికి ఈ రెండు వైవిధ్య మాటలు కష్టమేకదా! అనేది అంజప్పలో ఉండేది. కాళాపూరులో ఒకసారి ఇతను వెళ్ళినప్పుడు ఆ ఊరి పటేల్ భార్య ఇతడ్ని కూర్చోబెట్టుకొని కీర్తనలను విన్నదట. పటేల్‌కు ఆమె మూడో భార్య. కీర్తనలను పాడించుకొన్న తరువాయి ఆమె ఇతడికి కొంచంగా ఆకు వక్కల దానాన్ని ఇచ్చింది. అంజప్ప వాటిని నములుతూ కొద్దిసేపు అక్కడే కూలబడ్డాడు. అంతలో పటేల్ వచ్చి ఇతడి మీద రేగిపోయాడు. అంజప్ప సామాన్యంగా ప్రతి మాటలను పలికే స్వభావం కలిగిన వ్యక్తికాదు. పటేల్ కొన్ని బూతు పదాలను వాడినందున ఇతనికి కష్టం కలిగి "నన్ను ఏదో అన్నారు... మీరు మీ భార్యలను ఏమని అర్థం చేసుకొన్నారు... మీరు మానవంతులైతే మీ భార్యలకు చెప్పండి... నన్నెందుకు దూషిస్తారు?" అని కటువుగా అంటుంటే పటేలేమో "కబడ్దారు... ఎప్పుడైనా నిన్ను బలిచేస్తాను" అని అన్నాడు. అంజప్ప భయపడకనే ఇంకాస్త గట్టిగానే రెండింతలు ఎక్కువైన మాటల్నే బదులుగా విసిరి జోలిని తీసుకొని విసవిసా బయటకు నడిచాడు పటేల్ ఇంటి నుంచి.

ఇదైన మీదట అంజప్ప కాళాపురంకు ఒకసారో రెండుసార్లో వెళ్ళాడు. ఏమి విశేషమూ జరగలేదు. మూడోసారి వెళ్ళినప్పుడు ఆ ఊర్లోని ఏదో వీధిలో ఒక ఇంటి అరుగుమీద కూర్చొని పాటలను పాడుతుంటే, పక్కింటి పడతి ఒకామె పాటను వింటూ ద్వారం వద్దే నిలబడింది. పాటను ముగించి అంజప్ప వెళ్ళే ఊపులో ఉన్నాడు. అప్పుడు ఆ ప్రక్కింటి పడతి అతడ్ని పిలిచి కొంచం భిక్షను జోలిలో వేసింది. మరుసటి రోజు అంజప్ప ఆ మహిళ ఇంటి చెంతకు వెళ్ళి పాటలను పాడసాగాడు మనోజ్ఞంగా. ఆ స్త్రీ అతడ్ని ఇంట్లోకి పిలిపించుకొని, కూర్చోబెట్టుకొని మనోజ్ఞమైన కీర్తనలను పాడించుకొని భిక్షను వేసింది. ఆ మహిళ ఇల్లు ఆ ఊర్లోని ఇళ్ళతో పోల్చితే పెద్దదైన లోగిలే అది. అంజప్ప "ఈ పెద్ద ఇల్లు ఎవరిది?" అని విచారించాడు. ఆ మహిళ ఎవరి పుత్రి? అని విచారించాడు. ఎవరిదో ఇల్లు. వారి నామాలు నాకు గుర్తేలేదిప్పుడు. వాళ్ళు పుణ్యవంతులు. అయితే ఆ మహిళ భర్త స్త్రీలోలుడట. ఆ మహిళకూడా చంచల స్వభావురాలేనట. అది అంజప్పకు అప్పుడు తెల్వదు. ఇంట్లో ఆమె, భర్త, అత్త ముగ్గురే ముగ్గురు. అత్త కోళ్ళను పెంచుతుండేది. కోళ్ళ వ్యాపారాన్ని చేస్తుందట. అంజప్ప ఆ తర్వాత కొంత కాలానికి కాళాపురంకు పునఃవెళ్ళినప్పుడు ఆమె ఇంటికి వెళ్ళాడు. ఆ స్త్రీ బాగానే ఉంది. అంజప్పలో చెడు ఉద్దేశం ఏమీలేదు. అయితే ఆమె ఎంతగానో మెచ్చుకోవటం చేత ఆమెకు పాటలను విన్పించి, ఆమె సంతోషపడితే చూడాలనే చపలం అతనికుంది. వీధిలో జనానికి పాటలను విన్పించి, వారంతా వెళ్ళిన మీదట అంజప్ప ఆ మహిళ ఇంటి ద్వారం ముందు



కూర్చొని ఆకు వక్కను వేసుకొన్నాడు. కొంచం సమయం గడిచిన మీద ఆ స్త్రీ ద్వారం వద్దకు వచ్చి "జోగయ్యా... నువ్వు ఈ ఊరి నుంచి తిరిగి వెళ్ళేటప్పుడు మరలా ఒకసారి వచ్చి వెళ్ళు" అని అంది. "ఎందుకు తల్లి... నేను ఇప్పుడు వెళ్ళనా" అని అంజప్ప అన్నాడు. "నీ పాటలను విని ఎంతో సంతోషం కలిగింది. నీకేమైనా ఇద్దామని ఎన్నోసార్లు అనుకొన్నా.... నేనిచ్చేదాన్ని తీసుకొని శీఘ్రంగా వెళ్ళిపోవాలి.... మా అత్తకు తెలిస్తే రాచిరంఫాన పెద్దది" అని అంది. అంజప్పకు ఆ పుచ్చుకొనేదాంట్లో చచ్చే భయం కలిగింది. వద్దులే అని అందామంటే మనస్సు ఒప్పటం లేదుకదా! అయితే ఇతను ఏదో చెబుదామనే లోపే, ఆ మహిళ లోనికి వెళ్ళి అక్కడ్నుంచి "జోగయ్య... ఇక్కడికిరా..." అని పిలిచింది. అంజప్పలోనికి వెళ్ళాడు. ఆమె ఒక కోడిని ఇతడి జోలిలో వేసింది. "బయటకు పో... బయటకు వెళ్ళు" అని అంది. ఏమిటి? ఎక్కడికి అనే ఆలోచనను చేయకనే అంజప్ప ఆ ఇంటి నుంచి బయటపడ్డాడు. ఇప్పుడు ఎవరైనా పట్టుకొంటే ఏమిటి గతి అనేది అతడి గుండెకు డబడబా కొట్టుకోసాగింది. ఆమె లోపలి నుంచి "భద్రం.... జోగయ్యా... నేనే ఇచ్చానని ఎవరితోనూ అనకు" అని అంది. అంజప్ప ఏమి మాట్లాడకనే తక్షణమే బయటకు నడిచాడు. ఊరి బయట అరమైలు దూరంలో ఒక బావి యుంది. అక్కడి వరకూ ఒకే సమంగా నడిచి, ఒక చెట్టు నీడలో కూర్చొని అప్పటి వరకూ జరిగిన సమాచారాన్ని నెమరేసుకొంటూ ఆకు వక్కను నోట్లో వేసుకొని నములుకోసాగాడు.

అంజప్పకు ఇప్పటి వరకూ ఈ రీతిగా అయ్యింది లేదు వృత్తిలో దిగిన లగాయితు. అతడికి ముమ్ముందు ఈ రీతిగా జరగకూడదు అని అన్పించింది. కోడి అంటూ ఒక మంచి వస్తువే. దాన్ని జోగులోడికి ఎవరు ఉచితంగా ఇస్తారు? అయితే అందరెదుట ఇచ్చే భిక్ష ఒక రీతిలో అభ్యంతరం లేనిది కదా! దాంట్లో మోసమనేది ఉండదు. ఈ కోడి విషయంలోని భిక్షలో మోసం చేరుకొని ఉంది. అంజప్పకు ఆ పడతి విషయంలోని దానం మహత్తుగానే ఉంది. ఎంతమంచి మహిళ ఆమె. ఎంత సుందరంగా ఉంది. మంచిగా మాగిన దబ్బ, నిమ్మపండు వర్ణంతో మేనిఛాయ ఉంది కదా! ఇటువంటి సుందరమైన భార్యను ఇంట్లో పెట్టుకొని భర్త ఎందుకని పరాయి స్త్రీల సాంగత్యాన్ని కోరుకుంటున్నాడనేది అతడి మెదడును కొరకసాగింది. ప్రపంచమే ఇట్లా. ధనవంతులైతే ఒకరకమైన జుగుప్సను కలిగించే అధర్మపు ఆటలు, బీదోళ్ళైతే ఆకలితో కూడిన చిల్లర దొంగతనాల ఆటలు అతడి మెదడులో మసలసాగినవి.

అంజప్ప ఈ విషయాలమీద మేథోమథనం జరుపుకొంటూ తను ఉండేది క్షేమం కాదనేది మరిచాడు. కొంచం సమయం గడిచిన మీదట ఎవడో అగంతకుడు ఊరినుంచి

వచ్చి ఇతని వద్ద ఆగి "ఏమిటి జోగయ్యా... కూలబడ్డావు" అని అడిగాడు. అంజప్ప "కూర్చున్నాను. విశ్రాంతి తీసుకొంటున్నా... నాయనా" అని బదులిచ్చాడు. జోలి నిండిందా అని పల్లోడు అడిగాడు. "ఆ.. నిండిందిలే" అని అంజప్ప అంటే ఆ వచ్చినోడు జోలి మూటను విశాలంగా చేసి చూసాడు నిశితంగా...! ఆ జోలిలో కోడి ఉంది కదా! ఇదేంటి... జోలిలో కోడియుంది అని అన్నాడు ఆశ్చర్యంతో ఆ అగంతకుడు...! అంజప్పకు గుండె ఝల్లుమంది. "అవునయ్యా... అక్కడొక ఇంట్లో భిక్షగా ఇచ్చారు" అన్నాడు అంజప్ప. ఇకనూ మాట్లాడుతూ కూర్చొంటే ఎక్కడ? ఏ ఇంట్లో ఇచ్చారు? అనే చర్చలు వస్తవనే ఊహతో లేచి జోలి మూటను భుజాల మీద వేసుకొని బయల్దేరేందుకు సన్నద్ధమైయ్యాడు అంజప్ప. ఈ సమయంలో ఊరివైపు నుంచి ఒక వయస్సైన ముదుసలి ఎవడో ఒకడ్ని తోడుగా బెట్టుకొని వేగం వేగంగా అంజప్ప వద్దకు రావటం కనబడసాగింది. ఆ వచ్చే వాళ్ళకు వెనుకనే కొంచం దూరంలో ఇతనికి కోడిని భిక్షగా ఇచ్చిన ఆ పడతి కూడా వస్తుంది. అంజప్పకు మోకాళ్ళలో సన్నగా వణుకులు రాసాగినవి. అడుగుల్ని ముందుకు వేద్దామంటే కాళ్ళు స్వాధీనం తప్పినట్లైంది. ఇదేదో అనాహుతంకు దారిని ఇచ్చింది ఈ దానం అనేది అతడిలో భావనను కలిగించింది. అలాగునే వస్తున్నోళ్ళ వైపుకుచూస్తుంటే, దానాన్ని ఇచ్చిన మహిళ దూరం నుంచే ఇతనికి తను దానంగా ఇచ్చినదాన్ని చెప్పొద్దని చేతి సంజ్ఞలను చేయసాగింది. ఆ ముదుసలి దగ్గరకు వచ్చి, ఇతనేనా జోగయ్య అని కోడలితో అడిగింది. ఆమెతో జతగా వచ్చినోడు ఆ ఊరికి చెందిన తలారి. అవునా అని ఆ తలారి అడిగాడు కోడల్ని. "జోగయ్యా... మా కోడిని ఏమన్నా చూసావా నువ్వు?" అని అడిగింది అత్త. "అదేదో పాడు కోడి జోలిలోకి జొరబడింది! నాకు తెల్వనేలేదు... ఇంతకు క్రితమే ఈ అగంతకుడు చెప్పాడు" అని జోగైన అంజప్ప అన్నాడు. మొదటిగా వచ్చిన ఆ అగంతకుడు "ఎవరో భిక్షగా ఇచ్చారని చెప్పావు కదా" అని అంటుంటే "అయ్యో.... తండ్రీ... జోగికి పిడికెడు బియ్యాన్ని వేసేదే కష్టంగా ఉంటే.... కోడిని ఇచ్చేందుకు ఎవరు వస్తారు?" అని అన్నాడు అంజప్ప. తలారి జోలిమూటను తెరిచి చూడగా లోన కోడి మూర్ఛ స్థితిలో పడియుంది. ముసల్ది "ఫర్వాలేదు... కీర్తనలను పాడేందుకని ఇళ్ళలోనికి చొరబడి, కోళ్లను దొంగిలించేదాన్ని చేస్తున్నావు కదా" అని అంది. "నడువు... నడువు.. ఊరి పటేల్‌కు చెపుదాం.... బాగుంది నీ జోలి వృత్తి" అంటూ అంజప్పను వాచామగోచరంగా తిట్టసాగింది ఆ అత్త. "అమ్మా.... కోడిని నేను కాజేయలేదు... నీ కోడే అని నువ్వంటే తీసుకొని వెళ్ళు... నా మీద తిట్లదాడిని నిలువు తల్లి..." అని అంజప్ప అన్నాడు. "ఏంటయ్యో... ఎంతో సంపదున్నోడిలాగ మాట్లాడుతున్నావు... దొంగిలించకుంటే కోడి నీదగ్గరకు ఎలాగున వచ్చింది?" అంటూ



ముసల్ది కోడలివైపుకు తిరిగి "ఇది మన కోడే కదే" అని ప్రశ్నించింది. కోడలు గోడమీద పిల్లివాటం లాగ "ఏమో... మనదే కావొచ్చు అనేది ఉంది.. మనది కాదులే అనేది ఉందిలే"అని తల తిక్కగా జవాబిచ్చింది. "జోగయ్య మరెక్కడో ఖరీధించి యుండొచ్చేమో" అని మళ్ళీ అంది. "ఇవన్నీ ఏ విధమైన మాటలు... ఊర్లోని పటేల్ చెంతకు వెళ్దాం... జరిగిందంతా చెపుదాం.... వారే న్యాయాన్ని చేస్తారు" అంటూ తలారి హెచ్చరించాడు. అంజప్పకు తప్పించుకొని వెళ్ళిపోయే దారే కనబడలేదు. పటేల్‌కు తనమీద కోపం ఉందనేది అతనికి తెలుసు. ఇదేదో గ్రహచారం మీదబడింది కదా అని అనుకొంటూ జోలిని భుజానికి తగిలించుకొని, వాళ్ళతో కూడి మరలా ఊరిలోకే వచ్చాడు.

అక్కడ జరిగిన దాన్నంతా చెప్పినా ప్రయోజనం లేదు కదా! ఊళ్ళో కోళ్ళను పోగొట్టుకొన్నోళ్ళు. పోగొట్టుకోకుండా ఉన్నోళ్ళు జోగప్ప వృత్తాంతం మూలాన వెనుక దినాలలో తమ తమ కోళ్ళు మాయమైన దాన్ని ఒక పురాణంగా చెప్పసాగారు. పటేల్ పంచాయితి గద్దెనెక్కి "ఏమిరా జోగులోడా... ఇన్ని రోజులు పాడింది కీర్తనలు కాదు.... ఇప్పుడు లాకప్పుకు నెట్టే... అక్కడే పాడు పాటల్ని" అని హుంకరించాడు. పోలీస్‌స్టేషన్ అదెంతో దూరంలో లేదు. అక్కడికి ముద్దాయైన అంజప్పను, ఒక సవివరమైన రిపోర్ట్‌తో పంపించారు. అక్కడే వాంగ్మూలాలను ముద్దాయి మరియు కక్షిదారుల నుంచి తీసుకొన్నారు. అంజప్ప విచారణ నడిచే దినాలలో కోర్ట్‌కు హాజరౌతానని జామీను మీద స్వగ్రామంకు వచ్చాడు.

విచారణ నడిచింది. విచారణలో ఏముంది? ముసల్దాని ఇంటి నుండి కోడి మాయమైంది నిజం. ఆ కోడిని ఆమె గుర్తించింది. మ్యాజిస్ట్రేట్ అంజప్పతో "నువ్వేమి చెపుతావు" అని అడిగారు.

అంజప్ప: "ఎక్కడో నేను పాటలను పాడుతూ ఉంటే కోడి వచ్చి వెచ్చగా ఉందనే భావంతో జోలి లోపలికి చేరి యుండొచ్చు. నాకు తెలియలేదు అది చొరబడిందని. నేను జోలిని మామూలుగానే భుజానికి తగిలించుకొన్నాను".

మ్యాజిస్ట్రేట్ : "ఎంతటి పురాణాన్ని చెబుతున్నావు నువ్వు. కోడే వచ్చి నీ జోలి లోపలికి చొరబడిందా....? నిజాన్నే చెప్పు."

అంజప్ప: "మహా ప్రభో... సత్యాన్నే చెపుతున్నాను... మీరు చెప్పిన దేవుళ్ళమీద ఒట్టు... నేను కోడిని కాజేయలేదు?"

మ్యాజిస్ట్రేట్ : "నువ్వు కోడిని దొంగిలించలేదు అని అంటున్నావు... కోడి స్వతహాగా జోలిలోకి వచ్చేది అసంభవం.... ఎవరైనా ఇచ్చారా...."

అంజప్ప ఆ కోడలు పిల్ల ఇచ్చిందని చెప్పాలనేది నాలుక చివరి వరకూ వచ్చింది. అయితే ఆమె ఎవరికీ చెప్పొద్దని దానమిచ్చేటపుడు అడిగినదాన్ని, ఆ తరువాత తనకు సంజ్ఞెలను చేసింది... ఇవన్నీ జ్ఞాపకంకు రాసాగావి. ఏదో పాపం.... భ్రమతో ఒక కోడిని ఇచ్చింది. ఆమెను ఈ రాద్ధాంతంలోకి లాగేది ఎందుకు అనే యోచన వచ్చి నిజాన్ని దాచాడు. ఏమి చెప్పకనే నిధానంగా ఉండిపోయాడు. ఏమి చెపుతావు అని మ్యాజిస్ట్రేట్ మరలా అడిగాడు.

అంజప్ప: "ఏమి చెప్పేది మహాప్రభో.... ధర్మాధికారి మీరే.... నిజం ఏమిటనేది మీకు దేముడే తెలియజెప్పాలి... నేనైతే దొంగించలేదు."

మ్యాజిస్ట్రేట్ ఇతనిమీద ఒక నేరారోపణ ఉందని చార్జిషీట్‌ను రాసుకొని, నీ నుంచి సాక్షులున్నారా అని అడిగాడు. "అయ్యో మహాస్వామి... నాకెవరు సాక్షులున్నారు.... దేవుడే సాక్షి" అని అంజప్ప అంటుంటే, దొంగోడైనా ఎంత నాజూకుగా, తెలివిగా మాట్లాడుతున్నాడని భావిస్తూ ఇరవై రూపాయల జుల్మానా అది కట్టకపోతే పదిహేను రోజుల శిక్ష అంటూ తీర్పును చెప్పాడు. అంజప్ప జుల్మానా కట్టి వాడిన మోముతో తన ఊరికి తిరిగొచ్చాడు.

ఇది జరిగి నలభై సంవత్సరాలు పైబడి యుండొచ్చు. అంజప్ప ఈ కథను చెప్పి "మ్యాజిస్ట్రేట్ అంటే ఏమని అనుకొంటున్నారు.. తప్పు చేసినోడికి శిక్ష వేసి, సత్యవంతుల్ని కాపాడేది దేవుడి కార్యం లాంటిది. ఆ కార్యం మనిషి చేతికి వచ్చినాక ఆ మనిషి దేవుడి లాగ నడుచుకోవాలి. ఎక్కువ తక్కువ అవ్వొచ్చనే భయం ఆ న్యాయాధికారిలో ఉండాలి. ఇవి లేకుంటే నాకు శిక్షను వేసిన ఆ మ్యాజిస్ట్రేట్ నుంచి జరిగిన అన్యాయం లాంటిది ఎవరికీ రాకూడదు" అని అన్నాడు.

"నువ్వు చెప్పేది సరే అంజప్పా.... అయితే నిజాన్ని నువ్వు దాచటం చేతనే ఆ మ్యాజిస్ట్రేట్ సత్యాన్వేషణను ఎలా చేయగలడు" అని రంగప్ప అన్నాడు.

"నిజాలన్నీ ముద్దాయి నోటినుంచే వస్తే, దానికని న్యాయాన్ని చేయించే కార్యానికి మీ అంతటి సమర్థులైనోళ్ళు ఎందుకు నియోగించబడుతారు? సత్యం ఏమిటనేది తెలుసుకొనేదే మ్యాజిస్ట్రేట్ గారి డ్యూటి" అని చెప్పాడు అంజప్ప.



"యువతి మర్యాదను నిలపాలనే నువ్వే జుల్మానాను కట్టావు... ఏదోలే... మంచిదే అయ్యింది కదా..." అన్నాడు రంగప్ప.

"అయ్యో.... అదేంటి అలా అంటున్నారు... ఆ యువతి ఒకడితో అక్రమ సంబంధాన్ని పెట్టుకొందట..... రెండు మూడుసార్లు ఆ ప్రియుడికి కోళ్ళను ఇచ్చిందట. ఆమె అత్తేమో కోళ్ళు ఏమైనవి అని అంటూ ఆరాతీస్తుందట. ఎవడో దొంగిలించి యుండొచ్చు అని ఆ కోడలు పిల్ల చెపుతూ వస్తే... ఆ అత్త నమ్మటం లేదట. ఒకసారి కోడి పోయిన సమయాన.. తనంతోడి చేతిలో ఆ కోడి ఉండేది కనుగొనబడి తను (ఆ కోడలుపిల్ల) నిరూపణం చేయగలిగితే తన అక్రమ సంబంధ మోసం మూసివేయబడుతదని ఆ కోడలు పిల్లే ఇంతటి నాటకాన్ని జరిపింది అని నాకు ఆ తర్వాత తెలిసింది."

"ఏమిటి ? నీకే కోడిని ఇచ్చానని ఆ కోడలు పిల్ల తనే అత్తకు చెప్పిందా?" అని అడిగాడు రంగప్ప.

"అలాగని కాదులే... అత్త వచ్చి బంగారం లాంటి కోడి కనబడుట లేదు అని కోడల్ని అడిగితే నాకు తెల్వదు అని ఆ యువతి అందట. అలాగైతే ఏమైందే కోడి... ఇక్కడికి ఎవరైనా వచ్చారా అని అత్త అడిగితే నాకు తెల్వదు అని అందట ఆ యువతి.. ఆ తర్వాత ఎవరో జోగయ్య వచ్చాడని చెప్పారట.... పక్కింటోడు అవునవును జోగయ్య మీ ఇంటి నుంచి ఎంతో వేగంతో వెళ్ళాడు అని చెప్పగా, ఆ దుర్దినాన కాలం అంతా సరిగ్గా అతికిపోయి, నేను చిక్కాను ముద్దాయిగా".

ఆ తర్వాత వెళ్ళి "యువతితో ఇట్లా చెయ్యొచ్చా" అని అడగలేదా? అని రంగప్ప అంటుంటే, ఆమెను కల్సేందుకు నాకు మనస్కరించలేదు. ఆ వివరాల్ని ఆమె నుంచి పొందేందుకు నాకే జుగుప్సగా అన్పించింది అని అన్నాడు జోగైన అంజప్ప.

చివరిగా రంగప్ప "సరే.... వదిలేయి ఆ కోడి కతను... నిన్ను ఎవరైనా ముద్దాయిగా చేసి నా వద్దకు తీసుకొస్తే సత్యము ఏమిటి అని సరిగా తెల్సుకొని నిన్ను వదిలేస్తాను అంజప్పా" అని అన్నాడు.

"ఇక ముందు నేను నరమానవుడి ఎదురులో తప్పు చేసినోడని నిలిచేది లేదులే రంగప్పా...! నా మ్యాజిస్ట్రేట్ నా తండ్రైన వెంకట రమణస్వామే (తిరుమల వెంకటేశ్వరుడే)...! ఆ స్వామి చెంతకే వెళ్ళి, నిలబడి, ఏదో విషపు గడియలో తప్పు చేసానని ఒప్పుకొని, ఆ మహాస్వామి కాళ్ళమీద పడతాను. ఆ స్వామే నన్ను కాపాడుతాడు" అని అన్నాడు అంజప్ప. నేను మౌనంగానే ఆ నిర్భీతి మాటలను విన్నాను. అంజప్ప

ఇంకొంచెం సమయం నా వద్దనే కూర్చొని, "ఏమిటి రంగన్నా... నువ్వు మ్యాజిస్ట్రేట్‌గా అయినదానికి నాకు ఆకు, వక్కల్ని ఇచ్చేది లేదా" అని అంటుంటే, ఇంట్లో చాకిర్ని చేస్తున్న పనోళ్ళను పిలిచి అంజప్పకు ఆకు, వక్కల్ని కానుకగా ఇప్పించాడు రంగప్ప. అంజప్ప వాట్ని తీసుకొంటూ "నేను చెప్పింది బాగా జ్ఞాపకంలో పెట్టుకో... ఇక వెళ్ళొస్తా" అని చెప్పి బయటకు నడిచాడు.

- 0 -

19-09-2007

శాఖమూరు రామగోపాల్



దివంగత డా॥ బెసగరె హళ్ళి రామణ్ణ "గాంధి" కన్నడ కథకు అనువాదం

# గాంధి

**ఒ**క రోజు ఇండియాలోని కర్నాటక రాష్ట్రంకు చెందిన ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో - ఆరోజు సోమవారం అయినందున జనమే జనం - పెద్దాసుపత్రిలో జమైనట్లుగా రోగులు తమ పేర్లను నమోదు చేయించుకొని (గుమస్తా అమృతహస్తం నుంచి తమ పేరును, కులగోత్రాన్ని, వయస్సు మొదలైన వాటితో నింపుకొన్న) చీటీ మూలకంగా వైద్యాధికారిని కల్సే వ్యవస్థకు ఇక్కడ అవకాశమే లేనందున, మొదటగా వచ్చిన రోగి ఏదో మూలలలో లేకపోతే వైద్యాధికారి చెంతనున్న గది తలుపుల వద్దో నిలబడి అసహాయకంగా పిలిపిలిగా కంటిరెప్పల్ని కొట్టు, డాక్టర్‌బాబు కృపకోసం ఎదురుచూస్తూ, ఒక్కొక్కసారి సుస్తైపోయి వరండాలోనే తెచ్చుకొన్న నీళ్ళసీసానో, చద్దిమూటనో తలెదిండుగా చేసుకొని తమపాటికి తామే వచ్చిన కార్యాన్నే మర్చిపోయి బాధతో మూలుగు, నిట్టూర్పులతో పడుకొని యుండేది ఈకేంద్రంలో అదొక మామూలు రీతిగానే ఉంటుండేంది కదా! ఇలాగున ఏమిటేమిటో నమ్మలేనట్లుగా ఉంటుండేవి రోగుల ప్రవర్తనాలు. చివర్లో వచ్చినోడికి డాక్టర్‌బాబు నుంచి హార్థిక స్వాగతం. ఇకనూ వర్ణించటానికి అవకాశం రానటువంటి వర్గజనం ఆ కేంద్రం వద్దకు వచ్చినపుడు డాక్టర్‌బాబు మరియు ఆసుపత్రి సిబ్బంది నుంచి కృతకమైన స్వాగతం.... ఇలాంటి వాటన్నిటికి ఇక్కడ అవకాశాలు ఉన్నందుచేతనే 'బళ్ళికెరె' అనే ఊరునుంచి సూర్యోదయానికి ముందే ఆస్పత్రికి చేరుకొని వైద్యం కోసమని ఎదురుచూస్తున్న ఒక మహిళ మరియు సుమారుగా పదిహేను సంవత్సరాల తరుణ వయస్సులో ఉన్న ఒక బాలుడు ఎంతో సమయం వరకూ ఎవరి గమనానికి రాకనే పడి యున్నారు దీనులుగా. ఆ మహిళ, ఆ బాలుడికి తల్లి. సుమారుగా నలభై ఏళ్ళు ఉండొచ్చు ఆమెకు. బాలుడు వరండాలోని స్తంబానికి ఒరిగిపోయి ఆస్పత్రికి వచ్చేపోయేవాళ్ళను ఏమీ కుతూహలం లేకుండానే చూస్తూ కూలబడియున్నాడు. అతనిలో పదిహేను సంవత్సరాల ప్రాయంకే ప్రపంచం మీద ఒక విధమైన జుగుప్స ఆవరించుకొనియుంది. కూర్చుని, కూర్చుని విసిగిన అతను, అతని చెంతనే నిల్చిన తల్లి చీర చెంగును బలంగా లాగి...

"అమ్మా.... ఎంతో పొద్దు అయ్యింది, ఎండ వేడిమి అధికంగా ఉంది, పోదాం పద ఊరికి"

"కొంచెం నిధానించు.... వచ్చినోళ్లు చూపించుకొని వెళ్ళిపోతున్నారు కదా....!"

"సూర్యోదయానికి ముందే వచ్చాం కదా.. మనం ... అమ్మా...."

"ఇక్కడ మన రాగాన్ని (మన వేదనను) ఎవరు వింటారు బిడ్డా..."

తన తల్లి నుంచి వచ్చిన యాతనామయమైన ధ్వనిలోని అసహాయకత్వమూ మరియు చుట్టుప్రక్కల ఉన్న వాతావరణంలో నిష్కరుణనే నింపుకొన్న విధాన్ని గమనించిన ఆ బాలుడు తన కోసం తనను కనిమోసిన తన తల్లి మౌనంగానే బాధను, అవమానాన్ని సహించుకొంటూ నిల్చిన విధానాన్ని గమనించుకొని "నేను ఉంటే ఎంత, సస్తే ఎంత.. పదపద ఇక్కడనుంచి వెళ్ళిపోదాం ఊరికి" అన్నాడు అతను.

"ముప్పొద్దులా 'చస్తాను.... చస్తాను' ఇదే నీ నాలుకనుంచి"

"బతికుండీ నేను ఏ రాజ్యాన్ని ఏలాలి...?" వయస్సుకు మీరిన అనుభవాల మాటలు తన బిడ్డ నోటినుంచి రాలిపడినదాన్కి, ఆ తల్లి ఆశ్చర్యాన్ని చెందలేదు. ఈ లేత వయస్సుకే అనుభవించిన బాధల వలన అటువంటి మాటలు అతని నోటినుంచి వస్తున్నవని ఆమె గ్రహించుకోసాగింది. కన్నపేగులు చురుక్‌మని అన్పించగా ఆ తల్లి తన చీర చెంగునుంచి కన్నీరు తుడుచుకొంది. తన దేహంలో చొరబడిన వ్యాధిలోని బాధను, తల్లి అసహాయకత్వాన్ని, తమకు ఎదురౌతున్న అవమానాన్ని ఇక సహించుకోలేను అనే రీతిలో ఆ బాలుడు దఢాల్నే (గబుక్కనే) లేచి ముందుకు నడవసాగాడు...

"ఎక్కడికి పుత్రా?"

'డాక్టర్ బాబును కల్సేందుకు...."

"మొదలే తూలుతున్నావు.. ఎక్కడైనా పడిపోగలవు" అంటూ ఆపేందుకు వచ్చిన తల్లి చేతుల్ని నెట్టేస్తూ వైద్యాధికారి గదిలోకి ప్రవేశించి, అక్కడ పోగైన జనాన్ని చీల్చుకుంటూ డాక్టర్‌బాబు ముందు నిల్చి జోరుగా "సార్...! నేను, మా అమ్మ సూర్యోదయానికి ముందే ఇక్కడకు చేరుకొని మీ కోసం వేచియున్నాం..." అంటూ పలికాడు.

డాక్టర్‌బాబు తలెత్తి చూసినప్పుడు సుమారు ఎత్తుతో, ఎముకల గూడుతో, పెద్ద చెవులతో, బానకడుపుతో ఉన్న ఒక తరుణబాలుడు తన ముందు నిలబడినదాన్ని గ్రహించాడు. అవ్యక్తమైన బాధతో కూడిన రోషం ఆ బాలుడి ముఖంలో ఉంది.



ఆ బాలుడే మరలా చెప్పాడు ఈవిధంగా : "నన్ను ఒకసారి పరీక్షించండి సార్!"

వైద్యాధికారి ఈ అపురూపమైన బాలుడ్ని చూసిన తక్షణం కొద్దిగా కుచేష్ట చేయాలనిపించి, అతడ్నే చూస్తూ, "బాబూ... చూడ్డానికి భలేగా ఉన్నావులే.. నీ బాన కడుపు, చేతులు కాళ్ళు సువ్వలుగా.... చెవులు మాత్రం గాంధి తాతకున్న చెవులు లాగ ఉన్నవి కదా...!"

ఆ పిల్లోడు తన కుడిచేతిని ముందుకు చాపి, "నాకు సంక్రమించిన జబ్బును చూడండి సార్" అంటూ మరలా వేడుకొన్నాడు.

"మీకు మ్రొక్కుతా సార్... కోపాన్ని చెందకుండా పరీక్షించండి సార్.. వీడొక్కడే నాకు మగ సంతానం...!" ఆ మహిళ దీనంగా మొరపెట్టుకుంది.

డాక్టర్‌బాబుకు తన ముందు నిల్చిన వ్యక్తులు తనలాగనే మనుష్య వర్గానికి చేరినోళ్ళని జ్ఞాపకంకు వచ్చిందో లేక వైద్యులైన వాళ్ళకు మమతానురాగాలతో కూడిన హృదయం ఉండాలనే వైద్యోపనిషత్ లోని వాక్యాలు గుర్తుకొచ్చినవో ఏమో...! మరేమి మహిమో...! మొత్తంగా ఈ తల్లి – బిడ్డడు మీద కరుణ జాలువారి "ఇతను మీకుమారుడేనా... తల్లీ?"

"ఔను స్వామి..... దేవుడి మీద ఆన!"

"ఇతని పేరేంటమ్మా?"

"గాంధి... స్వామి!"

"ఏమిటమ్మా... ఏదో కుచేష్టకని నేను ఇతని చెవులు గాంధి తాతకు ఉన్నట్లుగా ఉన్నవని అంటే, ఇతడ్ని సాక్షాత్ గాంధి అన్నట్లుగానే చేసేసావు కదా... తల్లీ!"

"లేదు స్వామీ, అబద్ధాన్ని చెప్పితే నా నాలుక తెగిపోనీ.. చీలిపోనీ... నామీద ఒట్టు... నా కొడుకు పేరు గాంధీనే....!"

"దేవుడి మీద ప్రమాణం సార్... నా పేరు మహాత్మాగాంధీనే" ఆ పిల్లోడు ధైర్యంతో, దృఢంగా చెప్పాడు.

వైద్యాధికారి మూగబోయాడు. అతనికి, అతని సర్వీస్‌లో ఇప్పటివరకూ, ఈ రీతిలో అయ్యిందాన్ని ముందెన్నడూ చూడలేదు. వినటమూ జరగలేదు. తన జీవితంలో ఒదిగొచ్చిన ఈ ఘటన ఎంతో అపురూపంగా భావించి, దీన్ని తన సహోద్యోగులతో పాలుపంచుకొందామని, మరలా ముమ్ముందు తను ఎవరితోనైనా వర్ణించేటప్పుడు (చెప్పేటప్పుడు)

ఇదొక కట్టుకథ అని వినేవాళ్ళు ప్రశ్నించితే, ఇంతంతోళ్ళు ఉన్నారు అప్పుడు; కావాలంటే వాళ్ళను అడిగి తెల్సుకోండి అని అనేందుకు సాక్షులను దఖలు పర్చుకొనేందుకని జవానును (ప్యూన్‌ను) జోరుతో కేకల్ని పెట్టి పిలిచాడు.

"చూడూ... నాయ్డును, నరసింహమూర్తిని, నరసమ్మనూ నేను పిలుస్తున్నానని త్వరగా చెప్పి, అర్జంట్‌గా రావాలని చెప్పు" అని హుకుం చేయగా, వారందరూ ఆ డాక్టర్‌బాబు వద్దకు వచ్చారు. వైద్యాధికారి చెప్పిందాన్ని విని కిసుక్కునే నవ్వారు. అందులోనూ కొంతకాలం క్రితమే కుటుంబ కల్యాణ యోజన విస్తరణాధికారిగా ప్రమోషన్ పొందిన నరసింహమూర్తి (తను) దీనిని నమ్మేదేలేనట్లుగా మరొకసారి కిసుక్కునే నవ్వాడు. వైద్యాధికారికి కొంచెం కోపం అధికమై,"కావాలంటే మీరే ఆ బాలుడ్ని అడగండి" అంటూ, చిన్నగా గద్దించాడు.

"ఓయ్.,. పోరడా.... ఆ ఫోటో ఎవర్ది?" వైద్యాధికారి కుర్చీ వెనుకన గోడకు వేళ్ళాడదీసిన ఫోటో ఒకదాన్ని చూపిస్తూ అడిగాడు నరసింహమూర్తి.

"మహాత్మాగాంధీ గారిది సార్... ఇది నాకు గుర్తే...!"

"నీ పేరేంటి?"

"మహాత్మాగాంధి... సార్"

"అబద్ధాల్ని చెప్పమాకు...?"

"అబద్ధాల్ని చెప్పి మీ దగ్గర నుంచి నేను ఎంతటి సామ్రాజ్యాన్ని గుంజుకొనేది నాకు అవుతదా?" అందరి నాలుకలు తడారిపోయినవి. స్థాణువులై (శిలలై) నిలిచారు ఆ ఆస్పత్రి సిబ్బంది. మహాత్మాగాంధి ఫోటోను ఒకసారి, తర్వాత రక్త – మాంసాల్ని నింపుకొని శ్వాసను వదుల్తూ, పీల్చుతూ బాధను అనుభవిస్తూ నేలమీద తమకళ్ళెదుటే నిల్చిన ఈ మహాత్మాగాంధి వైపుకు ఒకసారి దృష్టిని విసురుతూ నిల్చారు ఆ సిబ్బంది. వైద్యాధికారి మరియు అతడి బళగం (పరివారం) జగత్తులోని ఎంతటిదో అయిన విస్మయకర విషయాన్ని చూసినోళ్ళలాగ నిలబడిపోయిన విధంను చూసిన ఈ మహాత్మాగాంధీకి (పిల్లోడికి) అసహనం పుట్టింది.

"నా ఆరోగ్యాన్ని చూడండి సార్! నా నుదుటిరాతను..." అన్నాడతను.

"నీకు ఈ పేరును పెట్టిందెవరు?" అడిగారు ఆ సిబ్బంది.

"మా తాత కరిసిద్దగౌడే... నాకు ఈ పేరును పెట్టారు సార్...!"



వైద్యాధికారి హెడ్‌నర్స్‌ను పిల్చుకొని, గాంధీని పరీక్షించేందుకని బారు బల్లమీద పడుకోబెట్టమని ఆదేశించాడు. ఆమె అతడ్ని బల్లమీద పడుకోబెట్టింది. నాలుక, కళ్ళు, గొంతును చూసిన మీదట గుండెను పరీక్షించి, ఆ పిమ్మట కడుపు భాగాన్ని ఒత్తి ఒత్తి పరీక్షించి, అవన్నిట్నీ చేసిన మీదట వైద్యాధికారి గాంధి తల్లివైపుకు తిరిగి, "నీ పేరేంటమ్మా?" అని అడిగాడు.

"నింగమ్మ .... స్వామి!"

"చూడు నింగమ్మా... నీ కొడుకు కడుపులో నీరు చేరుకొంది. దానికి తోడు కాళ్ళూ వాచినవి. ఇది హృదయానికి (గుండెకు) సంబంధించిన జబ్బు. ఇప్పటికే లివర్‌కు రోగం అంటుకొని, దానినుంచే గాంధి నొప్పి, బాధ అంటూ విలవిలలాడుతున్నాడు...."

'ఏమిటో స్వామి... మూడుమైళ్లు నడిచేటప్పటికి ముప్పై చోట్ల కూర్చున్నాడు. దేగుకొంటూ వచ్చాం ఇక్కడికి. ఇక్కడే ఉండనీయండి... రేపు మా నాయనను పిల్చుకొని వస్తాను.. తండ్రిలేని బాలుడు నా కొడుకు..."

"నీ మొగుడికి ఏమై చనిపోయాడు?"

"స్వామీ.. తాటికల్లును దించేటప్పుడు ఒకరోజు చెట్టునుంచి జారిపడి, తక్షణమే ప్రాణాన్ని వదిలాడు."

"అయ్యో పాపం! ఎంత కష్టం వచ్చింది నీకు...! చూడమ్మా... నీ కొడుక్కి ఎక్స్‌రే తీయించాలి. గుండెను మరొకసారి పరీక్షించాలి.. రక్త, మూత్ర పరీక్షల్ని చేయాల్సి ఉంటుంది. ఈ కేంద్రంలో ఇవేవి అయ్యేవి కావు. ఇతడ్ని తక్షణమే జిల్లా ఆస్పత్రిలో చేర్పించాలి. నేను అంతట్నీ వ్రాసి ఇస్తాను. పొట్టలో చేరిన నీరు తగ్గేందుకు ఇప్పుడు టెంపరరీగా (తాత్కాలికంగా) రెండు మాత్రల్ని మింగిస్తాను" అంటూ నీళ్ళను తెప్పించి మాత్రల్ని మింగించాడు. సరసరా జిల్లా ఆస్పత్రికి గాంధీకి అంటిన రోగం గురించి తను కనుగొన్న విషయాలన్నిట్నీ వివరంగా నమోదు చేసి, ఆ కాగితాన్ని వాళ్ళ చేతులలో పెట్టాడు.

❀ ❀ ❀

మనమడి ఆరోగ్య స్థితి బాగలేదు అనేది కరసిద్దేగౌడకు ఎవరూ చెప్పనవసరం లేదు. అతడి ఆశెల పల్లకీలో తన కూతురైన నింగమ్మ మరియు ఆమె బిడ్డలైన పద్ది (పద్మ)మరియు గాంధీ మాత్రమే కొలువై యున్నారు. పద్మ ఎంతైనా మెట్టినింటికి పోయే

బాలికే కదా! అందుచేత గాంధిమీద కరిసిద్దేగౌడకు ఎంతగానో వాత్సల్యం ఉంటుండేది. తన మనమడికి పేరును పెట్టిందే (నామకరణం) ఒక మర్చిపోలేని సంఘటనగా ఉందిలే. ఒకరోజున పొలాన్ని దున్ని తను మరియు అల్లుడైన బుక్కేగౌడ పొద్దు మునిగిన మీదట ఇంటికి చేరుకోగా నవజాత శిశువు ఆక్రందన విన్పించసాగింది. కరిసిద్దేగౌడకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు. తన మనమడి వెడల్పాటి చెవులను చూసి ఆనందభరితుడై ఊరి పూజారి వద్దకు వెళ్ళాడు. పూజారి ఎంతో ప్రశస్తమైన గడియలలో నీ మనమడు జన్మించాడని లెక్కలను వేసి, ఆ నవజాత శిశువుకున్న చెవులు విశాలంగా (పెద్దవిగా) ఉన్నందునో మరియు కరిసిద్దేగౌడ వెనకెప్పుడో మహాత్మాగాంధీ శివపురంకు వచ్చినప్పుడు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అతనొక్కడే వెళ్ళి కల్సినందునో, ఆ శిశువుకు 'మహాత్మాగాంధీ' అనే పేరును పెట్టాలని ఆ పండితుడు తీర్మానించాడు. కరిసిద్దేగౌడ ఎంత ముగ్ధ (బోళా) మనిషి అంటే, 'మహాత్మాగాంధీజీ'నే తన కూతురు గర్భంలోకి ప్రవేశించి, మనమడిగా అవతారాన్ని పొందాడనే అభిప్రాయం అతనిలో ఉండేది.

కరిసిద్దేగౌడకు రెండు ఎకరాల భూమి, ఒక చిన్న పెంకుటిల్లు ఉంది. ఇప్పుడు ఆ రెండు ఎకరాల భూమి నుంచి ఒక ఎకరం బీదోళ్ళకు ఇళ్ళను కట్టించి పంచేదానికని గవర్నమెంట్ అతడి నుంచి వశం చేసుకొంది. ఈ చర్య కరిసిద్దేగౌడకు తన అల్లుడు మరణించిన దానికన్నా ఎక్కువగా బాధను కలిగించసాగింది. ఈ బాధలో మునిగి ప్రభుత్వం వశం చేసుకున్న ఆ ఎకరం భూమిలో ఉన్న సొగసుతో ఫలభరితమైన ఒక మామిడిచెట్టును (వృక్షాన్ని) కొట్టేసేది లేకపోతే దాన్ని సజీవంగానే ఉంచే జిజ్ఞాసలో ఇరుక్కుపోయి (మునిగిపోయి) అతను తన మనమడి ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టలేదు.

కూతురైన నింగమ్మ వైద్యుడు రాసిచ్చిన చీటీని తండ్రి చేతులలో పెట్టి, గాంధీని జిల్లా ఆసుపత్రికి చేర్పించాలని చెప్పినపుడు కరిసిద్దేగౌడ గుండె (హృదయం) కలుక్కుమంది. మరుసటిరోజు మొత్తం సంసారం అంతో ఇంతో డబ్బును, సామానును చేతపట్టుకొని బస్సులో పెద్దాసుపత్రి ఉండే జిల్లా కేంద్రానికి పయనమయ్యారు.

ఆస్పత్రికి చేరుకొన్నప్పుడు మధ్యాహ్నమైంది. ఔట్‌పేషెంట్లను చూసే విభాగంకు చేరుకొని అక్కడున్న గుమాస్తాకు తమ మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని వైద్యాధికారి ఇచ్చిన రోగం తాలూకు వివరాలున్న కాగితాన్ని ఇచ్చినప్పుడు, ఆ గుమాస్తా దాన్ని చూసి రోగి పేరును రెండుమూడుసార్లు చదివి ఏదో అనుమానం కలుగగా కరిసిద్దేగౌడ వైపుకు చూసి "ఎవర్ని చేర్పించేందుకు మీరు వచ్చారు?"అని అడుగుతుంటే కరిసిద్దేగౌడ తన మనవడి వైపుకు చేతిని నిలిపాడు. "ఓహో! ఇతడిపేరు 'మహంతగౌడే' కదా....! మీ



డాక్టర్ ఇతడ్ని మహాత్మాగాంధి అని రాసి ఉంటాడులే!" అంటూ కిసుక్కున నవ్వాడు.

"పేరును రాసింది సరిగానే ఉంది స్వామి.... నా మనమడి పేరు మహాత్మాగాంధీనే" అన్నాడు గౌడ. గుమాస్తా విస్మయంతో తెరిచిన నోటిని అలాగే పెట్టుకొని మహాత్మాగాంధీని చూసాడు. "సరేలే... తీసుకోండి ఈ చీటీని" అంటూ పాత శిఫారసు కాగితం జతగా ఇంకొక కొత్త చీటీని ఇచ్చి, ఆ వైపుకు వెళ్ళండి అని అన్నాడు.

అక్కడొకడు వీళ్ళిచ్చిన కాగితాలను మరియు ఇంకా అనేకమంది ఔట్‌పేషెంట్లు ఇచ్చిన కాగితాలను తీసుకొని లోనికి వెళ్ళి ఒక పెద్ద రౌండ్ టేబిల్ చుట్టూరా కుర్చీలలో కూర్చున్న వైద్యబృందం ముందు వాటిని పెట్టాడు.

మహాత్మాగాంధీ వంతు వచ్చినప్పుడు ఆ వైద్యుల గుంపులో కలవరం కలిగింది. జోరుగా "ఎవరయ్యా మహాత్మాగాంధీ?" అని పిలిచారు.

"తీసుకొస్తున్నాను... స్వామి, ఇదిగో ఇక్కడ" అంటూ కరిసిద్దేగౌడ తన మనమడ్ని వెంటేసుకొని లోపలికి వెళ్ళాడు. నింగమ్మనూ, పద్మనూ బయట ద్వారం వద్దే జవాను నిలిపేసాడు.

కరిసిద్దేగౌడ తమ ముందు నిలబెట్టిన ఆ రోగిని ఆ వైద్య బృందమంతా తామొక విచిత్రమైన రోగాన్ని శోధించామనో లేకపోతే క్యాన్సర్ వ్యాధికి ఔషధాన్ని కనుగొన్నామనో అనేంతగా విస్మయంతోనే చూసారు.

'మహాత్మాగాంధీ' అని పిలవబడే ఆ రోగిని చూసినమీదట వాళ్ళకు నవ్వాలో, ఏడ్వాలో కాకపోతే నమ్మేదేలేనట్లుగా ఒక స్థితిలో ఉండిపోదామో... ఏమితోచకనే యదావిధిగా పరీక్షను చేసే హాల్‌కు తీసుకొని వెళ్ళి, నిశితంగా పరీక్ష చేసి, కరిసిద్దేగౌడను పిల్చి, "చూడయ్యా... నీ మనమడికి హృదయవైపల్యం, మూత్రపిండాల జబ్బు అంటింది. ఔషధాల్ని రాసి ఇస్తాము... వాట్ని ఖరీదించుకోండి... ఏయే విధంగా వాట్ని వేసుకోవాలో అనే దాన్ని చెపుతాము... మేము చెప్పినట్లుగా ఔషధాల్ని అతనికి నియమిత కాలాలలో (టైమ్ ప్రకారం) ఇవ్వండి... కష్టం, బాధలు కొంచంగా తగ్గుతవి" అని బోధన చేసారు. కరిసిద్దేగౌడకు ఎవరో తనని గొంతు పిసికి నీళ్ళలోకి నొక్కేసినట్లైంది.

"మీకు కృతజ్ఞతలండి... ఏదో విధంగా నా మనమడ్ని కాపాడండి. ఇక్కడే కొన్నిరోజులు ఉండనీయండి... మీరు ఇతనికి చేసే ఉపకారం ఈ ముదిప్రాయానికి (నాకు) చేసే ఉపకారం అని భావించుకోండి... మీకు పుణ్యం వస్తది" అంటూ అక్కడే ఆ విశాలమైన

పరీక్షాగదిలో వేళ్ళాడించిన భారతద భాగ్య విధాత మహాత్మాగాంధీజి గారి భావచిత్రానికి (ఫొటోకు) చేతుల్ని జోడించి కన్నీళ్ళను కార్చుతూ నిలిచిపోయాడు గౌడ. వైద్యబృందం మరో మాట పలకకనే, పురుషుల వార్డ్‌లో మహాత్మాగాంధీని చేర్చుకోమని ఒక కాగితాన్ని రాసి, ఒక జవానును పిల్చి అతడి తోడుతో ఆ పిల్లోడిని పంపించారు.

❁ ❁ ❁

ఇక ఇప్పుడు జరగబోయే ముందు విషయాన్ని ఎక్కువగా పెంచకుండానే ముగించేది ఉత్తమంగా కనబడుతది మనకు. మహాత్మాగాంధీని ముప్పై మందికి మాత్రమే సరిపోయే వార్డ్‌లో అరవై మందిని చేర్చుకొన్న ఫలితంగా నేలమీదే కంబళి వేసి పడుకోబెట్టారు. ఎక్సరే, ఎముకల పరీక్షలను చేసి ఔషధోపచారం అనే వాట్ని చేయించ సాగారు. వైద్యులు రాసిన మందుల్ని కొని వాడుకోగా మూడురోజులకే కరిసిద్దేగౌడ తన వెంట తెచ్చుకొన్న డబ్బు కరిగిపోయింది.

నాలుగోరోజున గాంధి తన తల్లి నింగమ్మ మరియు చెల్లెలు పద్మ చెవి కమ్మల్ని విప్పి తన తాత చేతిలో ఎందుకు పెడ్తున్నారు అనేది గ్రహించుకొని తన తాతను పిల్చి "తాతా... నన్ను తిరిగి మన ఊరికి తీసుకొని వెళ్ళు... నా నుదుటి రాత ప్రకారమే అంతా నడుస్తది." అని అడుగుతుంటే "అలాగున మాట్లాడబోకు.... నేను ఇంకా బతికే ఉన్నాను గాంధి.... నిన్ను బతికించుకుంటాను" అన్నాడు గౌడ గద్గదితంగా.

తన మీద తాతకున్న పిచ్చి వాత్సల్యానికి గాంధీలో ఏడుపు హృదయంలోంచి ఒక్కసారిగా బయటకు పెల్లుబికిరాగా, తాత తొడమీద తలను ఆనించి తాత చూపులకు తన చూపులను నిలిపి "తాతా... నేను చనిపోతే మన మామిడిచెట్టు వేర్లదగ్గర నన్ను పూడ్చి పెట్టండి" అని అంటుంటే, ఆ వృద్ధుడు వెక్కి వెక్కి ఏడ్చాడు. నింగమ్మేమో "ఊరుకో బిడ్డా" అంటూ గాంధీని గదిరింది. "అన్నా... అన్నా" అంటూ పద్ది (పద్మ) ఏడవసాగింది.

ఇదంతా నడుస్తున్నప్పుడు ఎం.డి. పట్టాను పాసైన పెద్ద డాక్టరు ఒకాయన దయతో గాంధీని మరోసారి పరీక్షించి, ఒక చీటీలో మందును రాసి దాన్ని ఎంతో తొందరగా తేవాలని గౌడకు ఆజ్ఞను జారిచేసి, ఇక మిగిలిన రోగులను చూసేందుకు వెళ్ళిపోయాడు. కూతురు, మనమరాల చెవి కమ్మల్ని వారి వద్దనుంచి తీసుకొని స్వంత ఊరికి వచ్చిన గౌడ వాట్ని తాకట్టుపెట్టేందుకని ప్రయత్నించాడు. ఎవరూ తాకట్టుకని ఒప్పుకోలేదు. పోనీ అప్పు అయినా దొరుకుతదేమోనని ప్రయత్నించితే పాడు దుర్భిక్షం (కరువు) వలన



ఒక్క పైసా కూడా దొరకలేదు. మామిడివృక్షాన్ని కలప కోసమని ఒకడు రెండువందల ఏభై రూపాయలకు బేరమాడగా, ఆ డబ్బు దొరికేందుకు రెండురోజులు పట్టింది. డబ్బును పొంది కరిసిద్దేగౌడ బస్సెక్కి ఆస్పత్రి సమీపంకు చేరుకొంటుంటే నింగమ్మ గేట్ వద్దే పద్దిని (పద్మను) నిలబెట్టుకొని ఏడుస్తూ నిలిచినదాన్ని చూసిన గౌడ, "గాంధి ఎలాగున ఉన్నాడు" అని అడగనే లేదు. అందుకు బదులుగా "ఎప్పుడు చనిపోయాడు" అని అడిగాడు.

"రాత్రి 11-12 గంటల మధ్యలో దేవుడి పాదాల్ని తలిపాడు గాంధి... శవాన్ని చీకటి కొట్లో (శవాలగదిలో.. మార్చురీలో) వేసారు" అంటూ రోదిస్తున్న నింగమ్మను ఓదార్చుతూ "మనుషులు చావకపోతే.... రాళ్ళు చస్తవా... నిధానించు పుత్రీ" అంటూ గాంధి శవాన్ని పొందేందుకు అనుమతి పత్రం కోసం పెద్దసార్ ఉండేటి గది వైపుకు అడుగుల్ని భారంగా వేయసాగాడు కరిసిద్దేగౌడ.

\- 0 -

(స్వతహాగా వైద్యుడైన బెసగరహళ్ళి రామణ్ణగారు 1936లో కర్నాటకలోని మండ్యాజిల్లాలోని మద్దూరులో జన్మించి వైద్యవృత్తితో బాటు హాబీగా సాహిత్యవృత్తిని చేసారట. 1979లో రచించిన వీరి కథ ఒక శతాబ్దంలోని అత్యుత్తమ 82 కన్నడ కథలలో ఒకటిగా చేర్చబడిన దాన్ని, నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని లైబ్రరీలో చూచి అనువదించడం జరిగినది.)

03-02-2008

శాఖమూరు రామగోపాల్

అమెరికాలో స్థిరపడిన డా॥ కాగినెలె గురుప్రసాద్ గారి
"బీజం" కన్నడ కథకు అనువాదం

# బీజం

అరవింద్ దేశ్‌పాండేకు పోయిన సెప్టెంబర్‌కు పదహారు వచ్చినవి. పేరునుబట్టి చూస్తే ఎంత పెద్దోడో అనిపించే అరవింద ఇంకా పసితనంపోనోడే. అతనికి హాలిహుడ్ కన్నా బాలిహుడ్ అంటేనే ఇష్టం. టామ్‌క్రూస్ కన్నా శారూఖే గొప్ప అతనికి. అతని రూమ్‌లో శారూఖ్‌కు చెందిన నాలుగున్నర అడుగుల ఒక పెద్ద పోస్టర్ ఉంది. పక్కనే దెయ్యం లాంటి గిటారు. ఎవరూ చూడనప్పుడు, తన రూంలో తలుపులు వేసుకొని తన బైసెప్స్‌ను ముట్టుకొని, చూచుకొంటూ మురిసిపోతాడు. అట్లాగే శారూఖ్‌ఖాన్ బుగ్గల మీద సొట్టల్ని, దాని లోతుల్ని వెతుకుతాడు.

అరవిందకు డ్యాడి అయిన ఫణీశ్ దేశ్‌పాండే గొప్ప డాక్టరు. జనరల్ ప్రాక్టీసులో పేరున్నోడు. రోగాల్ని గుర్తించటంలో గొప్ప ఘటికుడు అని అందరూ అనేవారు. భార్యకు మరియు కొడుకుకూ తన గురించి బయటి పొగడ్తలను తనే చెప్పుకొనేవాడు.

పరిమళా దేశపాండె అరవిందుడి తల్లి. అరవిందుడి అమ్మ శివమొగ్గ లోని డివిఎస్ కాలేజిలో బి.ఎ. చదివింది. ఆమెకు ఇష్టమైన దేముళ్ళ చిట్టా (ఎ) ముగ్గురు సాయిబాబాలు.... షిరిడిసాయి, పుట్టపర్తి సాయిబాబా మరియూ ప్రేమసాయి (బి) మంత్రాలయంలోని రాఘవేంద్రస్వామి, (సి) శృంగేరి శారదాంబ, (డి) తిరుపతి వెంకటరమణ, (ఇ) బాదామి బనశంకరి, (ఎఫ్)కుక్కె సుబ్రమణ్య మీద అంతులేని భక్తి, (జి) ఉడుపి శ్రీకృష్ణ మరియు గణేశ్ ఆమెకు ఇష్టమైన దేముళ్ళు. ఇంకా పొడిగించాలి అంటే అన్ని దేముళ్ళూ ఆమెకు ఇష్టమే.

ఇంట్లో కాటన్ నైటీనే ఉపయోగిస్తది. బయటికి వెళ్ళాలంటే జీన్స్ కన్నా చుడీదార్‌నే ఆమె ఇష్టపడుతది. మసాలావడలు, పులిహోర, బిసిబెళెబాత్ అంటే ఆమెకు పంచప్రాణాలు. అరవిందకేమో పిజ్జాలంటే ఇష్టం. డా.ఫణీశ్‌కేమో దక్షిణ కన్నడ మంగళూరు వంటకాలను



అభిమానిస్తాడు. ఫణీశ్‌కు కార్బోహైడ్రేట్స్ మరియు క్యాలరీల లెక్కలు సదా నోట్లో నానుతుండేవి. మరి ఆయన డాక్టర్ కదా!

దేశపాండె ఉండేది విశ్వానికే పెద్ద దిక్కైన అమెరికాలోని డెలవేర్‌లో. అది న్యూయార్క్ నుంచి మూడు గంటలలో చేరుకొనే నగరం.

అరవింద్ దేశపాండేకు కుడివైపున బీజం (వృషణం) వాచింది. ఇప్పటికిప్పుడే అయిన వాపుకాదు అది. నాలుగు వారాల నుంచి వాపు ఉంది. ఆ వాపు ఎట్లా ఉందంటే పాలక్ పన్నీరును శుభ్రమైన తెల్లటి బట్టలో కట్టి, కిచెన్‌లో వేలాడదీసినట్లుగా, జారిన రెండు బీజాల్లో అంటుకొని ఉన్న చర్మం మిరమిరా మెరుస్తుంది. ఎడం పక్కన ఉన్నదాన్ని ఒక పెన్ టార్చ్‌లైటుతో చూచాడు. అక్కడేమి కాలేదు. పిసుక్కొని పరీక్షించాడు. కొద్దిగా నెప్పి కలిగింది ఆ భాగం నుంచి.

వృషణం వాచినదాన్ని చెప్పాలో వద్దో అనుకొంటూనే అరవింద తండ్రి దగ్గరకు వచ్చి చెప్పనే చెప్పాడు. తండ్రి ఇంట్లోనే ఒకసారి పరీక్షిస్తాను అని అన్నాడు. అరవింద 'వద్దు, వద్దు' అని పలికాడు. తల్లైన పరిమళ ఎట్లాగో కొడుకును ఒప్పించింది. తండ్రి – కొడుకు ఇద్దరూ చేరి అరవిందుడి రూంలో తలుపులు వేసుకొన్నారు. అరవింద సగం సగం ఒప్పికతోనే తన అండర్వేర్‌ను కిందకు గుంజాడు. వాచిపోయిన కుడిబీజాన్ని చూసి, ముట్టుకోవడానికి చేతిని ముందుకు చాపిన డా॥ఫణీశ్‌ను గెట్ ఔట్ అని రూం నుంచి బయటకు నెట్టాడు అరవింద్. తలుపులు కూడా అరవిందనే బలపరుస్తున్నట్లుగా ధబ్‌మని శబ్దం చేసి, ఆ తర్వాత నిశ్శబ్దాన్ని పుట్టించినవి.

ఫణీశ్ భార్య అయిన పరిమళతో "వెళ్ళు.... బాధ పెట్టుతుందేమో అడిగిరా" అని పంపించాడు. తనేమో రెండుసార్లు బాత్రూమ్‌కు వెళ్ళి మూత్రవిసర్జన చేసి వచ్చాడు.

'బాధగా లేదంటలే' పరిమళ చెప్పింది. గూగల్‌లో ఏమేమో వెతకసాగింది. "ఏమైనా సుఖవ్యాధి ఉందేమో. ఈ వయస్సులోని పిల్లల్ని నమ్మటానికి వీలే లేదుకదా" అంది ఆమె. ఫణీశ్ ఏమో "నాకైతే అంత డౌట్ లేదులే. నా ఫ్రెండ్ ఒకాయన ఉన్నాడు. గొప్ప యూరాలజిస్ట్. అతని దగ్గర చూపిద్దాము" అని బదులిచ్చాడు భార్యతో. పరిమళ అన్ని దేముళ్ళ ముందు ఆవునేతితో ప్రమిదల్ని పెట్టింది. మంత్రాలయ, శిరిడి, కుక్కె సుబ్రమణ్య, ధర్మస్థళ మంజునాథ, తిరుపతి, ఉడుపి, గోమటేశ్వరునకు కానుకలు చెల్లిస్తాను అని మొక్కుకొంది.

యురాలజిస్ట్‌ను సందర్శించటానికి వెళ్ళేటప్పుడు, కొడుకుతో అన్ని దేముళ్ళకు ఒకట్రెండు సార్లు దండం పెట్టుకొని రా అని అరవిందును పూజాగదికి తీసుకెళ్ళింది. అరవింద అమ్మ ఒత్తిడి మూలాన ఒక నమస్కారం చేసాడు. “మంచి నవ మన్మథుడు ఉన్నట్లుగా ఉన్నావులే. ఆ ఉడుపి శ్రీకృష్ణ నిన్ను కాపాడుతాడులే. ఏమి బెదరొద్దు” అన్నది ఆమె తన నైటుగౌనుకు చేతులు రాసుకొంటూ. “ఏ ఉడుపి శ్రీకృష్ణ? థట్ బ్లా గాడ్, యామ్ ఐ రైట్”? అంటూ నమస్కారం చేసాడు అరవింద్.

‘నాన్ సెమినోమేటిస్ జర్మ్ సెల్ ట్యూమర్’ అయ్యుండొచ్చేమో అన్నాడు ఫణీశ్ తన కొడుకుకు అయిన వృషణ వాపు గురించి. బయాప్సి చేసిందాకా అలాగునే అంత బారుగా ఉన్న ఆ రోగం పేరు పలకటం బాగుండదేమో అని ఆ డాక్టర్ అన్నాడు ఫణీశ్‌తో. సి.టి. స్క్యాన్‌లో పొట్ట క్రిందకు, చెస్ట్ అంచులకు వ్యాపించింది అని డాక్టర్ అన్నాడు. "Don't try to be defensive, I won't sue you" అన్నాడు డా. ఫణీశ్. మళ్ళీ యురాలజిస్ట్ ‘బయాప్సి చేస్తేనే మంచిదేమో’ అని అన్నాడు. బయాప్సి అంటే పూర్తిగా బీజాన్ని బీజం తనక, బీజం సమేతంగా తీసి ఆ తర్వాత మైక్రోస్కోపులో పరీక్ష చేయటం అనేది ఆ యూరాలజిస్ట్ వాదన.

రెండు గంటల్లోనే పూర్తిగా అయిపోయింది. అరవిందుడి సంపదలోని కుడివైపున స్క్రోటల్‌స్యాక్‌ను సన్నగా కోసారు. తండ్రైన ఫణీశ్ ఊహే నిజం అయ్యింది. అతను మొదలే చెప్పిన పొడుగైన పేరుండే రోగమే ఖరారైంది. యురాలజిస్ట్ ‘తనకన్నా ఉత్తమమైన డయాగ్నోస్టిషియన్ ఫణీశ్ సారే’ అని పొగిడాడు.

పరిమళ తడి చీరతో విష్ణు సహస్రనామం చదివి, కుక్కె సుబ్రమణ్య దేముడికి ఇంకా ఎక్కువగా కానుకలు సమర్పించుకొంటాను అని మొక్కుకొంది. ఆ రోజు నైటీతో పూజ చేయలేదు ఆమె.

అరవింద తన రూంలో ప్లేస్టేషన్ ఆడుకొంటూ కూర్చున్నాడు.

అరవిందకు అంటిన జబ్బు సైకిల్‌కీమో రెండు వేపుల ప్రస్ఫుటంగా పొట్టదాక పాకిపోయింది. అయితే ఇది కీమో నుంచి పూర్తిగా కోలుకొనే ట్యూమర్. కీమో తీసేస్తే అంతా సరిపోతది అనేది ఆ తండ్రి నుంచి వచ్చిన వైద్యశాస్త్రం లెక్క.

‘ముందే గుర్తైతే ఈ కిమో పామో రగడే ఉండేది కాదుకదా. పదిహారేళ్ళ బాలుడికి ఇదెంత రోగం’ అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది పరిమళ.



‘ముందే ఎట్లా తెలుస్తది? పదహారేళ్ళ పిల్లోడు బీజాలు వాచినవి అని నాదగ్గర చెప్పగలడా? ఈ దేశంలో ఈ వృషణాల జబ్బు గుర్తు అయ్యేది ఎట్లా తెలుస్తదో నీకు గుర్తా?’ అన్నాడు ఫణీశ్.

శిల లాగ భర్త ముఖాన్నే చూసింది పరిమళ.

‘పిల్లోడి గర్ల్‌ఫ్రెండ్ మూలాన!’

స్తంబీభూతురాలైంది పరిమళ.

ఫణీశ్ చెప్పుకుపోసాగాడు ‘ఇక్కడుండటం వలన అన్ని పనులు చకచకా టెస్ట్‌లు మూలకంగా జరిగినవి. చూడు ఎక్స్‌రే నుంచి ఏమి దొరికేది కాదు. సిటిస్కాన్ చేయించటం వలన బాబుకు ఎంత సైజులో రోగం వ్యాపించింది అనేది గుర్తు అయ్యింది. మనం స్వదేశంలోని శివమొగ్గలో ఉండి ఉంటే చెస్ట్ ఎక్స్‌రే మాత్రం చేసి, లంగ్స్ అంతా నిండిందని వృషణాన్ని పూర్తిగా తీసేసి మనల్ని మన పాటికి (కర్మకు) వదిలేసేవారు. ఇక్కడ నేను ఉండడం చేత గొప్ప వైద్యం దొరికింది’.

అరవింద నుంచి మాయమైన ఒక వృషణానికి ఏడవాలో, ఫణీశ్ బుద్ధివంతతనానికి గర్వపడాలో లేకపోతే జిల్లా కేంద్రమైన శివమొగ్గలో ఇటువంటి వైద్యం దొరకనే దొరకదు అనే వాదనకు ఒప్పుకోవాలో ఏమీ తెలియని గందరగోళంలో పడి ఊరికనే కళ్ళను తుడుచుకోసాగింది పరిమళ.

మళ్ళీ పూజగదికి వెళ్ళి, అన్ని దేముళ్ళకు మొక్కుకుంది పరిమళ.

ప్రేమసాయి ఫోటో ఆమెకు సులభంగా దొరకలేదు. ఆమె భారతదేశానికి వెళ్ళినపుడు ఎవరో సత్సంగ సభ్యులు ఇచ్చారు ఆ ఫోటోను.

వృషణాలలోని క్యాన్సర్ పూర్తిగా మంచి క్యాన్సర్ అట. పరిమళకు క్యాన్సర్లలో మంచివి ఉంటవి అనేది తెల్వదు. ఫణీశ్ చెప్పసాగాడు: అకస్మాత్తుగా దేముడు ఒక రోగి ఎదురు ప్రత్యక్షమై, నీకు ఏదైనా ఒక క్యాన్సర్ కావాలని కోరుకోమని అడిగితే లంగ్ (lung) లివర్ (liver) కిడ్ని (Kidney) బ్రైను (brain) బ్రెస్ట్ (brest) అని అడిగితే వృషణాల క్యాన్సర్ ఇవ్వు దేవరా అని కోరుకోవాలి. ఎందుకంటే కీమో తీసేటప్పుడు కష్టం కలుగుతుంది తప్పితే ఆ తరువాత నూటికి నూరుపాళ్లు ఆ క్యాన్సర్ నుంచి బాగు పడొచ్చు అని చెప్పాడు డా.ఫణీశ్ భార్యతో.

పరిమళ ఏమీ మాట్లాడలేదు. ఇంకా చెప్పాలంటే ఫణీశ్ నుంచి జాలువారిన హండ్రెడ్ పర్సెంట్ అనేదాన్ని ఆమె అర్థం చేసుకోలేకపోయింది.

శిరిడీ నుంచి ఇంకా ప్రసాదం ఎందుకు తన దగ్గరకు చేరలేదబ్బా అని ఆమె ఆ విషయంలో కూరుకుపోసాగింది.

అరవింద మూడు వారాల్నుంచి ఇంట్లో వాళ్ళతో మాట్లాడటాన్ని ఆపుచేసాడు. తనేమో, తన ప్లేస్టేషన్ ఏమో అనేటట్లుగా ఉండిపోయాడు. తన రూంలో తన బాడి బైసెప్పును చూసుకొనేవాడు. శారూఖ్‌ఖాన్ కొత్త పోస్టర్‌ను ఇంటర్‌నెట్ మూలకంగా తెప్పించుకొనేదానికి తల్లైన పరిమళ నుంచి డబ్బుల్ని పొందాడు.

“అరవిందుడి వీర్యాన్ని క్రయోప్రెసిపిటేట్ చేయాలంటే అతని వీర్యాన్ని దేహంలోనే ఫ్రీజ్ చేస్తారు. ఈ వృషణజబ్బు నుంచి అరవింద శాశ్వతంగా స్టైరైల్ అవుతాడు. సెక్సుకు కష్టం కాదు. రేపేమైన పిల్లలు కావాలంటే కుదరదు. వంశావళి నిలిచిపోతదేమో” అన్నాడు డా.ఫణీశ్.

పరిమళకు భర్త ఏమి చెపుతున్నాడు అనేది అర్థం చేసుకోవటానికి ఒక గంట పట్టింది. “వైద్యలాభం అరవిందకు ఉండాలంటే వంశవాహిని ముందుకు సాగక పోయినా పర్వాలేదు. కాని నేను మాత్రం కొడుకుతో వీర్యాన్ని ఫ్రీజ్ చేసే పనికి అతని నుంచి సహకారం పొందేది కుదరని పని” అంది ఆమె. “మన వంశం నిర్వంశమైన పర్వాలేదు. తప్పని సరైతే మీరే అరవిందతో మాట్లాడండి” అని బాధతో చెప్పింది పరిమళ.

అరవింద రూంలో టి.వి. పగిలింది. ప్లేస్టేషన్ తునాతునకలైంది. అరవింద చెంపల్ని పట్టుకొని బయటకి వచ్చాడు ఫణీశ్. అరవింద – ఫణీశ్ ఇద్దరూ వణుకుతూనే ఉన్నారు. ‘నీ కొడుకు అని అనుకొన్నా’ అంటూ గదినుంచి బయటకు వచ్చిన ఫణీశ్ భార్యతో ‘ఆ శారూఖ్‌ఖాన్ ఫోటోను, పోస్టర్లను నేను వచ్చేవరకు తీసేయాలి’ అని చెప్పి వెళ్ళాడు.

అరవింద కింద పడ్డ గాజు పెంకుల్ని చూడసాగాడు.

‘మామి, ఇది నా సమస్య. నన్ను చిన్న పిల్లోడిలాగ చూచేదాన్ని వదిలేయమని డ్యాడికి చెపుతావా?’

‘తప్పకుండా చెపుతాను బాబూ?’

‘డ్యాడి చెప్పినట్లే వైద్యం చేయించుకొన్నాను కదా. అయితే నాకు అతడ్ని కలిసే ఏర్పాట్లు చేయించమని చెప్పు. అతను గౌరి మరియు ఆర్యన్‌తో కుటుంబ సమేతంగా వస్తాడట. పబ్లిక్కును కలుస్తాడట. నేను అతడ్ని కలుసుకోటానికి మార్గం చూపించమ్మా. అతని 40వ పుట్టినరోజట. అతన్ని కలుద్దామంటే అతను కాదనడు’. అని గోడ దిక్కు బేలగా చూస్తూ చెప్పుకుపోసాగాడు అరవింద.



పరిమళ అరవిందను చిన్న బాబేలే అని అనుకొనేది ఇప్పటిదాకా. అయితే అరవింద ఇంత గట్టి అభిమాని ఆ యాక్టర్‌కు అని ఆమె ఇప్పటిదాకా అనుకోలేదు.

కంప్యూటర్ మానిటర్ నిండా శారూఖ్ ఖాన్ చిత్రాలే. ఏమేమో వెబ్‌సైట్స్ నుంచి వచ్చిన తుణుకులు . సుమారుగా రెండులక్షల డెబ్భైవేల సైట్స్‌ను ఫ్యాన్స్ మూలకంగా పొందిన ఈ కింగ్ శారూఖ్‌ఖాన్ ప్రపంచంలో పరిమళ మునిగిపోయి ఈతతో కష్టపడి బయటకు వచ్చినట్లైంది. అన్నిటిని అరవింద షార్ట్‌కట్ చేసి ఉన్నాడు. అతని బుగ్గల మీద ఉండే సొట్టల లోతు, అతను న్యూయార్క్‌లో తాగే సిగెరెట్, పూసుకొనే సెంట్, గౌరితో జగడం, వెన్నుకు సర్జరి, కరణ్ జోహార్‌తో చెలిమి,... ఏమిటేమిటో వివరాలు...

‘దేముడా’ అనుకొంది పరిమళ.

‘పిచ్చిపట్టినోడు’ అనుకొన్నాడు ఫణీశ్ కొడుకు గురించి లెక్కవేస్తూ.

తామే ఆ స్థానానికి జేరటం సాధ్యంగానోళ్ళు, వేరొకరు ఆ ఉన్నత స్థానంలో ఉండేవాళ్ళను దేముళ్ళలాగ చూస్తూ, వారి చుట్టూరా తమ బతుకులను పెనవేసుకొనే వ్యర్థ ప్రయత్నమే తన కొడుకు చేసేది అనేది తండ్రి వాదన. ఈ ప్రపంచంలో అతని నుంచి ఒక ఫోన్‌నెంబరు, ఒక ఇ –మేల్ అడ్రస్సే కదా నీకు దొరికింది. ఇ–మేల్ చేస్తే కృతకంగా రెస్పాన్స్ వస్తది. ఏదో ఒకటైనా నిఖరమైన వెబ్‌సైట్ అతని దగ్గర ఉందా? అన్నాడు కొడుకుతో లాజిక్‌ను పెనవేస్తూ డా.ఫణీశ్‌దేశపాండే.

‘లేదు... డ్యాడి’

‘వీళ్ళంతా సరుకులు లాంటోళ్ళు. నువ్వు పిచ్చితో చేసే ఒకొక మౌస్‌క్లిక్ ఎవరికో డబ్బును ఒనగూడుస్తది తెలిసిందా! ఆ శారూఖ్‌కు అధికృతమైన ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసుకోవటం పెద్దకష్టమేమీ కాదు. అయితే అతనికన్నా చక్కగా ఎవరో అతని తరపున ఈ పనిని నెరవేరుస్తున్నారు. ఇక్కడ ఎవరో పెప్సి, కోలా వారో లేకపోతే దుబైలో ఎవరో ఈ యాక్టర్ మీద మోహాన్ని, పిచ్చిని క్యాష్ చేసుకొంటున్నారు అనేది తెలుసుకో.

పరిమళకు భర్త కొడుకుతో అనేది ఏమి అర్థంగాలేదు.

‘చూడండి. నేను ఇంటర్‌నెట్ ద్వారా తెలుసుకొన్న ప్రకారం శారూఖ్ పుట్టినరోజు వేడుకలను ప్లాజాలో జరుపుకొంటాడట. అక్కడికి అరవిందను తీసుకొని వెళ్దాం. మన అదృష్టం బాగుంటే అతను అరవిందను మాట్లాడించినా మాట్లాడించొచ్చేమో కదా!’

‘నా చేతులలో అవుతదో లేదో చెప్పటం కుదరదు పరిమళా. దేముడి మీద ఒట్టువేసి చెపుతున్నా. ఈ జబ్బు నూటికి నూరుపాళ్ళు బాగయ్యే రోగమే. ఈ రోగం నయమవటానికి డాక్టర్లు తప్పితే ఎంతటోడైనా అతను శారూఖ్‌ఖాన్ అయినా కానక్కరలేదు. ఊరికే కీమో తీయించుకోటం మాని అది కావాలి, ఇది కావాలి అంటూ ఒత్తిడిచేస్తే... అది కూడా ఇంత వయస్సులో ఉన్న పిల్లలు, వాళ్ళ కల్పనలను మనం ప్రోత్సహించటం తప్పు అవుతది. పిల్లోడి నుంచి వచ్చిన కల్పన, శారూఖ్‌ఖాన్ సొట్టబుగ్గలు, మార్లబరో ఇంతటి వాటిని వదిలేసి, అరవిందలో మిగిలిపోయిన ఒకే ఒక వృషణాన్ని నిర్వీర్యం చేసేముందు, పాత్రలో అరవింద నుంచి వీర్యస్కలనం, దాని సేకరణ, దాన్నుంచి ముమ్ముందు ఇంకొక రీతిలో మన దేశపాండే వంశం ముందుకు సాగిపోయేది... ఇది కల్పనకాదు వైద్యం మూలకంగా.’

‘తను అరవిందుడి కల్పనలను మాత్రమే తెలుసుకొనే మాతృమూర్తేనా?’

పరిమళ కళ్ళ నుంచి రెండే రెండు బొట్లు భాష్పాలుగా రాలాయి.

ఫణీశ్ దగ్గరకు వచ్చి పరిమళను ఓదార్పుతో ఒత్తుకొన్నాడు. తలను నిమిరాడు. ‘సరేలే... సరేలే’ అనే మాటలు అతని నోటినుంచి వచ్చాయి.

‘ధడ్’ అంటూ డోర్ తెరుచుకొంది. అరవింద నుంచోని ఉన్నాడు.

"Are you guys making love? Making babies"? అన్నాడు సంకోచం లేకుండా.

ఇద్దరూ దఢాల్నే ఆ మాటల్ని విని దూరంగా జరిగారు. ‘నాకు తెలుసు మీరు పిల్లల్ని పెట్టే కార్యంలో ఉన్నారు కదా? నేను చచ్చిపోతానని. అందుకే మీకు పిల్లలు కావాలి డ్యాడి.. నీకు నా మీద నమ్మకమే లేదు You don't trust my jelly juice. you don't trust that my seeds in that dish can make more babies... ! మామ్ నువ్వు మంచిదానివి అని అనుకొనేవాడ్ని. కాదు నువ్వూ బ్యాడ్ మదరే. You know what? I don't fuck in care' అన్నాడు కోపంతో అరవింద.

‘కాదు బాబూ, అరవిందా... రా.... బాబు... ఇక్కడికి నా చెంతకు రా, అయ్యయ్యో వెళ్ళి మీరైనా సముదాయించండి బాబును....’ అన్నది వేదనతో పరిమళ.

హోటల్‌లోకి వెళ్తుంటే బయట చిన్నగాలివాన. అందరికీ శారూఖ్‌ఖాన్ ఏటైమ్‌లో వస్తాడో అనే ఆత్రం. ఏదో ఒక హోటల్లో దీపక్‌చోప్రాతో చేరి తన నలభైయ్యో పుట్టిన రోజు పండుగకు ఒక పెద్దకేక్‌ను కట్‌చేసి... గౌరి, ఆర్యన్‌ను స్వదేశంలో వదిలి వచ్చినోడు ఇతనే. అతని కూతురు ఏదో కొత్త సినిమాలో నటిస్తున్నదట. గౌరి కూడ ఇతని జతగా



వచ్చిందా? వచ్చి ఉంటే ఆమె బయటికి కనిపించటం లేదు కదా. ఆమె పూర్తిగా ప్రైవేట్ అట.

‘ఇద్దరి పిల్లల తల్లైనా ఎంథ బాడి ఫిగర్ ఆమెది’ అని తనెప్పుడో చూచిన ఫిల్మ్ మ్యాగజైన్‌ను గుర్తు చేసుకొంది పరిమళ.

కరణ్ జోహర్ ‘కభీ అల్‌విదన కెహనా’ అనేది కొత్త సినిమా అట. శారూఖే ఏదైనా కొత్త సినిమాకు దర్శకత్వం వహించొచ్చట.

శారూఖ్ నుంచి ‘ఇన్నర్‌వరల్డ్’ అనే కొత్త డి.వి.డి వచ్చిందట. ఏరోస్ సంస్థ నుంచి మార్కెట్ అవుతుందట ఆ డివిడి. ఈ సంవత్సరంలో అతని నుంచి ఏ సినిమా హిట్ కాలేదట. ఈ ‘ఇన్నర్ వరల్డ్’ ఒక తరహ నాటకం లాంటిది. ఒకరకంగా జనం మరిచిపోకుండా ఉండటానికి చేసే మాయాజాలం ఇది. ఈ సెలెబ్రిటి మనుష్యులు ఎక్కువుగా చెప్పాలంటే అన్‌సెక్యూర్డ్ పర్సెన్స్.

మొన్న ఏదో ట్యాబ్లాయిడ్‌లో అడిగారు డైరెక్ట్‌గా.... ‘మిమ్మల్ని జనం స్వలింగకామి అని అంటే మీకేమనిపిస్తుంది.’

చిలిపిగా నవ్వాడట శారూఖ్. నవ్వాడు అని పేపరోళ్ళు రాసారు. ఆ ప్రశ్నను విని అతను నవ్వుతాడు అంటే నేను ఒప్పుకోను. అసహనం పుట్టిస్తది ఆ ప్రశ్న ఎంతోడికైనా! ఆ ప్రశ్నెను వింటుంటే గౌరి ఉందికదా. పిల్లలు ఉన్నారు కదా! అతడ్ని స్వలింగాకామి అంటే అది సరైన ప్రశ్నేనా.

“జనం ఈ కాలంలో సమాజముఖి అయినా సంవేదనా శీలత్వం లేకుండా ఉండటం అనేది ఇప్పుడొక పెద్ద ఫ్యాషన్ లాగ తయారైంది. నేను కూర్చోవాలి అని అంటే పద్మాసనం వేసుకొని కూర్చొంటా. నేను స్వతహా సూక్ష్మ పరిశీలన ఉన్న మనిషిని. స్త్రీలను గౌరవించే మనస్సును పొందినోడిని. నానా మగాళ్ళతో స్వలింగ కామంతో స్వేచ్ఛా జీవనం నడిస్తే అది పురుషత్వ బలానికి ప్రతీకం అవుతదా. ఇంకొక తమాషా ఏమిటంటే కరణ్ జోహర్‌కు గర్లఫ్రెండే లేదు ఇప్పటిదాకా. నేను, అతను స్వలింగ కాములమైతే, నా గౌరి గతి ఏమిటి?”

‘భలేగా జవాబులు చెప్పాడు శారూఖ్.’

‘అట్లా అతను చెప్పాడో లేక వీటన్నిటిని వీళ్ళే సృష్టించుకొని రాసారో?

ప్లాజాకు వచ్చాడు శారూఖ్. అతని పక్కన నలుగురు బౌన్సర్లు ఉన్నారు. తెల్లతోలును పొందిన బౌన్సర్లు. ఏదైనా క్లబ్‌లో యువతి సాంబా నృత్యం చేస్తుంటే, వాళ్ళను తాకటానికి

వెళ్ళే తాగుబోతులను క్లబ్‌నుంచి నిర్దాక్షిణ్యంగా బయటకు ఎత్తి విసిరేసేవాళ్ళను బౌన్సర్లు అని అంటారు ఈ దేశంలో. వీళ్ళు బాడీగార్డులకన్నా బలమైనోళ్ళు.

ఆర్మానీ సూట్‌లో వచ్చి అందరికీ చేతులూపుతూ లోనికి వెళ్ళిపోయాడు. అతను తొందరగానే ముఖం చూపించి వెళ్ళిపోయినా, ఆ ముఖంలో బుగ్గలసొట్టలు కనపడినవి ప్రస్ఫుటంగా. గౌరి కనబడలేదు. ఆర్యన్ కూడా లేదు. పాపం స్కూల్‌కు వెళ్ళే పసివాడు కదా. ఆర్యన్ ఏ స్కూలుకు వెళ్తున్నాడు అనేది తెలుసుకోవాలంటే ఇన్నర్ వరల్డ్ డి.వి.డి. నుంచే తెలుసుకోవాలి.

అందరూ 'మేమందరం నిన్నే ప్రేమిస్తున్నాము We love you sharuq' అంటూ అరుస్తున్నారు.

మామి చెప్పింది. శారూఖ్‌ను చూడొచ్చు అని. అతన్ని కలవటం కుదురుతదో లేదో అని కూడా అంది మామి. ప్లాజాలోని పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరా ద్వారా ఒక చీటి పంపింది మామి. "You can bring light in someone's life just by a hand-shake, a smile or even a phone call" అని రాసి ఆ చీటిని పంపించింది.

మామి కొంచం ఎక్కువగానే రాసినట్లున్నదని అన్పించింది నాకు. పాపం అతనేమో సెలిబ్రిటి. అతనికి ఎంత జనమో! ఎవర్నని చూస్తాడు. పలకరిస్తాడు!

అయితే

వృషణాన్ని పోగొట్టుకొన్నోడిని నేను.

నాకు శారూఖ్ అంటే ఇష్టం. ఈ ట్యాబ్లాయిడ్లులు ఏమి రాసినా నేను ఖాతరు చేయను. నన్ను మాట్లాడించకపోయినా పరవాలేదు. డ్యాడి ఈ రోజు ప్లాజాకు రాలేదు. అతనికి ఏదో మీటింగ్ అట. కొత్తగా నర్సులను ఇంటర్వ్యూ ద్వారా చేర్చుకొంటున్నాడట. ఇక్కడినుంచి ఇంటికి మూడు గంటల కారు ప్రయాణం. మామి అంతదూరం నడుపుతదో లేదో?

ఫణీశ్‌కు కోపం వచ్చింది. 'జబ్బుతో ఉన్న బాలుడ్ని మాట్లాడించలేదు అని అనుకొంటే అతను ఎంత పెద్దస్టార్?. వదిలేయి... అతను లేకపోతే పర్వాలేదులే. నువ్వు ప్రశాంతంగా, కీమోను చేయించుకో, నువ్వు కూడా ముమ్ముందు అతడ్ని మీరి పోగలవు' అని కొడుకుతో అన్నాడు.



అరవింద ఒకటే హఠం చేస్తున్నాడు. తను కీమోను చేయించుకోడట. కారణం చెప్పడు కదా!

ఫణీశ్ తనకి తెలిసినదంతా చెప్పాడు. కీమోథెరపి చేయించుకొంటే వ్యాపించుకొన్న క్యాన్సరు కరిగిపోయి, మాయమైయ్యేది ఏదో ఒక రోగి నుంచి ఉదాహరణకని సిటిస్క్యాన్ రిపోర్టును కొడుక్కి చూపించాడు. ఎంటివిలో ఒక పేర్గాంచిన స్టార్ తనకి సంక్రమించిన వృషణం కాన్సర్ ఎట్లా మానిపోయింది అని చెప్పే వైనాన్ని తన స్నేహితుని వెబ్‌సైట్ నుంచి డి.వి.డి.గా చేసుకొని దాన్ని కొడుక్కి రుజువుగా చూపించాడు తండ్రి.

అరవింద నుంచి ఒకటే మాట 'నాకు వద్దు' అని.

'ఎందుకు నాన్నా. ఆ శారూఖ్ ఖాన్ నీతో మాట్లాడలేదనే నీరసమా నీకు?'

'కాదు...అతను పూర్తిగా బిజీగా ఉంటాడని నాకు తెలుసు. అతడ్ని చూడటానికి నీకు టైమే లేదు కదా' అన్నాడు నిష్ఠురంగా తండ్రితో.

'దానికి దీనికి ఏమి సంబంధం?' అన్నాడు ఫణీశ్.

'ఏమిలేదులే, జనానికి తమ పని ముఖ్యం. ఎవరెవరికి వాళ్ళ వాళ్ళ పనే ముఖ్యం కదా!' అన్నాడు తండ్రితో కటువుగా.

'ఇంకెవరినైనా అడుగుదామా. కావాలంటే నేను వస్తానులే. ఇప్పుడు సంవత్సరంలో ఆరునెలలు ఇక్కడే గడుపుతున్నాడు కదా అతను. నువ్వు కీమో చేయించుకొన్న తర్వాత అవసరం పడితే, అతను మళ్ళీ వచ్చినప్పుడు మనమంతా పోయి చూసి రావచ్చు. నేను అప్పుడు ఖచ్చితంగా వస్తాను.'

'య్యే... షూర్.... రైట్!'

'చూడు నాన్నా, నేను నిన్ను చూస్తుంటే ఇదెంత పిచ్చితనం నీది అని అన్పిస్తుంది. ఈరకంగా పిచ్చిపిచ్చి భ్రమల్ని కల్పించుకొనేది తప్పు నాన్నా. అది ఎంత అసహ్యం పుట్టిస్తదో తెలుసా? మగాళ్ళ మీద ఇంత ప్రేమా నీకు. నేను నీ వయస్సులో ఉన్నప్పుడు శ్రీదేవి, జయమాలిని, ఇక్కడామె అయిన షరూన్ స్టోన్ మరియు మాతృభాషలోని మాలాశ్రీని పిచ్చిగా అభిమానించేవాడ్ని. చూడు, ఇప్పుడు ప్లాజాలో ఆమె ఎవరో వచ్చిందట. నాకు ఆమె పేరు తెలవదు. ఆమె దగ్గరకు వెళ్ళి మాట్లాడుదాము పదా. 'Come on. Be a man ' అన్నాడు ఫణీశ్. 'Yeah right I have only one having in there as of now. Rest of my seeds will be fried in a short while. Do you get it? I am a man, but just different' బదులిచ్చాడు అరవింద.

డా.ఫణీశ్ దేశపాండె మాట్లాడలేకపోయాడు. పదహారేళ్ళ పిల్లోడికి అర్థం కాలేదులే తన వాదన అని అన్పించింది. విసర్జించుకొన్న బీజం నుంచి వచ్చిన విరసమో లేక విసర్జించుకొన్న బీజం నుంచి అది ఒక రక్షణగా దేహానికి ఉపయోగపడుతుందనే లెక్క తన పిల్లోడికి అర్థమవ్వటం లేదు కదా! అయితే అరవింద అర్థం చేసుకొన్న మరియు కల్పించుకొన్న పిచ్చి, భ్రమ మూలాన శారూఖ్ ఖాన్ మీద కోపం కలుగజేసింది తండ్రైన ఫణీశ్‌కు. అరవిందకు చిన్న ప్రాయమైన పదహారేళ్ళ జీవనంలో శారూఖ్‌ఖాన్ మొదలే వచ్చాడా లేక క్యాన్సరే ముందు వచ్చిందా అనేది ఆ తండ్రికి గుర్తు అవ్వటం లేదు.

మొదలు అరవింద క్లవర్ స్టూడెంటే. హ్యారిపాటర్, లార్డ్స్ ఆఫ్ ద రింగ్ చదివేవాడు. పరిమళతో చేరి అనేక రంగులున్న గులాబీలను పూయించాడు. అతనికి మొదట్నుంచి తోటమాలి పని అంటే భలే ఇష్టం.

అరవింద నుంచి కీమో తీయించేది మొదలైంది. డాక్టర్ అయిన తండ్రి అరవిందతో మైనార్టి ఏజ్ మూలాన స్వతంత్ర ధోరణితో రోగాన్ని పెంచుకోవటం అమెరికా లా ప్రకారం నేరం అవుతది అని భార్య పరిమళ మరియు కొడుకుతో న్యాయవాదిలా వాదన చేసాడు. మైనర్ బాలుడు అవటం చేత అతని మీద హక్కులు తల్లి – తండ్రికే ఉంటవి. అతని ఇష్టప్రకారమే నడవాలి అంటే ఇంకా రెండేళ్ళు ఆగాల్సిందే అని తన ఆసుపత్రిలోంచి బైలాస్ జిరాక్స్ కాపి తెచ్చి చూపించాడు.

ఒంటరిగా పరిమళ దొరికినప్పుడు బావురుమంటూ వాటేసుకొని మనం ఇక నుంచి అరవిందను మరిచిపోతే మంచిది. With or without testicles అని ఏడ్చాడు ఆ కన్నతండ్రి.

'కభీ ఆల్ విదన కెహనా' షూటింగ్ ఇక్కడే (అమెరికా) నడుస్తుంది.

అమితాబ్ బచ్చన్ కూడ వచ్చాడట ప్లాజాకు. శారూఖ్ మళ్ళా రెండోసారి గౌరితో వస్తాడని ఒక వదంతి పుట్టింది.

కరణ్ జోహర్ ఎప్పుడూ కాఫీ తాగుతాడట.

బెంగళూర్‌లో ఆరు థియేటర్‌లలో రిలీస్ అవుతదట. ఈ సిన్మా మేలో రిలీసట. ఈసారి ఇండియాకు వెళ్ళాలి అని మామి చెపుతుంది. పి.వి.ఆర్. మల్టిపెక్స్ లో ఈ సినిమాను చూడాలి మామి, డ్యాడితో ఇండియాకు వెళ్ళాక.

డెలవేర్‌కు హింది సినిమాలు రావు. డివిడీలు అన్నీ నకిలీలే.



అంకాలజి వార్డుకు డైరెక్టుగా ఫోన్ వచ్చింది అరవింద కోసం. 'ఎవరు' అని నర్స్ అడిగింది.

"ఓ. ఔనా. అతను ఇప్పుడు కీమో చేయించుకొంటున్నాడు. మీ ఫోన్ నెంబరు ఇవ్వండి అతనికి మెసేజ్ ఇస్తాను."

"ఎవరు మీరు? సెక్రటరీనా? ఓ.కె. చెప్తాను."

'నీకెవరో ఫోన్ చేసారు ప్లాజా నుంచి, అని అరవిందకు ఒక నెంబర్ను ఇచ్చింది నర్స్.

నర్స్ ఫిలిప్పైన్ దేశం ఆమె.

ప్లాజా నుంచి మాట్లాడిన వాడి ఇంగ్లీషు యాస ఒక రకంగా సింగ్లీష్ (సింగపూర్‌లోని ఇంగ్లీష్) లాగా లేకుండా హింగ్లీష్ (హిందీ + ఇంగ్లీష్) తరహా లాగ ఉంది అని తనతోటి నర్స్‌కు చెప్తుంది ఈ ఫిలిప్పైన్ నర్స్.

- 0 -

12-11-2009

శాఖమూరు రామగోపాల్

రాయచూర్ జిల్లాలోని మాన్వి తాలూకాకు చెందిన డా॥ రాజశేఖర నీర్‌మాన్వి గారి "హంగినరమనెయ హొరగె" కన్నడ కథకు అనువాదం. ఒక శతాబ్దంలోని అత్యుత్తమ 84 కన్నడ కథలలో ఈ కథ చేర్చబడింది.

# చివరి క్షణాలలో

మగత నిద్రలో ఉన్న నాకు బాధ ఎక్కువవ్వగా మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూచా. ఎవరులేరు. ప్రక్కకు తిరిగి కళ్ళను మూసుకొన్నా. నాయన ఎవరితోనో చిన్నగా మాట్లాడుతున్నట్లుంది బయటన. "ఏమిటండి... ఈ రోగం ఇంతగా ముదిరేదాక బయటపెట్టలేదు కదా!" అడుగుతున్న ఆ వ్యక్తితో, "నేనేమి చేసేది.. వాడిరోగం వాడికే గుర్తుకానప్పుడు? చదువుకొన్నోడు... నా కన్నా తెలివైనోడు అనేదే తల నిండా నింపుకొన్నోడికి నేనేమి చెప్పాలి? ఇతడ్ని చూసుకోవటంలో... ఆ బాధ్యతలో ఇప్పుడు నిద్రలేదు... తిండీ లేదు సరిగా వేళకు..."

నాయన చెప్తున్న మాటలను వింటుంటే నాయన మీద జాలి ఇంకాస్తగా పెరిగింది. "నాయనా... ఈ పరిస్థితికి నన్ను తెచ్చిందో నువ్వు" అని పెద్దగా అరవాలని అన్పించింది. ఎప్పుడూ తన పెద్దరికాన్ని మెరిపించే నాయన, నేను రోగం బారినపడిన ఈ వేళలో కూడా దాన్నే ప్రదర్శిస్తున్నాడు. పుట్టిన నాటినుంచి ఇప్పటిదాకా నన్ను ధూళిలోని కణం కన్నా తక్కువగా చూసే నాయన ఇప్పుడు నా చివరి అంకంలోని పాత్రను భలేగా ఆడించి అందర్నుంచి శెభాష్‌గిరిని పొందుతున్నాడు.

ఎందుకో ఏమో...! నాయనకు – నాకు మొదట్నుంచి సరిగా లేదు. నేను పిల్లోడిగా ఉన్నప్పుడు బెత్తంతో కొట్టి, చెవుల్ని పిండి, మెకాళ్ళ దండ వేయించి ఓనామఃలను నేర్పిన అయ్యవారి చిత్రం (బొమ్మ) నా కళ్ళ నుంచి మాయమై పోయినా, నాయన చిత్రం మాత్రం మాసిపోలేదు. అకారణమైన కోపం ఉండేది నాయనకు. ఏది చేస్తే మంచిది, ఏది చేస్తే తప్పు అని ప్రతి పనిని ఆలోచనలతోనే చేసి, ఆయా పనులను ముగించిన మీదటా నాయన నుంచి ఏవిధంగానూ ప్రోత్సాహపు మాటలు లభించేవికావు. కొన్నిసార్లు పొగిడితే, ఎన్నోసార్లు తిట్టి, విమర్శనా వ్యాఖ్యానాలు చేసేవాడు. ప్రస్తుతం నాయన



నుంచి వచ్చిన మార్పులు ఏమిటంటే మేము బాల్యంలో ఉన్నప్పుడు కొట్టుతుండేవాడు... ఇప్పుడు పెరిగి పెద్దోళ్ళెయ్యామని తిట్టిపోస్తున్నాడు అంతే.

ఇటువంటి సంగతులలో తండ్రిని గురించి చెప్పేది క్షుల్లకతనమే అని అన్పిస్తుంది నాకు. ఇప్పుడే కాదు... నాకు జ్ఞానం వచ్చినప్పటినుంచి ఈ క్షుల్లకతనంతో పోరాడుతున్నా నేను గెల్వలేదు. అది ఓడిపోలేదు."పితాజీ... కలలో నీ శవాన్ని చూసా నిన్న...." అని ఎవరో రాసిన కవనాన్ని చదివినప్పుడు, ఈ రీతిలో పోరాటాన్ని చేసినోడు నేనొక్కడ్నే కాదు అని అనుకొంటూ సమాధానాన్ని పొందా. నేను పెరుగుతుంటే నాలో నేనే పెరుగుతుంటే, ఏదో పెద్దదాన్ని చూపించి నన్ను నాలోని వ్యక్తిని చిన్నోడిగా చేసేవాడు నాయన. ఏమీ దొరకనప్పుడు ఏదో తప్పును వెతికి "చదివి, తెల్సుకొని, మా కన్నా జ్ఞానాన్ని పొందినోళ్ళు మీరు" అని విమర్శించేవాడు. తనకన్నా ఎక్కువగా నేను చదివింది తప్పేనా? ఉన్నదాన్ని చూసి సంతోషపడేదానికన్నా, లేనిదాన్ని వెతుకుతూ విమర్శించేదే ఎక్కువైంది నాయనలో.

జనరల్‌వార్డ్‌లో ఉన్న పేషెంటొకడు బాధ ఎక్కువై అరుపుల్ని చేయసాగాడు.

నర్స్ వచ్చి టెంపరేచర్ చూసి, చార్ట్‌లో రాసి మందహాసంతో వెళ్ళిపోయింది. ఈ మందహాసం కూడా ఆమె డ్యూటీలో ఒక భాగమే...

ఆమె నవ్వు ఏదో ఒక భావనను రేపించేది. అంతా వ్యాపారమే. ఎందుకో జ్ఞానం వచ్చినప్పటినుంచి రోజుకు ఇంతగా భయం ఎక్కువ అవుతుంది. నేను ఒకట్రెండు శతమానాల తర్వాత పుట్టి ఉండాల్సిందేమో...!

స్వాతంత్ర్యం లేని బతుకును బతికియుంటే ఎంత.... పోతే ఎంత? ఒక వ్యక్తి చుట్టూ ఎందుకింత బంధనం? తను, తనది, తనవాళ్ళు అని అనుకొన్న పరివారం ఒకటా.... రెండా...

బయట జనం గోల ఎక్కువైంది. నాలుగు గంటలైయుండొచ్చు. ఇక రెండు గంటలు ఆ రోజులో మామూలే అన్నట్లుగా జాతర. వచ్చిన జనం తమ యోగ్యతకు అనుగుణంగా కన్నీరును కార్చి, అనుకంపాల్ని ప్రదర్శించి, తమ సజ్జనతనాన్ని తామే భూతద్దాల్లో చూపెట్టుకొని సంతోషపడే సుయోగం.

అమ్మ తమ్ముడితో వచ్చింది. ఫ్లాస్క్, పండ్లను పక్కనపెట్టి, తమ్ముడు చార్ట్‌ను చూసి, "అంతా నార్మల్‌గానే ఉంది అన్నా" మెచ్చుకొనే ధ్వనితో అన్నాడు. తమ్ముడు ఫైనలియర్ ఎం.బి.బి.యస్.'

అమ్మ మామూలే అన్నట్లుగా ఒక బకెట్ కన్నీరును కార్చింది. నాయన అదే నెపంతో ప్రతిరోజు లాగ లోనికి వచ్చి.... "ఆపరేషన్‌కు ఇంతగా భయపడతారా? ఇప్పుడు హార్ట్ ఆపరేషన్లు నడుస్తున్నవట... ఇదంతా ఏమిటి?" అని చెప్తూ తన తల్లిని సముదాయిస్తున్నాడు. అతనిలో తన కొడుకు చచ్చేది లేదు అనే భావన ఉంది.

అన్నా..." రేపు ఉదయాన ఎనిమిది గంటలకేనా ఆపరేషన్" అడిగాడు తమ్ముడు.

"ఔను!" తల ఊపా.

అమ్మనుంచి కన్నీటి జాలు ఇంకా వస్తూనే ఉంది.

డాక్టర్ ఆ రోజు విసిటింగ్‌కని లోనికి రాగా, పాల పొంగుమీద నీరును చల్లినట్లుగా అమ్మనుంచి ఏడుపు రాగం తగ్గిపోయింది.

డాక్టర్ చార్ట్‌ను చూసి గుండె, పొట్ట, వీపుమీద స్టెతస్కోపు పెట్టి.... "రేపు ఈ సమయానికి మీరు నార్మల్‌గా ఉంటారు..." అని పలుకుతూ అమ్మకు ధైర్యాన్ని చెప్పి వెళ్ళిపోయాడు.

అమ్మ నుంచి వస్తున్న ఏడుపు ఎక్కువైనందులకో, ఎంతోసేపు ఆస్పత్రిలో ఉన్నందుకో విసుగుతో నాయన అమ్మను పిల్చుకొని, ఇంటికి వెళ్తామని, తమ్ముడ్ని ఇంకొంచం సేపు ఉండమని చెప్పి వెళ్ళాడు అమ్మతో కల్సి.

"అన్నా.. వదిన వచ్చింది" కొత్త విషయాన్ని చెప్తున్నోడిలాగ అన్నాడు తమ్ముడు.

"ఇప్పుడెందుకు వచ్చింది"

"ఇదేంటన్నా... ఇట్లాగున అంటున్నావు? ఇటువంటి సమయంలో రాకపోతే మరెప్పుడు రావాలి?"

"భార్య, బంధువులు, బలగం అంటే చచ్చేటప్పుడు కల్సుకొనేవారు గానే ఉంటారా? నేను చచ్చేది ఖచ్చితం చేసుకొని పోయేందుకనా?"

తమ్ముడు నా నోటిమీద అరచేతిని అడ్డుగాపెట్టి నా నుంచి మాటలను బయటకు రానీయలేదు. తమ్ముడికి పాతదంతా గుర్తుకు వచ్చియుండొచ్చు. బయటికే నడిచాడు తమ్ముడు.

ఎందుకో ఒక రీతిలో సంతోషపు భావన మనస్సులోకి జొరబడింది. తమ్ముడి మనస్సును బాధపెట్టినా "చూసావా... ఎలాగున పగను తీర్చుకొన్నానో" అనే ఒకవిధమైన



వికృత సంతోషం అది అయ్యుండొచ్చు. ఆమె మీద కోపంతో తమ్ముడి మనస్సును నొప్పించాను కదా అనే ఒక అభిప్రాయం మరలా మనస్సులో జొరబడింది.

అవును! దీంట్లో నాదేమి తప్పు? నాకు అన్పించినదాన్ని ఈ విధంగా ముఖానికి కొట్టినట్లుగా చెప్పగూడదు అని ఎంతగా ప్రయత్నించినా అదెలాగో తప్పించుకొని కఠోరమైన మాటలుగా బయటకి వస్తవి నా భావనలు. నేను జీవిస్తున్న ఈ పరిసరాలలో నాకు అన్పించినట్లుగా నడిచేది, బతికేది సాధ్యం కాదు అనేది తెల్సి నేను ఈ సమాజంలో, ఈ జగత్తులో బతికేందుకు అనర్హుడ్ని అనే నిర్ణయానికి వచ్చా.

మనస్సులోని, హృదయంలోని భావనలకు జతకట్టకుండా ఎవరిదో బంధనానికి, ఎవరిదో అభిప్రాయానికి తన స్వంతతనాన్ని అదుముకొని, ఎవరిదో నాలుకకు, ఎవరిదో అయిన కళ్ళకు, ఎవరెవరి చెవులకో మనిషి తన స్వంతతనాన్ని పంచుకొని జీవించేవాళ్ళు ఆడేటి ఈ లోకంలోని నాటకం నా పాలికంటూ చచ్చినట్లుగానే ఉంటది. అందుకే ఈ మృతప్రాయమైన జనజాతరలో బతికేదానికన్నా మంచి మార్పులతో బతికుండే సమాజాన్ని నిర్మించేందుకని చచ్చేదే మంచిది కదా....!

"వదిన వస్తదంట. నాతో అన్నట్లుగానే మరలా ఆమెను అంటావా... అన్నా" లోపలికి వచ్చిన తమ్ముడు అన్నాడు. మందహాసంతో తమ్ముడి ముఖాన్ని చూసా. తన అన్న ఎటువంటి పరిస్థితిలో కూడా వదినతో పిచ్చి పిచ్చిగా పలకడు అనే భరోసా నా నుంచి వచ్చిన మందహాసం మూలంగా స్థిరమైంది అతనిలో. ఏదో ఔషధాన్ని తెస్తానని వెళ్ళాడు తమ్ముడు.

## 2

నన్ను చంపేటి బోనులో ఈమె ఒక ముఖ్యపాత్రధారే. ప్రేమించిన ఆ జవ్వనిని వదిలినా, ఉన్నామెనైనా ప్రేమించాలని అనుకొని పెళ్లైన క్రొత్తలోనే నా పాతకతను చెప్పాను. ముమ్ముందు అదే పెద్ద పర్వతంగా మా ఇద్దరి నడుమ అడ్డుగా నిలబడ కూడదని చెప్పా. అదే చాలన్నట్టైంది ఆమెకు. అప్పుడు వెంట్రుక వాసికన్నా సన్నగా ప్రారంభమైన పగుళ్ళు రాగా రాగాపెద్దవై, రెండు భాగాలై ఆమె ఆవైపున, నేను ఈ వైపున ఉండేటట్లుగా చేసింది. ఇప్పుడు ఈ ఆస్పత్రిలో పడియున్నప్పుడు, నా మరణ ఛాయ ఒక సేతువు (వంతెన) గా అయ్యి, ఆమెను పిలిపించుకొచ్చింది. చూడాలి ఇక ఈమె తన పాత్రను ఎలాగున నిర్వహిస్తుందో,.....

ఇప్పుడు ఆమెకు కడసారిగా చెపుతా... మొదట చెప్పగూడనిదాన్నే చెప్పినందున ఇప్పుడు చెప్పాలనేదాన్ని చెప్పకుండా పోతే ఎట్లా? చివరికి నిజాలు గుర్తై తనది ఎంత అల్పతనం అనేది ఆమెకు కలగనీ....

"ఏమేయ్ సుందరీ... నిన్ను పెళ్ళి చేసుకొంది నీ ముఖాన్ని, నీ అంతస్తును చూసికాదు. నీ మీద ప్రీతినుంచీ కాదు. నువ్వు ఈ ఇంట్లోకి అడుగు పెట్టింది ఇంటికి పెద్దకోడలిగానో లేక నా భార్యగానో అనేదాన్ని నీ మామనే అడిగి చూడు. మొగుడిగా నా నుంచి అన్ని కర్తవ్యాలను నిర్వంచనంతోనే నిర్వహించా. పూర్వం ఆమెను ప్రేమించా. అయితే విధి వక్రించి నిన్ను వివాహమాడా.... కాలింగ్‌బెల్ శబ్దాన్ని విని జొల్లును కార్చే బొచ్చుకుక్కలాగ కుంయ్ కుంయ్ అంటూ నువ్వంతట నువ్వే ఒళ్ళును గోక్కుంటే నేనేమి చేసేది?...."

ఆమె వచ్చింది. ఒకతే వస్తే మరింకేమి అవుతదో అనే భయంతో స్నేహితురాళ్ళ గుంపును వెంటేసుకొని వచ్చింది. వారిలో కొంతమంది నా సహపాఠీలు ఉన్నారు. యథాప్రకారం అందరూ తమ శక్త్యానుసారం సింపతీని, దుఃఖాన్ని చూపించి, నా అర్ధాంగి నొకదాన్నే వదిలి బయటకే వెళ్ళిపోయారు. ఆమె తన కర్తవ్యాన్ని పూర్తి చేసేందుకని నా ప్రక్కన కూర్చుని, నుదురును ముట్టి, జ్వరాన్ని లెక్కించసాగింది. కడుపుమీద చేతిని నిమురుతూ... "నొప్పి ఎక్కువగా ఉందా" అంది గర్భిణితో అన్నట్లుగా.

"అంతేమిలేదు" నేను కొంచంలోనే రసీదును ఇచ్చినట్లుగా చెప్పా...

చిందరవందరగా ఉన్న నా ఉంగరాల జుట్టును సవరించింది. కొంచం సేపైన తర్వాత నా హృదయం మీద తల పెట్టుకొని చిన్నగా ఏడ్వసాగింది. నాకు నవ్వు వచ్చింది.

"ఎక్కువగా ఏడ్వకు? ఇంటికి వెళ్ళాలనుకొంటే మరలా స్నో, పౌడర్ పులుముకోవాలి" అని అనాలనిపించింది. ముఖం నిండా మేకప్ వేసుకొని పాత హిందీ సినిమాలో ఏడుస్తున్న మీనాకుమారిలాగ గుర్తుకొచ్చింది.

ఈ ఏడుపు స్త్రీకి దైవదత్తంగా లభించిన కళ. కొంతమందికి అదొక వాడిక... కొంతమందికి అదొక అంటురోగం.

అమ్మ రెండో జాతికి చేరినామె. ఏడ్చి ఏడ్చి కన్నీరులోనే సమస్తాన్ని కరిగించి వదిలేది. కొన్నిసార్లు నాయన కరిగిపోయి నన్ను శిక్షించకనే వదిలేసింది ఉంది. ఈ అమ్మ ఒక విధంగా కిరికిరి మనిషి. అన్నిట్లోనూ ఎంతో అతి. ఆమె నన్ను అంతగా ప్రీతించి, లాలించి, ముద్దుచేసి పెంచియుండకపోతే నాలో ఇంత మొండితనం వచ్చేదికాదు. నాయన ప్రీతిని, అమ్మనుంచి లభించిన ప్రీతిని కూడుకొని సరాసరిగా తీసుకొంటే, ఒక మనిషిలో ఎంత ఉండాలో అంతదాని కన్నా అధికంగానే వచ్చేది ఆ లెక్కల సరాసరి మూలకంగా. అయితే అమ్మ ఈ విషయంలో క్యాపటలిస్ట్. ఆమె అంతట్నీ తన పాలుకు



తీసుకొన్నందుచేతనో ఏమో నాయన ఎప్పుడూ ఉగ్రవాదిలాగనే ఇంట్లో అందరి విరుద్ధంగా రేగుతుండేవాడు.

ఆమె నా హృదయం మీదనుంచి తన ముఖాన్ని పైకి తీసుకోగా, నా గుండె మీద బరువు తగ్గినట్లైంది. ఏడ్చే స్టాక్ అయిపోయి ఉండొచ్చు. విచారాల సుడిలో ఆమె అస్థిత్వం నా నుంచి కొట్టుకొని పోయింది. ఆమెలో ప్రేమపాశం నా లెక్కలకు మీరి తక్కువగా ఉందని చెప్పొచ్చు. ఈ ఏడ్చే ముఖాకృతి ఆమె వ్యక్తిత్వానికి ఎంతగా కళను తెచ్చిందో కదా అని అనుకొన్నా. ఆమె తలమీద చేతుల్ని ఆడించి ఆమె కన్నీరును తుడిచా.

"ఈరోజు తప్పితే రేపు ఉదయమే ఆపరేషన్ జరిగితే అంతా బాగుపడుతది" అన్నాను.

"ఈ అనిష్టాలన్నిటికీ నేనే కారణం. నేను వదిలేసి పోకుండా ఉండుంటే మీకు ఈ పరిస్థితి వచ్చేది కాదు" అంది ఏడుస్తూ.

వాహ్ పిల్లా! నిన్ను అంతగా ప్రేమిస్తున్నాననే భ్రమ ఎలాగున పుట్టిందే నీ తలలో. అంత గాఢంగా ప్రేమించేందుకు యోగ్యురాలవు నువ్వు అనే అహంభావం అయినా ఉంది కదా నీలో. ఇప్పుడు నీలో ఉన్న భావనలు అన్నీ హృదయాంతరాళం నుంచి వస్తున్నవని తెలుస్తదా నీకు? అది నిజమే అయితే చావు అనే శబ్దం అందరినైనా గాకపోయినా కొంతమందినైనా దారికి తెస్తది అనేది ఉంది కదా! అకస్మాత్ ఆపరేషన్ సక్సెస్ అయ్యి నేను బతికి ఉంటే, ఈ ప్రీతి, ఈ విశ్వాసం చిరస్థాయిగా నిలిస్తే నేను బతికేందుకు అడ్డు చెప్పను.

ఈ సమస్త విచారాలు నాలోని నిరాళమైన ప్రాంజల మనస్సు నుంచి బయటపడినవో లేక 'బతకాలి' అనే ఆశే నన్ను ద్వేషించుతున్న ఈ జగత్‌కు గూఢచారిగా పనిని చేస్తున్న నాదే ఐన మనస్సుకు చెందిన ఇంకొక ముఖమో? అనే విచారం నా తలను తినేందుకు జొరబడింది.

"మిమ్మల్ని వదిలి ఈ రెండు సంవత్సరాలు ఏవిధంగా గడిపానో అనేది ఆ దేవుడికే గుర్తు. మీరు పిల్చుకొని, తీసుకెళ్ళేందుకు వస్తారని దారిని చూడని దినమే లేదు. నా కష్టం ఎంతామెకు రాకూడదు" అంది ఏడుస్తూ.

ఈ నారీలోకమే ఇంత. అందులోనూ ఈమెకు తన కన్నీరులోని మూల్యం (విలువ) ఎంతగానో గుర్తు. నయనతార లాగ అగత్యం ఉన్నప్పుడే తన కన్నీరును ఖర్చుచేస్తది ఈమె. సందర్భానికి తగినట్లుగా అభినయం. ఈ అభినయంలో వచ్చే మాటలన్నీ తన

హృదయ అంతరంగం నుంచి వస్తున్నవనే అన్నట్లుగా అభినయంలో పరిణిత ఈమె. ఇదంతా నాకు గుర్తే.

ఐతే ఈ నారీలోకంకు అంటుకొన్న అపవాదంకు విరుద్ధంగా ఒకామె ఉంది. ఏడ్చే వరస వచ్చినప్పుడు నవ్వుతది. అందరూ నవ్వేటప్పుడు గంభీరురాలుగా ఉంటది. జీవితంలోని ఒక మజిలీలో నన్ను సంధించి, కొంతకాలం నా అడుగులలో అడుగుల్ని వేసింది. అప్పుడు నా వాళ్ళకని నా అంతస్తు, వంశగౌరవాన్ని కాపాడుకొని నిలుపుకోవాలనే ఒత్తిళ్ళకు కట్టుబడి ఆమెను నడిదారిలో వదిలేసి తప్పించుకొన్నోడ్నినేను. లోకం ఇదొక విషయంలో రిబేటును ఇచ్చియుంటే నేను ఎప్పుడో దాని (లోకం) గులాముగా (సేవకుడిగా) మారి ఈ జగత్తుకు సేవను చేస్తుండేవాడ్ని.

తమ్ముడు వచ్చాడు. ఇంతసేపు వరకూ అభినయంలో మాసిపోయిన తన మేకప్‌ను అంత మట్టం వరకే సరిపడచుకొని నా అర్ధాంగి నా నుంచి దూరంగా జరిగి మెల్లగా కూర్చుంది.

"వదినా... నీ స్నేహితురాండ్రు పిలుస్తున్నారు... విసిటింగ్ టైమూ ముగిసింది...మీరు ఇంటికి వెళ్ళండి.... నేనూ వస్తాను" అన్నాడు తమ్ముడు. ఆమె లేచి –

"రేపు ఉదయాన్నే వస్తాను" అని చెప్పి వెళ్ళింది.

ఆమె వెళ్ళిన మీదట, తమ్ముడు రెండు సంవత్సరాల నుంచి నన్ను వదిలేసి వెళ్ళిన దానిమీద వదినను తూలనాడుతున్నాడు.

అతను ఎల్లప్పుడూ తన అన్నకు ఎవరినుంచైనా అన్యాయం కలిగితే సహించుకోలేడు. తను (తమ్ముడు) ఆ అన్యాయంను చేసే వాళ్ళ జాగాలో నిలిచి విచారం చేసి, వాళ్ళు చేసింది తనైతే చేస్తానో లేదో అనే తర్కాన్ని చేసి వాళ్ళ విరుద్ధంగా గొడవకు దిగేవాడు. ఎన్నోసార్లు దీనిమీద తెలివిని చెప్తుంటే –

"నీకేంటన్నా.. సముద్రం ఉన్నట్లుగా ఉంటావు. ఎంతగా నీలో కల్మషాన్ని వేసినా, చూసి చూడనట్లుగానే వెళ్తావు నువ్వు.... నీ నిధానంను ఒప్పుకోవాలంటే దానికీ ఒక పరిమితి ఉండాలి కదా! నాకైతే ఇదంతా చూసి సహించుకొనే శక్తే లేదు" అని అంటుండేవాడు.

నాలో ఏమి చూసాడో.... ఇంట్లో నాయనను మొదలుకొని అందరిమీదా అధికారాన్ని చెలాయించే తమ్ముడు నాతో మాత్రం ఎంతగానో వినయవిధేయలతో ఉండేవాడు. తమ్ముడి నుంచి మాటలు వస్తూనే ఉన్నవి. విషయాన్ని మళ్ళించేందుకని –



"రవి ఎప్పుడొస్తాడంట.. ఈ రోజు లేటు అయ్యింది కదా...!"

"అన్నట్లు చెప్పటం మర్చిపోయానన్నా.... అతనింటికి ఎవరో వచ్చారట... అందుకే ఆలశ్యం అవుతదని చెప్పు" అని అన్నాడు బజారులో కనబడి.

రాత్రిళ్ళు నాతో రవిగాని, త్రప్పితే తమ్ముడుగాని ఉంటుండేవాళ్ళు.

"అన్నా.. కొంచెం పని ఉంది. బయటకెళ్ళి ఎనిమిది, ఎనిమిదిన్నరకు వస్తాను" సమ్మతిని పొంది తమ్ముడు బయటకు వెళ్ళాడు.

## 3

ఇన్ని సంవత్సరాలుగా నా పెరుగుదలలో ఎవరైనా నన్ను అర్థం చేసుకొని నా అంతరంగంలో స్నేహితులుగా ఉన్నవారు ఎవరంటే ఈ రవి మరియు కుటుంబానికి, కులపోళ్ళకు భయపడి నేను పరాయివాడిగా కనుమరుగై చేసినదానికి ఆ జవ్వని ఒకతి.

ఈ రవి నాలాగనే జీవితంలో ఎన్నో కష్టాల్ని అనుభవించినోడు. ఏదో మాటకని ఇంట్లో వాళ్ళతో పొరపొచ్చాలు కలిగి ఇంటిని వదిలి పెట్టి నాతో జతగట్టి, తన స్వంత పరిశ్రమతో చదువును ముగించాడు. ఇప్పుడతను కలాశాలలో లెక్చరర్.

అతడి దుఃఖాల్ని, కష్టనష్టాల్ని చూస్తే నావన్నీ తృణప్రాయమే. అయితే ఆ బాధల్ని అతను మనస్సుకు అంటించుకొనేదిలేదు. ఎల్లప్పుడూ ప్రతి దాంట్లోనూ మంచినే చూసే అతను చెడునెప్పుడూ అతని మనస్సులోకి ఎక్కించుకొనేది లేదు. జీవితంలోని కష్టాల్ని సుఖాలన్నట్లుగానే నిండు మనస్సుతో స్వీకరించేవాడు.

ఒక రీతిలో అతను సుఖి. అతని లెక్కప్రకారమే ఇక్కడ సంభవించే అన్ని సంగతులూ జరగాల్సే ఉన్నందున ఆ సంగతుల నుంచి మనిషికి విడుదలే లేదు అనే అభిప్రాయం ఉన్నోడు. ఇక్కడే మా ఇద్దరికీ భిన్నాభిప్రాయాలు వస్తుండేవి.

మనం చేసిన మంచి చెడులకు మనమే బాధ్యులం. మనకి సంబంధం లేని విషయాలలో వేరేవాళ్ళు ఏమేమో తెచ్చిపడేసి మనకు జవాబ్దారి పట్టాను ఎందుకు కట్టబెట్టాలి? అనేది నా అభిప్రాయం. దానికి ఏదేదో పురాణాన్ని చెప్పి నాకు మనస్సు కలగకపోయినా తన తర్కాన్ని ఒప్పుకొనేటట్లుగా చేస్తుండేవాడు.

జీవితంలోని సంఘటనలు మా ఇద్దరిలో ఒకే పోలికలను చూపెట్టినా, మానసికంగా మేమిద్దరం వేరే వేరే ధ్రువాలుగా ఉండేవాళ్ళం. అయినా ఏదో ఆకర్షణ శక్తి మా ఇద్దర్నీ బంధించేసింది. ఇతని దారే వేరు, నా దారే వేరు అని ఎన్నోసార్లు అన్పించినా, డాక్టరుగారి

ఔషధం అన్నట్లుగా నాలోని కణం కణంలో తన ప్రభావాన్ని చూపెట్టి, నా అంతర్యంలోని కోటను నాకే తెల్వనట్లుగా వశం చేసుకొన్నాడు. చివరికొక రోజు ఎక్కడ అతని విచార ప్రవాహంలోని సుడులలో చిక్కి కొట్టుకొని పోతానేమో అని భయం చెందేటోడ్ని.

ఐనా ఎందుకో ఒకసారి అతడిలోకూడా నిర్లిప్తత కనబడసాగింది నాకు. అప్పుడు నేను, ఇతనూ నాలాగనే అయితే నన్ను ఈ జారు బండనుంచి రక్షించేవాళ్ళు ఎవరు అనే అవ్యక్త భయంతోనో ఏమో, అతడిలో ధైర్యాన్ని నింపి, అనివార్యమైన ఈ జీవితాన్ని ఉన్నన్ని రోజులూ సరిగా అభినయించి మట్టిలో ఐక్యమవుదామని చెప్పాను ఏమే ఐనా....

బయట కోలాహలం ఎక్కువైనట్లుగా అన్పించింది. నా గది ముందు వెళ్తున్న నర్స్‌ను పిల్చి అడిగా. ఎవరో ఒక యువతి టిక్ -20 తాగిందని చెప్పింది.

"ఎవరు ఆ అమ్మాయి?"

"శ్రీమంతుడి కుమార్తె అట... కాలేజిలో చదువుతుందట."

"అంత శ్రీమంతుడి కూతురికి ఏమైందో... చచ్చేందుకు వచ్చిన కష్టం"

"ఏముంటవి సార్... ఈ కాలంలో చచ్చేందుకు కారణాలు ఎందుకు అవసరబడ్తవి. అదీ కాలేజీలో"

"సిస్టర్... డాక్టరుగారు పిలుస్తున్నారు" చప్రాసి కేకేసాడు. నర్స్ నా నుంచి వెళ్ళిపోయింది.

కాలేజి అమ్మాయిలు అంటే ఇంకేమి ఉంటవి. పరీక్షలో ఫేల్ కావొచ్చు. విద్యార్థి బలగం చచ్చేది ఎక్కువైందని విశ్వవిద్యాలయం వాళ్ళు కొంచెంగానైనా మంచిగా రాస్తే ఉదారంగా పాసు చేసి చచ్చేవాళ్ళ సంఖ్యను తగ్గించేందుకని ప్రయత్నించే ఈ కాలంలో కూడా చచ్చేవాళ్ళు ఉన్నారు కదా! ఫేల్ అయితే ఏమిటండి? అంత శ్రీమంతుడి కూతురుకు ఇప్పుడేమైంది ధాడి? (రోగం)? అది కూడా ఫైల్‌కు చుట్టుకొనే ఆమె చావాలా?

అది కాకపోతే ఇలాగున ఉండొచ్చు. ఈమె శ్రీమంతుడి కూతురు. దానికి అనుగుణంగా అందమూ ఉంది. ఆ యువకుడు పేదోడు. చురుకు బుద్ధితో డిబేటింగ్, నాటకాలు, చదువులలో ప్రథమస్థానం. ఈమె మందబుద్ధికి అతను మెచ్చుకోబడి యుండొచ్చు. ముందినదంతా చెప్పే అవసరం లేనేలేదు.

ప్రేమ...



ఆమె తండ్రి విలన్!

ఎవడితోనో ఈమె వివాహం నిశ్చయమైంది.

ఆత్మహత్యకు ఇంతకన్నా ఎక్కువ ఇంకేమి కావాలి?

లేకపోతే ఈమేమైనా...

గర్భవతిగా అయ్యుండొచ్చేమో...

ఛీ... అదీ కాదు!

ఎందుకంటే జరిగింది పై ప్రసంగాలకు విరుద్ధంగా సాధ్యమైంది. శ్రీమంతుడైన యువకుడు, పేద యువతి! వీరిద్దరి ప్రేమ. అప్పుడు ఆ యువతి గర్భిణి అవుతది. పెళ్ళే అవలేదు. అప్పుడు ఆత్మహత్య. ఇది సరిగా అతుకుతది నా భావనలకు.

అలాగైతే వైయక్తికంగా మా ఇద్దరిలో ఏ ఒక్కరం ప్రేమ విచారంకు మనస్సులో అపజయాన్ని కలిగించుకోలేదు. నేను ఆమెను పైన చెప్పిన విధంగా చేతిని విడిపించుకొన్నప్పుడు, ఆమె ఆత్మహత్యను చేసికొని ఉంటే, నా గతేంటి? అనే విచారం నా కెందులకు రాలేదు అప్పుడు! అయితే, ఆమె ఆత్మహత్యను చేసుకొనేంతగా అధీరురాలు కాదు... ఆమె గురించి నడిచే మాటలే వేరు కదా!

నాకు జ్ఞానం వచ్చినప్పటినుంచి ఇటువంటి నూరారు ప్రసంగాలు నా ఎదురులో సంభవించి ఈ లోకంకు విరుద్ధంగా, ఈ జన జాతరకు విరుద్ధంగా నన్ను ఎత్తి పెట్టి పోరాటంను (సంఘర్షణను) చేయమనే ప్రయత్నిస్తుంది నా మనస్సు. ఇంతగా ముందుకు పెరిగిన లోకంలో ఇంకా శిలాయుగం ఉన్నట్లుగా మనిషిలోని ప్రతి చలనవలనమూ బొమ్మలు లాగ సూత్రబద్ధంగా అవ్వాలని అంటే ఎలాగ? మనిషి జీవించటానికి, అతను తన మనస్సుకు తగినట్లుగా బతికేందుకు లోకంలోని ఏ సంగతులూ అడ్డంగా రాకూడదు. ఈ రీతిగా అడ్డంపడి వచ్చిన విషాలు (గరళంలు) క్రిమికీటకాల మీద ప్రయోగం అయ్యేదానికన్నా ఎక్కువగా తన మీద తనే ప్రయోగపడిపించుకోమని ఒత్తిడ్ని చేయరాదు.

ఈమె అతడ్ని పెండ్లి చేసుకొని ఉంటే జీవనాన్ని బీదరికంలోనే గడుపుతది. అతను ఆమెను పెండ్లి చేసుకోంటే వంశం, అంతస్తు, షావుకారుతనంకు కొరత ఉంటది. మాలో లోపదోషాలు ఉన్నవని మాకు (యువతి - యువకుడుకు) తెలియజేయబడ్తే వంశగౌరవానికి న్యూనత కలుగుతది. ఇంకొకడిలో బుద్ధితనం ఉందని ఒప్పుకొంటే, మా వ్యక్తిత్వంలోని వృద్ధికి అడ్డు కలుగుతది. ఇటువంటి వేలవేల పూర్వగ్రహ దూషితమైన మనస్సు ప్రతి

ఒక విషయంలోనూ, పావ్లోవన్‌కు చెందిన కుక్కలాగ కండిషన్డ్ రిఫ్లెక్స్‌లో బ్రతుకుతుంది కదా!

నిజంగా చెప్పాలంటే నా పోరాటం ఇంతటి బొచ్చుకుక్కల విరుద్ధమేగాని ఈలోకంకు విరుద్ధంగా కాదు సుమా! నేనొక మనిషిని. నాకూ వ్యక్తిత్వం ఉంది. నన్ను నాలాగానే పెరగనీయండి. నేను బుద్ధివంతుడిగా గాంధి, లింకన్‌లాగ గొప్పోడిగా అవ్వక్కరలేదు. చెడ్డోడిగా నాధురామ్ గోడ్సేగా అయ్యేది అవసరం లేదు. వారు అలా అయ్యారు వీరు ఇలాగున అయ్యారు అనేది నాకు అక్కర్లేదు. నేను నేనుగానే అవ్వాలి. అందుకని బజారులో నాకెంత మౌల్యం నిజంగా రావాల్సి ఉందో అంతే మౌల్యాన్ని ఇవ్వండి. అదంతా వదిలి మా సరుకే శ్రేష్ఠం అని నా మనుష్యత్వాన్ని అణిగించి గంటశబ్దాల్ని విని, జొల్లును కార్చే బొచ్చుకుక్కలుగా అయ్యేది మీకు తగదు. ఎందుకంటే ఇటువంటి లోకంలో బతికేది నాకు ఇష్టంలేదు. నేను మానవత్వంతో ఉన్న మనుషులున్న లోకంలో బతకాల్సి ఉంది. అందుకే మీరు మనుష్యులుగా ఉండండి అనేదే చెప్తున్నా... అంతేకాదు...

“పాపం! ఆ యువతి చనిపోయింది సార్” అంది నర్స్.

“ఎప్పుడు సిస్టర్? ఎందుకు చనిపోయింది... ఏమైనా లవ్‌గివ్?” నా ఊహలు తప్పుగా అయ్యుండొచ్చని అడిగా.

“ప్రేమించినోడికి వేరే ఎక్కడో పెళ్ళి అయ్యిందట... అందుకే...”

“ఎందుకని ఆ యువకుడు ఈమె కన్నా శ్రీమంతుడా?”

“కాదంట సార్, ఎంతో బీదోడు అట”

“అందుకే ఆ యువతి తండ్రి పెళ్ళి అయ్యేది లేదు అని చెప్పియుండొచ్చు”

“అది కాదు సార్, యువతి ఇంట్లోని వారందరూ ఒప్పుకొన్నారంట”

“మరేంటి? ఏమైంది ఆమెకు?

“అయితే ఒప్పుకున్న విషయం ఆ యువకుడికి తెల్వలేదట సార్. ఈమె అతనికి తెల్వదన్నట్లుగానే తన తల్లి దండ్రుల్ని ఒప్పించిందట. ఒప్పుకున్న విషయాన్ని తెలియజేసేలోపే అతని వివాహం వేరొకరితో అయిపోయిందట.”

“అంతగా అవసరం ఏముందమ్మా అతనికి?”

“గుప్త ప్రేమ అంటారుగా సార్... ఒకరికొకరు తెలియజేసుకోనేది కాలేదట. వివాహం ఐన మీదట అతను ఆమెకు ఉత్తరాన్ని రాసాడట. దాన్ని చదివి ఈమె విషాన్ని త్రాగింది...



“అయ్యయ్యో... ఇలాగైందా ఈ సమాచారం.”

మనిషి ఎప్పుడూ భావనల సుడిలో బుద్ధిని ఇవ్వకూడదు. దాని పరిణామాలే ఈ ఆత్మహత్యలు, యుద్ధాలు. ఎప్పుడూ బుద్ధిలోని పట్టులో హృదయం ఉండాలి. ఈ లోకం కలిగించిన దెబ్బల్ని సహించుకొనే వస్తువుగా. అంతేకాదు, ఆ దెబ్బల్ని సహించుకొనే, వాటికి లొంగకుండానే బతికేదాన్ని పెంపొందించుకోవాలి. దాన్నే డార్విన్ మహాశయుడు "Survival of the Fittest" అని చెప్పాడు.

నర్స్ ఎప్పుడో లైటును వేసి వెళ్ళింది.

ఎంతోసేపు మంచంమీద పడుకొన్నందున విసుగు వచ్చింది. బయటున్న చప్రాసీని పిల్చి అతని సహాయంతో లెట్రిన్ వైపుకు నడిచా. రూమ్‌లోనే క్యాన్ ఉన్నా దాన్లో మూత్రాన్ని పోసేందుకు మనస్సు ఒప్పుకోలేదు. కక్కసు దొడ్డినుంచి తిరిగొచ్చి స్టూల్‌మీద కూర్చుని, చప్రాసికి చెప్పి బెడ్‌మీదున్న దుప్పట్లను మార్పించా. అతను నేను చెప్పిన వాట్ని చేసి నన్ను బెడ్ మీద పడుకోబెట్టి వెళ్ళిపోయాడు.

ఇంతగా టైమ్ ఐనా ఈ రవి ఎందుకు రాలేదబ్బా? అతని ఇంటికి బంధువులు ఎవరైనా వచ్చియుండొచ్చేమో? ఆలోచిస్తుంటే తల వేడెక్కింది.

చప్రాసి ఎవరితోనో మాట్లాడేది చేస్తున్నాడు. రవి వచ్చినట్లుంది. రూమ్‌కు వచ్చేలోపే రవి నా ఆరోగ్యంలోని అన్ని వివరాలను సంగ్రహించుకొనే నా దగ్గరకు వస్తాడు. ఇంకా ఎంతసేపు మాట్లాడుతూ నిలుచుంటాడో ఈ మహాశయుడు.

వీడొకడు... ఈ చప్రాసి... దార్లోనే రవికి ఎందుకని ఎదురైయుండాలి అబ్బా...!

మాటలు ముగిసినట్లున్నవి. ఇటే వస్తున్నట్లుంది.

“ఇప్పటికి రానే వచ్చావు కదా...! చప్రాసీని చూసి, మాట్లాడి, గట్టిగానే ఉన్నానని తెల్సుకొన్నావా” అన్నాను నేను.

“ఎందుకు ఈ రోజు ఎప్పుడూ లేని అపనమ్మకం?” నవ్వుతూ అడిగాడు రవి.

“ఏమి చేసేది. ఇప్పుడు చివరిసారిగా నీమీద ఉండే నా నమ్మకం అంతా ఎగిరిపోతదేమో అని అన్పిస్తుంది. ఇప్పటిదాకా ఎందుకు లేటైంది? ఇంటికి ఎవరో వచ్చారని తమ్ముడు చెప్పాడు. ఆ వచ్చినోళ్ళ మూలంగానే ఈ ఆలశ్యం అయ్యిందా?”

“వారి మూలకంగా కాదు... నీ మూలకంగానే”

"నా మూలకంగానా ... ఎందుకయ్యా?"

"వచ్చినోళ్ళు ఎవరో తెల్సా? కిరణ వచ్చింది. రావటంతోనే ఇక్కడికే వస్తానని హఠం చేసింది. ఆమెకు అదీ ఇదీ చెప్పి బలవంతం చేసి, విశ్రాంతిని చేయండని చెప్పి ఇక్కడకు ముట్టిందే కష్టమైంది"

అతని మాటలను విని ఏమని బదులివ్వాలో తెల్వలేదు. ఎవర్ని ఇన్ని రోజులు పరదేసిరాలుగా చేసి మరచిపోయానో ఆమే ఈ రోజు ఇక్కడకు వచ్చిన విషయాన్ని విని మూగబోయాను నేను.

"ఎందుకు మూగోడైయ్యావు. ఆమె రాకుండా ఉండాల్సిందా?"

"అలా కాదు రవి. ఆమె మీద విచారాన్ని చేసే అధికారమే నాకు లేదు. వెనక నేను చేసిందే ఈ రోజున నన్ను అతి నీచతనానికి నెట్టి కేకల్ని పెట్టూ, నవ్వుతున్నట్లుగా అయ్యింది కదా! ఆమె నన్ను క్షమించొచ్చు. అయితే అందుకు నేను అర్హుడినే అని నా మనస్సును అడిగితే నేనేమి చెప్పేది."

"జరిగిన దాంట్లో నీ ఒక్కడిదే తప్పు అని అనుకొంటున్నదే నీ భయానికి కారణం. ఎప్పుడూ అన్నీ నీ నుంచే అయినవని ఎందుకు భావిస్తావు? ఈ అతితనమే మంచిది కాదు నీకు" అన్నాడు రవి.

"నీకు గుర్తే కదా రవి. నేను ఆ భావాల్ని పడదోసేందుకు ఎంతగా ప్రయత్నాల్ని చేయలేదు? స్థిత ప్రజ్ఞత అందరికీ వచ్చే గుణం కాదు. మరలా దాన్ని పడదోసేందుకు నా నుంచి అంటూ సాధ్యమే లేదు..."

సాయంత్రం నుంచి ఇప్పటి వరకూ జరిగిన నాలోని విచార ద్వందాలను వివరించాను. దానికి "జీవితంలోని ప్రతి క్షణాన్ని నిండు మనస్సు నుంచి అనుభవించాలి అనేది నా సిద్ధాంతం. నీ చుట్టుప్రక్కల ఇంతగా జనం ఉన్నా నువ్వు పరదేసిగా, అసుఖిగా అనుకొంటున్నావు కదా! అసంఖ్యాతులైన పరదేశీలు ఎలాగున బతుకుతారు అని విచారంను చేసేందుకు ఎప్పుడైనా వెళ్ళావా?" అన్నాడు రవి.

"చూడు రవి... ఎప్పుడూ నాలో లేనిదాన్ని ఉందని తెల్సుకొనే మూర్ఖతనాన్ని నేనెప్పుడూ చేయలేదు. నువ్వు ఇంతగా చెప్తున్నావు కదా.. మీ నాయన వద్దకు వెళ్ళి, ఎందుకు పితృసుఖాన్ని అనుభవించకూడదు నువ్వు" అన్నాను నేను.



"నీకు గుర్తుందో లేదో.... ఒక చేతినుంచి చప్పట్లను కొట్టేది కుదరదని అంటాను నేను. నేను అంతర్‌జాతి వివాహం చేసుకొన్నందున నా మీద మొదటే కోపంగా ఉండేటి మా నాయన కోపం ఇంకాస్త పెరిగి తమకొక కొడుకు రవి ఉన్నాడు అనే దాన్నే వారు మరిచిపోయారు కదా!"

"ఎంతగా మాట్లాడినా అదే కత.... వదిలేయ్ ఆ విచారాన్ని. కిరణ ఎక్కడ్నుంచి వచ్చింది. నాలుగైదు సంవత్సరాలనుంచి ఆమె సంగతుల్నే వినలేదు. ఆమెకు వివాహం అయ్యిందనేది మాత్రం గుర్తు."

నేనన్నదానికి రవి ఈవిధంగా చెప్పసాగాడు. ఆమెకు (కిరణకు) పెళ్ళై మూడు సంవత్సరాలు అయినవట. భర్తకు ఆమె పూర్వపు కత తెల్సి, విరసం ఎక్కువై, ఇప్పుడు మొగుడ్నించి దూరమై ఒక సంవత్సరం నుంచి ఏదో ఊర్లో హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా ఉందట. ఇప్పుడు నా కొచ్చిన రోగం విని చూసేందుకు వచ్చిందట.

తమ్ముడు వచ్చాడు. ఈ రాత్రి రవే ఇక్కడ ఉంటాడని చెప్పి తమ్ముడ్ని ఇంటికి పంపించేసా.

కిరణను చూసేందుకు మనస్సు ఆత్రం చేస్తుంది. రవి నా మనస్సులోని ఇంగితాన్ని తెల్సుకొన్నందున కిరణను పంపిస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

ఈ కిరణ ఇప్పటి బదులు ఆరేడు నెలల క్రితం వచ్చియుంటే నాలో బతికే ఆశె బలపడి నా ప్రాణాన్ని నిలిపే సాధ్యత ఉండేదేమో. ఆటను చూస్తున్నోళ్ళలాగే తెరవెనుక ఉండి అందరూ ఇప్పుడు ఒక్కసారిగా ప్రత్యక్షం అవుతున్నారు, నాకు చెందిన ఆటల సామానులను తీసుకొని పైకి పోయేందుకు నేను సిద్ధమైనప్పుడు.

ఒక సంవత్సరం క్రితమే గుర్తైంది నాకు. నాలోని రోగం బలపడి ఎంతో కాలం బతికేది లేదు అనేది గుర్తైంది. అప్పుడే రెడియో థెరపీ చికిత్సను చేయించుకొని ఉంటే నా పేగులు చెడిపోయి ఉండేదాన్ని తప్పించేది సాధ్యమై ఉండేది. జీవితంనుంచి విముఖుడినైన నా మనస్సు ఈ రాక్షస పుండు పెరిగి, నా జీవితంలోని పూర్ణతను పొందేందుకు అది ప్రయత్నాల్ని చేసింది.

తన భర్త నుంచి విడుదలను పొందిన కిరణ సమాచారం తెల్సియున్నట్లైతే నాకు ఏ కష్టాలు ఉండేవి కావు. ఇప్పుడు నాకు సరి అని అన్పించింది అది అకార్యం అని అన్పించుకొన్నా దాన్ని సాధించే ధైర్యం నాలో కలిగేది అని అన్పించేది. అప్పుడే కిరణ

సంగతి తెల్సుంటే ఈ లోకాన్ని ఫుట్‌బాల్ లాగ అటు తన్ని ఆమెతో బతుకు బండిని నడిపించియుండేవాడ్ని.

బహుశః రవి చెప్పింది నిజమై యుండొచ్చు. ఇక్కడ ప్రతి ఒక సంఘటన లోతైన వేరులను పొంది ఉండే యుండొచ్చు. కిరణతో సహభోగంలోని బతుకును నడిపించే సుయోగం ఒదిగి వచ్చినప్పుడు మొదట్లో ఈ లోకాన్ని ఎదురించే ధైర్యం నాలో లేదు అప్పుడు. ఆ ధైర్యం ఇప్పుడు వచ్చినప్పుడు కిరణలేదు.

కిరణను ఎలాగున చూసేది? నన్నంతోడి ముఖాన్ని చూసేందుకు ఆమెకు మనస్సు ఎట్లా ఒప్పింది. మోహించి, ప్రీతించి, కలలను కట్టించి, చివరికి ఆ కలల సౌధానికి నిప్పు పెట్టా. అది కాలి బూడిదైనప్పుడు, ఆమె నొకదాన్నే వదిలి పారిపోయిన నాకు ప్రాయశ్చిత్తం ఏదైనా ఉంటదా? ఆ ఊరిలో ఆమె బతుకు శరీరానికి అంటుకొన్న (నాతో కలిగిన) ఆ నల్ల మచ్చ ఈ రీతిలో జీవితం బారుకూ ఆమెను వెంటాడి, వేదించి, ఆమె బతుకునే నాశనం చేసింది కదా!

మెలకువ వచ్చినప్పుడు కిరణ మృదువుగా తలను నిమురుతుంది. రవి ఉదయానే వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. ఎంతోసేపూ తామిద్దరం మాట్లాడుకోలేదు. చివరికి ధైర్యంచేసి... ... ...

"నువ్వు రాకుండా ఉండాల్సింది కిరణా" అంటూ నేనే మౌనాన్ని చీల్చాను.

"ఎందుకని, ఈ రోగంలో మీకేమైనా అయితే దాన్ని నా తలమీద మోపాలని భావించుకొన్నారా?" నవ్వుతూ అంది.

"చూడు... అంతట్నీ నవ్వులలో తేలించి వదలమాకు. జీవితంలో ఇంతగా చెడును చేసిన మీదట ఒకడ్ని క్షమిస్తావంటే..." మాటలు ఇక ముందుకే రాలేదు.

"తప్పించుకొనేదీ ఒకరీతే... నాకన్నా మొదలే నువ్వు నిన్నే దూషించుకొంటూ తప్పించుకోవచ్చని భావించుకొంటున్నారా?" మరలా అదే నవ్వు.

"నువ్వు ఈ విధంగా నవ్వి నన్ను చంపమాకు. నన్ను తిట్టి, నాతో కొట్లాడు... ఏమైనా చేసి నామీద కోపాన్ని చేయి కిరణా...."

"అదే ఉడుకుబోతుతనం... అదే ముక్కుమీదకోపం. ఈ నాల్గైదు సంవత్సరాలలో ఏమైనా మార్పు చెంది ఉండొచ్చని భావించా. అతిగా భావుకతనం మంచిది కాదు. ఒకట్రెండు ఫలాలను తిని సమాధానాన్ని చేసుకోండి."



ఈమె కూడా నాలాగానే. ఎన్ని సంవత్సరాలు గడిచినా మార్పును చెందేది లేదు. ఈమె ముందు వాదించేది ఒకటే, పెద్ద బండరాయి ముందు నిల్చి ఒదురుతుండేది ఒకటే. వినేంతవరకూ విని తనకు తెల్సినదాన్నే, యుక్తమైన దాన్నే చేస్తది చివరిలో.

బాధ తగ్గినట్లనిపించి కూర్చున్నా. కంచంలో ఫలాలను పెట్టుకొని, నీళ్ళ గ్లాసుతో వచ్చింది. నీళ్ళను నోట్లో పోసుకొని పుక్కిలించి ఊసిన మీదట టవల్‌తో నోటిని తుడిచింది. తనే ఫలాలను తిన్పించి, ఫ్లాస్క్‌లో ఉన్న పాలును గ్లాసులోకి నింపి ఇచ్చింది. త్రాగాను.

మోసం, వంచన, కుటిలత్వం, చంచలత్వం, అసూయ.... మొదలైన ఎన్నో గుణాలను స్త్రీమీద ఆరోపించారు కవులు. అయితే బ్రహ్మ ఈమెను (కిరణను) సృష్టించేటప్పుడు ఆ మూల ద్రవ్యాలను నింపేది మర్చిపోయి ఉండొచ్చు.

"ఎందుకు అలాగున ధిట్టించి చూస్తారు?"

"మహిళ నిలిచిన నేల, గుర్రం నిలిచిన నేల, నది నిలిచిన నేల దొరికేది అసాధ్యం అనేది ఒక కథ ఉంది కదా... నీలో నువ్వు నిలిచిన స్థలాన్నే వెతుకుతున్నా..."

"దొరికిందా?"

"అది నీకు గుర్తే... పొద్దు ఎంతైంది?"

"అర్థరాత్రి ఒంటిగంట అయ్యింది" గడియారాన్ని చూసి చెప్పింది.

"ఎందుకో కూర్చుంటే ఊపిరిని కట్టిపడేసినట్లుగా ఉంది. బయటకు తీసుకెళ్తావా?"

"ఇంత కటిక చీకట్లో బయటకు వెళ్తారా... అదీ ఈ నొప్పులతో?"

"ఇంకా నామీద అపనమ్మకం ఉందా నీకు?"

"మీరు తుంటరితనాన్ని చేస్తారని నేను అంటున్నానా...?"

మంచం మీదనుంచి నిధానంగా దింపింది. ఆసరాకని ఆమె భుజాలమీద చేతుల్ని నిలిపి నించొన్నా. అలమారులో ఉన్న బ్యాట్రిలైటును తీసుకొంది. నిధానంగా ద్వారం వద్దకు వచ్చాం. బ్యాట్రిలైటును నా చేతికి ఇచ్చి తలుపు తెరిచింది. గది వెనుక అంతా మైదానమే. బ్యాట్రిలైటు వెల్తురులో బయటున్న మైదానం వద్దకు వచ్చి కూర్చున్నాము.

అమావాస్య వెళ్ళి రెండు మూడు రోజులు అయ్యుండొచ్చు. ఎటు చూసినా కటిక చీకటే. ఆకాశం నిండా నక్షత్రాలు.

"హా.... ఎంత నొప్పి ఇది" పొట్టలో మంట మండుతుంది.

"నొప్పి ఎక్కువైందా? కొంచంసేపు ఆరామంగా కూర్చోండి" అని చెప్పి కిరణ నన్ను తన హృదయానికి ఒత్తుకొంది. ఆమె హృదయం మీద తల పెట్టి ఆకాశాన్ని చూస్తున్నా...

పిచ్చి పట్టేటట్లుగా అసంఖ్యాకమైన నక్షత్రాలు. అదుగో అది పాండవుల దారి. అదే అయ్యుండొచ్చు వర్డ్స్‌వర్త్ వర్ణించిన పాలపుంత (మిల్కీవే). ప్రతిరాత్రి కూడా ఎన్నెన్ని నక్షత్రాలు కనబడి అస్తమిస్తవో ఏమో. చీకటికూడా ఇంత సుందరంగా శృంగారాన్ని చేసుకొంటదని నాకు ఇప్పటివరకూ గుర్తే కాలేదు. జీవితంలోని ఇప్పటివరకూ అన్ని రాత్రులను వ్యర్థంగానే పోగొట్టుకొన్నాను కదా! రవి అన్నట్లుగా జీవితంలోని ప్రతిక్షణాన్నీ నేను బతుకుగా చేసుకోనిది నిజమే. ప్రతిదాని విరుద్ధంగా మానసికంగా తిరుగుబాటు చేసే దాన్లోనే నా ఆయుష్యు అంతా గడిచిపోయింది. కోటానుకోట్ల సంవత్సరాల నుంచి క్షణ క్షణంకూ ఒక్కొక్క నవ్యతనం నుంచి వెలుగుతున్న ఈ నక్షత్రాల లాగ నేనూ ప్రతిక్షణంలోనూ నూతనాల్ని గుర్తించాల్సియుంది.

"చుక్కల్ని చూస్తున్నావా కిరణా....?"

"వాటినే చూస్తూ ఉన్నా.... చనిపోయినోళ్ళు నక్షత్రాలుగా అవుతారని చెప్తుండేది మా అమ్మ. అందుకే ఇప్పుడు అన్పిస్తుంది ఎంత జనం చచ్చి నక్షత్రాలుగా మారారో అని! ఎన్ని నక్షత్రాలు ఆకాశం నిండా"

"రేపు చస్తే నేనూ ఒక చుక్కగా అవుతానని అను..."

"నేను అని అనకండి. మనం అని అనండి... మీరు చనిపోతే నేను బతికుండేది సాధ్యం అని మీకు అన్పిస్తుందా?"

"ఇంతగా కష్టాల్ని కలిగించినా నాలో ఏమి చూసి ఇంతగా ప్రేమను నిలుపుకొన్నావు?

"అదేమి చూసానో నాకు తెల్వదు. అంతట్ని మూలంలోని లోతువరకూ శోధించుకొంటూపోతే చివరికి దొరికేది శూన్యమే. నాకు నా జీవనంలో ఏమీ గుర్తులేదు. ఏమైనా గుర్తులు ఉంటే అది నువ్వు ఒక్కడివే..."

"కిరణ"

"హుం"

...........

...........



మెలకువ వచ్చి కళ్ళు తెరిచా. ఆమె రొమ్ముమీద ఎంతసేపు ముఖాన్ని పెట్టి నిద్రించానో....

"చలి ఎక్కువైంది.... లోనికి పోదాంపదండి...." అంటూ నన్ను నిధానంగా లోపలికి నడిపించుకొచ్చి బెడ్ మీద కూర్చోబెట్టింది.

మంచంపై కూర్చోగా రవి కోసమని వేయించిన ఇంకొక ఎక్స్‌ట్రా బెడ్ ఉంది.... "దాన్లో పడుకో నువ్వు" అన్నాను నేను.

బదులు చెప్పకనే నన్ను పడుకోబెట్టి స్టూల్ మీద కూర్చొని "నిద్ర వస్తే పడుకొంటానులే" అంది.

'జీవితం నాతో ఇలాగెందుకు దాగుడుమూతలాడుతుంది? పిరికిపందనై కిరణ బతుకును పాడుచేసా.... ఇంకొకామె నాలో చేరి భార్యగా మారి నన్ను కాల్చింది. అయిన ఈ తప్పులన్నిట్ని దిద్దుకొని జీవితాన్ని కొత్త దిశలో ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే ......'

ఒక వేళ రేపటి ఆపరేషన్ సక్సెస్ అయ్యి నేను బతికుంటే, నా ముందు దారి ఏది అవ్వాలో? చివరికి కిరణ దొరికిందనుకొంటే భార్య అనే ఆమె రాబందులాగ వచ్చి, నా ప్రాణం మీదకు ఎగురుతుందికదా.... కుదర్దు... ఈసారి ఆమెను (భార్యను) శాశ్వతంగా వదిలించుకోవాలి. భార్య ఏ ఏ కర్తవ్యాలను నిర్వహించిందని, ముందున్న బతుకులో నేను అర్ధాంగిగా ఆమెను ఎట్లా పరిగణించుకొనేది?

కల...! నేను, కిరణ ఇద్దరమే బయల్దేరాం. ఎంత సమయం నుంచి నడుస్తున్నామో తెల్వటలేదు. ఒక అడవి వచ్చింది. ఒక పాము పడగవిప్పి 'బుస్' అంటూ నన్ను కాటేయాలి అనేలోపు, కిరణే దాని పడగను పట్టుకొంది. అది బుసగొడ్తూ ఆమె పట్టు నుంచి జారేందుకు ప్రయత్నాల్ని చేస్తుంది. నేను దాని తోకను పట్టుకొన్నా. గిరగిరా త్రిప్పి నేలకు కొట్టాలని అనుకొనేటప్పుడు అది నా చేతినుంచి జారి పులిలాగ కిరణ మీద ఎగిరింది. ఆ పులికి నా భార్యకున్న ముఖమే ఉందని అన్పించింది. దానితో పోరాడాలని భావించా. విశ్వప్రయత్నాన్ని చేసినా నా కాళ్ళూ చేతులూ ఒక అంగుళమూ కదలాడలేదు. అసహాయకుడ్నై అరిచా.

తక్షణమే మెలకువ వచ్చింది. భయంతో వళ్ళంతా వణికిపోయింది. కళ్ళను తెరచి చుట్టూ చూసా. అదేగది. స్టూల్ మీద కూర్చొని నా మంచం మీద తలను ఆనించి నిద్రపోతుంది కిరణ. ఆమె నుంచి ఒక చేయి నా గుండెమీద నిలిపియుంది. రెండ్రెండు సార్లు ముట్టుకొని ఆమే అని ఖచ్చితాన్నీ చేసుకొన్నా.

అలిసిపోయిన ఆమె ముఖంలో ప్రశాంతత తొణికిసలాడుతుంది. ఎంతో మంది నా వాళ్ళు అని అన్పించుకొన్నా, జీవితం మొత్తం నన్ను నమ్ముకొన్న జీవి కిరణ ఒక్కతే. నీలోనూ మనుష్యత్వం ఉంది, నువ్వూ ఒక మనిషివే అంటూ నాలో నాకు పరిచయాన్ని చేయించినామె కిరణే. సమీపంలో ఉన్నప్పుడు నాలో ఉన్న సుప్త చేతనాన్నీ మనస్సు లోపలి నుంచి బయటకు తెచ్చి, పాతాళంలో ఉండేటి నా మనస్సును పతంగం (గాలిపటం) లాగ ఆకాశపు అంచుకు ఎగిరించింది కిరణ. నాతో నిల్చిందంటే లోకంలోని వెడల్పుకూ, ఆకాశం అంచున ఎత్తుకూ, విశ్వంలోని బారుకూ నన్ను వదుల్తది. మనస్సులోని వీణను ఝుంకరించి వేయి రాగాలను ఒకేసారిగా మీటేందుకు ప్రయత్నిస్తది. నూరారు ఆశల బుద్భుదాలను (బుడగలను) సృష్టించి మనస్సును ఉద్రూతలాడించే ఈమె, ఒకొక పర్యాయం నీళ్ళను విరజిమ్మి ఉప్పొంగి పొర్లే మనస్సును నిలిపేదాన్ని చేసేది.

కిటికి నుంచి బయటకు చూసా. తెల్లారితే వచ్చే శుక్రవారం నిధానంగా రాబోతుంది. ఇంకొన్ని గంటలలో రాబోయే శుక్రవారం నాలాంటి బంధీలుగా (రోగులుగా) ఎంత మందిని చూస్తదోకదా! నాలుగు గోడల బంధనం నుంచి బయటకు పోతే బయటున్న ఎనిమిది దిక్కుల బంధనం కాసుకొని ఉంటది గదా! భూమి మీద పుట్టిన ఎవరికీ ఈ హంగు ఆర్భాటంతో ఉన్న రాజమందిరంలోని బంధనం తప్పేటట్లుగా లేదు కదా! ఈ హంగు ఆర్భాటంతో ఉన్న ఈ రాజ గృహంకు బయట ఉన్న పాలసముద్రం ఎలాగుందో చూడాలనే కోరికను చూడలేకపోయినా, చూసి ఉన్నోళ్ళనైనా అడగాలనే ఆశ నాలో ఉందిలే. ఈ భూమికి చెందిన గోరీ మీద కప్పిన ఆకాశపు పరదాను చింపి గట్టిగా నిలబడతాను ఒక్కొక్కసారి. మరుక్షణంలో ధూళిలోని కణంగా అవుతుంది నా అస్తిత్వం. నాకు చెందిన మల్లె మాలల దండను ఈ కిరణ సిరిముడిలో ముడిచి, చేతి తీటను తీర్చేందుకని అదిగో ఆ చిమ్మ చీకట్లో ఆకాశంలో కన్పిస్తున్న ఆ సప్తర్షి మండలంకు మొరపెట్టుకుంటున్నా.......

ఎందుకో, ఏమో, ఈమె తిరిగి నా వద్దకు ఇప్పుడు వచ్చినప్పటినుంచి బతకాలి అనే ఆకాంక్ష బలపడుతుందనే సంశయం (డౌటు) నాకు రాసాగింది. అదే గాంభీర్యం, అదే నిష్కపటత, ప్రశాంతత, ఔనో కాదో అన్నట్లుగా ముగుళ్ళవ్వు మెరుస్తూ ఆమె పెదాలమీద నాట్యాన్ని చేస్తుంది. నాలో మమత ఉప్పొంగి ఆమె చేతిని నిధానంగా నా గుండె మీద నుంచి తొలగించి, పైకి లేచి వంగి నెమ్మదిగా చుంభించా......

మెలకువ వచ్చి సవరించుకొంటూ లేచింది కిరణ. గడియారంను చూసి ..... "ఐదు గంటలైంది..... ఇంకా నిద్రరాలేదా మీకు?" అంటూ నన్ను పడుకోబెట్టి కాపలాగా కూర్చుంది. నాకు తెల్వదన్నట్లుగా నిద్ర నన్ను ఆవరించుకొంది.



కళ్ళను తెరిచి చూస్తే కిటికి నుంచి వెల్తురు పడుతుంది. ఎదురులో కిరణ నిల్చియుంది. మేలుకొన్న దాన్ని చూసి నాకు ముఖాన్ని కడిగేది, దంతావధానంను చేసేది తనే చేయసాగింది. బయట రవి తమ్ముడితో మాట్లాడుతున్నట్లుగా ఉంది. ముఖాన్ని కడిగిన తర్వాత అమ్మ నాయన మరియు నా అర్ధాంగి తన స్నేహితురాండ్రతో హాజరైయ్యారు. ఒక్కొక్కరుగా నన్ను మాట్లాడించారు. ఎందుకో వీళ్ళందర్ని కొత్తగా చూస్తున్నట్లుగా అన్పిస్తుంది. ఎవరి మీద ఏ భావాలూ నాకు కలగలేదు. ఏయే భావాలను వ్యక్తపరిచినా ఇప్పుడు ప్రయోజనం ఏమిటి? చనిపోతే నా కోరిక ఈడేరినట్లు అవుతది. కాదు కాదు బతికితే.... ఇంతే జీవితాన్ని అర్థపూర్ణంగా బతకాలి. జీవితంలోని ప్రతి ఒక్క క్షణాన్ని అనుభవించాలి. అంటే నాలో బతకాలి అనే హఠంలేదు. సావుకు చెందిన విషయ మీమాంసం గురించి జీవించియున్న ఇన్ని రోజులూ విచారాలను చేసా. ఇపుడు మిగిలియున్న ఒక క్షణం బతుకును గురించి ఆలోచించితే అయ్యేది ఏమిటి?

డాక్టరు నర్సులు వచ్చి నన్ను స్ట్రెచర్ మీద పడుకోబెట్టి, థియేటర్‌కు తీసుకొనిపోయే వ్యవస్థను చేయసాగారు. అందరూ వరుసలో నిల్చి చూస్తున్నారు నన్ను. అమ్మ కళ్ళలో నీరు తొణికిసలాడుతుంది. నాయన ఊరడిస్తున్నాడు అమ్మను. అర్ధాంగి ఏదో భావనలను ముఖంలోకి బలవంతంగా తెచ్చుకొనేందుకు ప్రయత్నిస్తుంది. కిరణ, రవి, తమ్ముడు ఆపరేషన్ థియేటర్ వరకూ వచ్చారు.

అయిపోయింది. ఇంకొక క్షణంలో వీళ్ళందరినుంచి మాయమై సావు బతుకుల చక్రవ్యూహంలోకి స్ట్రెచర్ నన్ను నెట్టుతది.

– 0 –

22-11-2009

శాఖమూరు రామగోపాల్

భాస్కర హెగ్డె గారి 'మీసె మామ' కన్నడ కథకు అనువాదం

# మీసాల మామ

భోజనం చేసే ముందు మాధవేంద్ర ప్రతాప్ సింగ్ హోటల్ టెర్రెస్ మీద నిలిచి, దూరంలోని గోల్ఫ్‌మైదానంలో ఉన్న పచ్చగడ్డిని (లాన్‌ను) దీక్షగా చూస్తున్నాడు. నలభై ఐదు నిమిషాల విరామం ఇక పది నిమిషాలలో ముగుస్తది అనే వాస్తవం తెలిసినా, మొత్తం భారతదేశంలోని గడియారాలన్నీ ఆగిపోవాలి, అప్పుడు మాత్రమే తనకు పూర్ణ విరామం దొరుకుతుంది అనే పిచ్చి ఆశతో, ఒక క్షణం తన వాచీని, మరొకసారి గోల్ఫ్ మైదానంలోని లాన్ మీద తను నిలిచిన హోటెల్ నీడని పరీక్షించసాగాడు. తను అనుకొన్నట్లుగా వాచీలు ఆగినవా అని పొడుగుగా పెరుగుతున్న హోటెల్ నీడను చూడసాగాడు. క్షణం క్షణం రోడ్డును దాటి గోల్ఫ్ మైదానంలోని ఓక్ చెట్లను మింగి ముందుకే పోయేందుకని ఆ నీడ ప్రయత్నిస్తుంటే, తనను విరిచేందుకని పొంచి నిలబడినట్లుగా అతనికి కనబడసాగింది.

మాధవేంద్రప్రతాప్‌సింగ్ ఉరఫ్ ఎమ్.పి.సింగ్ మీద హోటెల్‌కు వచ్చిన ఒక విదేశీ వనితను బలాత్కారం చేసేందుకు ప్రయత్నించాడు అనే ఆరోపణ మోపపడి మొత్తం హోటల్ రణరంగమయ్యింది. ఇంతకూ ఆ బెల్జియం దేశస్తురాలైన మొనాలిసా ఎమ్.పి.సింగ్ పేరును తన కంప్లైంట్‌లో రాయలేదు. "గుబురు మీసాలున్న, సుమారు ఆరు అడుగుల ఎత్తులో ఉన్న ఒకడు, తనను ఆ సాయంత్రం బలంగా వాటేసుకొన్నాడు. అతను ముఖాన్ని కప్పుకొని ఉన్నాడు...." అని ఆమె ఆ కంప్లైంట్‌ను ఇచ్చిన రోజు, ఆ హోటల్‌లో ఉన్న సుమారు 40 మంది భారీగా మీసాలున్నోళ్ళలో, ఆరు అడుగుల వాళ్ళు నలుగురు మాత్రమే మిగిలారు. ఆ నలుగురులో ముగ్గురు విదేశస్తులు కావటంచేత, హోటెల్ మేనేజ్‌మెంట్‌కు వాళ్ళమీద సంశయం పుట్టటానికి ఇష్టం కానందువలన, ఇక మిగిలిన ఒక్కడే ఒక్కడెవరంటే ఎమ్.పి.సింగే అవటం చేత ఈయన మీద అనుమానం కలిగింది. ఆశక్తుడైన ఎమ్.పి.సింగ్‌ను ఇంటరాగేట్ చేసేందుకని ఒకరి తర్వాత ఇంకొకరుగా మేనేజ్‌మెంట్ పై అధికారులు రాసాగారు. మొదటగా సిటీ (బెంగుళూరు)లోనే ఉన్న మేనేజర్ ఎంక్వైరి శాస్త్రాన్ని ముగించాడు. తర్వాత చెన్నై నుంచి వచ్చిన అధికారి ఎమ్.పి.నిష్ఠ, ప్రామాణికత గురించి



ప్రశ్నించి వెళ్ళిపోయాడు. ఢిల్లీ నుంచి వచ్చినోడు మధ్యాహ్నంలోని తీక్షణమైన వేళలో బీరు త్రాగుతూ, ఎమ్.పి.సింగ్‌ను లైంగిక సామర్థ్యం గురించి ప్రశ్నెల్ని వేసాడు. భార్యతో కూడిన రతి సంబంధం మీద ప్రశ్నెల్ని వేసాడు. ప్రతిసారి అతను ప్రశ్నెల్ని కురిపిస్తుంటే ఆ పీచుగడ్డపోడి మీద కోపం ఉక్కి ప్రవహించింది ఎమ్.పి.కు

పై అధికారి నిర్లిప్తతో కానీ, తార్కికంతో సత్యాన్ని వెతికే ఆతురతో కానీ, అతనిలో (ఆ అధికారిలో) కనబడలేదు ఎమ్.పి.కు. 'ఎ' సర్టిఫికేట్ సినిమాను చూచేటప్పుడు పోకిరీ కుర్రోళ్ళు చేసినట్లుగా కన్నుకొడ్తూ, రెండు చేతుల్ని పిసుక్కొంటూ అతను ప్రశ్నెల్ని వేస్తున్నాడు. ఒక్కసారిగా ఎమ్.పి.కు అదేమనిపించిందో, ఆ ముసలి పీచుగడ్డం అధికారి మీద కోపాన్ని కురిపించేదాన్ని నిలిపేసాడు. నెలల పర్యంతం ఆసుపత్రిలో మంచం మీదున్న రోగి ఇంజెక్షన్లు, మాత్రల ప్రపంచాన్నే ఆప్యాయమానంగా స్వీకరించిన స్థితే ఎమ్.పి.కి గుర్తుకొచ్చి నిధానించాడు. రూంలోని డిమ్ లైట్ క్రింద కూర్చుని, తన లైంగిక ఇతిహాసాన్ని చిన్న చిన్న పీలికలలాగ తెలుసుకొనే మజాలో ఉన్న అతని మీద కనికరం పుట్టింది ఎమ్.పి.కు. ఎముకలగూడైన ఆ తివారి సాబ్‌ను చూసాక, ఏదో నగరంలో గుట్కా కంపెనీలోని మార్కెటింగ్ విభాగంలో పనిచేసి, తల వెంట్రుకలు తెల్లబడిపోయిన తర్వాత ఎవడి కాళ్ళో పట్టుకొని ఈ హోటెల్ విభాగంలో చేరినోడిలాగ కనబడసాగాడు. అందుచేత అతని మీద కోపగించుకొంటే ప్రయోజనం శూన్యమే అని నిర్ధారించుకొన్నాడు ఎమ్.పి.

తివారి మీద పుట్టిన అనుకంపం మూలాన ఎమ్.పి. ఒకదాని తర్వాత ఇంకొకటిగా ఫ్యామిలి గుట్టును చెప్పేది ప్రారంభించాడు. వయస్సులో పెద్దోడు, ఏదైనా దారిని చూపిస్తాడు అనే ఆశతో, ప్రారంభదశలో ఉన్న భార్యకు అంటిన క్యాన్సర్ గురించి చెప్పసాగాడు. అదే తప్పు అయ్యింది. బాస్ ముసలోడైనా, తన చేతిక్రింద పనిచేసేటోళ్ళలో ఉబ్బసం వచ్చిందాన్ని గమనించి, తను కూర్చున్న కుర్చి సేఫ్ అనే మేనేజ్‌మెంట్ కోర్స్‌లో చెప్పే థియరి మంత్రం ఎమ్.పి.కు తెల్వదుకదా! "యూ ఈడియట్... నీకు మరియు నీ భార్యకు నడుమ లైంగిక సంబంధం ఎట్లాగుంది... అదేమైనా మన హోటల్‌లో నడిచిన కృత్యానికి కారణమైందా? మీ ఇద్దరి మధ్యా విరసం ఏమైనా ఉందా అనేదే నేను శోధించ తలచిన కార్యం. నువ్వు క్యాన్సర్ గురించి చెప్పొద్దు" అంటూ కిసుక్కునే నవ్వాడు. లోనెక్కడో అగ్గి అంటినట్లుగా ఎమ్.పి. విసురుగా బయటకు నడిచాడు. "ఇటువంటోడే....ఎవడో ఆఫీసర్ అయ్యుండొచ్చు.... ఆమెను బలాత్కరించటానికి ప్రయత్నించి ఉండొచ్చులే" అని భావిస్తూ విసురుగా బయటకు వెళ్ళాడు ఎమ్.పి. "ఎన్ని నిమిషాలు సెక్సును రసపట్టుతో ఇవ్వగలవు ఒక ట్రైబల్‌గా మారి. సెక్స్ చలనం జాస్తిగా ఉండేదా నీకు?" ఇట్లా ఒకదానిమీద

ఇంకొకటిగా తన లైంగిక క్రీడమీద ఆఫీసర్లు విసిరిన ప్రశ్నలను విని విని ఎమ్.పి. కు సెక్స్ మీద మాటలు అనాగరిక ప్రవర్తనంగా కనబడకుండాపోయినవి. నాగరిక జగత్తులో బస్‌స్ట్యాండ్‌లో "ఈ బస్ ఎక్కడికి పోతది" అని ప్రయాణికుడు అడిగిన ప్రశ్నలాగ కనబడింది ఎమ్.పి.కు ఆ ఎంక్వైరీ ప్రశ్నలన్నీ.

పెద్దదైన టెర్రెస్‌లో ఒక్కడే నిలబడగా, కోపం అలలు అలలుగా కొట్టుకొంది గుండెకు. తనని పిలిచి, కూర్చోబెట్టుకొని, ఎంక్వైరి చేసిన రూంలో ఆఫీసర్లు కూర్చున్న జాగామీదకు వెళ్ళి, నిలబడి, కాళ్ళతో టెర్రేసును తన్నాడు. కోపం తగ్గిందనిపించింది. క్రిందకు దిగి నడిచాడు బయటకు ఎమ్.పి.

దిగుతుంటే, చెవికి ఒక వార్త సోకింది ఇలా... హోటల్ యజమాని ఉండే సింగపూర్ నుంచి మరొక ఆంగ్లేయ అధికారి ఎంక్వైరీకి వస్తాడని. దాన్ని విన్నప్పుడు మనసులో బడబాగ్ని విస్ఫోటనం చెందలేదు. సిగ్గూ ఉదయించలేదు. తనకు తనే తలను విసురుకొన్న ఎమ్.పి మళ్ళీ తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకొనేందుకు సిద్ధమైయ్యాడు. తను చేయని రేప్ గురించి ఇంకెంత చక్కగా విశదీకరించేది సాధ్యమా? లేని అపరాధం జాడల్ని వీళ్ళంతా చేరి ఇంకెక్కడ్నించి తేగలరు? ఈ విధంగా ఆలోచన చేస్తుంటే అతనికి ఆధ్యాత్మిక సత్యమే కనిపించసాగింది. ఈ సంఘటన నడిచినప్పుడు తను డ్యూటీలో హోటల్‌లోని సింహద్వారం దగ్గర ఉన్నాను అని చెప్పినా, వినకుండా, దానికి సాక్ష్యాన్ని తెచ్చి చూపించు అంటూ పీడించే ఇంటిరాగేటింగ్ అధికారి మాటలు అదేదో కుట్రలో భాగం కావొచ్చేమో అనేది గుర్తుకొచ్చి అతను అప్పటికప్పుడే అఫ్‌సెట్ అయ్యాడు.

"అందరి కళ్ళెదురుగా ఉన్న తనకు ఏ సాక్ష్యం అక్కరలేదు" అనే మాటను చెప్పాలనుకొన్నా, తను దాన్ని ఇంతవరకూ వచ్చిన ఆఫీసర్ల ఎదురు ప్రస్తాపించలేదు. ఎన్నో గంటలు అనే దాని కన్నా ఆ దినం మొత్తం కుమిలిన అతను చివరిగా – ఆ వచ్చే సింగపూరోడికి – తన నిజాయితిని చెప్పే విజయాన్ని సాధిస్తానులే అని తనలోనే తనే అనుకోగా, అప్పుడు సమాధానం లభించింది ఎమ్.పి.కు. యౌవ్వన పొరను వదలుకొన్న మధ్యతరగతి మగోళ్ళు తమ శౌర్యాన్ని భవిష్యత్‌కని దాపెట్టుకొన్నట్లుగా ఎమ్.పి కూడా అంతటినీ సింగపూరుసార్‌కని దాపెట్టాడు. అప్పుడతని మనస్సు శాంతమైంది. మళ్ళీ అదే హోటల్‌లోని డ్యూటీని చేసేందుకు చైతన్యం పుట్టింది.

ఆరుపూట్ల నాలుగు అంగుళాలు ఉండే ఎమ్.పి రాజస్థాన్ నుంచి బెంగళూరుకు వచ్చిందే ఈ హోటల్‌లో పనికని. ఈ హోటలుకు చెందిన ఒక అధికారి సెలవలకని రాజస్థానును చూచేందుకు వస్తే ఈ ఎమ్.పి అతడికి తారసబడ్డాడు. ఎమ్.పి. కష్టించేదాన్ని,



దాన్ని కన్నా ముఖ్యంగా అతనికున్న విలక్షణ మీసంను చూసి అక్కడికక్కడే ఉద్యోగం ఇస్తానురా అని పిలుచుకొని బెంగళూరుకు తెచ్చాడతడ్ని. పనికని గుర్తేలేని దక్షిణభారతంలోని నగరానికి వెళ్తాను అని అంటే ఇంట్లో వాళ్ళందరూ ఘోల్లుమంటూ ఏడ్వసాగారు.

విదేశాల్నుంచి వచ్చే వాళ్ళను ఆదరంతో నిండు భారతీయుడిగా స్వాగతాన్ని ఇప్పించేందుకని మేనేజ్‌మెంటోళ్ళు వీరప్పన్‌కు ఉన్నట్లుగా మీసం ఉన్న ఇతనికి నౌకరీ ఇచ్చారు. నౌకరి దొరికి మూడునెలలైన తర్వాత ఊరికి ఒకసారి వెళ్ళి వచ్చిన తర్వాత, హోటలులోని సిబ్బంది ఇతడికి కొత్త పేరును పెట్టారు. "పొట్టకు అన్నాన్ని ఇచ్చే కంపెని తనను ఏ పేరున పిలిస్తే జరిగే నష్టం ఏమిటి?, ఏది ఎట్లా నడిస్తే అట్లాగే కానీ" అని నమ్మాడు. క్రొత్త పేరుగా – మాధవేంద్ర ప్రతాప్ సింగ్ – ఆఫిడవిట్‌తో పేరును మార్పించి, ప్రీతితో ఎమ్.పి అనే పొడి పేరును అందరూ ఉచ్చరించసాగారు. రాజస్తానీ డ్రెస్‌తో, రాజపుత్రుడి లాగ అతను హోటల్ లోని సింహద్వారంలో ద్వారపాలకుడిగా విజృంభించసాగాడు.

హోటలు సింహద్వారం వరకూ వచ్చి నిలిచిన కార్ల డోర్లును తెరిచే పనిలో అతనికి సుఖం కనబడేది. విలాసవంతమైన కార్ల డోర్లను తీస్తే లోన కూర్చున్న వ్యక్తి సావకాశంగా బయటకు వచ్చేది ఎమ్.పి.కు ఒక మ్యాజిక్‌లాగ కనబడేది. ఏ కారైనారానీ, పోర్టికోలో వచ్చి నిలబడితే, అక్కడికి వెళ్ళి కార్‌డోరును మృదువుగా తీసి కొంచెం నడుం వంచి నిలబడేటోడు. లోనున్న చక్రవర్తులు సావకాశంగా దిగి ఆహ్వానించేందుకు వచ్చినోళ్ళతో షేక్‌హ్యాండ్ ఇచ్చేముందే ఎమ్.పి. సలాము కొట్టి ఈ అతిథుల హృదయాలను గెలిచేవాడు. ఆ సలాములో మిలటరి శిస్తు, నిబద్ధత కనిపించేవి. పసిబాలుడి ప్రీతిలాగ అది ఉండేది. ఇట్లా చేస్తూ కొద్ది రోజులలోనే అతను ఎంతో ప్రశిద్ధం అయ్యాడు. అతని ఛాతిమీదున్న నల్లవెంట్రుకలు, వద్దన్నా అతను ధరించే రాజస్థానీ దుస్తుల నుంచి బయటపడి, కారునుంచి దిగిన కొంతమంది స్త్రీల మనస్సులను యమునాతీరానికి తీసుకెళ్ళినట్లు చేసేవి. ఒకరిద్దరు విదేశీ వనితలు విసిటర్స్ పుస్తకంలో "మీ హోటలులో స్వాగతానికని ముందుకురికిన అతని సేవాదృక్పదం అదొక మరపురాని అనుభూతిని ఇచ్చేదిగా ఉంది" అని రాసారు. ఆపుస్తకంలో అతని పేరును రాయకపోయినా, తిరిగి తమదేశాలకు వెళ్ళేటప్పుడు అతని గుండెను మీటుతూ "యు ఆర్ ది స్టార్ ఎట్రాక్షన్" అని చెప్పే వెళ్ళేవారు. అందరెదురు ప్రశంసామాటల్ని విన్నప్పుడు నోరు వెళ్ళబెట్టి నవ్వకుండా, సీరియస్‌గా నిలబడకుండా, ప్రభుదేవ నడుంను త్రిప్పినట్లుగా దేహాన్ని కులుకించి ఆనందాన్ని పొందేవాడు. కొన్నిసార్లు కార్లనుంచి దిగిన లలనామణుల దుస్తుల నుంచి బయటపడుతున్న అందాలు ఎమ్.పి.

రోమాల్ని నిక్క బొడిపించేవి. బయటకూ చెందని..... లోనశీచీ చేరని సింహద్వారంలో కూర్చున్నప్పుడు ఎట్లాగుండాలి అనే ట్రైనింగ్ మూలకంగానో మరేంటో అతను తను ధరించిన వస్త్రాలకు తగ్గట్టుగా మానసిక స్థిమితాన్నే మునిలాగ ఒప్పుకొన్నాడు.

ఉద్యోగం దొరికిన ఏడు సంవత్సరాలకు, అతని ఖుషీకని తోడైయ్యేందుకు కొడుకొకడు పుట్టాడు. తండ్రి చనిపోతే, తల్లైన దేవకిని 'హెబ్బాళ'కు సమీపంలో ఉండే అద్దెకొంపకు పిలుపించుకొన్నాడు. కొడుకు పుట్టి కాన్వెంట్‌లో చేరేవరకూ కిశోర్‌కుమార్ ప్రేమగీతాల్నే పాడుకొనే అతను, ఒక్కసారిగా భైరవీరాగంతో హిందుస్థాని సంగీతాన్ని ఆలాపించేటట్లుగా మార్పులు చెందాయి అతనిలో. ఇప్పుడు క్యాన్సరుతో కృశిస్తున్న అర్ధాంగి, జగడంతో నీటిని తెచ్చే తల్లి మరియూ రాజస్థానును పుట్టిన తర్వాత చూడని మరియు బెంగళూరుకే చెందిన కన్నడ పోరడుగా మారని కొడుకైన నియోగి.... ఈ ముగ్గురూ చేరి ఎమ్.పి. మీసాల్ని సడిలం చేసినట్లుగా ప్రవర్తించేవాళ్ళు. వారానికొకసారి కిద్వాయి ఆసుపత్రికి వెళ్ళి క్యూలో నిలిచి, చీటి తీసుకొని కెమోథెరఫి చేయించుకొని వచ్చిన అతని భార్య వారంలో మూడునాలుగు రోజులు జబ్బుబాధతో మంచాన పడి ఉండేది. అలా మంచాన పడియున్న రోజులలో ఇంట్లో అఘోషిత కర్ఫ్యూ ఉంటుండేది. మాటల్లేవు, కతల్లేవు, నవ్వుకూ రేషనే. వీటన్నిటి మధ్య నిన్నటి రోజున చేసిన పప్పుకూ, హోటల్ నుంచి ఎమ్.పి. తెచ్చే చపాతీలతో తినేది వాళ్ళకు అభ్యాసం అయ్యింది.

దిగువ మధ్య తరగతి కుటుంబాలలో పగటిపూటే నడిచే అల్లకల్లోలాలకు నిదర్శనం అన్నట్లుగా అతని భార్య సీత మరియు తల్లైన దేవకి పోట్లాడుకొనేది కులవృత్తిగా చేసుకొన్నారు. దేవకిఅమ్మకు ఒకటేగురి. ఇంటిలో నడుస్తున్న అనిష్టాలకు కోడలే కారణం అనేదాన్ని రుజువు చేసేందుకు ఎన్నెన్నో వాటిని సిద్ధం చేసేది. ప్రాతఃకాలంలోనే కోడల్ని నిందించేదాన్ని ఆమె అభ్యాసంగా చేసుకొంది. మనమడైన నియోగి నానమ్మ మరియు తల్లి మధ్య ఫోస్ట్‌మ్యాన్‌గా పనులను నిర్వహించేవాడు. చపాతీలకు ఎంత పిండిని కలపాలి అనే విషయం నుంచి, ఇంట్లోజరగబోయే ముందు పనుల వరకూ సీత కొడుకు మూలంగానే చెప్పి అత్త దగ్గరకు పంపేది. ఎన్నో పౌర్ణాలు, అమావాస్యలు వచ్చి వెళ్ళినా సీతలో అత్తమీద కోపం వృద్ధి చెందుతూనే ఉంది. వాళ్ళిద్దరి మధ్యన జగడంలో కూడా ఆ ఇంటిలో అన్నం ఉడుకుతూనే ఉంది. చపాతి ఉబ్బుతూనే ఉంది. పిశాచాలు తిరిగే ఆ ప్రాంతఃకాలంలోనే, కాలనీలో ఒక మూలనున్న కుళాయినుంచి క్యూలో నిలిచి నీరును పట్టుకొని వచ్చే దేవకీకు పాచిపోయిన పప్పు, గట్టిపడిపోయిన చపాతీని తింటుంటే ఈ ఊరికే కరువుకాలం వచ్చే లక్షణాలు ఆమెకు కలిగించేవి. తన ఆజ్ఞె లేకుండానే ఇంటిలో



వేరే వేరే సమయంలో నడిచే ఘటనలు, ఆమెను ఎడారిలోని ఎండ వేడిమిలా వేదించేవి. కోడలి అసహకార పనులు ఆమెకు సహించకపోయినా తమ భాషే మాట్లాడని ఈ ఊరులో కోడలి జతగా మాట్లాడకనే కోపాన్ని తన కడుపులోనే దిగమింగుకొని మౌనవ్రతాన్ని ఆచరించేది. ఎవరికీ రానటువంటి క్యాన్సర్ కోడలికి రావటం, డిసిప్లిన్ డిసిప్లిన్ అంటూ పిల్లలందర్ని ఒకే మూసలో సిపాయిలు లాగ తయారుచేయటానికి సిద్ధమైన మనుమడు నియోగి స్కూల్ మరియు తన ప్రీతిపాత్రుడైన కొడుకు డ్యూటీలో నడిచే కార్యాలు, ఇవన్నీ అర్థంగాక దేవకి కంగారు చెందేది. బెంగళూరుకూ చెందని, రాజస్థానుకూ పోలేనటువంటి జీవనం మూలాన తమిద్దరం ఒద్దికగా ఉండాల్సిందే అనే మిథ్యావాదం ఆ అత్తా - కోడళ్ళ మధ్యన ఉండేది. తమ ఇద్దరి రొట్టెలకు మూలమైన ఎమ్.పి. కార్యక్షేత్రం బెంగుళూరు మహానగర సంస్కృతిలో తమ కుటుంబమూ ఒక కోళ్ళ గూడుకు చెందిన ఆవాసంగా పరిగణించుకోసాగారు వాళ్ళిద్దరూ.

ఒకరోజు ఉదయాన లేచినప్పుడే నియోగి హఠాన్ని చేయసాగాడు. "పొద్దున్నే వెళ్ళి, రాత్రికి తిరిగొచ్చే నీకు పేగు బంధం ఎట్లా తెలుస్తుంది. నువ్వొక తోకాడించే ఊరకుక్క మాత్రమే సుమా" అంటూ కోడలైన సీతకు వినిపించనట్లుగా కొడుకును మందలించింది దేవకి. "యూనిఫాం వేసుకోకుండా స్కూలుకు వెళ్తాను" అనే హఠాన్ని చేసిన మనమడికి అతను అడిగిన పింక్ కలరు బట్టల్నే వేసి పంపింది నాయనమ్మ. "యూనిఫాం లేకపోతే చదవటానికి కష్టమా?" అని కోడలెదురు గట్టిగా మాట్లాడి మనమడ్ని స్కూలుకు పంపింది దేవకి. యూనిఫాంను వేసుకోకుండా వచ్చిన నియోగిని ఆ రోజంతా క్లాసులో నిలబెట్టి, శిక్షను విధించినదాన్ని తెలుసుకొన్న కోడలు, మరుసటిరోజు వస్త్రాపహరణం అయిన ద్రౌపదిలాగ రౌద్రమూర్తి అయ్యింది. సీత ఒంట్లో శక్తిని నింపుకొని అత్త ఎదురు వచ్చి నిలబడి ఒక్కసారిగా ధ్వనిని విసిరింది. "నాతో జగడం చేసేది చాలదా... ఇప్పుడు నా కొడుకైన నియోగికి రాహు, కేతువులాగ తగులుకొన్నారు కదా? మీకేమి కావాలో అడగండి... చేసి పెట్తాను.... తిని హాయిగా ఒక మూలన పడి ఉండండి" అంటూ నేలను ధపధపా గుద్దింది కాలితో. దేవకీకు కోడలి నుంచి వచ్చిన అడుగుల గుద్దుడుకు నిజంగానే భూమి కంపనం చెందుతదేమో అనేంత భయం ఆమెలో పుట్టింది. జుట్టును వదులు చేసుకొని,చేతులూ - కాళ్ళతో తనెదురు గట్టి ధ్వనితో ఆర్భాటాన్ని చేసినదానికి బెదిరిన దేవకి, తనను ఎవరో లోయలోకి నెట్టినట్లుగా భావించింది.

ఈ అనుభవానికి ఎట్లా ప్రతిక్రియించాలో గుర్తుకురాక దేవకి బోరున ఏడ్వసాగింది. ఇదంతా సునామి అలలాగ వచ్చి తాకినట్లుగా ఎమ్.పి. కళ్ళెదురే నడిచింది. అతను మాత్రం ఇదొక సుప్రభాతసేవ. దీనికి తను మగటిమితో అణిచేదాన్ని చేయరాదు అని

భావించాడు. ఆ రోజు ఎమ్.పి. డ్యూటీకని ఇంటి నుంచి బయటపడింది మళ్ళీరాత్రి ఇంటికొచ్చింది ఆ కాలనీలో జనం ఎవరికీ గుర్తుకాలేదు.

పాలవ్యాన్ తిరిగే సమయానికి సరిగ్గా స్నానం చేసి, స్కూలు పిల్లలు వెళ్ళేటైముకు ఎమ్.పి. ఇంటినుంచి బయటపడేటోడు. స్కూలుకు వెళ్ళేందుకు నిరాసక్తిని చూపించే పిల్లలకు, వాళ్ళవాళ్ళ తల్లులు ఎమ్.పి.ను దూరం నుంచి చూపించి, "మీసాల మామ వస్తున్నాడు. ఇప్పుడాయన్ను పిలవనా? పిలిస్తే చాలు వచ్చి నిన్ను పట్టుకెళ్తాడు" అని బెదిరించి వాళ్ళను స్కూళ్ళకు పంపేవారు. కాలనీలో ఇట్లా తన పాప్యులారిటీ పెరిగినా, తన దిన నిత్యకర్మలో ఏ మార్పులూ కలగవులే అని నమ్మినందు వలనే అతనికి తన పాప్యులారిటీ ఏమి మహత్త్యంను కురిపించలేదు. ఒక ఇంటి తర్వాత ఇంకొక ఇంటిగా, అతనికి తెల్వకుండానే నడిచే మీసాల మామ మహిమ మీద గుర్తేలేని అతను మాత్రం నూనెను పట్టించి మర్ధనం చేసిన తన మీసాల మీదే గమనాన్ని నిలిపి బస్‌స్టాఫ్‌కు చేరేవాడు. ఉరుములలో, కారు మబ్బుల మాటున దోబూచులాడుతున్న చంద్రుడిలాగ అతను సహప్రయాణికులకు ఒక్కొరికీ ఒక్కొక్కతరహాలో కనిపిస్తుండేవాడు. ముసలోళ్ళకు మూగోడులాగ, పిల్లలకు పెద్ద మీసాల రౌడి మామలాగ, సాత్విక స్త్రీలకు తోడబుట్టిన సోదరుడులాగ, కొంతమంది కిలాడి కన్యలకు సెక్స్ సింబల్‌లాగ కనబడుతుండేవాడు.

బస్ కోసమని చుట్టూ చేరిన జనంతో జతగా మాట్లాడే ఆసక్తిని చూపకుండా అర్ధాంగి సీత ఇంటి నుంచి బయటికి వచ్చే ముందు తనకు చెప్పిన తులసీదాసు 'రామచరితమానస'ను మళ్ళీ మళ్ళీ గుర్తుకు తెచ్చుకొంటుండేవాడు. పాలబుగ్గల నియోగి ప్రతిదినం మేల్కొనే దాన్నే చూస్తూ నిలబడితే, సీత "ఉత్తిగనే అతని ముఖాన్ని చూస్తే చాలదు.... ఆ పసివాడి నుదుటిమీద బాధల గీతలు రాకూడదు.... దానికోసం ఏమి చేయాలో ఇప్పట్నుంచే ప్రణాళికల్ని సిద్ధం చేయండి" అంటూ గుచ్చి గుచ్చి మాట్లాడింది గుర్తుకు వచ్చేది ఆ సిటీ బస్ ప్రయాణంలో.

దేవుడి ముందు నిలబడి ప్రసాదాన్ని స్వీకరించినట్లుగా కొడుకు ముఖారవిందాన్నే కళ్ళనిండా చూసి, ఇంటి నుంచి డ్యూటీకి బయల్దేరేవాడు ఎమ్.పి. కొడుకు ముఖంలో భవిష్యత్ నాడిని చూసే ఆత్రంలో అతను చుట్టూరా ఉన్న జనం నుంచి దూరంగా ఉంటుండేవాడు. "పంచతారా హోటల్‌కు వచ్చే శ్రీమంతులకు మాటలతో, చేష్టలతో బురుడీగొట్టించండి" అని సీత హిత బోధల్ని చేసేది "ఇన్ని సంవత్సరాలుగా విశ్వంలోని శ్రీమంతుల నుంచి మరియూ భారతదేశం నుంచి ప్రపంచసుందరిగా ఎన్నికైన ఆమెకూ.... మొదలైనోళ్ళకు భవ్యస్వాగతాన్ని నువ్వు కురిపించినా, ఎవర్నీ బుట్టలో వేసుకోని మిమ్మల్ని



చూస్తుంటే.... మీరు గడుసు మగోడు అనే దాంట్లో నాకు సందేహం పుట్టుతుంది. మీకు సిగ్గనిపించటం లేదా?" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది గుర్తుకు రాసాగింది ఎమ్.పి.కు. తన దినచరిలో సీత నుంచి జాలువారిన హితబోధనలు లేని దినాల్ని గుర్తుకు తెచ్చుకొనేందుకు అతను ఎంత ప్రయత్నించినా, చివరకు తనేమి చేయలేని నిస్సహాయకత మీద ఊరికనే నిట్టూర్పుల్ని వదిలి బస్ నుంచి దిగేదాన్ని అలవరచుకొన్నాడు. భార్యతో మాటలు ప్రతిదినం ఉదయాన ఇలాగునే పరిసమాప్తి అయినప్పుడు అతని మానసిక స్థితి – "హోటెల్‌లో కారు నుంచి పాచిగబ్బునోరుతో నవ్వుతూ దిగి లోనికి వస్తున్న బానకడుపున్న మంత్రి మహోదయుడిలాగ" పరివర్తనం అయ్యేది.

"వచ్చిన అతిథులతో ఎట్లాగైనా చేసి, భేటీ అయ్యే సన్నివేశాన్ని కల్పించుకోండి. వాళ్ళతో మాటల్ని కలపండి. మీరెవరు అని వారు అనుకోవాలి. డోరు తెరచి స్వాగతాన్ని కురిపించిన మిమ్మల్ని వాళ్ళు మరచిపోకుండా ఐదువందల నోటును మీ చేతిలో పెట్టిపోయేటట్లుగా సమ్మోహనాన్ని కలిగించండి." అనే సీత ఉద్భోదనలు అతని చెవికి సోకేవి కాదు. "కాదు... కాదు తల్లి తనతోనే ఉంటుంది. ఉన్న ఉద్యోగంలో ఏదైనా దుర్ఘటనలను తను చేస్తే ఉప్పు, కారంతో తనను బాండిలిలో వేసి వ్రేపిస్తది తల్లి అనేది అతనికెప్పుడూ ముంజాగ్రత్త సూచనలను ఇస్తుండేది. హోటెల్‌కు ముట్టి, బట్టలను బదలాయించుకొని, మొదటి మూడు నాలుగు సలాములు కొట్టే వరకూ అతని మస్తిష్కంలో అర్ధాంగి మాటలే నిలబడి ఉండేవి. "తనకు మొత్తం బెంగళూరులోని ప్రఖ్యాత శ్రీమంతజనం పరిచయం ఉందిలే. అయితే ఎవర్ని అడిగినా సహాయం చేస్తారు అని అనుకోకూడదు. ఒక వేళ తను యూనిఫాంను విసర్జించి, శ్రీమంత జనం భేటీకనిపోతే.... కర్ణుడు కవచకుండలాల్ని వదిలి యుద్ధానికి వెళ్ళినట్లుగా ఉంటది కదా! నన్ను నమిలి మింగుతారులే.... నాలుగో క్లాసునూ చదవని నాకు ఏమి సహాయం చేస్తారు? 'నువ్వు వచ్చిందే రాజస్థాని మనిషిగా.... ఇదిగో రాగి చెంబు' అని చేతికి ఇచ్చినా ఆశ్చర్యం లేదులే. పద్ధతిగా ఉంటే ఈ ఊరు నాకు ఎల్లప్పుడూ రొట్టెల్ని దండిగానే ఇస్తదిలే! వాటిని వదలి, నల్లకోటును వేసుకోవాలి అని భావిస్తే ఒక లోటా నీరునూ దొరకనట్లుగా చేయగలరు ఈ శ్రీమంత జనం....!" సీత మాటలు మంచిగా లేవులే అనే విచారధార అతనికి సదా జ్ఞాపకంకు వచ్చేది. ఆమె ఎన్నో మాటల్ని ముందస్తు ప్రణాళికకని చెప్పి, భర్తను డ్యూటీకని పంపించే విధం ఎట్లాగుండేదంటే "దీపావళి పండుగ మరుదినం నగరంలోని యాదవులు బలిష్టమైన దున్నపోతును శ్రద్ధతో అలంకరించి సదర్ ఉత్సవానికని పంపినట్లుగా ఉంటుండేది" ఎమ్.పి.కు.

ఎవరైనా గొప్ప అతిథి కారులోంచి దిగివస్తే, అతను ఉత్తిగనే సలాము మాత్రమే కొట్టకుండా "వెల్‌కమ్ టు అవర్ హోటెల్" అంటూ వాళ్ళ ముందు చేతిని చాచేవాడు. అతిథి ఇతడ్ని గమనించకుండా ఉన్నా, వాళ్ళతో కృతకంగా నవ్వును నింపుకొని, ద్వారాన్ని దాటి నాలుగు అడుగుల్ని వేసేందుకు ప్రయత్నించేవాడు. మామూలుగానే మీసం గురించి చెప్పేందుకని ప్రయత్నాల్ని చేసేవాడు. తన కొడుకు చదివే స్కూలులో మిగతా పిల్లల తండ్రులకన్నా తనే పెద్ద మీసం ఉన్నోడ్ని అని చెప్పేందుకు ఆరాటం చెందేటోడు. ఎప్పుడైతే తన స్తోత్కర్షను వినేందుకు వాళ్ళు విముఖులైయ్యారు అనే షాక్ కొట్టితే, వేరే దారి లేక మళ్ళీ తన సింహద్వారం చెంతకొచ్చేవాడు.

అప్పుడొక విచిత్రం నడిచింది. ద్వారాన్ని దాటి నాలుగో ఐదో అడుగుల్ని వేసి ముందుకు పోయేటప్పుడు లాబీ మేనేజర్ ఎదురొచ్చి, ఎవరికీ తెల్వనట్లుగా ఆపి "ఎమ్.పి. సింహద్వారంలో ఎవరూ లేరు కదా! ప్లీజ్" అంటూ నోట్నించి మృదువుగా చెప్పినా అతని కళ్ళలో ఎర్రటి నెత్తురు చారికలను చూసిన ఎమ్.పి తక్షణం భార్య చెప్పిన హిత బోధల్ని వదిలేసి, హోటలోళ్ళు నేర్పించిన చిలకపలుకుల్ని వల్లెవేసేందుకు తిరిగి సింహద్వారం వద్దకు వచ్చాడు. తక్షణమే అతను అంతఃకరణంతో మార్పును చెంది, బ్యాలెన్స్‌తో కొద్దిగా నోరు తెరచి పెదాలమీద చిరుదరహాసాన్ని ప్రదర్శించి, వచ్చినోళ్ళను అప్యాయంగా చూడసాగాడు. నేరుగా నించొని అతనుంటే, ఆ శరీరభంగిమలో అప్పుడే జనించిన నవజాత శిశువులాగ కనబడేవాడు అతిథులకు. ఇంటిలో జరిగే పోట్లాటలను చూసి, విసిగివేసారిన అతనికి హోటెల్‌లో మాత్రమే సహజంగా ప్రీతిపుట్టేది. వచ్చిన అతిథులు పిల్లల సమేతంగా వస్తే, ఆ పిల్లల్ని తన దగ్గరకు పిలుచుకొని, థ్యాంక్స్ చెపుతూ, వాళ్ళకు గాలిలోనే ముద్దుల్ని కుమ్మరించేవాడు. ఈ విధంగా డ్యూటీ ముగిసేవరకూ చేసేవాడు. ఇంటిదార్ని పట్టినప్పుడు ఒక్కసారిగా సీత చెప్పింది గుర్తుకొచ్చి ఈ రోజు కూడా ఎవర్ని వశం చేసుకోలేదు కదా అనే విషయం గుర్తై లోలోపలే ముడుచుకుపోయేవాడు. ఇంటి సమీపంకు చేరేటప్పటికి, మొత్తం పగలంతా గుబురుగా నిలిచిన మీసాలు చచ్చిన కొండ చిలువలాగ అయ్యేవి.

ఆరోజు ఎప్పటిలాగ లేదు. ఇంటిలో తల్లి మరియు భార్య నడుమ పోట్లాట ఎప్పటిలాగ నడచినా, దారిలో కనబడిన సంభ్రమ వాతావరణంను చూసి ఒక క్షణం చకితుడైయ్యాడు. కరెంట్ దీపాల మాలలతో మొత్తం కాలని ధగధగలాడుతుంది. అతనికి ఆశ్చర్యం! "ఏమైందబ్బా"! ఇల్లు మరియు డ్యూటి అనే రెండు కొండ చిలువలు అతడ్ని ఎంతగా కబళించినవంటే, అతనికి కాలనీలో జరిగే మేరిమాత జాతర గుర్తుకే రాలేదు. ఇంటిలో



కాలిట్టాడు. ఇల్లంతా గబ్బిలాలతో నిండినవి అనే భావన వచ్చింది. తను వదులు చేసుకొన్న జుట్టును సీత ఇంకా సరిగా ముడివేసుకోలేదు. అతని తల్లి కూడా తలుపుల్ని తెరచి ఆప్యాయంగా ఆహ్వానించలేదు. కొడుకు ముడుచుకుపోయిన కుక్క పిల్లలాగ హోం వర్క్ చేసుకొంటున్నాడు. మాటల్లేవు... కథల్లేవు.... టి.వి కూడా మ్రోగట్లేదు. కాళ్ళు కడుక్కొని లోనికి వచ్చిన అతను ఐదు నిమిషాలు ఉత్తిగనే కూర్చున్నాడు. ఆ తర్వాత కొడుకు ఏం చేస్తున్నాడు అని చూచేందుకు వెళ్ళాడు. తండ్రి పాదాల్ని చూసిందే ఆలశ్యం అన్నట్లుగా కొడుకు ఒకేసారిగా పీడించసాగాడు. "జాత్రకు వెళ్దాం.... బెలూన్లని కొనిపించు" ఇంటిలో అగ్గిపుల్లను ఎత్తుకొన్నా తన తల్లికి మరియు నానమ్మకు చెప్పే నియోగి ఈ వేళ ఎవరికీ ఏమి చెప్పకనే, ఇంటిలో మిగిలున్న చిల్లర తీసుకొని జాత్ర జరిగే దారిని పట్టాడు.

అతనికి ఆశ్చర్యం. ఈ కాలనీకి వచ్చిన క్రొత్తలో, అతనికి కాలనీలో నడిచే 'రామనవమి' ఉత్సవం నుంచి మేరిమాత జాత్ర వరకూ అన్నీ ఏవే రోజులలో జరిగేవి అనే జ్ఞాపకాలు బాగానే ఉండేవి. ఆ జ్ఞాపకాల మూలాన హోటెల్‌లోని షాండిలియర్ క్రిందున్న ఆ మాయజాలపు బల్బుల వెలుగుల్ని వదిలించుకొని పండగనాడు తొందరగానే ఇంటిదార్ని పట్టేవాడు. వదిలేసి వచ్చిన తన స్వస్థలంలోని దారే ఇక్కడ కూడా కాలనీలో వెలగని వీధిదీపాల దారులలో కనబడుతుంటే ఇదీ తన స్వస్థలం లాగనే ఉందిలే అని ఖుషీపడేవాడు. కొడుకు నియోగి పుట్టింతర్వాత, తల్లైన దేవకీకు ఉన్న ఏకైక ఎర్రచీరను ఇంటిముందే ఆరేసిన విధం, ఇంట్లోని అలమారులో భార్యకని పోగైన జబ్బుమాత్రలు, ఇవన్నీ కనిపించి అతనికి భవిష్యకాలాన్నే తెలియకుండా చేసినవి. ఇన్ని కష్టాలు అతడ్ని వాటేసుకొన్నా, అతనికి కాలనీలోని దినచర్యను మరిచేంత సందర్భం ఇకనూ రాలేదు. గుబురుగా ఉన్న అతని మీసాల వెనక యవ్వనం ఇంకా ఉందిలే. రోజూ వచ్చే రాత్రి సమయం తనంతట తానే రాత్రై, ఎక్కెడెక్కడివో నక్షత్రాలు ఒకదాని వెనుక ఇంకొకటి అన్నట్లుగా ప్రత్యక్షమై కాంతుల్ని విరజిమ్మే వ్యాపారాన్ని నడిపినట్లుగా, డ్యూటీని చేసే హోటెల్‌లో కూడా గంభీరమైన చిరునవ్వు మరియు నమస్కారం అతనికి ఒక బ్రాండ్‌గా అయ్యి, దాన్ని మరింత ఆకర్షణీయంగా మలిచేందుకు ఆ ప్రయత్నంలో మిగిలిన వాటిని యథాలాపంగానే మరిచాడు. అందుచేత ఈరోజు అతనికి ఇంటిదారికి మళ్ళినప్పుడు ఆశ్చర్యం అయ్యింది. "తన అరచేతి వాసనే దూరం అయ్యింది కదా" అనే భావన అతనిలో కలిగింది.

ఈ కాలనీకి వచ్చిన మొదటి సంవత్సరంలో నడిచిన జాత్ర గుర్తుకొచ్చింది. అందర్నీ మాట్లాడించే ప్రయత్నం చేస్తూ "నేనూ ఈ కాలనీకి వచ్చాను.... మీ మధ్యన నేనూ మీ వాడినే" అని చెప్పేందుకు ప్రయత్నించాడు. ఈ రోజున అతడ్ని ఎవరూ మాట్లాడించనేలేదు.

అతనికీ అది అవసరం లేదు. కోళ్ళగూడు లాంటి ఇల్లు, కొరికే చలిలాగ వెంటాడే భార్య, తల్లి జగడం నుంచి తప్పించు కోవాలని కొడుకును వెంటేసుకొని, ముద్దులాడుతూ జాతరకని వెళ్ళిన అతనికి, తిరిగివచ్చేటప్పటికి రాత్రి పదైంది అనేది గుర్తుకు రాలేదు. కొన్ని బంతుల్ని, జిలేబిని, గాలిబూరల్ని కొడుక్కి కొనిపించి, ఉషారుగా కొడుకుతో ఇంటికి చేరాడు.

అతనికి డ్యూటీ చేసే హోటెల్ కోర్టులాగ, ఇల్లేమో బాక్సింగ్ రింగ్‌లాగ మార్పు చెందితే, అవి చాలదన్నట్లుగా మళ్ళీ రెండు సంఘటనలు అతడి చేతిని దాటి వెళ్ళినవి. కుటుంబంలో ఎవరికీ రాని చర్మరోగం అతడికి అంటుకొంది. అదే సమయంలో కొడుకైన నియోగి చదివే స్కూలులో ఫ్యాషన్ డ్రెస్ వేషాల పోటీలలో, తన వేషాన్నే అంటే ద్వార పాలకుడి వేషాన్నే వేస్తానని హఠం చేస్తే తల్లైన దేవకి “మనమడు స్కూలు విడిచిన పర్వాలేదు. నియోగి మాత్రం ఆ వేషాన్ని పోషించేది వద్దు” అని గోల చేసింది.

అదొక రోజు ప్రభాతవేళలేచి, మీసాల్ని ట్రిమ్ చేసుకొంటున్నప్పుడు ఎడం ప్రక్కనున్న మధ్యభాగంలో మీసం కొద్దిగా పలుచబడినట్లు కనిపించింది. పై అధికారుల కళ్ళకు కనబడినట్లుగానే, అతనికీ అది పెద్దదిగానే కనిపించినా, మళ్ళీ మరుక్షణంలో తన కళ్ళకు అలాగున కన్పించిందేమో అని తనను తనే సమాధాన పరచుకోసాగాడు. మీసాలు ఊడుతున్నవి అనే సంశయం వచ్చిన రోజున ఎప్పటి మాదిరిగానే డ్యూటీకి వెళ్ళాడు. అక్కడెవరూ తన పలచబడిన మీసాల గురించి మాట్లాడలేదనేదాన్ని గమనించి తన మనస్సులోపల ఆ రోగం (పేనుకొరుకుడు) కీటాణువులు వెళ్ళిపోయినవేమోనని అనుకొంటున్నప్పుడు, భార్య సీత ఒకరోజు ఉదయాన్నే షాక్ ఇచ్చింది. అతను లేచి వస్తుంటే, అతడ్ని చూసిన సీత ఒకదానిమీద ఇంకొకటిగా చెప్పసాగింది. “ఏమైంది మీ మీసాలకు? ఎందుకు అవి రాలిపోతున్నవి.... అయ్యో, అదొక రోగం కదా!” ఎమ్.పి. వ్యక్తిత్వాన్ని చీల్చి తోరణంగా కట్టినట్లుగా అతడి ముఖంలో ముఖాన్ని పెట్టి చెప్పింది. ఎప్పటిలాగానే ఆమె మాటల్ని చెవిలో వేసుకోని ఎమ్.పి., ఆమె నుంచి జారిని మాటల పలుకుల్ని వింటుంటే తనకు సంక్రమించిన ఈ మీసాలు రాలిపోయే రోగం (పేనుకొరుకుడు) మూలకంగా, తను జీవనంలోని చివరి అంకానికి చేరే ఘట్టంకు వచ్చి నిలబడినట్లుగా భావించుకోసాగాడు. భార్య మాటలతో ఎంతో సమయం ఈ పేను కొరుకుడ్ని నివారించేందుకు ఒక దారిని వెతికే చర్చెలలో నిమగ్నమై ఉన్నప్పుడు, కొడుకు ఆవులిస్తూ లేచి “మా స్కూలులో ఫ్యాషన్ డ్రెస్ పెరేడ్‌ను ఏర్పాటు చేసారు. మా టీచర్ నన్ను ద్వారపాలకుడి వేషాన్ని వేస్తావా అని అడిగింది. నేనేమో యస్ అని చెప్పాను” అని అమాయకంతో అన్నాడు నియోగి. మిగతా రోజులలో అయితే, అతను



ఖుషీపడేవాడేమో? మీసాలు రాలిపోతున్నవి అనే సాక్ష్యాలు దొరికిన ఆ దినం కొడుకు మాటలను బుర్రలో వేసుకోకుండానే హోటల్‌కు వెళ్ళాడు ఎమ్.పి.

ఆ రోజు రాత్రి ఇంటిలో అడుగుపెట్టున్నప్పుడు భార్య నుంచి మాటలు రాసాగాయి. కొడుకు తండ్రి నీడలో (అడుగుజాడలలో) పెరగకూడదు అని భార్య చేసిన ప్రయత్నాలన్నీ నియోగి నుంచి వచ్చిన హఠం మూలాన కొట్టుకుపోయినవి. “పిల్లోడి కాన్వెంట్‌లో నువ్వు ఏ పనిని చేస్తున్నావు అనేది ఎవరికీ తెలవదు. అందువలన అతనికి (నియోగికి) ఎవరూ కష్టాల్ని కలిగించలేదు ఇప్పటివరకూ. నువ్వు ఒక హోటెల్‌లో ద్వారపాలకుడు అని స్కూల్లో తెలిస్తే నియోగి భవిష్యత్ కత ఏమౌతదో గుర్తేనా మీకు” అంది సీత.

ఒక క్షణం అతను భార్య మాటలకు ప్రతిగా జవాబును ఇవ్వలేదు. “హోటెల్ ద్వారపాలకుడ్ని వివాహం చేసుకొన్నప్పుడు నీకేమీ తక్కువ తనం కనిపించలేదా? ఇప్పుడు నీకు ఈ నగరంలోని మిగిలిన జనంకు రానటువంటి దరిద్రరోగం అంటలేదా? నీకేమో కుళాయి నుంచి నీటిని తెచ్చేది, సాయంత్రం దోమల్ని పారదోలేందుకు సాంబ్రాణిని వేసేది కుదరట్లేదు కదా! నేను ఏమన్నా అతడికి చెప్పానా.... నా వేషాన్నే వేయమని? అతడికి ఆ వేషాన్ని వేయాలని ఇష్టం కలిగితే వేయనీ. అది అతని ఆత్మ విశ్వాసాన్ని వృద్ధి చేస్తదిలే” అన్నాడు ఎమ్.పి.

ఈ వాగ్వాదం అంతంగాక, అతని చేయి యథాలాపంగా మీసాల మీద పడినప్పుడు, ఊడుతున్న మీసాల గుర్తుకొచ్చినవి. అతను అప్పటికప్పుడే మీసాల్ని గొరిగించుకొనే నిర్ణయాన్ని ప్రకటించాడు. తల్లైన దేవకి ఒప్పుకొంటదో లేదో అనే దాన్ని నిరీక్షించకుండా, అతను అక్కడి నుంచి వెళ్ళి నిమ్మళంగా పడుకొన్నాడు. మరుసటిరోజు మీసాల్ని గొరిగించుకొని, తనను విచారించటానికి దూరదేశమైన సింగపూర్ నుంచి వచ్చే శ్వేతవర్ణం అధికారిని ఎదుర్కోటానికి సిద్ధమయ్యాడు. యవ్వనంలోకి అడుగుపెట్టినప్పటి నుంచి మీసాలతో మెరిసిన అతనికి ఆ మీసాలు లేకుండా ఉన్న ముఖాన్ని అద్దంలో చూస్తుంటే అది తన ముఖంగా కన్పించనేలేదు. ఆ రోజు కాలనీలోని ఎంతమంది జనం అతని ముఖాన్ని మీసాలు లేకుండా చూచారో అనేది గుర్తేకాలేదు అతనికి.

గంటకన్నా మించి అతనిమీద విచారణ నడిచింది. ఆ అధికారి ఎమ్.పీ.ని తెగపొగిడాడు. అతని కార్యతత్పరత, అతని నడవడి ఇట్లా మొదలైన పొగడ్తలు, ఒక మట్టంలో ఎమ్.పి. రేప్ ప్రయత్నానికి ఒడిగట్టాడు అనే ఆరోపాన్ని నమ్మటానికి ఎవరికీ మనస్సు రాదులే. బలాత్కారాన్ని చేసాడు అని చెప్పేందుకు ఏ సాక్షికీ సాధ్యం కాదులే అని ఎమ్.పి. భావిస్తున్నప్పుడు యథాలాపంగా చేయి మీసాన్ని త్రిప్పేందుకు ముందుకొచ్చింది. ఆ అధికారేమో పెద్దదైన ఎమ్.పి. వ్యక్తిగత ఫైల్‌ను మళ్ళీ మళ్ళీ తరచి

చూస్తున్నాడు. మొదటి పేజీలో అంటించిన ఎమ్.పి. పెద్ద మీసాలున్న కలర్ ఫోటో, దానిక్రింద రాసిన రిమార్క్సను కూడా చదివాడు.... ఒక క్షణం... ఇతడ్ని ధిట్టించి మరొకసారి చూసాడు.... "నీ కొక భారీ (గొప్పదైన) మీసం ఉండేది కదా..."

"అవును....."

"ఆ మీసాలు ఎక్కడికి పోయినవి?"

"పేను కొరుకుడు రోగం వచ్చిందని వాటిని గొరిగించాను. ఇప్పుడు ప్రతిదినం మందార తైలాన్ని మర్ధించుతున్నా.... అది గుణం చెంది మళ్ళీ మీసాల్ని పెంచుతాను."

"నీకు తెలుసా.... నీకు నౌకరీ ఇచ్చిందే నీకున్న మీసాలు నుంచి మాత్రమే సుమా! మీసాలు లేని ముఖంలో ఏమి విశేషాలు కనబడుట  లేదుకదా... ఎందుకట్లా చేసావు?"

ఎమ్.పి.కు ఏమి జరుగుతుంది అనేది అర్థం అయ్యే మొదలే  ఆ అధికారి మాటల్ని ముందుకు పొడిగించసాగాడు. "ఈ హోటెల్‌కు ఒక ఆకర్షణ ఉండాలని అపురూపమైన మీసాలున్నోళ్ళను జాబ్‌లో పెట్టుకొంటే, నువ్వేమో ఎవరికీ చెప్పకుండానే, అడగకుండానే మీసాల్ని గొరిగించుకొన్నది ఒక పిచ్చితనంగా పరిగణించుకోవాల్సి వస్తుంది గదా! తనను రేప్ చేసేందుకు పెద్ద మీసాలున్నోడు ప్రయత్నించాడు అనే ఆరోపణను ఆమె చేసిన కొన్ని రోజులలోనే, నీకు మీసాల్ని తీయించుకొనే అవసరం ఎందుకు కలిగింది. డాక్టరు సర్టిఫికేట్‌ను నువ్వు తెచ్చినా, మేము నమ్మేందుకు కుదరదు."  అన్నాడు కటువుగా ఆ శ్వేతవర్ణపు సింగపూర్ అధికారి. "నువ్వేమి చేస్తావో తెల్వదు మాకు? సహజంగా మీసాల్ని పెంచుకొని వచ్చేంతవరకూ నీకు విశ్రాంతే సుమా! జీతం లేకుండా లీవ్  ఇచ్చేందుకు తీర్మానం చేస్తున్నా" అన్నాడు ఎం.పి. తో

ఎమ్.పి. నుంచి ప్రత్యుత్తరం రాలేదు. ఎంతోసేపు కూర్చున్నాడు అక్కడే. ఆ అధికారి లేచి వేళ్ళాడు. అంతా అయిపోయింది అని అనుకొనేటప్పుడు అతనికి.... "తన ద్వారపాలక వేషాన్నే.... ఫ్యాషన్ డ్రెస్‌లోని పోటీలో పాల్గొనేందుకని వెళ్ళిన కొడుకు గుర్తుకొచ్చాడు. అతను (నియోగి) ఉత్తిగనే బట్టల్ని వేసుకొని, తనను అనుకరణం చేస్తే ఉపయోగం లేదు. ఒక కృతకమైన మీసాన్ని పెట్టుకొంటే మాత్రం కొడుక్కి తప్పకుండా బహుమానం వస్తది అనేదాన్ని పుత్రుడిలో కలిగించాలి...." అనుకొంటూ సూర్యుడు నడినెత్తికి చేరినప్పుడు అతను హోటెల్ నుంచి ఇంటిదార్ని పట్టాడు.

– 0 –

12–12–2009

శాఖమూరు రామగోపాల్



**నాగరాజ వస్త్రారెగారి "కెలవు బేవారసి టిప్పణిగళు" కన్నడ కథకు అనువాదం. వృత్తిపరంగా ఆర్కిటెక్ట్‌గా, ప్రవృత్తిపరంగా గొప్ప కథకుడిగా వర్థిల్లుతున్న వస్త్రారేగారు కన్నడ సారస్వత లోకంలో పెనుతుఫానునే తన రచనల ద్వారా సృష్టించుచున్నారు. తను రచించిన కథలు కొన్నే అయినా ఆ రచనలు విశిష్ట స్థానంలోనే కన్పిస్తున్నవి.**

# కొన్ని పనికిమాలిన రాతలు

**21**–07–2001,18–10–2001,22–10–2001,26–10–2001, 28–11–2001

గత పది సంవత్సరాల నుంచి.... అంటే దేహంలో మగతనం ఛాయ గట్టిగా రూపుగొన్న సమయం నుంచి, మనస్సు బాల్యంలోని పసితనాన్ని వేరుచేసుకొన్న కాలం నుంచి, అమ్మ చెరగు చాటు నుంచి బయటపడి ప్రపంచానికి నన్ను నేను ఒత్తుకొని పోయే కాలం నుంచి ఇంకా సరళంగా చెప్పాలంటే ఈ బుద్ధి తన అతీవ Individuality (ఖాసా వ్యక్తిత్వం) అనుభవించే సమయంనుంచి ఇంగ్లీషులోని Legacy (లెగసి) అనే పదానికి, సరైన కన్నడ వాడుక పదాన్ని వెతుకుతూనే ఉన్నాను నేను. ఇప్పటి దాకా 'లెగసి' అనే పదానికి సరైన నిర్వచనం నాకు దొరకనే లేదు. మీ దగ్గరుంటే చెప్పండి? నాకు దొరికిన ఇంగ్లీషు – కన్నడ నిఘంటువుల్ని చూస్తే 'లెగసి' పదానికి పిత్రార్జితం అనే సామాన్య అర్థం ఉన్నప్పటికీ అదేమో నాకు సూక్తంగా అన్పించలేదు. ఆ పదంలో దాచిన సొత్తు, ఎంథదో నిరాయాసంగా వచ్చే సంపద.... ఇటువంటివి ఆ పదానికి అంటుకొని ఉండటం నాకు జుగుప్సనే కలిగించింది. నేను ఈయన గారి పుత్రాన్ని, ఇంతామెకు భర్తను, ఈయనగారి అల్లుడ్ని, అతని షడ్డకుడ్ని ....... ఇవన్నీ ఒకే మూసలో ఉన్న వికారాలే. చచ్చిబూడిదై నదుల్లో కలిసినా, విడిపోని మాయే. విసర్జించుకోటానికి సాధ్యం అయితే హంగు, ఆర్భాటం లేకుండా నిర్వాణం చెందితే అది నాకు పరమ ప్రియం.

మొన్న ఊరికే ఖుషీకోసం వారుణితో గరుడ మాల్‌కు వెళ్ళాను నా 28 వ జన్మదినం ముందు. బహుమానం అనే నెపంతో తలనుంచి కాలు వరకు కొత్త దుస్తుల ఖరీదు.

నాకోసం 10వేలు మించి క్రెడిట్ కార్డ్‌ను విప్పింది ఆమె. మరు దినం అన్నిటిని వేసుకొని ఆమెతో ఒట్టిగా వెళ్ళాక పది – పద్దెనిమిది బ్రాండ్లను ప్రచారం చేసే ఎడ్వర్‌టైజ్‌మెంట్ బొమ్మ లాగ అయ్యాను. సాయంత్రం ఎబొని (బార్) లో వైన్ చప్పరిస్తూ "Hey, i Feel - I have become a manyquiene ressuracted ఓ.... హో....... నేను కొండపల్లి బొమ్మలాగా అయ్యాను కదా? మంచిగా నడిచే ఎడ్వర్‌టైజ్‌మెంట్ తరహాగా చేసావు గదా" అని చిరు కోపం ప్రదర్శించా. 'ఇంకేంటి Dessert (రాత్రి భోజనం) టైమ్‌కు విప్పాలిగదా' అని కళ్ళు చికిలించా. నాకు ఈ బ్ర్యాండ్ పేర్లంటే 'మొదట్నించి జుగుప్సే'. అడిడాస్, రీబాక్, లీ, జాకీ, లీ కూపర్.... అసహ్యం అనిపిస్తవి 'వారుణీ' అని అంటుంటే ఆమె నవ్వింది. సుందరమైన సాయం సంజె సరి రాత్రిలో వెళ్తూ ఇద్దరం ఆమె ఇంటికి చేరాం. నేనేసుకొన్న బట్టల్నీ ఒక్కొక్కటే విప్పుతూ పెళ్ళి ప్రస్తావన తెచ్చింది. జంజాటం లేకుండానే బతకాలి అనే నా అభిమతాన్ని మరొకసారి ఖరాఖండిగా చెప్పా. 'We are together as long as we are comfortable with each other Honey' అన్నిటిని విప్పిన తర్వాత, ఇంకా ఉన్నటువంటి కామ సూత్రద చిహ్నాన్ని చూచి కొంటెగా నవ్వింది. 'This is brand tool' అని రేగించింది.

నేను కూడా ఇంతే! నాగరికత కోసం రేఖల రూపాల్ని అద్దుతూ ఇల్లు, మఠం, ఊరు కట్టే మాలాంటోళ్ళం బహుశః ఇట్లాగే ఉంటామేమో. మాకు హద్దులు గీసే ప్రవృత్తి. ఐ – బార్‌లో స్త్రీ జతగా ఉంటేనే బాగుంటది. రామనవమి ఉత్సవంలో సీతా – రాముల్లాగ అనే భావన ఆమెతో సురాన్ని త్రాగుతుంటే అప్పుడప్పుడు కలిగేది. బర్ముడాను బిగుతుతో వేసుకొని మాల్‌లోకి ప్రవేశించినట్లుగా పంచె – జుబ్బాకు సులభం కాదు. ఒక్కొక్కసారి మా అంత బాధ్యత ఉన్న మందే లేరు అనే లాగ "We don't need education, we don't need self control" అనే సిగ్మండ్ ఫ్రాయడ్‌గారి నీలి మనో వైజ్ఞానిక వాక్యాల సూత్రాల్ని ధిక్కరించి, 'ప్రణవస్య పరబ్రహ్మ ఋషి' అనే దేశీయ సంస్కృతికి తిరిగి జారుతాం. నురగతో బీరు గాజుగ్లాస్ అంచుల్ని మీరిపోతుండగా, ఒక్కొక్క గుటక వేస్తూ మధ్యలో యోని చక్రం రేఖను వేసా. తర్వాత పబ్ వాడు ఇచ్చిన టిష్యూ పేపర్ మీద రతికేళి విన్యాసపు రేఖలను, ఎంతదో ట్యూబ్‌ను (గొట్టాన్ని) గీచా. బీరు మగ్గు చేతిలో ఉండగా భగవద్గీత మీద చర్చించా. గీసిన గీతలన్ని బ్రహ్మగీతలే. గీచిన వృత్తం పరబ్రహ్మద భాగం. వెలుతురు వచ్చాక కాండోమ్ (గొట్టం). అదే బ్రహ్మసాక్షాత్కారం రూపు. కొంచెంసేపు సరససల్లాప మాటలు. వాటి మీద మోహర్లు (గుర్తులు) లేకుండా.

తామరసంను ప్రతిఫలిస్తూ వస్తున్న హరిదాసు కీర్తనలను దేవవాణి అని అమ్మ నమ్మి బతుకుతుండేది. ఇప్పుడూ అదే కీర్తనలను నమ్మి బతుకుతున్నది. ఆమెకూ అలాగే



చేయకనే ఉండటానికి వేరే విధి లేనే లేదు. ఆ కీర్తనలే వేరు అన్నట్లుగా సోకుగా ఉన్నా, సోకు లేనట్లుగానే బదికేది కదా అమ్మ. నా పేరులో కూరుకుపోయిన ఈ కడిదాళ్ అనే తోకను చూడండి. ఏమనాలి? కొన్నిసార్లు అది (కడిదాళ్) భారంగా అన్పించేది. ఈ నాగరికతలో అది ప్రస్తుతానికి తప్పనిసరై నా పేరులో నిలిచిపోయింది. నేను ఆర్కిటెక్చర్ కోర్సు చదివే దినాలలో అది కుంచించుకుపోయి ఒక మోడల్‌గా అడ్డపేరు అయ్యి నిలిచిపోయింది. నాతో చదివే వాళ్ళు అందరూ నన్ను 'కడ్డీ' అంటూ పిలిచేవారు. ఇంకా అమ్మ పెట్టిన పేరు, ఆమె బతుకుకు ఆధారం అని 'అభీప్సె' అని పెట్టింది. ఇప్పటి ఉద్యోగ నాగరికత ప్రపంచంలో నాలుగు అంగుళాల బిజినెస్ కార్డ్‌లో నేను అభీప్సా కడిదాళ్. కొద్దిమంది నన్ను భిప్స్ అని పిలిచేవాళ్ళు. అదెట్లాగైనా ఉండనీయండి. ఇప్పుడు నా 'దావా' ఏమిటంటే నన్ను అంటుకొని ఉన్న 'కడిదాళ్' అనే లెగసి గురించి కదా!.

1995 డిసెంబర్‌లో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో దాఖలైన సందర్భం. పి.యు.సి. ముగించిన నన్ను అమ్మ డీన్ అనంతకృష్ణను కలవటానికి తీసుకొచ్చింది. నా మీద ఎంతో భరోసా ఉండేది అమ్మకు. " నా పేరు చదివిన డీన్ 'అక్షోభ్యకడిదాళ్' అనే ఆర్కిటెక్ట్ ఒకాయన ఉండేవారు. ఆయన నాకు బాగా తెలుసు. జె.జే స్కూల్లో నాకు కొంతకాలం ప్రొఫెసర్‌గా ఉండేవారు. ఆయన మీకు తెలుసా?" అని అడిగారు. అమ్మలో కలవరం పుట్టింది. "ఆయన ఇతనికి తండ్రిలాగ....." నాలికెమీద ఏమిటో బేవార్సీ ఆటంకాలు. ఆమెకు నా మూలాన మూగరోదనం. "ఏమిటమ్మా ఇట్లంటారు? నాకు గుర్తున్నంతవరకు ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు. ఇప్పుడు అమెరికాలో ఉన్నారని విన్నాను". అమ్మకు అప్పుడు మాటలే ముందుకు రాలేదు. "He was a greatman - Any way if your son fares well in entrance test, we shall certainly turn him in!" డీన్‌కు ఎంతదో అనుమానం (సంశయం). నిజం లేకపోలేదు. అమ్మ అవమానంతో కూలబడి పోయింది. ఇటువంటి సంఘటనలు ఆమెకు ఏమీ కొత్తకాదు. ఆమె బతుకుకు బెదిరిపోయి ఉంటే నేను ఈ మట్టానికి తలుపేవాడ్ని కానేకాదు. 'ఇక నుంచి నీ చేతిలో ఉంది నీ భవిష్యత్. నువ్వు నీ వారసత్వానికి సాక్ష్యంగా నిలవాలి' అంది అమ్మ ఇంటికి వచ్చాక. సాయంత్ర సంజె ముగుస్తుంది. మదరాసులో సైక్లోను మూలాన చీకటిలో చిట పట చినుకులు, హోరుగాలి. "మమ్మీ.... ఆయనెందుకు మన జతగా లేనేలేడు?" అని ఆ చీకట్లో తనిఖీ ప్రారంభించా. "ఆయన భార్య ఆయనకు విడాకులు ఇవ్వనే లేదుగదా. అభీప్సె ....!!" అమ్మది సాక్ష్యంలేని బాధ.

పాత తరం వాళ్ళు నాకు చిక్కినప్పుడు ఎంతో అనుమానంతో "వెనుకటి కాలంలో కడిదాళ్ మంజప్ప అనే మాజి ముఖ్యమంత్రి ఉండేవారు కదా... ఆయనేమైనా...." అని

ప్రారంభిస్తే, వాళ్ళ మాటలకి నేను పెడముఖం పెట్టుకొనే వాడ్ని కాదు. “మా నాన్న ఆయన ఊరి వాడేనట” అని నేను అనటం, వాళ్ళు మరొక రకంగా “మిమ్మల్ని చూస్తుంటే కన్నడం వాళ్ళు అని అన్పించటమే లేదు…!” అనే ప్రశ్నే వాళ్ళనుంచి వచ్చేది. నాది ఒక పనికిమాలిన కార్యం. పంజాబి అమ్మనే హెచ్చుగా శరీరాకృతిలో పొందాను. తప్పు నాదికాదు. అమ్మకు ఈ నేల మీద కసువు పడేయాలి అనే ఆలోచనా ప్రయత్నం ఇదికాదు. మట్టివాసన, మాటలు మనుష్యులకు ముఖ్యం అని నాన్న చెప్పేవారట. “ఎంత అందంగా కన్నడాన్ని రాస్తున్నావు? ఆయనే ఉంటే ఎంథ ఖుషీ పడేవారో…. ఏమైనా అవ్వనీ…. సంధ్యా వందనాన్ని మాత్రం తప్పించరాదు….” అనేది అమ్మ. ఇప్పుడు ఈ ఊర్లో నాదే అయిన ఆఫీసు ఉంది. “అక్ష కాన్ఫ్లూయెన్స్!” ఇది అమ్మ ఇచ్చినపేరు. ఆయన గుర్తుగా ఉంటది? తన ప్రీతికి బహిరంగంగా వారసత్వాన్ని ఇవ్వని వ్యక్తి మీద అమ్మకు అదెంత వాంఛ. కాండోమ్ సమేతంగా మైథునం చేసినట్లుగా. నాకు ఈమె పెట్టిన పేరు సుతరాం ఒప్పేది కాదు. ప్రీతిని ఆ పేరు మీద గుర్తించటం నాకు సరి అన్పించలేదు. ఒకొక్కసారి వారుణిని కూడా (అమ్మ ప్రీతిలాంటిదే) ప్రీతితో గద్గద భావుకురాలు అయ్యేటట్లుగా చేసేవాడ్ని. I hate those four letters word, you call that Anything, but love !! నాకు ఏమి చివర్లు (కొసర్లు) సరి అనిపించేవికావు. అసహనానికి పేరు, గురుతులు నాకవసరం లేదు. తహతహ విరహం నాకు అక్కరలేదు.

18.10.2001

కొన్ని మలుపులు బతుకులోని మూల భూత నమ్మకాల్ని అల్లాడించ వచ్చేమో? ఇప్పటి వరకు ఉన్నవి అబద్ధాలే అనిపించబడేవి. బతికిందే అబద్ధం అన్పించే టట్లుగా. ఇప్పటి సత్యాన్ని ఆ కాలంలోని సత్యం నెట్టి కడిగేయవచ్చు. న్యూటన్ని ఐన్స్టీన్, ఐన్స్టీన్ను హోరెన్స్, డార్విన్ను మరొకతను…. ఇట్లాగునే భౌత విజ్ఞానం తన నెలగట్టును పునర్ విమర్శించుకొన్నంత సేపు, తత్వజ్ఞానమూ తన నేలను మరొకసారి రూపించుకొంటది అన్నట్లుగా… అలాగే సామాజిక నేలకూడా. Physics and philosophy are interdependent - So is Architecture that depends on both. మొన్న స్కూల్లో ఇదే చర్చిలో స్టూడెంట్స్ను నిమగ్నం చేసా. మన ప్రస్తుత నాగరికతలో రెండు ముఖ్యాంశాలైన మాహితి మరియు వేగాలను పొంది ఉన్న ధాతువు ఉంది కదా…. దాన్ని ఏమని పిలవాలి? అది ఆకాశతత్వం ఉన్నది అనేలాగ. ఈ శతమానం నాగరికత మనకి అందించిన తత్వం, నవ్య మాహితిని దక్కించు కొన్నాక దేహానికి – మనస్సుకు వేగస్పర్శే ఉండినప్పుడు ప్రపంచాన్ని చూసే సాధారణ కళ్ళకు ఉండే వేగం, ఒదిగిపోయే మాహితి అదెంతగా



ఉండొచ్చు. హిమాంశు అనే నా స్టూడెంట్ ఒకదుండేవాడు. ఎంత చక్కగా వాదించాడో గుర్తా? Unclaimed lines అని డిసైన్ గీసి క్లాసులో మా ముందుంచాడు. అప్పుడే నా నోట్ప్యాడ్లో “ఈ గీతలకు వారసులు లేరు” అని గీచాను. అబ్బా! ఎంత మెటఫర్ (ఉపమానం) అది. “తలను క్రిందకు పెట్టి, కాళ్ళను పైకి పెట్టి ప్రపంచాన్ని చూచామంటే భూమి మీదకు, ఆకాశం క్రిందకు అని చెప్పే క్రొత్త దృక్పదంతో చూస్తే అర్థం పుట్టదు. అనర్థమే కలుగుతుంది.” అని అన్నాడు. నేను ఇప్పటిదాక భావించుకొనే అర్థాన్ని అనర్థంగా దిద్దుకొన్నాను. మా కాలంలోని తంత్ర్యజ్ఞానం కలిగించిన సత్యాలే ఇవి. ఇప్పటి వరకూ ఇవే సత్యాలు. నికరంగా చెప్పాలి అంటే వేగంగా మారుతున్న కాలంలో ఇవే సత్యాలని చెప్పలేం. అన్నీ తాత్కాలికాలే. నమ్మిందే పరమార్థం అని చెప్పే కాలం వాళ్ళము మేము.

ఆ దినం మధ్యాహ్నం రెండు గంటలకు స్కూలు నుంచి ఆఫీసు “అక్ష”కు వచ్చాను. టేబిల్ మీద స్పెక్ట్రెమ్ ఫౌండేషన్ నుంచి వచ్చిన తపాలు ఉంది. “అది (ఆ తపాలు) నా జీవిత నమ్మకాల్ని పుట్టి ముంచుతుంది” అని అనుకోలేదు. కవర్ను చించుతుంటే సౌమిత్రో నుంచి పోను వచ్చింది. “కంగ్రాట్యులేషన్స్ భిఫ్స్! నాకు భలే సంతోషమైంది. Very deserving choice! నేను ఫౌండేషన్ నుంచి వచ్చిన ‘మ్యాగజైన్’ మూడు పుటలలో ‘అక్ష కాన్ఫ్లూయెన్స్’ పేరు చూడగానే నాకు అర్థమైపోయింది లే” అని అతను ఫోన్లో చెప్పుకు పోసాగాడు. అప్పుడు నాకు “నా ప్రాజెక్ట్ ఒక దానికి రాష్ట్రీయ (Naional) పురస్కారం వచ్చింది.” అని తెలిసింది. ఆ తర్వాత స్నేహితుల్నుంచి ఒకటే ఫోన్లు. ఖుషీని పంచుకొందాము అని ఫ్రెండ్స్ ఆత్రం చేయసాగారు. సాయంత్రం ఐదింటికి అనూష మొబైల్కు ఫోను చేస్తుంటే మరొకటి అనిరీక్షితంగా కాచుకొంది. ‘అక్షోభ్యకడిదాళ్’ అనే ఒకాయనకు మరణోత్తర లైఫ్టైమ్ అవార్డు ఇచ్చారట. ఆయన నీకు తెలుసా? నేను నిలబడిన చోటే శిలగా అయిపోయాను. నన్ను ఫలించిన వీర్యవంతుడికి మరణోత్తర ప్రశస్తి? సమగ్ర జీవిత సాధనను పరిగణించి!! అమ్మకు తక్షణం ఫోన్ చేసా. ఆమె సంతోష నిచ్చెనకు నేనున్నాను కదా అని కొంచం సంశయంతో నిధానంగా చేరాను ఇంటికి.

అభీ!! నాకు ఈ రోజు భలే మంచిరోజు! ఆయన జీవించి ఉన్నకాలంలో ఇంథ రికగ్నిషన్ (Recognition) రానేలేదు. దాని కోసం ఆయన వెంపర్లాడలేదు. ఆయన ఉండుంటే నీ సాధన మీద కూడా గర్వం చెందేవారు. రాత్రి భోజనానికి సిద్ధమయినప్పుడు అమ్మ మాటలు మొదలు పెట్టింది. “ఎందుకు ఇంత బేజారులో ఉన్నావు? ఖుషిగా ఉండాలి కదా నువ్వు!” నేను బదులు పలకలేదు. “ఆయన్నే పోలి ఉన్నావు స్వభావంలో. నెలకొకసారి వస్తుండేవారు. వచ్చేటప్పటికే ఏదో కష్టాన్నే మోసుకొంటూ వచ్చేవారు. చివర చివరిగా

ఆయనకు ఏదీ ఇష్టం అయ్యేటట్లుగా ఉండేది కాదు. నేను అసహనం కలిగించేదాన్ని". 'Oh mom? will you stop it please?' అమ్మ మూలనున్న టేబిల్‌కు ముఖాన్ని ఆన్చుకొని చిన్నగా రోదించ సాగింది. నేను ఆమెను ఓదార్చలేదు. వాస్తవంగా నా అసమాధానానికి నాలో కారణాలు ఏమీ లేవు.

ఆ రాత్రి ఎంతోసేపు ఇంటర్‌నెట్‌లో కూరుకుపోయా. రాత్రి ఒకటిన్నరకు శశాంక్ కాలిఫోర్నియా నుంచి మెసేజ్ ఇచ్చి వెమ్మటే మేల్‌ను చెక్ చెయ్యమని చెప్పాడు. అతని మెసేజ్‌లో మూడు పేజీల మాహితి ఉంది. అది అక్షోభ్య కడిదాళ్ గురించి వ్రాసిన వివరం. దాన్లో దొరికిన 'మాహితి' నా మనో నేత్రాల్ని విపులం చేయసాగింది. 1950 లో దేశానికి ఇంకా ఆధునికత గాలి సోకని కాలంలో కాంక్రీట్ తత్వాన్ని, దాన్ని నేరుగా ఉండే రూపంలో ప్రపంచం మొత్తం మీద ఉపయోగించుకొన్న అతి కొద్దిమంది విన్యాసకారుల్లో ఈయన ఒకరట. పశ్చిమభారతదేశంలోని బొంబాయిలో కొన్ని బృహత్ కట్టడాల రూపకల్పన ఇతనివేనట. 50 సంవత్సరాల క్రితమే ఆ బొంబాయిలోని గోల్కోన్ పేరు మీద విద్యార్థి వసతి నిలయం సంపూర్ణంగా కాంక్రీట్‌తో ఈయన రూపించిందేనట. అది కాలాతీత మనిపించే రచన అట. It is timeless! He was a true master of sorts in the sub - continent . ఇతని గురించి ఇప్పటిదాకా లభించిన మాహితి తక్కువట.... మరియూ మరియూ.... చివరిగా Spectrum Foundation ఈయన సాధనను మొత్తంగా పరిగణించి ఆయనవి అన్ని రచనలు (విన్యాసాలు) దాఖలవ్వాలి అని కోరుతున్నదట. నాకు ఒక నమూన గుర్తుకొచ్చింది. తెలవకుండానే కళ్ళ నుంచి నీరు కారసాగింది. ఆ మేల్‌ను డౌన్‌లోడ్ చేసి, దాని ప్రింట్‌ను తీసుకొని మళ్ళీ, మళ్ళీ చదివా.

ఈ నాగరికత నోరును చూడండి. తనని రూపొందించిన వాళ్ళందర్ని మింగేస్తది. జ్ఞాపకానికి అని కూడా కొంచం మిగల్చదు. అదృష్టం ఉంటే కొంతమంది తమ జీవిత కాలంలోనే వేనోళ్ళ కొనియాడబడుతారు. కొంతమంది తాము చచ్చిన 20 సంవత్సరాల తర్వాత అకస్మాత్తుగా వెలుతురుకు వస్తారు. కొన్ని గీతలకు వారసులు ఉండరు. ఆ గీతలు కట్టిన ఆవరణానికి, వాటి నిర్మాణ అర్థానికి ....'Lines Unclaimed' హిమాంశు డిబేట్‌లో చెప్పిన వాక్యాలు గుర్తుకొచ్చినవి.

22-10-2001

ఈ అక్షోభ్యకడిదాళ్ అనే వ్యక్తి ఎక్కడోడు అని ఎంతో మందికి గుర్తులేదట. మాటలు తక్కువ. ఎంత అవసరమో అంతే మాటలు. అమ్మతో కూడా అంతేనట... అమ్మ తండ్రి



సుఖ్‌వీర్‌సింగ్ బాదల్ ఢిల్లీలో పేరున్న ఇండస్ట్రియలిస్ట్ అట. తను కట్టించే కొత్త ఇంటి ప్లాన్‌కోసం దక్షిణ భారతదేశ అక్షోభ్య కడిదాళ్‌ను ఎంచుకోటం, నా బతుకిన కథకు పీఠిక అయ్యింది. అడ్వాన్స్ 10 వేలకు Blue Print ఇవ్వక కడిదాళ్ ఆరు నెలలు సతాయించాడట. ఒకసారి లోన్లోనే కుతకుతలాడుతున్న సింగ్‌గారు జరుగుతున్న నిధాన ద్రోహంకు ఆగలేక బొంబాయిలోని 'లోనావాలా'కు ఫోన్లు చేయటం, సిట్ అవుట్‌లో అక్షోభ్య ఒక్కరే కూర్చొని ఏమో చేస్తుండటం బాదల్‌గారి కళ్ళకు కన్పించిందట. సుఖ్‌వీర్‌సింగ్ బాదల్‌గారు అతడ్ని కలిసి నోటికి వచ్చినట్లుగా తిట్ల పురాణం విప్పాడట. రెండు మూటల నల్లటి చిప్స్‌ను పక్కన పెట్టుకొని చేతి వృత్తిలో మునిగిపోయిన కడిదాళ్ ఈ బాదల్‌గారి వైపుకు ఒకసారి చూసి మళ్ళీ పనిలో మునిగిపోయాడట. రెండు పగళ్ళు మూడు రాత్రులు అలుపు సొలుపు లేకుండా శ్రమించి నాలుగోరోజు ముంజాములో తన గిరాకీ దారుడ్ని భేటీ అయ్యి ఆ నల్లటి చిప్స్‌తో చేసిన అద్భుత భవన కలాకృతిని ఇచ్చి, ఇప్పుడు చెప్పండి అని చేతులు కట్టుకొని నిలబడ్డాక , సుఖ్‌వీర్‌కు మాటలే దొర్లలేదట. సుందర సజీవ భవన కలారూపం. చివర్లో అక్షోభ్య అనే సంతకం. His work of Art .....చివరిగా .....Even his architecture అన్నీ దాఖలాల్ని మీరి పోవాలి అనేదే ఆయనకు భలే ఇష్టం అట. ఆయనిచ్చిన కట్టడాల దాఖలాలు ఆయన దగ్గర ఉండేవి గావట.

విచిత్రం ఏమిటంటే 'నా పుట్టుకకూ నేను ఆయన్నుంచి' అనే సాక్ష్యాలు లేవుకదా!!

నేను పుట్టినప్పుడు అమ్మకు 25 సంత్సరాలట. నాయనకు 62 అట. ఆశ్చర్యం కదా!! నేను పుట్టినప్పుడు అమ్మను చూస్తున్న మిషనరి ఆసుపత్రి నర్స్ అమ్మతో జతైన ఆయన చిత్రాన్ని చూసి నవ్విందట. "Oh! He must be a real man!! బిన్నిష్టన్ గార్డెన్ దగ్గర కుడివైపున ఉన్న చిన్న బంగళాలో మేము ఉండేవాళ్ళం. నేను నాయన్ని చూసిందే తక్కువ. నెలకొకసారి వచ్చినా ఒకట్రెండు రోజులు మాత్రమే. ఉండాలనే వచ్చేవారట. పని ఒత్తిడి. "లోనావాల"కు పోయి ఎన్ని దినాలైందో గుర్తేనా? సరిత ఇప్పుడు నన్ను పూర్తిగా అవలంభించుకొని ఉంది. 'Girls have to be married' అని ఒకటేగోల. ఆ జవాబ్దారి ముగించి ఆ తర్వాత నీతోనే నా చివరి బతుకు". చివరిసారిగా వచ్చినప్పుడు వారినుంచి వచ్చిన మాటలు ఇవి అని అమ్మ చెప్పింది. నాకు అప్పుడు 10 సంవత్సరాలు. ఆయన వెళ్ళటానికి రెడి అయినప్పుడు నేను కాగితం మీద ఏమేమో గీస్తున్నానట. నాయనకు దాన్ని చూసి ఏమనిపించిందో... "జస్‌బీర్... మన కొడుకు నన్ను మీరి పోతాడు" అంటూ నన్ను ముద్దించి కాగితాన్ని మడచి కోటులో భద్రంగా పెట్టుకొన్నారట. నాకు మసక మసకగా గుర్తు. నా వయస్సు అప్పుడు 10 సంవత్సరాలే!!

26-10-2001

నేను దినచరి (డైరి) రాసుకొనేది నా కోసమే. రాసుకొనేది అంతా నన్ను నేను తనిఖీ చేసుకోవటానికే. కొన్ని పరిశీలించుకోటానికి. లోనున్న లోతుల్ని తెలుసుకోటానికి డైరి ఒకదారి. తవ్వుకొంటున్నా. అగాధమే దొరకట్లేదు? అందుచేత బాధలేదు. ఇది (డైరి) ఎవరికి దొరికినా, చదువుకొన్నా అక్కడ నా యజమానికత్వం లేదు దాన్లో.

అమ్మ ఉదయాన్నే నాయన చావు గురించి అడిగింది. ఒక నమూనా ఝల్ అని అన్పించింది నా మనస్సుకు. ఆయన గురించి మొదటిసారి మౌనం భగ్నమైంది. 04-09-1983 ఆదివారం హౌరా స్టేషన్‌లో భోగి ఒకదాంట్లో ఒక శవం దొరికిందట అనాథగా. సూటు -బూటు వేసుకొన్న దేహం చచ్చి నాలుగు దినాలు అయ్యిందని విచారణలో తేలిందట. గుర్తించటానికి ఏమీ దొరకలేదట. కోటు జేబులో ఒక మడిచిని కాగితంలో కొన్ని వృత్తాలు ఉన్నవట. దానిమీద 'Lines never owned' అని చేతి రాతట. దాని నకళ్ళను అన్ని రైల్వేస్టేషన్‌లలో పెట్టారట రైల్వే పోలీసులు. జే.జే. స్కూల్ ప్రొఫెసర్ సుదీఫ్ ముఖర్జి బోరివిల్లి (ముంబయి) స్టేషన్‌లో ఆ కాగితం రాతల్ని చూసి అక్షోభ్య కడిదాళ్ అని గురుతించారట. చావు సంభవించిన ఒక నెల తర్వాత.

నాలో ఉక్కి ప్రవహించిన ఏడుపును ఆపుకోలేక పోయాను. అమ్మను వాటేసుకొని వెక్కి వెక్కి ఏడ్చాను మొదటిసారి. జీవితంలో గీతలకు వారసులుండరూ. బాధకూ.....?

ప్రశస్తి పురస్కారం జరిగేటప్పుడు సభలో మరణోత్తర ప్రకటనను ప్రకటించినప్పుడు శ్రీమతి సరితా కడిదాళ్ వేదిక మీదకు వెళ్ళారు. ఏమో మాట్లాడారు. మాటల్లో పూర్తి గద్గదం. మాటల్లో వారసత్వం. అమ్మకు కళ్ళు చెమర్చినవి యంగ్ అచ్చీవర్స్ అవార్డ్ సైటేషన్ చదివేటప్పుడు. సభ నా పేరులో ఉన్న కొసర్ని అక్షోభ్యకడిదాళ్‌తో సరిచేసి వేస్తారేమో అనే సందేహం. చప్పట్ల మ్రోత ఆలోచనల్ని నెట్టేసింది. Lines are never owned! They are unclaimed !! అని ప్రశస్తి పొందిన తర్వాత మైకులో చెప్పా. గీతల్ని చూస్తే యజమానికత్వం ఉండదని.

గీతలకి వారసులు అక్కరలేదు. అంతే ఈ రాతలకూ....!

- 0 -

22-01-2006

శాఖమూరు రామగోపాల్



**ప్రొ॥ అమరేశ నుగడోణి "తమంధద కేడు" కన్నడ కథానికకు అనువాదం.**
***హంపిలో ఉండేటి కన్నడ విశ్వవిద్యాలయంలో కన్నడ భాషకు ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్న అమరేశ నుగడోణిగారు రాయచూరు జిల్లాలోని మాన్వి తాలూకాకు చెందిన వారుగా ఉండి గొప్ప రచనలను చేసి కర్నాటకలో పేరును గడించారు. ఒక శతాబ్దంలోని (1987-1997) అత్యుత్తమ 84 కన్నడ కథలలో ఈ కథ ఉన్నదాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయంలో కనుగొని దీన్ని తెనిగించాను.***

# అజ్ఞానపు చీకట్లలోని కీడు

కలజారిపోగా.... దురుగడికి ఎచ్చరిక ఐంది. కళ్ళు తెరుస్తుంటే గుండె డబడబా కొట్టుకొన్నట్లుగా ఉంది. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. అలాగే పడుకొని కన్న కలను జ్ఞాపకం చేసుకోసాగాడు. గుర్తుకు రాసాగింది కల. శాంతగౌడ కొరడా పట్టుకొని 'ఆగురా' అంటూ ఆజ్ఞాపిస్తున్నాడు. తనకు పరిగెత్తేందుకు కాళ్ళు ముందుకే అడుగులను వేయటం లేదు. శక్తినంతా కూడదీసుకొని కాళ్ళను లాక్కొంటూ పరిగెడుతున్నా... శాంతగౌడగారి కొరడా వీపుకు తగిలినట్లై 'చచ్చాన్రో నాయనో' అంటూ నేలలో పడ్డాడు. కొరడా వేటు పడింది తనకి. అయితే కొడుకైన చెన్నడు రక్తంతో తనతోపాటు నేలలో పడినట్లుగా కలను కన్నాడు. ఆ కలను కన్న దురగ బెదరిపోయి, ఉగ్రుడై అరుస్తూ 'పటేలా.... నీ గుణాన్ని చూపించావు కదా....' అంటూ ఎగరిపడి శాంతగౌడను పట్టుకొని నరికేందుకు చూస్తుంటే.... శాంతగౌడేమో కంటికి కనపడనట్లుగా, చేతికి దొరకనట్లుగా నేల నుంచి ఆకాశం అంచులెత్తుకు నిలిచియున్నాడు. ఈ కల కంటి ముందే నడిచినట్లుగా జ్ఞాపకంకు వచ్చిందే తడవన్నట్లుగా దురుగ దఢాల్నే లేచి కూర్చొని 'శివశివా' అన్నాడు. పీడకల అని బాధపడ్డాడు.

కంటికి ఏమీ కనబడటలేదు. కటిక చీకటి. బయటున్న అరుగుమీద కూర్చోవాలని అన్పించింది. వెలుతురు రావచ్చని భావిస్తూ లేచి అభ్యాసంతో తలుపు వద్దకు వచ్చి దాన్ని తెరిచి బయటకు వచ్చి నిలబడినా వేకువ జాము వచ్చేది ఏమీ కలగలేదు. బయటా కారు చీకటే. వారం నుంచి మబ్బులు వెలుతురును మూసేసినట్లుంది కదా! వంటికి

చలిగాలి రివ్వున కొట్టినట్లై చెమటతో తడిసిన దేహానికి కాస్తంత హితాన్ని కలిగించింది. ఒక గడియ నిలిచి కుక్కలు, నక్కలు అరిచేదాన్ని వినేందుకు దురుగ ఎదురు చూడసాగాడు. ఏ సప్పుడునూ వినలేదు. ముందుకే వెళ్ళి కాళ్ళను ముడుచుకొని కూర్చొన్నాడు. చలి ఎక్కువై వళ్ళంతా చల్లబడినట్లుగా అన్పించింది. పైకి లేచి వంటిని చేతులతో సవరించుకొన్నాడు. దేహమంతా నీరే నీరు. వళ్ళు తడిసినదానికి మంచు ఏమైనా ధారగా కురుస్తుందా అని ఆకాశం వైపుకు చూసాడు..... పైనా చిమ్మ చీకటే. ఏమీ కనబడక ఇంట్లోకి వచ్చాడు. దీపం బుడ్డిని వెతికి వెలిగించాడు. ఒళ్ళంతా నెమ్ముగా ఉంది. పంచెతో తుడుచుకొంటూ 'వానైతే రాలేదు. పొలాలలో ఈ సంవత్సరం విత్తనాల్నే విత్తలేదు... ఎళ్ళ అమావాస్య ఉండనీ.... జేష్ఠ అమావాస్య ఇంకా రాలేదు. అప్పుడే మంచుపడేది ప్రారంభమైంది కదా! పంటలు లేని కాలంలో చలిజాస్తి. ఏమి కాలమో ఏమో! ఏయే కాలాలలో ఏమేమి అవ్వాలో అవి మా పెద్దల కాలంలో మంచిగా నడుస్తుండేవి. ఇప్పుడు.... అంతా మా లెక్కలు తప్పుగా అయ్యేందుకు మొదలైయ్యావి కదా! కాలం తన గుణ ధర్మాన్ని మార్చుకొనేందుకు పోతుంటే.... మనుషులు ఏ విధంగా బతకాలి?' అనుకొంటూ బిగుసుకుపోయాడు దురుగ.

నెల నుంచి కొడుకైన చెన్నడి పరంగా చింతను పెట్టుకొని కరిగిపోసాగాడు. కొడుకు తెచ్చిన ఆపద ఎవరికి ఉరి అవుతదో అనే చింతలో మునిగినా పరిష్కారం అయ్యేది కనబడుటలేదు. నిద్ర, దాహం లేనోడిలాగ అయ్యాడు దురుగ. నిత్రాణంగా కళ్ళను మూసుకొంటే కలలు, పాడు కలలు వస్తున్నవి. కొడుకు నెలనుంచి ఊరికి వెళ్ళినోడు మరలా రాలేదు. రానందుకు మంచిదేలే అని కూలబడ్డాడు. కొడుకు ఊరికి వచ్చేది వద్దని దేవుడికి మొక్కుతున్నాడు. 'వస్తాను తండ్రీ' అని చెప్పి వెళ్ళినోడు నిజంగా వస్తే ఎట్లా? అనే దిగులులో పడ్డాడు దురుగడు. మనస్సంతా దిగులుతో నిండింది. ఎంతోపొద్దైంది. మరలా కళ్ళను మూసుకొన్నాడు. ప్రాణం 'జిల్' అంటుంటే వణకసాగాడు. అంతలోపలే మరొక కల. అక్కమ్మ ఇదే ఇంట్లో తనకు అన్నాన్ని వడ్డించసాగింది. ఆమె ఇదే ఇంటికి చెందిందిగా కలలో కనబడింది. కలను గుర్తుకు తెచ్చుకొంటూ 'దేవుడా అంతా నీ లీల.... తెల్సుకోన్నోళ్ళు ఎవరు' అనుకొంటూ చేతుల్ని దండంగా పరివర్తనం చేసుకొన్నాడు దురుగ.

"ఏమిటి దురుగణ్ణా... నీ కొడుకు పెద్దోళ్ళ కూతురి చేతినే పట్టుకొన్నాడట" బసణ్ణ గుడి పూజారైన బూదెణ్ణ ఆరోజు అదెంతటిదో చెడు మాటను ప్రస్తాపించిన తక్షణమే "అయ్యా ఆ విధంగా వ్యంగ్యంగా మాట్లాడి హృదయానికి కొట్టకండి? చెప్పేదేదో ఈ



మాదిగోడికి నేరుగానే చెప్పు తండ్రి" అని అన్నాడు దురుగడు.

"చూడు దురుగా... నువ్వంటే మా అందరికీ నమ్మకస్తుడైన మనిషివి. నువ్వే ఈ విధంగా నాటకం ఆడేందుకు నిలబడితే?"

'అయ్యో తండ్రీ.... మీ అందరి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బతికేటోడు ఈ మీ మాదిగ!'

'అంటే నీకేమీ తెల్వదా? నీ కొడుకు...'

'తెలీదండి! అయ్యా, నా కొడుకు కాదు అతడు! ఊరి మొత్తానికే చెందిన కొడుకు... పెద్ద బుద్ధిమంతుడు అని మీరే అన్నారు కదా....!'

'అవునవును! ఎక్కువగా చదువుకొంటే తల బరాబరిగా ఉండదని అనేది అబద్ధమేమీ కాదులే.... అక్కమ్మనే వివాహం చేసుకొంటానని అంటున్నాడట....' పూజారి అనటమే తడవుగా దురుగడికి పిడుగులు పడినట్లై అచేతనుడైయ్యాడు.

'చూడు దురుగా, ఎక్కడ మండే వత్తి అక్కడే ప్రజ్వలిస్తేనే అది ఒప్పుగా ఉంటది. పొయ్యిలో మండేటి మంట పొయ్యిని వదిలి వేరేచోట మండేందుకు వస్తే ఏమౌతది దాని గతి?' అంటూ బూదెణ్ణ వెళ్ళిపోయాడు. దురుగ ఏ విధంగా లేచి తన ఇంటికి చేరాడో ఏమో! వచ్చిన పిమ్మట తన కొడుకైన చెన్నడ్ని గుద్దాలని ఆత్రం చేయబోగా, అసంఖ్యాకమైన పుస్తకాల నడుమ చెన్నడు చక్కగా చదువుకొంటూ కూర్చున్న దానిని చూసి మనసు కరిగి కోపం తగ్గి ప్రేమపాశం ఉప్పొంగింది. వాకిట్లోనే కూలబడి కన్నీరును కార్చసాగాడు.

'బసవేశ్వరా ఈ ముదిప్రాయానికి ఎంత గంధాంతరాన్ని ఇచ్చావు తండ్రీ! ఎవర్ని పట్టుకొనేది? ఎవర్ని వదిలేసేది? ఒక వైపు కళ్ళు... ఒకవైపు అన్నం....' అని అనుకోసాగాడు. బాధ కలగసాగింది. నిలబడి మరలా బయటకు వచ్చాడు. బాధను చీకటి ఆరగించుకోసాగింది. చలిగాలి వంటికి రివ్వున తగిలింది. చుట్టూరా చూసాడు. ఏమీ కనబడలేదు. శాంతగౌడగారి నల్లరాళ్ళ పెద్ద భవనం ఛాయలు కనబడలేదు. అటుఇటూ చెవుల్ని రిక్కించి నిలిచాడు. ఎట్నుంచి సప్పుడు అనేది వినబడలేదు. కొంత సమయం గడిచిన మీదట చెఱువు వెనకున్న వాగులోని ఈతచెట్ల వరుసలనుంచి కాకులు అరిచేది విన్పించింది. ఆ వేళకు అదెక్కడినుంచో కోకిలలు కుహుకుహు అనే నాదంను చేయసాగావి. దాన్ని వింటు, వింటూ దురుగడి మనస్సు నిండా 'చింవు చింవు కవకవ' అంటూ వేలకొద్ది పక్షుల ధ్వని చెవిలో చొరబడ్డాయి. దురుగ కూర్చున్నాడు. అవి అలాగున

కిచకిచ అరుస్తుంటేనే, దురుగడికి, చందవ్వకు నెమ్మది తనాన్ని కలిగించేది. పొద్దు మునిగి ఒక గంట కిలకిలారావాల్ని చేసి ఆ తరువాయి మరలా అవి శబ్దాల్ని చేసేది సూర్యోదయంకు ముందు మాత్రమే. ఇప్పుడు కాకులు, పిచ్చుకలు, గోరువంకలు మొదలైన నానా జాతి పక్షులన్నీ దురుగడ్ని దాటి వెళ్ళిపోయినవి. భూమి అంతా, ముగిలు అంతా ఎత్తుకు పెరిగి నిలిచిన ఒక వేపచెట్టు, ఒక దిరిశన చెట్టు దురుగడి కన్నా ముందే పుట్టి వృద్ధి చెందినవి. అతడి నాయనో, అమ్మో లేకపోతే బసవదేవుడో పెంచి యుండొచ్చువాట్ని. దురుగడి భార్య చందవ్వ ఉన్నంత వరకూ ఆమెకు భర్తకే చెందిన ఇల్లనేది లేదులే. ఆ వృక్షాల మొదళ్ళలోనే నివాసం చేసుకొంది చందవ్వ. చెన్నడు పెరిగాడు ఆ చెట్లఒడిలో. చందవ్వ అదెంతగా గొప్పగా పాడుతది అనేందుకు పొద్దు మునిగిన తర్వాయి పల్లెలోని అలసిసొలిసిన జనం చందవ్వ నివాసం చేసుకొన్న వృక్షాల వద్దకు వచ్చి కూర్చొని జానపద పాటలను విని బాధల్ని మరిచి నెమ్మదిని నింపుకొనేవాళ్ళు. పల్లెలోని వృద్ధుడైన బసప్ప 'చందవ్వా... నీ పాటలు మా హృదయాలలోని దుఃఖాల్ని శమనం చేసినవి కదా! బతకాల్సిందే అనే ఉత్సాహాన్ని కలిగించినవి కదా' అని నిండు మనస్సుతో దీవించాడు. శాంత గౌడ ఆ మధుర స్వరాన్ని వింటూ పుళకించి మైమరచి 'నా అర్ధాంగిగా చందవ్వ ఎందుకు పుట్టకూడదు?' అని నూరారు సార్లు అనుకొంటుండేవాడు. ఆ మీదట తాళైతే కట్టించుకోలేదుగాని, ఆ నల్లటి రాళ్ళ దొడ్డ భవంతిలో ఉండి 'గౌడసాని (దొరసాని)' అని అన్పించుకొన్నది లేకపోయినా మిగతా అన్ని విషయాలలో చందవ్వ శాంత గౌడకు భార్యగానే అయ్యిందిలే. పోయిన బసవణ్ణ దేవుడి జాత్రకు ఆ రెండు వృక్షాలను కొట్టేసి నాలుగు సంవత్సరాలు అయినవి. అయితే దురుగడికి నిన్నో, మొన్నో అదంతా నడిచినట్లుగా ఉంది. ఆరోజు శాంతగౌడ వచ్చి నిలిచాడు. కట్టెల మండి (అడ్తి) రసూల్‌సాబ్‌ను వెంటేసుకొని వచ్చాడు. వృక్షాల ముందు నిలిచి మొదలు నుంచి కొమ్మరెమ్మల వరకూ కంటి చూపుల్ని పారించాడు రసూల్‌సాబ్. 'పటేలా, ఈ రెండు వృక్షాల్ని కొట్టే.... బరాబరి రెండు ఎద్దుల బండ్లు, వ్యవసాయ పనిముట్లు లభిస్తవి. మీకొకటి, మీ అక్కఐన రుద్రమ్మ దొరసానికొకటి... అంతేకాదు పటేలా.... మీ మనమ సంతానం వరకూ నేను ఇచ్చే బండ్లలో కాలం గడిసిపోవాలె.... వాట్ని బందోబస్తుగా చేసి పెట్టా.... గొర్రు, గుంటె, నాగళ్ళు, మేటి, దంతెలు అన్ని వ్యవసాయపు పనులకూ అవసరమైయ్యే సామానును చేసిపెట్టా. ఈ సామానంటే పేరుకు మాత్రమేకాదు... వాట్ని చూసినోళ్ళు శాంతగౌడ గారి బతుకంటే ఇవే అని అనాల్సిందే' అని అంటున్న రసూల్ సాబ్ మాటల్ని విన్న దురుగడి జీవం విలవిలలాడింది. శాంతగౌడకేమో మనస్సు ఉల్లాసమైంది. 'దురుగా' అని పిలిచాడు శాంతగౌడ. 'దురుగా' అని పిలిచేదే ఎంతో గొప్పగా ఉండేది శాంతగౌడలో.



ఆ నాదంలోని పిలుపునే వినేది ఒక పుణ్యం అనే నమ్మకంతో దురుగ ఉంటుండేవాడు. 'ఇంటివారసుడ్ని పిలిచినట్లుగా పిలుస్తాడు మన పటేలు' అని పల్లెలోని జనం అనుకొంటుండేవారు. 'రసూల్‌సాబ్ చెప్పేది విన్నావా?' అన్నాడు శాంతగౌడ.

'విన్నాను పటేలా' అన్నాడు దురుగ. దురుగడిలో ఏదో ముభావం ఉన్నదాన్ని గమనించిన గౌడ ఎందుకు దురుగడిలో ముభావం ఉంది అనేది గ్రహించాడు. దురుగడికి చందవ్వ గుర్తుకొచ్చింది. ఆ వేళలో ఆమె కనిపెంచిన, చందవ్వ జతగా ఒక తారక లాగ కనబడేదాన్ని కూలబడి చూడసాగాడు ఆ పుత్రుడి ముఖారవిందంలో.

'నీకు మనస్సు ఇష్టం గాకపోతే వదిలేయి' శాంతగౌడ గారి ధ్వని బిరుసుగా ఉంది.

'అలా కాదు పటేలా.... ఈ వృక్షాలంటే నా ప్రాణం అన్నట్లుగా ఉంటవి! ప్రాణం అంటే... చందవ్వ ఉన్నట్లుగా. చందవ్వకు ఇవంటే ఎంతో ప్రీతి.... అందుకనే....' అంటూ వృక్షాల్ని చూసాడు.

'పటేలా.... చెన్నడు వస్తే పగలంతా ఈ వృక్షాల మొదళ్ళలోనే కూర్చుని నూరారు పుస్తకాల్ని చదువుతాడు' అని అంటున్నపుడు దుఃఖం ఉప్పొంగి రాసాగింది. దుర్గడ్ని ఇప్పుడు ఆపేది అయ్యేది కాదని శాంతగౌడ భావిస్తూ బయటకు నడిచాడు.

మూడు నాలుగు రోజులు గడిచిన పిమ్మట 'దురుగా' అని పిలిచాడు శాంతగౌడ. ఆ పుణ్యమైన మనోహర నాదంలోని పిలుపును విన్పించుకొని 'యప్పో' అని అన్నాడు దుర్గడు. 'దురుగా... నీకు ఇదే మా జాగాలోనే ఇంటిని కట్టించి ఇస్తాను... నా ఈ జాగాలోనే.... సరేనా?' అన్నాడు పటేల్. దుర్గడు ఉండేది, అతడి వృక్షాలు ఉండేది శాంతగౌడ గారి జాగాలోనే అనేది గుర్తుకొచ్చి 'దేవుడి ఇచ్ఛ' అని అన్నాడు దుర్గడు. రెండు మూడురోజులు పద్దైదు మంది ఆ రెండు చెట్లను కొట్టి, ఒక చోట జమ చేసారు. కళ్ళతో చూసేందుకు అవ్వటంలేదు. అయితే అక్కడే ముందు నిలబడే ఆ కార్యక్రమాన్ని చూసేది దుర్గడి వంతుగా అయ్యింది. ఆ రెండు వృక్షాల నిండా సంసారాన్ని పెట్టుకొన్న వేలకొలది పక్షులు తమ గూళ్ళను, రెక్కలు విప్పని సంతానాన్ని సైతం పోగొట్టుకొని రెండు మూడు దినాలు అపస్వరంతో చ్రింప్ చ్రింప్, కాకా, ట్రింవ్ ట్రివ్ అనే ఏడుపు నాదాల్ని చేస్తూ అక్కడే చుట్టిచుట్టి తిరిగి అలసిసొలసి మరలా ఎక్కడికో దేవుడు చూపెట్టిన జాగాకు వెళ్ళిపోయినవి. అదే జాగాలో జీడిమన్ను, పాటిమన్నును కలగలిపి రెండు గదుల పెంకులతో శాంతగౌడ దురుగడికి ఇల్లును కట్టించి ఇచ్చాడు. దానికి మునుపు 'దురుగా, నీకెందుకు ఇల్లు? నీ ఇల్లు ఇది' అని శాంతగౌడ తన నల్లటి రాళ్ళతో కూడిన పెద్ద భవంతిలో కూర్చొని

అన్నాడు. దుర్గడి పాలికి ఆ మాటలు నిజమేలే. అయితే కొడుకైన చెన్నయ్య పాలికి అది సరిమాటకాదు అనేది నెమరేసుకొంటూ, 'పటేలా, నాకూ ఒక ఇల్లంటూ ఉండనీ....రోగం రొప్పువస్తే....' అని అన్న దుర్గడి బానిస మనస్తత్వంగానే ఆ ఇల్లు ఉంది కదా. దుర్గడికి ఆ ఇల్లంటే శవాన్ని పాడెతో కట్టెలమీద దహనం చేసే చిన్న సమాధిగా కనబడింది. ఆ ఇంట్లోకి ప్రవేశిస్తే శవాన్ని పాడె మీద పడుకోబెట్టినట్లుగా ఉంది. ఆ రోజు నుంచి దుర్గడు చైతన్యాన్ని కోల్పోయాడు. కొడుకైన చెన్నయ్యకు ఇది గుర్తై గ్రామంకు వచ్చాడు. రౌద్రాకారంతో నిలిచాడు. ఏమి చేసేది కాదుగదా! దుర్గడు కుమారుడ్ని వాటేసుకొని 'కుమారా.... చెన్న మల్లయ్యా' అంటూ రోదించాడు. 'పోయిన వృక్షాలు వస్తవా' అని అన్నాడు. అప్పుడు చెన్నయ్యకు పరీక్షలు ఉన్నవి. ఊళ్ళోని విచారాన్ని (చింతను) తుంగమ్మనదిలో (తుంగభద్రలో) విసిరేసి చెన్నయ్య పట్నంకు వెళ్ళిపోయాడు. ఆ మీదట శాంతగౌడే దురుగడిని పరిపరివిధాలుగా సమాధానపర్చేందుకు ప్రయత్నించాడు. ఏమి చేసినా దుర్గడు మొదట్లోలాగ నవనవలాడే మనిషిగా అయ్యేది కాలేదు కదా! చందవ్వ (భార్య) బతికుంటే ఈ వృక్షాలు మాయమైయ్యేవి కావు కదా అని దుర్గడు పదే పదే గుర్తుకు తెచ్చుకొని విలపించసాగాడు. ఎలాగో జీవాన్ని పెట్టుకొని కుమారుడి ముందిన జీవితాన్ని ఊహించుకొంటూ నెమ్మదిని పొందసాగాడు. రసూల్‌సాబ్ వృక్షాలనుంచి వచ్చిన వందలాది తుంటల్ని లారీలో నింపుకొని వెళ్ళి ఆరునెలల గడిచిన మీదట రెండు బండ్లను, జతగా వ్యవసాయ పనిముట్లను లారీలో నింపుకొని శాంతగౌడ ఇంటిముందు దించాడు వాట్ని. ఊరు, పల్లెలోని జనం పశుపక్ష్యాదులు ఒకేచోట జమై ఆశ్చర్యంతో ఆ పనిముట్లను, ఆ రెండు బండ్లను చూడసాగారు. శాంతగౌడ ఒక బండిని తన అక్కైన రుద్రమ్మకు పంపించాడు. బసవదేవుడి జయంతికి దుర్గడే బండిని కడిగి విభూతి రాసి, కుంకుమ బొట్లు పెట్టి సాంబ్రాణికడ్డీ వెలిగించి, టెంకాయి కొట్టి, నైవేద్యాన్ని చేతిలో పెట్టుకొని, చిన్నగా వంటిని నుదురునూ బండికి కొట్టుకొని దుఃఖించింది మిగతా నరమానవులకు గుర్తేకాలేదు!

దుర్గడి జీవం ఒక దినమూ ఆ బండిలో కూర్చొని ఉండేందుకు మనసొప్పలేదు. ఊరు – పల్లెలోని జనంకు మాత్రం ఆ బండిలో కూర్చొని చూసేది అంటే దేవేంద్రుడి రథంలో కూర్చొన్నట్లుగా అని ఊహిస్తూ ఉబ్బి తబ్బిబ్బుగా అయ్యేవాళ్ళు.

దుర్గడి చిత్తం ఎక్కడికో మోసుకొని పోయినట్లుగా ఉంది. అతడి దేహం మాత్రం చీకట్లో నిప్పుల కొలిమిలో కూర్చొన్నట్లుంది. వంటికి ఎంతో చలికొట్టినప్పుడు ఎచ్చరికను పొంది కళ్ళను అటు ఇటు నిలిపాడు. వళ్ళంతా తడిసి నెమ్మిగా అయినట్లైంది. వెలుతురు



రాసాగింది. అయితే ఆ వెలుతురు ఎటువైపున చూసినా మసక మసకగా కాంతులుగా ప్రసరిస్తున్నవి. భయంతో తన ఇంటి చుట్టూరా చూపుల్ని తిరిగించాడు. జీవాన్ని ఆపుకోలేక రెండు సంవత్సరాలక్రితం తన ఇంటి చుట్టూ నాటిని నాలుగైదు చెట్లు జీవాన్ని నింపుకొని పెరిగినవి. వాట్ని ముట్టి ముట్టి చూసాడు. నిరుమ్మళంగా ఉన్నవి ఆ చెట్లు, అప్పటికప్పుడే పెరిగినవా ఇవి అని అనుకోసాగాడు. ఎన్నోసార్లు చూడాలని ప్రయత్నిస్తుంటే శాంతగౌడగారి భవంతికి చెందిన పెద్ద ప్రాకారపు గోడ కనబడటంలేదు ఈ వేళన. వెనుకున్న పల్లెలోని గుడిసెలు కనబడుటలేదు. తాయమ్మదేవి వీధిలోని పెద్ద వేపవృక్షం ఇప్పుడు ఏ దిక్కులో ఉంది అనే అనుమానం దుర్గడికి వచ్చింది. దూడలు, బర్రెలు, కుక్కలు, కాకులు, పిచ్చుకలు ధ్వనులను చేసేది విన్పించసాగింది. పల్లెనుంచి శబ్దాలు వినిపిస్తున్నవి. ఊళ్ళోవాళ్ళు మిద్దెలమీద చేరి నిలిచి మాట్లాడినట్లుగా ధ్వనులు వస్తున్నవి. ఇంటి తలుపును మూసి పల్లెవైపుకు వచ్చాడు. సమీపం సమీపంకు రాగా బసప్పడి గుడిసె కనబడింది. కుక్కలు, కోళ్ళు ఎలాగెలాగో చూస్తూ నిలుచున్న చోటే నిలిచినవి. బర్రెలు, దూడలు ఎటో ముఖాల్ని పెట్టుకొని తోకల్ని ఊపుకొంటున్నవి. దట్టంగా పొగమంచు అలుముకొనియుంది.

'రా....రా.... దుర్గణ్ణా.... పొగమంచు బాగా పట్టింది' అని పిలిచాడు బసప్ప.

'ఔనౌను! ఎలాగుందో చూడు... ముందున్నా నీ ఇల్లు కనబడుట లేదు...' అని అంటూ వచ్చి కూర్చున్నాడు. బసప్ప కొద్దిసేపు దీపం బుడ్డి వెల్తురులో బొండిలిని వెదకసాగాడు.

'కొద్దిసేపు విశ్రమిస్తా....' అన్నాడు దుర్గణ్ణ

శాంతగౌడ చెప్పిన మాటలు గుర్తుకు రాసాగావి. అక్కడక్కడ చుట్టుప్రక్కల పల్లెలలో వానలు పడుతున్నవట. మనసీమకు వానలు పడ్డే విత్తనాల్ని విత్తేది ఉందని అంటున్నాడు పటేల్. ఈ సంవత్సరం మహార్నవమి వచ్చి వెళ్ళినా ఇంకా వానలే ప్రవేశించలేదు. అందుకే పొలాలలో గింజలు పడలేదు. దేవుడు వానల్ని కురిపించనందుకు 'ఏమి చేయాలి యప్పో' అంటూ ఊరు–పల్లెలోని జనం హడిలిపోయారు. 'అదెక్కడో ఆంధ్రాలో తుఫాను వచ్చిందట. వాన వచ్చే సూచన కనబడుతుంది. దానివలనే మబ్బులు కమ్ముకొనియున్నవి. తుప్పర తుప్పరగా పడుతుంది వాన. 'దురుగా పొలాల్ని ఎందుకు ఖాళీగా ఉండనీయాలి? గింజల్ని వేస్తేసరి. మన పూర్వీకులు మూలకార్తెలో గుప్పెడు గింజల్ని వేసి ఒక్కొక్క గుప్పెడుకు మూడు మూడు బస్తాల జొన్నల్ని పొందేవారట. ఇప్పటి కాలంలో మనమెందులకు అంతటి వెనుకటి భవ్యకాలాన్ని తిరిగిచూసి ఖుషిని అనుభవించకూడదు? ఒక విధంగా తార్కికంగా

ఆలోచిస్తే ఇప్పుడు పడే తుప్పర వానకు భూమి నానేది తక్కువే! అని శాంతగౌడ ఉత్సాహ, నిరుత్సాహాలతో అన్నాడు. బీజాల్ని విత్తేందుకు కొట్టంలో ఉన్న గొర్రు, జడ్డిగం ఇత్యాది సామాన్లు సరిగానే ఉన్నవని గ్రహించాడు దుర్గడు.

'అవును దుర్గణ్ణా, ఈ మీ పటేల్‌కు ఎంతో ఆశ ఉంది కదా! ఒకే పుత్రిక కదా! ఆమెను పరాయి ఇంటికి పంపాల్సిందేకదా! ఇంకా లగ్నమే కాలేదు! మీ పటేల్ ఆశలను చూస్తే కొండంత లాగ....! అదీ కాదులే, ఒక వేళ నలుగురైదుగురు మగబిడ్డలు పుట్టియుంటే ఏ విధంగా ప్రవర్తించేవాడో కదా!' అన్నాడు బసప్ప. దురుగ మరు మాట్లాడలేదు. కొంతసేపు అయిన మీదట బసప్పడే ప్రక్కకు జరుగుతూ 'నీ కొడుకు బహద్దూర్.... చదువుకొన్నది సార్థకమైంది. అక్కడే పట్నంలోనే ఉండనీ.... ఒక మాట అననా.... అక్కమ్మ అదేనయ్యా మన చిన్న దొరసాని చెన్నయ్యను లగ్నమాడుకొంటానని అన్నదటగా.... ఆ పలుకే చాలయ్యా... అవును కదూ.... అదేమైనా చిన్న మాటనా? మన బసవణ్ణ దేవుడు చేసే చిత్రమైన ఆటే ఇది. మన చేతులలో ఏముంది?' అన్నాడు బసప్ప.

దుర్గడికి కోపం వచ్చింది. 'బసప్పా, అదెలాగు సాధ్యపడుతుంది...'అని అనగా మధ్యలోనే దుర్గడి మాటలను తుంచేస్తూ 'ఏ కాలానికి ఏమి నడవాలో అది నడవాల్సిందేలే! అవును, నువ్వు నీ జీవాన్ని భద్రంగా (పదిలంగా) నిలుపుకో' అన్నాడు బసప్ప. అంతలో బసప్పడి పెళ్ళాం బయటకు వచ్చి చాయ్‌ను ఇచ్చింది. దుర్గడు లేచి నోటిని నీళ్ళతో పుక్కిళించుకొని చాయ్‌ను త్రాగసాగాడు. పొగమంచు వీడలేదు. చుట్టు ప్రక్కల పొగమంచు పల్లెనిండా దట్టంగా వ్యాపించినదానికి ఆశ్చర్యపడుతూ నాకు నువ్వు నీకు నేను కనబడుటలేదు అని జనం అనుకోసాగారు. చిన్నపోరలు పొగమంచులోనే దొంగ – పోలీసు ఆటను ఆడుకోసాగారు.

'చెన్నయ్య వచ్చాడట కదా..... తిరిగి వెళ్ళాడా?' బసప్పడి భార్య అడిగింది.

'వెళ్ళాడు' అని జవాబిచ్చాడు దుర్గణ్ణ.

'పాడైన దాన్ని వదిలేయి! మరలా పల్లెకు వచ్చేది వద్దు.... చదువుకొన్నాడు. నౌకరి చిక్కింది కదా! రాజు ఉన్నట్లుగా ఉండేదాన్ని వదలి.... అవును కదా అణ్ణా? మన కెందులకు ఇది? లోకంలో నడవకూడనిది చేసేందుకు వెళ్ళి.... నీ ప్రాణానికి నిరుమ్మళం (నెమ్మదిని) లేకుండా.....' అంది ఆమె.

'ఊరుకోవే.... ఊరుకో' అంటూ బసప్ప పెళ్ళాన్ని గదరించాడు.



దుర్గడు బసప్పడి గుడిసె నుంచి లేచి నడవసాగాడు. కూర్చుంటే సమాధానం కావట్లేదు. నించుంటే అదీ సమాధానం కలగనీయట్లేదు. పటేల్‌కు ఈ విషయం చెవికి సోకిందో ఏమో! ఆ రోజున దురుగడితో 'దురుగా, నీ కొడుకు చెన్నడు... అవును నాకూ కొడుకే' అని అన్నాడు శాంతగౌడ.

'ఊరు మొత్తానికీ చెందిన కుమారుడని అను పటేలా' సూగప్ప మాష్టారు గొంతును కలిపాడు.

'నేను అతనికి అవసరమైనంతగా సహాయాన్ని చేసాను' శాంతగౌడ నుంచి ఈ పలుకులు.

'యప్పో, ఇప్పుడు కాదని ఎవరన్నారు' అన్నాడు దురుగడు.

'నువ్వు ఉన్నట్లుగా, నీ కొడుకు ఉండలేదు కదా... దురుగా...! అతను తిన్న గంగాళంలోనే ఉచ్చను (మూత్రాన్ని) పోసేందుకు నిలుచున్నాడు.... మా వంశానికి మసిని పూసేందుకు సిద్ధమైయ్యాడు దురుగా.... నువ్వే అతనికి చెప్పు... నీ ముఖాన్ని చూసి నిధానించా! లేకపోతే...' అంటూ ఉగ్రుడైమాట్లాడాడు. దురుగడు ఆ కోపాన్ని చూసి చెమటతో తడిసాడు. తన గూటికి తిరిగివచ్చాడు. కొడుకును మాట్లాడించేందుకు ధైర్యం రావట్లేదు. మొండు ధైర్యాన్ని నింపుకొని 'జనం ఏదో అనుకొంటున్నారు చెన్నయ్య.... నిజమేనా' అని అడగాలని ఆ సుద్ధి ఊరు – పల్లెలో వ్యాపించినప్పటి నుంచి ప్రయత్నాన్ని చేసినా, నోటి వరకూ వచ్చినా, మాటలు మాత్రం హృదయంలోనే స్థాపనం అయ్యి, కుతకుతమంటను గుండెలోనే రేపుతున్నదాన్ని సహించుకోసాగాడు దుర్గడు.

ఒకరోజున చెన్నడే 'తండ్రీ, నువ్వే అనేవాడివి కదా... నుదుటిలో రాసినదాన్ని తప్పించేందుకు బ్రహ్మదేవుడే దిగివచ్చినా సాధ్యమైయ్యేది లేదు...' అని అన్నాడు తండ్రితో.

'అంటే?' దుర్గడికి కోపం వచ్చింది.

'ఏమి జరగాలో అది జరుగుతది...' అని చెన్నయ్య అనటమే తడవుగా

'ఏమి మాట్లాడుతున్నావు కుమారా....ఇదేమన్నా శరణ బసవేశ్వరుడి కాలమా? చెప్పుల్ని కుట్టే చేతికి శివలింగం వచ్చేది సాధ్యమా?' అని అరిచాడు. చెన్నయ్య మిన్నకుండిపోయాడు. మరుదినం చెన్నయ్య పట్నంకు వెళ్ళేందుకు నిలిచినప్పుడు 'నాయనా, నువ్వూ నాతోనే వచ్చియుండు' అని అడిగాడు. ఇలా అడిగేది నూటొక్కసారి అయ్యుండొచ్చేమో. దుర్గడు పుత్రుడ్ని గట్టిగా ఆలింగనం చేసుకొని 'చెన్న..... చెన్న

మల్లయ్యా.... నీ తల్లి వినలేదుకదా ఈ నీ పలుకుల్ని... అల్పాయుషి నీ అమ్మ జన్మ జల్దీగా మట్టిలో కలిసిందికదా! బిడ్డా కుమారా.... నాకు ఈ ఊరు, ఈ తుంగమ్మ నీరు, ఊరు – పల్లె, ఈ మందిని వదిలి వచ్చేది కావటంలేదు' అని కన్నీరు పెట్టూ 'చెన్నమల్లయ్యా, పటేల్ చుట్టరికాన్ని వదిలిపెట్టి నీవు చల్లగా ఉండు.... చూడు పుత్రా.... మరలా ఈ ఊరికి వచ్చేది చేయకు... ఏముంది ఇక్కడ? నాకు ఇక్కడ నేలతల్లి ఋణం ఉంది. నేను ఇక్కడే భేషుగా ఉండాలనుకొంటే.... నువ్వు వచ్చేది వద్దు' దుఃఖిస్తూ అన్నాడు. 'వస్తాను, వస్తాను నాయనా!' అంటూ బిరుసుగా సంజ్ఞలను చేసి వెళ్ళిపోయాడు. కొడుకు పోయేదాన్ని చూస్తూ నిలిచాడు దుర్గడు. దుర్గడికి చెన్నయ్య పుట్టిన మీదట మరలా సంతానం కలగలేదు. చందవ్వకు చెన్నయ్యనే మంచిగా పెంచేది సరి అని అనుకొంది. చెన్నడ్ని చూసిన సూగప్ప మాష్టారు తన గుడిసె లాంటి పాఠశాలకు పిలుపించుకొని ఓనామాలు చెప్పటమే ఒక అబ్బురంగా ఉంది. ఆ ఊరి ఇతిహాసంలో మాదిగోడి కొడుకొకడు ఓనామాలకు కళ్ళను, నోటిని తెరిచి నిలిచింది లేదు ఇప్పటి వరకూ! శాంతగౌడగారి నమ్మకమైన పాలేరు దుర్గడు అనే కారణంకో, దుర్గడి మీద అభిమానంకో, సూగప్ప మాష్టారు చెన్నడికి అక్షరాల్ని దిద్దించాడు. మిగిలిన పిల్లలకన్నా శీఘ్రంగానే అక్షరాల్ని దిద్ది చూపించిందే ఒక గొప్ప సంతోషాన్ని కలిగించి 'మాదిగోడి కడుపున తప్పిపోయి పుట్టాడు వీడు' అంటూ తలకి బెత్తంతో చిన్నగా టఫ్ అని కొట్టాడు. 'దురుగా, వీడికి విద్య అబ్బుతుంది.... సర్కారి బడిలో చేర్చు' అన్నాడు సూగప్ప మాష్టారు. దుర్గడికి ఒళ్ళంతా పులకరించి శాంతగౌడ వైపుకు చూసాడు. అది శుభగడియేమో అయ్యుండొచ్చు. 'హుం.... చేర్పించు .... నాలుగు అక్షరాల్ని నేర్పనీ' అన్నాడు పటేల్. ఈ ఊళ్ళో సర్కారు బడిలేదు. పక్క ఊళ్ళో స్కూలు ఉంది. సూగప్ప మాష్టారే స్వయంగా వెళ్ళి పేరునూ, జన్మదినాంకాన్ని నమోదు చేయించి పిల్లోడ్ని ఆ స్కూలులో చేర్పించాడు. ఒక సంవత్సరం దుర్గడే మోసుకొని కొడుకు చదువుకు సహాయపడ్డాడు. సాయంత్రం పనేమి లేకుంటే దుర్గడే పక్కఊరుకెళ్ళి కొడుకును ఎత్తుకొని ఇంటికి చేర్చేవాడు. కుదరకపోతే చందవ్వ వెళ్తుండేది. చందవ్వ సాయంత్రం చెన్నయ్యను భుజాల మీద కూర్చోబెట్టుకొని, శ్రావ్యంగా దాసరి పదాల్ని (పాటల్ని) పాడుతూ దార్లో సాగిపోతుంటే, చెన్నడు తల్లి భుజాలమీద చప్పట్లను కొడ్తూ తనూ తల్లితో గునుగుతుండేవాడు. అంతలోనే 'అమ్మా అమ్మా అటు అటు' అంటూ తల్లిని బుడిబుడిగా కొట్టూ మునుగుతున్న ఎర్రగా, గుండ్రంగా ఉన్న సూర్యుడ్ని చూపించి నిలుపుతుండేవాడు తల్లిని. చందవ్వ ఆ సూర్యాస్తమయాన్ని చూసి, తను చెన్నడ్ని కడుపుతున్నప్పుడు పండిన తాటికాయల్ని నిప్పుల కుంపటిలో వేసి, వాటి తోలు వలచి, ఆ తదుపరి తినేందుకు ఆ మాగిన పండును చూసినట్లుగా సూర్యుడు కనబడింది గుర్తుకు తెచ్చుకోసాగింది.



'అమ్మో.... అది ఎక్కడికి పోతది" అని చెన్నయ్య అడిగితే 'తల్లి దగ్గరకు వెళ్తున్నాడు' అని చెపుతుండేది. కొంతకాలం గడవగా మూడో సంవత్సరం నుంచి చెన్నడే వెళ్ళి వస్తుండేవాడు. రాత్రి ఒక గంట చెన్నడికి సూగప్ప మాష్టారే లెక్కల్ని చెపుతుండేవారు. వచనాల్ని (శతకాల్ని) చదివి చెపుతుండేవారు. రాగా రాగా జైమిని భారతం, బసవపురాణం, గిరిజాకళ్యాణం మొదలైన కావ్యాలను చదివి విడమర్చి చెపుతుండేవారు సూగప్ప మాష్టారు. చెన్నడు శ్రద్ధగా విని, చదివి మననం చేసుకొంటుండేవాడు. దుర్గడు మూగోడిలాగ ఉత్తిగనే కూర్చొని వింటూ, చదువు ముగిసిన మీదట చెన్నడ్ని గుడిసెకు తీసుకొచ్చేవాడు. ఈ విధంగా చెన్నడు చదివి మెట్రిక్ పాసైయ్యాడు. శాంతగౌడ సహాయం చేసాడు. ఆ పిమ్మట కాలేజీకి చేరాడు. చెన్నడు ఊరికి వస్తే పటేల్‌ను కలుస్తుండేవాడు. ఆ విధంగా రాగారాగా చెన్నడికి సరిగా అన్పించలేదు. దుర్గడి మాటలకు కట్టుబడి పటేల్ దగ్గరకు వెళ్ళి వస్తుండేవాడు. చెన్నడికి తల్లైన చందవ్వ శాంతగౌడ మధ్యన శారీరక సంబంధం గుర్తైనా అది రాగారాగా అతని మర్మానికి తట్టటం మొదలు పెట్టసాగింది. అయితే ఆ సమయంకు తల్లికి గర్భాశయంలో గడ్డపుట్టి ఒక వారం విలవిలలాడి ఒక రోజున చనిపోయింది. చనిపోయినప్పుడు చెన్నడు గంభీరంగానే ఉండి శవసంస్కారంలో పాల్గొన్నాడు. సూగప్ప మాష్టారు అభిమానంతో 'దురుగా నీ కొడుకు పెరిగాడు, చూడు..... నీ కొడుకు తల్లి చనిపోతే, అదెంత గంభీరంగానో నిలచి శవ సంస్కారానికి నిలిచాడు. అయితే నువ్వు.... చిన్న శిశువులాగ విలపించినట్లుగా ఏడుస్తున్నావు కదా! బతుకులోని మర్మం ఏమిటనేది అతనికి గుర్తు. ఎవరు శాశ్వతం? ఇదంతా తెలుసుకొన్నోళ్ళు ఈ సావుకు అల్లాడేది లేదు కదా! నీ కొడుకు బుద్ధిమంతుడు జ్ఞానవంతుడు' అని పలికాడు. అదైన సంవత్సరం తరువాత రాయచూరులో అక్కమ్మ చదివే ప్రౌఢశాలలో పెద్ద మాష్టారుగా నియమించబడిన సంగతి తెలిసొచ్చి ఊరు–పల్లె ఆశ్చర్యాన్ని పొందింది. చెన్నయ్య అప్పుడప్పుడు తండ్రి కోసమని ఊరికి వస్తుండేవాడు. ఒకసారి తండ్రిని తనుండే పట్టణంకు (రాయచూరుకు) తీసుకెళ్ళాడు. అక్కడ తింటానికి, పడుకోటానికి, కట్టుకోటానికి వీటిలో కొరతేమీలేదు. అయినా దుర్గడికి అక్కడి వాతావరణం ఒప్పలేదు. ఇక్కడేమో దుర్గడు లేనందుకు పటేల్‌కు పిచ్చిపట్టి నట్లైంది. నిమిషానికొకసారి 'దురుగా' అని అంటే 'యప్పో' అని వారిద్దరి నడుమ మాటలు నడిస్తేనే తిన్నకూడు అరుగుతదని అనుకొనేవాళ్ళు జనం. 'చెన్నమల్లయ్యా.... నేను ఊరికి వెళ్తా... నువ్వు స్థిమితంగా ఉండు.... నాకు ఆ ఊరు, ఆ తుంగమ్మ తల్లి నీరు, శాంతగౌడ మరియు సూగప్ప మాష్టారును వదిలేందుకు మనస్సు ఒప్పటం లేదు' అని చెప్పి మరలా వేగంగా ఊరికి తిరిగి వచ్చాడు. ఊరికి వచ్చి నిలిచిందే

తడవుగా దుర్గడికి సలిలంగా ఊపిరాడింది.

దుర్గ బసప్పడి ఇంటి నుంచి (గుడిసెనుండి) లేచి నడుస్తుంటే ఏమో జ్ఞాపకం చేసుకొంటూ వెళ్ళసాగాడు. పటేల్ గారి కుక్క పరిగెత్తుకొచ్చి కుంయ్ కుంయ్ అంటూ దుర్గడి కాళ్ళకు చేరి నాకుతూ కూర్చొంది. దాని కాలికి ఏదో దెబ్బ తగిలియుంది. చూడగా 'ఏమైంది? ఎవరు కొట్టారు....' అని విమర్శగా చూడసాగాడు. పొగమంచులో తుంటరిపొరలు ఎవరూ కనబడటం లేదుకదా!

'చూడు శాంతగౌడ.... పై పైనే దుర్గడితో మాటలు పలికితే, తిట్టితే ఏమి ప్రయోజనం అవుతదో నువ్వే చెప్పు? పాపం.... అతను నా చేతిలో ఏముంది నాయనో! నా కొడుకు చెన్నయ్యకు తిట్టి చెప్పాను. మంచిని చెప్పేందుకు కాళ్ళా వేళ్ళా పడ్డాను అని అంటున్నాడు కదా! పోనీ ఆ విచారాన్ని.... నువ్వు దుర్గడితో అదెంతంగా తిట్టి ఏమి పొందావు? ఛీ.... నీకు బుద్ధిగిద్ది ఉందా? దురుగడు నీకు తన పత్నినే సమర్పించుకొని సహించుకొన్నాడు కదా! అతను పోషించిన వృక్షాల్ని నరికించి నువ్వు ఇంటినిండా ముందు తరాలకు సరిపోయేంతగా బండ్లను, వ్యవసాయ పనిముట్లను పొందావు కదా! అప్పుడు అతను అనుభవించిన బాధ అంతింతగాదు! నీకు ఏమన్నా ఆ బాధ తగిలిందా? వందలసార్లు నిన్ను తన భుజాల మీద ఎక్కించుకొని తుంగభద్ర ఆవలి తీరంకు దాటించలేదా... ఛి....ఛీ.... అతను నీకు చేసింది ఎంతో ఉంది. అంతోడొకడు, అంతగా పనిచేసేటోడొకడు నీకు దొరకటం చేతనే ఈ ఇల్లు ఈ గౌరవం కమ్మగా నడుస్తుంది కదా! నువ్వు ఏమి చేయాలనుకొనేది అది చెన్నడిమీదనే చేయి. దుర్గడి మీదకు వెళ్ళబోకు మహాశయా.... నమస్కరించి చెపుతున్నా' సూగప్ప మాష్టారు చెప్పదలచిన హితాన్నంతా ఊపిర్ని బిగపట్టుకొని కోపంతో చెప్పి నిర్గమించాడు ఆ పటేల్ ఇంటినుంచి. శాంతగౌడకు ఒక విధంగా అవే అవే మాటలు పదే పదే చెవులకు, హృదయానికి కొట్టుకోసాగావి. 'ఔనౌను! దురుగడు దేవుడి లాంటి మనిషి. అతడ్ని ఆడిపోసుకొనేది తప్పే' అని ఎన్నోసార్లు అనుకొన్నా శాంతగౌడకు సమాధానం కలగట్లేదు. శాంతగౌడ తన నల్లటి రాజసౌధంలో కూర్చొని భగభగా మండుతున్న మనస్సు నుంచి ఏమేమో ఆలోచిస్తూ కూర్చున్నాడు. రాత్రి అదెంత పొద్దు గడిచిందో శాంతగౌడ కూర్చునియున్నందునే హనుమంత మరియు భీమయ్యలకు పడుకొనేది ఎలా అవుతదని వాళ్ళు ఆవలిస్తూ గౌడ చెంతన కూర్చున్నారు. సూగప్ప మాష్టారుకు నిద్ర వచ్చింది. పటేల్‌తో మాట్లాడి వాదం చేసి, బుద్ధివాదాన్ని చెప్పి అలిసిపోయి పడుకొన్నాడు. శాంతగౌడ కాళ్ళను మర్ధనం చేయించుకొనేందుకు లేచి 'దురుగా' అని కేకపెట్టాడు. హనుమంత, భీమయ్యలు ధడాల్నే లేచి లాంతరు పట్టుకొని బయటకు



నడిచారు. ఇది ఈ రాత్రిలో ఈ కేక మూడోసారో,నాల్గోసారో. కాళ్ళను మరలించేందుకు లేవలేకపోయాడు. 'దురుగా' అని పిలిచాడు. 'దురుగణ్ణ ఈ రోజు తన ఇంట్లో పడుకొనేందుకు వెళ్ళాడు దొరా' అని ఆ ఇద్దరూ చెప్పినా, ప్రతిసారి 'దురుగా' అంటానే పిలుస్తున్నాడు శాంతగౌడ. కాళ్ళను కదుక్కొని లోనికి వస్తుండగా పశువుల కొట్టాన్ని దాటేటప్పుడు పేడను తొక్కాడు. కోపం నెత్తికెక్కి 'థూథ్.... అరేయ్.... ఎద్దుల్ని దారిలో కట్టేయకండి అని చెపితే విన్నార్రట్రా?' అంటూ వ్యవసాయ పనిముట్లు ఉన్న గదికి వెళ్ళి చంద్రాకోలును పట్టుకొచ్చి పేడను వేసిన ఎద్దుకు చట్‌చట్‌మంటూ వేట్లను కురిపించాడు. మిగిలిన 11 (పదకొండు) ఎద్దులు, ఆవులు, బర్రెలు వాటి సంతానం (దూడలు) ఈ రౌద్రాకారాన్ని చూసి దపదప లేచి అటూఇటూ జరిగి తోకల్ని విసరసాగావి. హనుమంత, భీమయ్యలు ఈ రౌద్రాకారాన్ని చూసి, ఇదంతా మామూలే అని తెల్సినా భయపడ్తూ 'వదలి పెట్టుదొరా' అని భీమయ్య లాంతరు పట్టుకొని అన్నాడు. హనుమంత నీళ్ళ చెంబును తెచ్చి పటేల్ కాళ్ళను కడిగాడు. ఆ తర్వాత పెద్ద అరుగు మీద కూర్చొని ఎద్దులకు మేతను వేయండ్రా అని హుకుం చేసాడు. మేతను వేసి అరగంట కాలేదు. మరలా మేతను తెచ్చి వేసారు. కర్‌కర్‌కర్ అంటూ మేయసాగావి ఆ పశువులు. ఆ సప్పుడు ఇల్లంతా వినబడసాగింది. శాంతగౌడకు ఇకనూ సమాధానం కాలేదు. అరుగుమీద అటూఇటూ పొర్లసాగాడు. కాలును ఈడ్చుకొంటూ సూగప్ప మాష్టారుకు ఏదో చెప్పేందుకు చూసాడు. అతను నిద్రిస్తున్నాడు. తాతకు (మాష్టారుకు) వయసైంది అని అనుకోసాగాడు. శాంతగౌడ ఏమి చేయాలన్నా సూగప్ప మాష్టారునే అడిగి చేస్తుండేవాడు. శాంతగౌడకు కుడివైపున సూగప్ప మాష్టారుంటే, ఎడమవైపు దురుగడు ఉంటుండేవాడు. ఎద్దుల్ని ఖరీధించినా, గింజల్ని భూమిలో వేసినా, ఏ కారణానికైనా సూగప్ప మాష్టారిని అడిగే పనులను ప్రారంభించేవాడు. శాంతగౌడ ఇప్పుడు వణకసాగాడు. వారం నుంచి రాత్రి వేళలో ఇక్కడే ఈ భవంతిలోనే పడుకోమని అభ్యర్థించాడు. 'సూగప్ప తాత తప్పు చేసాడు.... ఆ వేళలో నాకూ తెల్వలేదు. మరలా ఈరోజు దురుగడిలాగ నా ఇంట్లో వెట్టికి ఉండి, నేనేసిన ఎంగిలికూడు తినుకొంటూ కుక్కలాగ పడుండేవాడు.....!' 'పోరడు బుద్ధివంతుడిలాగ ఉన్నాడు..... చదవనీ... చెన్నడు చదువుకుంటే భవిష్యత్‌లో తనకూ ఉపయోగానికి వస్తాడని సూగప్ప తాత అన్నాడు కదా! ఇప్పుడు....? వచ్చి నిలిచిందిలే విపత్తు మెడ మీదకు!' 'బూదెణ్ణ అన్నదే నిజం కదా! ఈ కులాన్ని ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచాలి పటేలా' అని అన్నాడు కదా! అయితే దురుగడి, చందవ్వ ముఖాల్ని చూసి చెన్నడికి చదువుకొనేందుకు అవసరమైనంత రొక్కాన్ని ఇచ్చాను కదా! 'అరె మొన్న ఏమేమో అన్నాడట.... మా అయ్య పనులను చేస్తున్నాడు....మా తల్లి ఇంటి పనులను

చేసిచేసి తనువు చాలించింది. అమ్ముడుపోయారు వాళ్ళిద్దరూ పటేల్‌కు. అమ్ముడుబోయింది చూస్తే దాని రొక్కం విలువకు శాంతగౌడ ఆస్తినంతా అమ్మినా సరిపోదు మాకు ఋణపడిందానికి....!' 'వాహ్ కొడుకా..... చెన్నా' అని గట్టిగా మాట్లాడుకొంటూ అటుఇటు తిరుగుతూ మండిపోసాగాడు శాంతగౌడ.

అర్ధాంగి హంపమ్మ గుర్తుకొచ్చింది. చందవ్వ కళ్ళముందు రమిస్తుంది. అక్క రుద్రమ్మ, పుత్రికైన అక్కమ్మ కళ్ళ ముందు నిలిచారు. అయితే ఈ భవంతిలో ఇప్పుడు ఎవరూలేరు కదా..... అనేది గుర్తుకు రాగా 'నేనెట్లా ఇన్ని దినాలు ఒంటరోడిగా బతికాను ఈ మహల్‌లో' అని అనుకోసాగాడు. శాంతగౌడకు ఈ ప్రశ్నె ఇంతకు మునుపెన్నడూ ఎదురవలేదు. 'దురుగ ఉన్నాడు, సూగప్ప మాష్టారు ఉన్నాడు... అక్కమ్మ ఉంది... ఇలాగున అన్పించినా తనకెవరూ తోడు లేరనేది' మనసులో నిలవగా శాంతగౌడకు శక్తి హరించినట్లైంది. పలచగా (కోలగా) తెల్లగా ఉండేటి హంపమ్మ గుర్తుకొచ్చింది. ఎప్పుడూ నుదురులోని విభూతి మాసిపోయేది కాదు. ఆమెకు సూగప్పతాతే దేవుడిగా అయ్యాడు. పురాణం, పుణ్యకథల్నే వింటూ కాలాన్ని గడుపుతుండేది. తాత పుణ్య ప్రవచనాల్ని బోధిస్తూనే ఉండేవారు. ఎన్ని రోజులు విన్నా ఆమెకు విసుగనిపించేదిలేదు. తనకుండే ఏ వ్యవహారాలలో ఆమె ప్రవేశించేదికాదు. లగ్నమైన ఆరు సంవత్సరాల తర్వాత ఒక పాప పుట్టిందే చాలన్నట్లుగా ఆమె నుంచి సంతాన భాగ్యలక్ష్మి నిలిచిపోయింది. శాంతగౌడ వారసుడుకని ఆశెపెట్టుకొని మరొక మారు మనువును చేసుకోనిదే ఒక అద్భుతం అని అనుకోవచ్చు. అక్క రుద్రమ్మ దీన్ని గమనించి ఒకట్రెండు సార్లు చూచాయగా ప్రస్తావించింది. శాంతగౌడ మనసు పడియుంటే వేరేది ఒకటైయ్యేది నిజమే. దాని గురించి (మారు మనువును) అతను ముందుకు రాలేదు. రుద్రమ్మ ఇక ఒత్తిడ్ని చేయలేదు. హంపమ్మ మీద గౌరవం ఉన్న రుద్రమ్మ మిన్నకుండిపోయింది. రాగారాగా రుద్రమ్మ 'తన కొడుకుకు తమ్ముడి కుమార్తెనే ముడిపెట్టి లగ్నం చేస్తే పోలే' అని భావించుకొంది. శాంతగౌడ ఆస్తికి తన కొడుకే వారసుదారుడుగా అవుతాడనే ఆశయాన్ని పొంది ఆమె నెమ్మదిని పొందింది. తర్వాత శాంతగౌడ చందవ్వతో సంపర్కం పెట్టుకొన్న తక్షణమే హంపమ్మ కంపించిపోయింది. చందవ్వ మీద దురుగడి మీద హంపమ్మ నిప్పుల్ని కురిపించసాగింది. రోజంతా లోలోనే కుమిలిపోసాగింది. దీన్ని చూచి ఒకరోజున సూగప్ప మాష్టారే 'హంపమ్మా... శాంతగౌడ మంచి మనిషి అమ్మా.... ఏదో విషగడియలో... అతడినుదుట రాత అది అని మనం అనుకోకూడదు. అందుకే చందవ్వతో సంపర్కాన్ని చేసుకొన్నాడు. పరిపాలించే దొరకు నూరు పత్నులు అనేది విన్నావు కదా! నువ్వు చల్లగా



ఈ మహల్‌లో మహరాణిలాగ ముత్తైదువగా ఉండు తల్లి. హంపమ్మా... నిశితంగా పరిశీలిస్తే చందవ్వ ఎంతైనా ఇంటి బయటే రాసలీలలో నిమగ్నమవ్వాల్సిందే. శాంతగౌడ మగసంతానం లేదని మరొకామెను వివాహమాడితే...? మహల్‌లోనే కళ్ళెదురే ఆ సవతిని చూడాల్సి ఉంటది కదా! ఆ వచ్చే సవతి ఎలాగుంటదో.,.. నువ్వు సలక్షణమైన బాలికకు తల్లిగా ఉన్నావు..ఎంతో సిరిసంపదలతో తులతూగుతున్నావు.. నీకేమంత వయస్సైంది.. బసవేశ్వరుడు కళ్ళను తెరిస్తే... ఒక మగబిడ్డ జనించితే అంతా చక్కబడుతది' అని హితాన్ని చెప్పి శాంతపర్చాడు. హంపమ్మ అదెలాగో నిశ్చింతరాలైంది. శాంతగౌడకు ఆ నిశ్చింతే మహదానందాన్ని కలుగజేసింది. చందవ్వ దగ్గరకు వెళ్ళి వచ్చేందుకు ఉన్నటువంటి ఆటంకాలు తగ్గిపోయినట్లైంది.

చందవ్వను శాంతగౌడ దురుగడితో వివాహమాడి ఇక్కడికి జేరినప్పటినుంచి చూస్తూనే ఉన్నాడు. అయితే అతనికి ఏమీ అన్పించలేదు. ఆమె దురుగడి పెళ్ళాం. తన మహల్‌లో ఇంటి పనులను చేసుకొని కాలాన్ని వెళ్ళదీస్తది. దురుగడికి సరైన జోడి అనేది తప్పితే మొదట్లో అతడి మదిలో ఏమి లేదులే. చందవ్వకు చెన్నడు పుట్టాడు. మూడు నాలుగు సంవత్సరాల బాలుడై యుండొచ్చు. అదే రబీ పంటను (శీతాకాలం పంటను) వేసే సంభ్రమం నడుస్తుంది. ఊరి చెంతనున్న పొలంలో దురుగడే తెల్లజొన్నను విత్తసాగాడు. పౌర్ణమి పక్షం అయినందున రాత్రి కూడా గొర్రుతో విత్తేది సాగుతుంది. వెన్నెల రేయిలో గొర్రుతో సాళ్ళను తప్పనీయకుండా ఎదబెట్టేది దురుగడికి మాత్రమే సాధ్యం. శాంతగౌడ దురుగడి కౌశల్యాన్ని గమనించుకొని నిద్రవస్తున్నందున మహల్ వైపుకు నడవసాగాడు. హంపమ్మ ఎన్నో సంవత్సరాల తర్వాత ఒక పాపకు జన్మనిచ్చి బాలింతగా తన పుట్టింటిలోనే ఉంది. మహల్ దగ్గరకు దురుగడి నివాసం ముందున్న దారిలో వస్తుండగా చందవ్వ ఆ వేళలో హరిదాసు కీర్తనలను పాడుతుంది. శాంతగౌడ ఎందుకో నిలబడి వీక్షించాడు. పెద్ద వృక్షాల క్రింద ఒక చిన్న గుడిసె. గుడిసె ముందు చెట్టుకొమ్మలకు లాలి ఉయ్యాల తొట్టె. దానిలో చెన్నడు. చందవ్వ కూర్చొని ఉయ్యాల తొట్టెని ఊపి, లేచి, ముందుకు వచ్చి, తిమ్మిరెక్కిన కాళ్ళను ఝాడించుకొని, చీర కుచ్చిళ్లను సవరించుకొని, ఆ తర్వాత నిధానంగా వస్తుంటే ఆ దారిలోనే శాంతగౌడ శిలలాగ నిలబడిన దానిని చూసి 'యప్పో పటేలా...' అంది. శాంతగౌడకు కొంచం అసహనంతో ఇబ్బంది కలిగినా 'హం ఆ... నేనే.... గొర్రు నుంచి విత్తనాలు ఎదబెట్టుంటే పనిని చూసేందుకు వెళ్ళా... తిరిగి ఇంటి దారిని పద్దామని వస్తున్నా.... నువ్వు నీ పాటను...' అన్నాడు గౌడ. చందవ్వకు తను పాడేది పటేల్‌కు పసందుగా ఉంటదని

గుర్తే. ఆమె ఖుషీతో నిలబడియుంది. అయితే శాంతగౌడలోని ధ్వని మాత్రం మార్పుతో ఉంది. ఆమె చీర కుచ్చిళ్ళను సరిచేసుకొన్నదాన్ని చూసిన తక్షణమే అతడి చిత్తం కదిలిపోయింది. దగ్గరకొచ్చి, 'చందవ్వ, నీళ్ళను ఇవ్వు' అన్నాడు. బయలకు పోయేందుకు అడిగి యుండొచ్చేమోనని లోనికెళ్ళి నీళ్ళను చెంబులో నింపుకొని తెచ్చింది. శాంతగౌడ ఎడం చేతితో ఆమె తెచ్చిన చెంబును పట్టుకొని కుడిచేత్తో ఆమె జబ్బను పట్టుకొన్నాడు. చందవ్వకు గుండె డబ్‌డబ్ అంది. 'యప్పా.. పటేలా...' అంటూ వెనుకకు జరిగింది. అతను చెంబును విసిరేసి ఆమెను లాక్కొని 'చందవ్వా... చందవ్వా.. నువ్వు నాకు కావాలి... ఇప్పుడు' అంటూ సంభోగాన్ని చేసాడు. చందవ్వ ఏమి చేసేందుకు అబలగా అయ్యింది కదా!

ఆ తర్వాత శాంతగౌడకు హంపమ్మ కన్నా కాళ్ళు, చేతులు బలిష్టంగా ఉన్న చందవ్వే హితమైంది. ఒక వారం ఆపుకొనేది సాధ్యం కాలేదు పటేల్‌కు. చందవ్వ తప్పు చేసానని క్రుంగిపోసాగింది. ఆమె పవిత్రమైన మనస్సున్న మహిళ. అయితే ఇప్పుడు మైలబడ్డాను, ముట్టుకొనేది వద్దని దుర్గడితో అంది. దుర్గడు జరిగిందాన్ని ఆమెనుంచి విని ప్రవహిస్తున్న తుంగమ్మ ఒడిలో దూకి ఆ ఒడ్డు, ఈ ఒడ్డుకూ ఈది ఈది ఎంతో సమయం తర్వాత నివాసంకు చేరుకొన్నాడు. చందవ్వలేదక్కడ. చెన్నడ్ని ఎత్తుకొని తన పుట్టింటికి వెళ్ళింది. ఒక వారం గడిచింది. చందవ్వ రాలేదు. దుర్గడూ వెళ్ళలేదు అత్తోరింటికి. దుర్గడికి కొడుకు మీద ప్రాణం కలిగి అసహనాన్ని చెందాడు. శాంతగౌడకు దుర్గడు మహల్‌కు రానందున జీవాన్నే పోగొట్టుకొన్నోడిలాగ దుర్గడి గుడిసెకు వచ్చాడు. దురుగ శాంతగౌడ కాళ్ళమీద పడి బావురమన్నాడు. ఆ తర్వాత చందవ్వను దుర్గడే వెళ్ళి పిలుచుకొచ్చాడు. అయితే శాంతగౌడ – చందవ్వ మధ్యన సంబంధం ఆమె చనిపోయే వరకు కొనసాగింది. దుర్గడు నీలకంఠుడిలాగ ఆ గరళాన్ని కంఠం మధ్యలోనే పెట్టుకొన్నాడు.

శాంతగౌడ అది ఇది ఏమేమో జ్ఞాపకం చేసుకొంటూ వాటిలో మునిగాడు. కాళ్ళీడ్చుకుంటూ అరుగుమీద అటునుంచి ఇటు, ఇట్నుంచి అటు, తిరుగుతూ చందవ్వ గురించి జ్ఞాపకం చేసుకోసాగాడు. దురుగడి మీద కనికరం కలిగి 'దురుగా' అని ఏదో మాట్లాడేదానికని పిలిచాడు. ఆ పుణ్య పిలుపును వినేందుకు దురుగ లేడక్కడ. ధడాల్నే మేల్కొన్న హనుమంత 'గౌడా పిలిచావా' అన్నాడు.

అంతలో భీమయ్య 'దురుగణ్ణ తన ఇంటికే వెళ్ళాడు దొరా నిన్నరాత్రి నుంచి' అన్నాడు. 'ఎందుకెళ్ళాడు? ఎందుకెళ్ళాడు?' అని శాంతగౌడ తనకు తనే ప్రశ్నెను



వేసుకొంటూ ఉన్నాడు. అడ్డదిడ్డంగా తిరిగేదాన్ని నిలిపి కూర్చున్నాడు. 'వెల్తురు అయ్యిందేమో చూడు' అన్నాడు. హనుమంతు బయటకు వెళ్ళి వచ్చి 'ఏమి తెల్వటలేదు పటేలా.. మబ్బులు కమ్ముకొని యున్నవి. చిమ్మచీకట్లు ఉన్నవి'.

"చలి మొదలైంది" అని అన్నాడు. 'పొద్దు పొడుపు తెల్వదు వీడికి' అని అనుకొంటూ తనే బయటకు వెళ్ళేందుకు నిలిచాడు. వెట్టి జీతగాళ్లు ఇద్దరూ లాంతరు పట్టుకొని బయటకు వచ్చారు దొర వెనుకనే. శాంతగౌడ బయట నిలిచి 'చుట్టుప్రక్కల వాన వచ్చేది ఖాయం అన్నట్లుగా తుఫాను ఉంది.మన ప్రాంతంలో వానపడ్తే, మనం గొర్రెను సాగించాలి... తెల్సిందా' అన్నాడు కోపంతో 'హుం' అన్నారు సేవకులు. చుట్టూరా చూసి ఏమి కనబడక లోనికే వచ్చాడు. 'అరేయ్ భీమా, హనుమా... చెన్నడు ఈసారి ఊళ్ళోకి వస్తే నాకు తెలపండ్రా' అని ఆజ్ఞాపించాడు. 'హుం' అన్నారు వాళ్ళు. 'తెలియజేయాలంటే తెలియజేయాల్సిందే? అవును కదరా కొడుకల్లారా.. మబ్బు ముఖాల్లారా...? అన్నాడు కోపంతో 'అలాగే పటేలా..' అన్నారు వాళ్ళిద్దరు.

ఒక గంట గతించిన మీదట శాంతగౌడ లేచి మరలా కాలు ఈడ్చుకొంటూ, లాక్కొంటూ అరుగుమీద తిరగసాగాడు. 'చెన్నడు నా గుదం క్రిందకూ నీరును తాపించాడు కదా.... కొడకా ఒరేయ్' అంటూ పళ్ళు పటపటా కొరికాడు. 'ఒరేయ్ తెల్లారుతుంది లేవండిరా..... సూగమ్మను పిలిచు కొచ్చేందుకు వెళ్ళు.... ఒరేయ్ భీమా, నువ్వే వెళ్ళు' అని అన్నాడు. అతను పరుగు పెట్టాడు. 'కుక్కను వదులురా' అన్నాడు. హనుమంత ఎద్దుల చెంత కట్టేసిన కుక్కకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చాడు. అది పరిగెత్తి బయటకు వెళ్ళింది. మరలా లోనికొచ్చింది. అరుగు ఎక్కాలని చూడసాగింది. శాంతగౌడను చూసి తోక ఊపుతూ కుంయ్ కుంయ్ అంది. 'వస్తుందట దొరా' అంటూ 'చినుకు చినుకు వాన వచ్చేటట్టుంది పటేలా' అన్నాడు భీమయ్య.

'ఏమి చినుకులు పడినా ఎదబెట్టేందుకు సరైన పదును కలిగించే వాన రావట్లేదు కదా' అన్నాడు శాంతగౌడ అసమాధానంతో. 'దురుగ ఎందుకు ఇక్కడే పడుకోలేదు'? అని అడిగాడు. ఆ జీతగాళ్ళిద్దరూ మాట్లాడలేదు. అతడు చెప్తాడేమోనని ఇతడు, ఇతడు చెప్తాడేమోనని అతడు ఇలాగున స్తబ్ధులైయ్యారు. 'మొరిగేందుకు ఏమైందిరో...' అన్నాడు కోపంతో శాంతగౌడ. సూగప్ప మాష్టారు ధడాల్నే లేచి 'హాం ఏమైంది' అని అడగసాగాడు. 'తాత, ఏమి లేదులే ...నువ్వు సుఖంగా పడుకో' అన్నాడు పటేల్. అయితే సూగప్ప మాష్టారు మెల్లగా లేచి కూర్చున్నాడు. శాంతగౌడలోని కరుకుధ్వనిని విని కుక్క వెనక్కి

జరిగి భయంతో నిలిచింది. శాంతగౌడ తననుంచి ఇప్పుడు నడిచిదాన్ని మరిచి కూలబడ్డాడు. కుక్క మరలా శాంతగౌడ దగ్గరకు వచ్చింది. దాని తలమీద చేతిని ఆడించాడు. అది లటలట తోకను ఊపిఊపి ఎగరసాగింది. సూగమ్మ వచ్చింది. ఆమె వచ్చి నేరుగా వంట గదికి వెళ్ళింది. హంపమ్మ చనిపోయిన మీదట శాంతగౌడకు, వచ్చిపోయే అతిథులకు వంటవార్పును చేసేది. వంటావిడగా పనిచేస్తుంది.

రుద్రమ్మ నుంచి 'రా.... తమ్ముడూ' అని కబురొచ్చింది. 'వెళ్ళిరా' అని సూగప్ప మాష్టారు గుర్తుచేసారు. శాంతగౌడకు గుర్తుందిలే. 'వెలుతురు రానీ' అంటూ దారిని కాచేది చేయసాగాడు. కుక్క ఊరకుండటం లేదు. పటేల్ తొడను మూతితో నాకింది. 'ఛీ...' అని లేచి ఒక కట్టెను పట్టుకొని కొట్టాడు దాన్ని. కుక్క కాలికి దెబ్బను తగిలించుకొని 'కొంయంయ్యో కొంయంయ్యో' అంటూ మొరుగుతూ బయటకు పరిగెత్తింది. కొట్టంలో ఉన్న బర్రెలు, దూడలు భయాన్ని చెంది దపదప లేచి నిలబడినవి. భీమయ్య, హనుమంతు శిలలులాగ నిలబడ్డారు. సూగమ్మ, సూగప్ప మాష్టారు శాంతగౌడనే చూస్తూ నిలబడిపోయారు. 'దురుగడ్ని పిలుచుకొని రండిరా' అంటూ గర్జించాడు.

దుర్గడు శాంతగౌడ గారి నల్లటి రాళ్ళతో ఉన్న భవ్యమైన మహల్ లోపలికి ఇష్టం లేకపోయినా కాళ్ళను ముందుకే వేయించాడు. అరుగు మీదున్న గద్దెలో శాంతగౌడ కూర్చున్నాడు. అప్పుడే శివలింగ పూజను ముగించి కూర్చునట్లుంది సూగప్ప మాష్టారు ముఖభంగిమ. దుర్గడు జన్మలో ఒకసారైనా ఈ రీతిగా కూనమే (పరిచయమే) లేనట్లుగా ఇంటిలోపలికి అడుగుల్ని వేసిందికాని, శాంతగౌడ – సూగప్ప మాష్టారు తనని చూసి చూడనట్లుగా కూర్చున్నది గాని ఇంతకు మునుపు ఎన్నడూ లేదులే. లోపల సూగమ్మ రొట్టెల్ని కాల్చేది ఆపి బయటకొచ్చి దుర్గడ్ని చూసింది. దురుగ మెత్తబడిపోయాడు. ఇలాగున ఉన్నది ఆమె ఇంతకు మునుపెన్నడూ చూడలేదు. ఇంత పెద్ద భవంతిలో దురుగడు పదిమంది పెట్టుగా, సోమారిగా ఉండకుండా ఏమేమో పనులను తనంతట తనే చేస్తుండేవాడు. ఎవరెవరినో, దేనికనో బాధ్యతతోనే తిట్టూ ప్రాంగణం అంతా కలివిడిగా తిరుగుతూ ఎద్దుల జతగానో, బర్రెల జతగానో పనులను చేస్తూనే ఉండేవాడు. తనేమో తన పనేమో. దురుగడు మనుషుల జతగా తక్కువగానే (మితంగానే) మాట్లాడేవాడు. ఈరోజు మూగగా స్తంభం దగ్గర చేరగిలపడిన దాన్ని చూసిన సూగమ్మకు దుఃఖం ఒక్కసారిగా వచ్చింది. హంపమ్మ చనిపోయిన పిమ్మట వంటకని ఈ మహల్‌లో కాలు పెట్టినప్పటి నుంచి నిన్న రాత్రి వరకూ దురుగడికి వడ్డించింది. దుర్గడంత నమ్మకస్తుడైన జీతగాడును ఈ ఇల్లు పొందిందే ఒక సౌభాగ్యపు ఇల్లుగా ఇది ఇంకా జీవాన్ని పెట్టుకొని



శోభిల్లుతుందనేది సూగమ్మకు గుర్తే. సూగమ్మకు దురుగడి మీద ఎంతగానో కనికరం ఉంటుండేది. 'దురగప్పా...' అంటూ మెల్లగా పిలిచింది.

'యవ్వా(తల్లీ)....' అంటూ పైకి లేచాడు. అతను 'యవ్వా' అని సంబోధించితే ఆ ధ్వని నవజాత శిశువు తల్లిని పిలిచినట్లుగా సూగమ్మలో ఉండేది.

'వేడి వేడి రొట్టెల్ని తిందువుగాని రా' అంది ఆమె.

'ఎందుకు తల్లి! సగం పొద్దుకే తిని చేసేదేముంది? పనిలేదు... ఆకలి లేదు' అన్నాడు.

రుద్రమ్మ దొరసాని తమ్ముడ్ని రమ్మని కబురు పంపిందట... నువ్వు వెళ్ళాలికదా...' మెల్లగా అంది సూగమ్మ. సూగమ్మ ఇచ్చిన రొట్టెల్ని వద్దనలేక తిని లేచాడు. దురుగడ్ని చూస్తున్న శాంతగౌడకు ప్రాణం చురుక్‌మని అన్పించింది. దురుగడి తప్పులేదు. పాపం... అతను తన జీవాన్నే ఇస్తాడు నాకోసం అని అనుకొంటూ 'దురుగా' అని అన్నాడు. ముఖాన్ని ఎత్తి చూసిన దురుగ 'యప్పో (అయ్యో)' అని బదులిచ్చాడు. శాంతగౌడకు అది దురుగడి ధ్వనిలాగ అన్పించలేదు.

'రా తమ్ముడూ అని అక్క కబురు పంపింది. వెళ్ళి వద్దామా?'

'నువ్వు ఎట్ల అంటే అట్లనే పటేలా' అన్నాడు దురుగ. దురుగ మునుపెన్నడూ ఇలాగున అనలేదు. శాంతగౌడకు కోపం వచ్చింది.

'ఎందుకు దురుగా.... వద్దా?'

'వెళ్ళివద్దామంటే వెళ్ళివద్దాములే.... పటేలా?'

'అలాగైతే బయల్దేరు ఇక' అంటూ శాంతగౌడ భుజం మీద కండువాకని గదిలోకి వెళ్ళాడు. సూగప్ప మాష్టారు లేచి గబగబా అరుగు దిగి దురుగడి దగ్గరకు వచ్చి 'దురుగా... చూడు.... నువ్వు ఇక మీదట ఈ ఊరిలో ఉండేది వద్దు.... నీ కొడుకు దగ్గరకు వెళ్ళి అక్కడే ఉండిపో. ఈ కనికరమే లేని కుంటి పటేల్‌కు జతగా ఎన్నిరోజులు బతుకుతావు...? నీ కొడుకును వెనక్కి లాక్కొని జాగ్రత్తలతో ఉండమని చెప్పు.... నువ్వు నీ కొడుకుతోనే ఉండిపో. వచ్చేది వచ్చినట్లుగా దిగమింగుకొని పోతే బంధనం అనేది ఉండదు... ఏంటి అర్థమైందా....' అని చెపుతున్న వేళకు శాంతగౌడ కాలును ఈడ్చుకొంటూ వచ్చాడు. 'రుద్రమ్మతో ఈ విషయాన్ని ఏమి చెప్పగాకు శాంతపటేలా. ఒక వేళ ఆమె చెవిలో ఈ విషయం పడుంటే.... అటువంటిదేమీ జరగలేదని, ఏదైనా జరిగియుంటే సరిచేస్తానని

చెప్పు. ఈ సారి చెన్నడు వస్తే గట్టిగానే బుద్ధివాదాన్ని నేను చెపుతాను...' అన్నాడు సూగప్ప తాత. శాంతగౌడ 'హుం' అంటూ నడిచాడు. దురుగ వెంబడించసాగాడు. బయట ప్రాంగణంలో కుక్క కాలును విరగగొట్టించుకొన్నందున పడియుంది దీనంగా.

శాంతగౌడ ముందు ముందు, దురుగ వెనకెనుక నడవసాగారు. పొగమంచు అలాగనే ఉంది. ఊరును దాటారు. పల్లెనూ దాటారు. మొన్న మొన్నటి వరకూ వాళ్ళు ఆ విధంగా వెళ్ళే దానిని చూసేదే ఒక సంభ్రమంగా ఉంటదని ఊరు – పల్లెలోని జనం అనుకొనేవాళ్ళు. అయితే ఈ రోజు ఈ జనం ఎలాగెలాగో చూస్తున్నారని శాంతగౌడకు అన్పించింది. తెల్లటి చొక్కా, తెల్లటి పంచె, భుజాలమీద పట్టు ఉత్తరీయం వేసుకొని పలచగా, తెల్లగా ఉన్న శాంతగౌడ ముందుకు ముందుకే కాలును ఎగరేస్తూ నడిచినా అలిసిపోనట్లుగా నడుస్తున్నాడు. వెనుకనే దురుగడు రపరఫా పరిగెత్తుకొంటూ అనుసరిస్తున్నాడు. వాళ్ళు వెళ్తుంది చుట్టుప్రక్కల పొలాలలో ఉన్నోళ్ళకు గుర్తైందిలే. శాంతగౌడ బిగ్గరగా ఏదేదో సంగతుల్ని చెప్తూ నడుస్తుంటే, దురుగడు చెపుతున్న దానికంతా 'ఔనప్పా ఔనౌను... నీ మాటలు కరక్టే... నీ మాటలను తీసేసేందుకు వీలేలేదు. పటేలా' అని వంతపలుకుతూ పరిగెడుతుంటే దార్లో పొలాలలో ఉన్న మందికి వినబడుతుండేవి. తుంగమ్మ నది ఒడ్డుకు వచ్చి చేరినా ఇద్దరి మధ్యా ఇప్పుడు 'హం లేదు.... హూం లేదు'. తుంగమ్మ గుడుగుడు శబ్దాలతో ప్రవహిస్తుంది. 'నదికి ప్రవాహం (వరద) వచ్చిందో ఏమో' అంటున్నాడు శాంతగౌడ. ఈ రోజు సూర్యుడి దర్శనమే లేదు. ఈ రోజే కాదు వారం నుంచి అలాగే ఉంది. చిన్న చిన్న తుప్పర ఈ రోజు లేదు. మబ్బులు ముసురుకొని చీకటిగా ఉంది. శాంతగౌడ ఠీవిగా నిలిచి చూడసాగాడు. ఆవలి ఒడ్డునున్న అక్కరుద్రమ్మ ఊరు ఈ రోజు కనబడుటలేదు. తుంగమ్మనది గుడుగుడు సప్పుడు వినబడుతుంది తప్పితే రాళ్ళు, బండలు, ముళ్ళపొదలు, నీళ్ళు ఇవేవి సరిగా కనబడుటలేదు. మెల్లగనే నిలిచియున్నాడు పటేల్. వెనక వస్తున్న దురుగ మెల్లగా చేరాడు పటేల్ చెంతకు.

తుంగమ్మ ఇక్కడ విచిత్ర రూపాన్ని పొందియుంది. ఒకటిన్నర మైలు వెడల్పుతో తనదేహాన్ని పరుచుకొంది. తనదేహం మొత్తంలో బండల్ని, రాళ్ళను, ముళ్ళ పొదల్ని నింపుకొని ఉంది. తుంగమ్మ ఈ విధంగా అవతారంతో ఉన్నందున ఇక్కడ సేతువు అనేది నిర్మించబడలేదు. కరెంటూ రాలేదు. ఇక్కడున్న తుంగమ్మకు ఏడు మైళ్ళ దిగువున వంతెన ఉంది. ఇందుచేత ఇక్కడున్న ఈ రెండు ఊర్లలో సంబంధ బాంధవ్యాలు వృద్ధికాలేదు. ఆ వైపు ఊరోళ్ళకు రాయచూరు పట్టణం వ్యవహారాలకు ఊరుగా ఉంటే, తుంగమ్మ నదికి ఈ ఒడ్డులో ఉన్న ఊరోళ్ళకు ఆదోని వ్యవహారాలకు ఊరుగా ఉంది. శాంతగౌడగారి



అక్క రుద్రమ్మను అదెలాగో ఆ వైపునున్న ఊరిలోని గణ్య వ్యక్తికి ఇచ్చి లగ్నం చేసారు. ఆమె పెళ్ళైనప్పుడు భయంకరమైన క్షామం ఉంది. ఈ సీమలో వాన అనేది లేదు. తుంగమ్మ క్షయరోగిణి లాగ సుస్తై నిలిచింది. ఊరు–పల్లెలోని జనం అతిథులుగా వెళ్లి ఆ వివాహంను ముగించి వచ్చిన మీదట ఇప్పటి వరకూ పుట్టింటిని చూడలేదు రుద్రమ్మ. అప్పుడప్పుడు దుర్గడే తుంగమ్మకు బిడ్డలాగ శాంతగౌడను భుజాలమీద ఎక్కించుకొని ఆ వైపుకు వెళ్ళి వస్తుండేవాడు. ఇప్పుడిప్పుడు ఆ ఊరిలో రుద్రమ్మకు జీతగాడైన మానిషయ్య ఆవైపు నుంచి శాంతగౌడకు కబురును అందించేందుకు తయారైయ్యాడు. అదికూడా దుర్గడే దారిని చూపి నేర్పించినందున. వీళ్ళిద్దరూ అదెంతగా తుంగమ్మను దాటినా అది వేసవి కాలంలోనే వెళ్ళి వస్తుండేవారు. ఆరాళ్ళలో, ఆ నుణుపైన బండలలో, ముళ్ళపొదలలో దారి తప్పిన పశువులూ వెళ్ళేందుకు వెనుకంజ వేసేవి. 'నేను దురుగడిలాగ ఉండుంటే ఎవరి సహాయం లేకున్నా అక్క ఊరికి వెళ్ళి వస్తుండేవాడ్ని కదా...!' అని శాంతగౌడ అనుకోసాగాడు. ఈ భావన శాంతగౌడకు ఈరోజు మాత్రమే వచ్చింది. శాంతగౌడ తుంగమ్మ ఒడ్డుమీద నిలిచి నిధానంగా కంటి చూపుల్ని ప్రసరించాడు. దురుగడు నిధానంగానే నిలిచియున్నాడు. ఇటువంటి గడియలు వాళ్ళ జీవితంలో ఎప్పుడూ రాలేదు... వస్తవని కూడా కలలను కనలేదు వారిద్దరూ.

'దురుగా' అన్నాడు శాంతగౌడ.

ఆ పుణ్య పిలుపుకు 'యప్పా' అన్నాడు దుర్గ.

'తుంగమ్మకు వరద వచ్చినట్లుంది కదా...'

దురుగ తుంగమ్మను చూసాడు. పొగమంచు వలన ఏవీ స్పష్టంగా కనబడుటలేదు. చెవుల్ని రిక్కించి విని 'వరద వచ్చియుంటే తొడల మట్టం వరకూ వచ్చియుండొచ్చు' అన్నాడు దురుగడు. శాంతగౌడ దురుగడ్ని దిట్టించి చూసాడు. వారం క్రితం ఉన్నట్లుగా దురుగ ఇప్పుడు లేదు. వడిలిపోయియున్నాడు. ఎర్రటి ఎరుపు తప్పిపోయి ముఖం నల్లబడియుంది. వృక్షంలోని మొదలు లాగ ఉండేటి అతడి దేహం కొట్టేసిన కొమ్మలాగ ఉంది ఇప్పుడు. ఎప్పుడూ శాంతగౌడ వెనకే ఉంటున్నందుచేత మంచి బట్టల్నే ధరించేటోడు. దురుగడు ఎంతో దృఢంగా అందంగా ఉండే మనిషి అని ఊరు – పల్లెకు గుర్తే.

'దురుగా నువ్వు మెత్తగా అయిపోయావు' అన్నాడు శాంతగౌడ.

'యప్పా, కొడుకు చేసిన నిర్వాహకానికి నేనేమి చేసేది? దేవుడు చేసిందానికి నేనేమి చేసేది? నేనేమైనా నీకు ఎప్పుడైనా ద్రోహాన్ని చేసానా..?' అన్నాడు దురుగ.

'నాకు విచిత్రంగానే ఉంది దురుగా... అప్పటి నీ కొడుకును గుర్తుకు తెచ్చుకొంటుంటే ముద్దు వస్తుంది.... ఇప్పుడు జ్ఞప్తికి తెచ్చుకొంటుంటే నా వంశ గౌరవానికి మసి పూసేందుకు నిలబడ్డాడు కదా.... దురుగా, మసిని పూసేందుకు...' అంటూ పళ్ళనూ కటకటా కొరికాడు శాంతగౌడ.

'యప్పా... నాకు, నీకు మొదటినుంచి సుమధుర సంబంధమే కదా! నువ్వున్నకాడ నేను, నేనున్నకాడ నవ్వు.... నాకు, నీకు కులం లేదు. జాతిలేదు.... అలాగునే నడుచుకొని వచ్చాం.... ఇప్పటి వరకు' అని మిన్నకుండిపోయాడు....

'వదిలేయి ఆ పూర్వపు విచారాన్ని! తుంగమ్మను దాటేది అవుతదా.... లేదా చూడు...'

దురుగడికి ఇప్పటి వరదకన్నా మూడు రెట్లు అధికంగా నీరు వచ్చినప్పుడు శాంతగౌడను మోసుకొని నదిని దాటించిన అనుభవం గుర్తుకొచ్చి, 'నా హృదయంలో జీవం ఉన్నంత వరకూ, నదిని దాటుతాను...రా పటేలా' అంటూ ఆంజనేయుడులాగ కూర్చున్నాడు. శాంతగౌడ పంచను ఎగ్రదోపుకొనీ దుర్గడి వీపు వెనుకకు కాళ్ళను తాపించి, భుజాలమీద కూర్చుని కుడి ఎడమల ప్రక్కన కాళ్ళను వేళ్ళాడదీసి, దురుగడి తలను పట్టుకొని కూర్చున్నాడు. ఆజానుబాహుడైన తన భుజాలమీద ఆరామంగా గౌడ కూర్చున్నదాన్ని గమనించి, దురుగలేచి నిలబడి తుంగమ్మ ఒడికి దిగాడు. ఎందుకో శాంతగౌడ ఈరోజు అధైర్యంగా ఉన్నాడు. సవారి సాగుతుంది. ఇలాగున సాగేదాన్ని తుంగమ్మ అదెన్నిసార్లు చూచిందో కదా. ఈరోజు దురుగడి అడుగులు సక్రమంగా పడుతున్నవని శాంతగౌడకు అన్పించలేదు. ధైర్యంతో బిగుసుకొని కూర్చున్నాడు. అయినా భయం మొదలైంది అతనిలో. దురుగ తనకు గుర్తైన కాలిబాటలోనే అడుగుల్ని వేసుకొంటూ సాగుతున్నాడు. గుండ్లను, నుణుపైన బండ్లను, సందులను, ముళ్ళపొదల్ని దాటుతూ, నీటిలోపల సుడులు వస్తే కాళ్ళను సవరిస్తూ అన్ని అడ్డంకుల్ని దాటుతూ నడవసాగాడు. వాన మొదలైంది. పొగమంచు కరిగినట్లుగా కనబడింది. దుర్గడు ముందుకు చూస్తూ దాటేటప్పుడు దాటి, ఎగిరేటప్పుడు మెల్లగా ఎగిరి, సుడులను చూసి ఎచ్చరికతో సర్దుకొని ఒక్కొక్కసారి పెద్దపెద్ద గుండుల నడుమ నడిచేటప్పుడు చేతి ఆసరాకని గుండులమీద చేతుల్ని ఆనించి వెళ్ళసాగాడు.

ఇలాగున సాగిపోయేదంటే వాళ్ళిద్దరికీ భలే సంతోషం. ఊరు – పల్లెలోని సుద్దులు, వాన–పంటల సుద్దులు, రుద్రమ్మ పేరు ప్రఖ్యాతులు, చెన్నడి పెరుగుదల (విద్యా విషయంలోని) సుద్ది ..... ఇంకా ఏమేమో తమకు తెలిసిన వాట్ని విడమర్చి



మాట్లాడుకొంటూ సాగుతుంటే, తుంగమ్మను ఎంతో ప్రయాసంతో దాటినదాన్ని గుర్తే అయ్యేది లేదు వాళ్ళిద్దరిలో. అయితే ఈ రోజు మాటలు లేవు. కతలు లేవు. దురుగ దార్ని పట్టుకొని మెల్లగా వెళ్తున్నాడు. అతనెప్పుడూ దార్ని వెతికేవాడుకాదు. ఈ రోజున దార్ని వెతుకుతున్నాడు. తుంగమ్మ నది మధ్యలో అలుపొచ్చి పటేల్‌ను ఒక పెద్ద బండమీద కూర్చోబెట్టాడు. అలుపు తీర్చుకొని మరలా పటేల్‌ను కూర్చోబెట్టుకొని లేచాడు సాక్షాత్ మారుతిలాగ. అవతలి తీరం వచ్చేలోపు మరొకసారి దించాడు. శాంతగౌడకు ఏమేమోలాగ అన్పించింది. లోలోపలే కృద్ధుడైయ్యాడు. తెల్లజొన్నల్ని రాసిగా చేసిన తరువాయి ఆషాడ – శ్రావణంలోని వర్షాలు వచ్చేవరకూ తుంగమ్మను ఈ ఇరువురు దాటుతుండేవాళ్ళు వెనక కాలంలో. ఇప్పుడు వర్ష ఋతువు గడిచినా తుంగమ్మ ఉధృతంగానే ప్రవహిస్తుంది. జీడిమణ్ణు, గుండెల వరకూ నీళ్ళున్నా ఇంతకష్టంలో కూడా దురుగడు నాలుగైదుసార్లు జీవానికి అపాయం ఎదురైనా శ్రద్ధతో తనని దాటించినందుకు దురుగడిమీద పటేల్‌కు అభిమానం ఉప్పొంగింది.

చివరికి దురుగడు శాంతగౌడను మోసుకొని నది ఒడ్డున దించాడు సుభద్రంగా. ఆయాసం అన్పించి కూర్చొన్నాడు. శాంతగౌడ పంచెను సరిచేసుకొని, నువ్వు ఆయాసాన్ని తీర్చుకొని నిధానంగా రా అంటూ వెళ్ళాడు. మునుపెన్నడూ ఈ విధంగా అనలేదు. అయినా దురుగడు వస్తున్నా పటేలా అంటూ లేచి నడవసాగాడు. శాంతగౌడకు పుట్టుకతోనే ఒక కాలు సన్నగా ఉండటంచేత కాలును లాక్కొంటూ పట్టి పట్టి నడిచేటోడు. ఈరోజు అక్క ఊరుకు చేరుకొంటున్నప్పుడు ఠీవిగానే రొమ్మును విరగదీసుకొంటూ నడవసాగాడు. దార్లో ఎదురైనోళ్ళు 'దొరసాని తమ్ముడు' అని సలాములను చేయసాగారు. ఊరు నడుమ రుద్రమ్మ ఇల్లు. అది నాలుగు దిక్కుల నుంచి కనబడుతుంది. రుద్రమ్మ పెళ్ళైన క్రొత్తలో తన భవనంలోని మేడమీద నిలిచి పుట్టిన ఊరును చూస్తుండేది. శాంతగౌడ తనను మాట్లాడించి వెళ్ళేటప్పుడు ఆమె చూసే విధానాన్ని చూసి శాంతగౌడ, దుర్గడు ఉప్పొంగిపోయేవారు. అటువంటి పెద్ద మహల్‌లోని అక్కకు చెందిన ప్రాంగణంలోపలికి కాలు పెట్టాడు. నాలుగు రోజుల తుప్పర తుప్పర వానకు దేవిడి అంతా చిత్తడిగా ఉంది. దేవిడిలోని అరుగులమీద కూర్చొన్నోళ్ళు లేచి శాంతగౌడకు నమస్కరించారు. దురుగ అక్కడ చేరిన కొంతమందితో మాట్లాడసాగాడు. దేవిడిలో తన వృక్షాల నుంచి చేయించిన బండి కనబడింది. ఈరోజు ఎందుకో దానిమీద చేతిని పెట్టి సవరిస్తూ 'ఇక ముందు చూచేది లేదు నిన్ను' అని అనుకొంటూ శాంతగౌడ వెనుకనే వెళ్ళాడు. రుద్రమ్మదేవి 24 జతల ఎద్దుల కొట్టం ప్రక్కనున్న 'ఆహుతులగది' వద్ద చుట్టుప్రక్కల ఊర్లలోని పదహారు

మంది గణనాయకులు ఆమెకు కుడి, ఎడమల ప్రక్కన దిగువునున్న కుర్చీలలో ఆసీనులైయున్నారు. శాంతగౌడ వెళ్ళి అక్క చెంతనే కూర్చున్నాడు.

అక్కడున్నోళ్ళ నడుమ శాంతగౌడకు కుశల ప్రశ్నలు, సంభాషణలు నడిచినవి. దుర్గడు గది ముందున్న అరుగుమీద కూర్చున్నాడు. రుద్రమ్మ తననే చూస్తున్నట్లు అన్పించింది. తలను క్రిందకు వాల్చుకొన్నాడు. దురుగ రుద్రమ్మను చిన్నపాపగా ఉన్నప్పట్నుంచి చూసినోడు. ఈమె మెట్టిన ఇంటికి చేరినప్పటినుంచి చూస్తూ వచ్చినోడు. 'కళ్ళను మూసి కళ్ళను తెరిచేలోపలే రుద్రమ్మ పెరిగి పెద్దదైంది' అని అనుకొంటుండేవాడు. ఆమె ఈ ఇంట్లోకి అడుగు పెట్టిన తర్వాత ఒకరి వెనుక ఇంకొకరుగా ఆరేడు సంవత్సరాలలో నలుగురికి జన్మనిచ్చింది. ఇద్దరు మగ, ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరి కూతుళ్ళ వివాహాలు ఒకేసారి అయినవి. మూడు సంవత్సరాల క్రితం పెద్ద కొడుకుకు వివాహం జరిగి అతను విస్తారమైన సొంతజమీను వ్యవసాయ పనుల్నే నిభాయించుకోసాగాడు. ఆఖరోడైన కొడుకు రాయచూరులో చదువుతున్నాడు. అతనికి (శాంతగౌడ కూతుర్ని) మేనకోడలితో వివాహంను చేయాలనేది రుద్రమ్మలో ఉండేది. అందుచేతనే హంపమ్మ చనిపోగా, చిన్నతనం నుంచి తన సంతానం జతగానే చదువుకొనేందుకు రుద్రమ్మ మేనకోడలైన అక్కమ్మను తన జవాబ్దారిలోనే ఉంచుకొని పెంచసాగింది. రుద్రమ్మ పెనిమిటి (మొగుడు) ఆరేడు సంవత్సరాల క్రితం లింగైక్యమైయ్యాడు. భర్త గతించిన పిమ్మట రుద్రమ్మే దొడ్డతనాన్ని తన చేతులలోకి తీసుకొని ఆ బాధ్యతల్ని నిర్వహించేందుకు నడుం కట్టింది. మూడు నాలుగు సంవత్సరాలు తిరిగే లోపలే చుట్టుప్రక్కల ఊళ్ళకు ఆమె పేరు, ప్రఖ్యాతులు పాకినవి. అదెలాగో ఏమో బతికి చెడిన గ్రామ రైతులు ఆమె దివాణంలో సహాయం కోసం అర్రులు సాచేవాళ్ళు. జగడాలు, లూటీలు, హత్యలు, బలవంతపు వసూళ్ళు, మొగుడు – పెళ్ళాల విచ్ఛేదన పోట్లాటలు ఇక్కడే రుద్రమ్మ దేవిడీలోనే పరిహారమైయ్యేవి. ఎక్కువ తక్కువగా చుట్టుప్రక్కల ఊళ్ళలోని వ్యవహారాలన్ని ఈమె అంగీకారాన్ని అడిగే నడిచేవి. ఇప్పుడు రుద్రమ్మ బయటకు కాలు పెట్టక పోయినా ఆమె 'హుం' అని ఒప్పుదలను ఇవ్వకపోతే ఒక పెళ్ళీ నడిచేది లేదు కదా! ఆ సీమలోని సరిహద్దులలో ఒక పిచుక 'చింవ్' అనేది చేయాలంటే 'దొరసాని అనుమతి కావాల్సిందే' అని జనం అనుకొనేవారు. 'నించో' అని అంటే గుడుగుడుగా ప్రవహించే తుంగమ్మ నిల్చిపోవాల్సిందే. ఇంత వర్చస్సు ఆమెకుంది ఇప్పుడు. శాంతగౌడ వచ్చి కూర్చున్న మీదట రుద్రమ్మ మాట్లాడలేదు. మహల్ అనే మహల్ నిశ్శబ్దమైంది. అప్పుడు అతిథులు ఒకరొకరే



లేచి రుద్రమ్మకు వంగి వంగి నమస్కరిస్తూ వెళ్ళిపోయారు. దురుగడికి భయమేసింది. 'దురుగా' అని కేక పెట్టింది రుద్రమ్మ.

'యమ్మో..... యవ్వా.... (అమ్మో.... తల్లో) అన్నాడు, అరుగునుంచి క్రిందకు పడి.

'భేషుగా ఉన్నావా? ఎందుకు మెత్తబడినట్లుగా కనబడుతున్నావు?'

'లేదు తల్లి, భేషుగానే ఉన్నాను... నీ నీడలో.....' అంటూ నించొన్నచోటే వణకసాగాడు.

'నువ్వు మా వాడివి.... చల్లగా ఉండు....చచ్చేవరకూ భేషుగానే ఉండు... ఏమంటావు?' అంటూ లేచింది. శాంతగౌడ కూడా లేచి నిలబడ్డాడు. ఆమె తమ్ముడ్ని మేడ మీదకు తీసుకొని వెళ్ళింది. అక్కడ రుద్రమ్మకు హితైషి అయిన నాగమ్మ కూర్చుని ఉంది. ఈ సీమలో ఆమె 'శరణి నాగమ్మ' అనే పిలుచుకోబడేది జనం నుంచి. రుద్రమ్మలో వర్చస్సు పెరిగినమీదట ఆమె ఇక్కడకు వచ్చి రుద్రమ్మ ఆప్త మండలిలో పరమాప్తురాలిగా గుర్తించుకొంది. రుద్రమ్మ శరణి నాగమ్మ ఆనతితోనే మసలుకొనేది. శాంతగౌడ నాగమ్మ పాదాలకు సాష్టాంగ నమస్కారాన్ని చేసాడు. 'శాంతప్పా, దురుగడు బతుక్కొని మన దగ్గరే ఉండనీ... అతనికి కష్టాన్ని కలిగించేది వద్దు.... చెన్నడికి నేనే కబురును రవాణా చేస్తాను... మా తంటకు రావద్దు.... అవసరమైతే నువ్వు కోరుకొనే మీ జాతి స్త్రీని తెచ్చి నేనే వివాహాన్ని నా స్వంత ఖర్చులతోనే నడిపిస్తాను.... ఎందుకంటే నువ్వు మా దురుగడి కుమారుడివి కదా.... అందుకనే చెపుతున్నా' అని చెప్పి పంపాను కబురును. దాని కతను 'మీరెవరు.... నా పెండ్లిని చేసేందుకు? అక్కమ్మే నన్ను వివాహమాడుతానని అంటుంది కదా.... ఆమెతోనే నా పెండ్లిని జరిపించండి పెద్దలుగా వచ్చి' అని అంటున్నాడట. 'శాంతప్పా...విషయం నలుగురినోళ్ళలో పడేది వద్దు....! పాపం అక్కమ్మ యుక్తాయుక్తాన్ని మరచి ఏదో మనస్సును ఇచ్చింది అతడికి! ఆమెకేమి తెలుస్తది? మన మర్యాద వంశ గౌరవాన్ని మనమే కాపాడుకోవాలి... చూడు దీన్ని సాగదీసేది నాకు ఇష్టంకాదు. ఈ వారంలో అతను ఊరికి వస్తాడట. వచ్చేదాన్ని గమనించి నాకు కబురును ముట్టచెప్పు.... చెన్నడ్ని నరికి, సన్నగా తుణకలు తుణుకులుగా కత్తిరించి తుంగమ్మలో చల్లించివేస్తాను! ఏమంటావు? ఆ తర్వాత జల్దీగా (శీఘ్రంగా) అక్కమ్మను ఈ ఇంటికి కోడలిగా చేసుకొంటాను. నువ్వు ఈరోజే ఊరికి తిరిగి వెళ్ళు. చెన్నడు వస్తే నాకు సమాచారాన్ని తెలుపు' అంటూ రుద్రమ్మ లేచింది. శాంతగౌడకు భయంకరమైన భయంలో కూడా అక్క పటేల్ తనానికి ఉప్పొంగాడు. వంటినిండా గట్టిగా శ్వాసను తీసుకొన్నాడు.

దీన్ని విన్న నాగమ్మ బెదిరి, 'రుద్రమ్మా.... తొందరపడేది వద్దు తల్లి!' అంది.

'అమ్మా, నాగమ్మా.... నా ముఖానికి మసి పూసే మగాడు ఉండకూడదు నేను బతికున్నంతవరకూ.....! చెన్నడు మాదిగ.... మేము అగ్రవర్ణస్తులం.... తరతరాలుగా ఈ సీమకు దొరలం... అతడు విద్యావంతుడే కావొచ్చు.... అయితే మా కుల గౌరవం గతేంటి?' అని సహజంగా అంది. మరలా వారిరువురిలో మాటలు పెరగలేదు.

కొంచం సమయం గడిచిన మీదట రుద్రమ్మ 'శాంతప్పా, నువ్వు ఊరికి వెళ్ళు..... వెళ్ళే ముందు అక్కమ్మను మాట్లాడించి వెళ్ళు' అని అంది. శాంతగౌడ కూతురు (అక్కమహాదేవి) వాడుకొనే గదికి వచ్చాడు.

'ఎప్పుడొచ్చావు నాయనా' అంటూ హుషారుతో అడిగింది. ఆమెకు తండ్రిని చూసి ఖుషి కలిగింది. శాంతగౌడ కళ్ళనిండా కూతుర్ని చూసాడు. కోమలంగా, తెల్లగా, ఎత్తుగా ఉన్న కూతుర్ని చూసి, భార్యను గుర్తుకు తెచ్చుకొంటూ, 'ఇప్పుడే వచ్చాను తల్లీ... భేషుగా ఉన్నావు కదా...' అంటూ శిరస్సు మీద చేతిని పెట్టాడు.

'నాయనా... నేనూ నీతోనే ఊరుకు వస్తాను... కూడి హోగాము (కల్సిపోదాము)' అంది గట్టి స్వరంతో అక్కమ్మ. 'దేనికి కొరతుంది ఈ ఇంట్లో... తల్లీ? నేనే వచ్చి కనబడి వెళ్తున్నాను కదా తల్లీ...'.

'నాకు ఈ ఇంటి సహవాసం వద్దు నాయనా! నేను మన ఇంట్లో నీతోనే ఉంటాను తండ్రీ....!'

శాంతగౌడకు చింతపట్టుకొంది. అక్కకొడుకుతో, అక్క మనుమ సంతానంతో అందరి జతగానే అక్కమ్మ రాయచూరులో చదువుకొంటుంది. రుద్రమ్మ 'అక్కమహాదేవిని' పిలుపించుకొని జిల్లా కేంద్రమైన రాయచూరులోని స్వంత ఇంట్లోనే ఉంచుకొని చదివిస్తుంది. తన భార్య హంపమ్మ స్వర్గస్తురాలైన తరువాయి కూతురు ఇక్కడే అక్క పర్యవేక్షణలోనే పెరుగుతుంది. అక్కమ్మ చదివే కాలేజిలో చెన్నడు పాఠాల్ని చెప్పేందుకు చేరుకొన్నపుడు వారిద్దరి నడుమ మాటలు నడిచి, ఇప్పుడు ఒకటైయ్యేందుకు సిద్ధమైయ్యారు. అక్కమ్మకు చెన్నడు దురుగడి కొడుకని ఇప్పుడిప్పుడే గుర్తైంది. రుద్రమ్మకు ఇది తెల్సిందే తడవుగా మేనకోడల్ని ఏమి అనకనే లోలోపలే బందోబస్తును చేసేందుకు యోచించింది. శాంతగౌడ మాత్రం దీన్నంతా విని మండిపోసాగాడు.

'నాయనా, నేను వస్తానని అంటున్నా... నీతో మాట్లాడేది ఉంది!' అంది అక్కమ్మ.

'వెళ్దాం అమ్మా... అయితే ఇప్పటికిప్పుడే బయల్దేరితే అక్క ఏమంటదో....! అందులోనూ వర్షం మరలా మొదలైయ్యేటట్లుగా కనబడుతుంది... నువ్వు బస్సును ఎక్కి



వద్దువుగాని. నేను ఈ రోజు వెళ్ళి రేపో ఎల్లుండో వస్తాను...! కల్సిపోదాం అప్పుడు' అన్నాడు శాంతగౌడ.

'నాయనా, నువ్వు వచ్చేదారినే కాస్తూ, ఎదురుచూస్తా... నువ్వు రాకపోతే.... నేనే వస్తాను మన ఊరికి' అంది అక్కమ్మ. శాంతగౌడ ఒప్పుకొంటూ 'భేషుగా ఉండుతల్లీ' అని అన్నాడు. మరలా కంటినిండా చూసి, 'వస్తాను తల్లీ' అంటూ వడివడిగా బయటకు నడిచాడు.

వసరాలో ఉన్న రుద్రమ్మ 'నేను చెప్పినట్లు చేయి' అని గుర్తుచేసింది.

'హుం' అంటూ బయట ప్రాంగణానికి వచ్చాడు. యథారీతిగా మబ్బులు ముసురుకొని మసకమసకగా ఉంది.

పొద్దు అస్తమించేందుకు ఇంకొకగంట ఉందని అన్పించగా 'దురుగా' అని కేక పెట్టాడు. అక్కడున్న నలుగురైదుగురు లేచి నిలిచారు. ఒకతను, 'పటేలా... ఇప్పుడు ఇక్కడే ఉన్నాడు. నాగమ్మ పిలిస్తే పైకి వెళ్ళాడు' అని బదులిచ్చాడు.

గడిబిడిలో యున్న శాంతగౌడ 'నేను మెల్లగా వెళ్తాను... అతనికి రమ్మని చెప్పండి తుంగమ్మ తీరంకు' అని చెప్పి కాలును లాగుకొంటూ నడవసాగాడు.

శాంతగౌడ ఎంతటివో విషయాలలో మునిగి తుంగమ్మ ఒడ్డుకు వచ్చి నిలిచాడు. ఇంకా రాలేదు దురుగ అని అనుకొంటూ చుట్టుప్రక్కల చూచాడు. ఆకాశం నల్లటి మేఘాల నుంచి కప్పినట్లైంది. పశ్చిమంలో సూర్యుడి అస్తమయం కనబడసాగింది. అయితే సూర్యుడు కనబడుటలేదు. అక్కడంతా, ఎర్రటి వర్ణం పులుముకొని ఉంది. 'దురుగుడు ఎందుకు రాలేదు? జల్దీగా వెళ్దామనుకొంటుంటే'.... అని అసహనం చెందసాగాడు. కోపంతో ఊగసాగాడు. దురుగ ఊరి దారి నుంచి పరిగెత్తుకొంటూ వస్తున్నాడు. శాంతగౌడ చూస్తుండగానే చెంతకు చేరాడు. దురుగకు ఊపిరి ఆగిపోయేంతగా దమ్ముపట్టినట్లైంది. అతడ్ని చూస్తే భయం కలగసాగింది. వచ్చినోడు మాటా పలుకూ లేకనే కూలబడియున్నాడు. దురుగ ధడాల్నే లేచి అడుగుల్ని వేస్తూ వడివడిగా పరిగెత్తేందుకు చూసాడు. శక్తి సరిపోవట్లేదు. అయినా పరిగెత్తేందుకు ప్రయత్నించాడు. 'మెల్లగారా.... దెయ్యం పట్టినట్లుగా చేస్తున్నావు కదా' అంటూ గదిరాడు శాంతగౌడ.

దురుగడు పాదాలకు కావును పెట్టినట్లుగా వడివడిగా తుంగమ్మలో దిగాడు. మాటలు లేవు. కతలూ లేవు. పైన వర్షం పడేటట్లుంది. వరద వచ్చిందని దుర్గడికి ఒక క్షణం అన్పించినా, అతడి కాళ్ళు అతని స్వాధీనంలో లేవు. 'మెల్లగా... మెల్లగారా... చెడగొట్టకురా'

అంటూ శాంతగౌడ గదిరాడు. దురుగడు రాళ్ళు, నుణుపైన బండల దారిలో సాగిపోతున్నాడు. దారిని సరిగా పట్టుకొన్నది అతనికి గుర్తేలేదు. పశ్చిమంలో నల్లటి మబ్బులకు సూర్యుడి ఎరుపు వర్ణం తగిలి ఆ మబ్బుల సంధులలో ఎఱ్ఱ ఎఱ్ఱగా వికారంగా కాంతులు రాసాగావి. దురుగ గుడుగుడు అంటున్న తుంగమ్మ ఒడిలో వెళ్తున్నా అతడి కాళ్ళు చెరోవైపుకు ఉన్నవి. శాంతగౌడ ఈ మార్పును గమనించి భయపడ్డాడు. గట్టి గొంతుతో 'రేయ్... దురుగా... మెల్లగా నడువురే...' అంటూ గట్టిగా దురుగడి తలను పట్టుకొన్నాడు. చుట్టుప్రక్కల చూసేందుకు దుర్గడికి అవటం లేదు. పద్దానేనే భావంతో శాంతగౌడకు గుండె వేగంగా కొట్టుకోసాగింది. దానివలన మరింతగా బిగుసుకుపోయి అతడి తలను బలంగా అప్పు(వాటేసు) కొన్నాడు. దురుగడ్ని ఏమని ఎచ్చరిస్తున్నా మాట్లాడటంలేదు. 'వెనక్కి తిరిగి వెళ్దాంరే' అని అరిచాడు. దురుగ మాత్రం ముందుకే అడుగుల్ని తొక్కుతున్నాడు. అతనికి తుంగమ్మ ఎఱ్ఱగా కనబడింది. ఎందుకని కొద్దిసేపు నడకను నిలిపి చూసాడు. సూర్యుడు అస్తమిస్తుండటంతో ఎఱ్ఱటి కిరణాలు రక్తం లాగ అద్దినట్లుగా తుంగమ్మలో ఉంది. తుంగమ్మ ఇప్పుడు సముద్రం లాగ కనబడింది. సముద్రంలో జ్వాలాముఖి ఏర్పడినట్లుగా ఆ చిత్రం కనబడింది శాంతగౌడకు. దురుగ దమ్మును నివారించేందుకు నిలిచినప్పుడు మరలా అక్క ఊరికే వాపస్సు అవుదామని చెపుదామనుకొన్నాడు శాంతగౌడ. అయితే దుర్గడు ధడాల్నే బండల సంధులలో దిగి కుడి కాలును వేసాడు. నీళ్ళు శాంతగౌడ కాళ్ళకు తగిలినవి. శాంతగౌడ కళ్ళకు కటికి చీకట్లు కమ్మినట్లుగా అన్పించింది. 'ఆగరా' అంటూ కాళ్ళను ఝాడించాడు. దుర్గడికి తూలువచ్చి, గట్టిగా నిలిచేందుకు ప్రయత్నాన్ని చేస్తూ, 'నా రొమ్ములో ఇంకా జీవం ఉంది యప్పో' అని అంటూ శాంతగౌడ కాళ్ళను భద్రంగా పట్టుకొని అడుగుల్ని వేయసాగాడు. వాళ్ళ తలల మీద ఎంథెంథో పక్షులు అరుస్తూ వాళ్ళ తలలను తన్నేందుకు వచ్చాయి. శాంతగౌడ ఆ పక్షుల బాధను సహించుకోలేక దురుగడి తలను అదుమసాగాడు. భయంతో వాటిని పారద్రోలేందుకని తన కాళ్ళతో (తనకు జ్ఞానమే లేనట్లుగా) దురుగడినే తన్నసాగాడు. అంతలో దురుగడికి శరణి నాగమ్మ జ్ఞాపకంకు వచ్చింది. తన కుమారుడి భద్రతమీద ఏమేమో చెపుతున్నట్లుగా వినిపించసాగావి. అతనికి ఏమిట్లోనూ జ్ఞానమే లేనట్లుగా బుద్ధిమాంద్యం కలిగి అడుగుల్ని లాక్కొని లాక్కొని వేస్తున్నాడు. దారితప్పింది! ఒక్కసారిగా నీరు రొమ్ముల మట్టంకు తాకినవి. 'దురుగా...' అంటూ గర్జించిన శాంతగౌడ అరుపు తుంగమ్మనది బారుకూ వెడల్పుకూ ఆవరించింది. 'వెనక్కి తిరగరా' అంటూ దురుగడి తలను పట్టుకొని కొట్టసాగాడు. దుర్గడి అడుగులు లయ తప్పి, అతను అశక్తుడై నీళ్ళలో పడ్డాడు. శాంతగౌడ పైనుంచి తత్తరపడి 'దఫ్' అనే శబ్దంతో నీళ్ళలో పడుతూ, 'దురుగా' అంటూ చావుకేకను పెట్టగా... 'యప్పో...' అంటూ దురుగ అన్నాడు. ~~ఒకరికేక ఇంకొకరికి విన్పించలేదు. వాళ్ళిద్దరూ ఒకరికొకరు త~~



ఇప్పుడేమో నీళ్ళ గుడుగుడు సప్పుడు... కాళ్ళుచేతులు కొట్టుకొంటున్నట్లుగా..

# పండుగలోని కానుక

వెంకటరమణ : కమలా... పార్శిల్ (వి.పి) వచ్చిందా?

కమల : వచ్చిందన్నా!

వెంకటరమణ : ఎంత మొత్తానికి?

కమల : ఇరవై మూడురూపాయలకి... అన్నా!

వెంకటరమణ : అలాగైతే నేను ఊహించినదానికన్నా రెండు రూపాయలకు తక్కువగానే ఉందికదా... పుస్తకం ఎక్కడ?

కమల : పుస్తకం ఎక్కడని అడిగితే పోస్టాఫీస్‌లోనే అన్నా....

వెంకటరమణ : అదేమిటమ్మా... వి.పి.(పార్శిల్)ను తీసుకోలేదా?

కమల : లేదన్నా....!

వెంకటరమణ : ఎందుకే? వి.పి (పార్శిల్) వస్తది; అది నా సివిల్ సర్వీస్ పరీక్షకు ఎంతో అవసరపడే పుస్తకం అని నాయనతో అనలేదా?

కమల : అన్నాను! నువ్వు చెపుతున్నదాన్నే!

వెంకటరమణ : వి.పి. ఎందుకు తీసుకోలేదు? పోస్ట్‌మ్యాన్ వచ్చినప్పుడు నాయన ఇంట్లో లేరా?

కమల : ఉన్నారు అన్నా....

వెంకటరమణ : అలాగైతే వి.పి.ని ఎందుకు తీసుకోలేదు? నాయన ఏమన్నారు? కారణం ఏమై ఉంటది?

కమల : నన్నడిగితే ఏమి ప్రయోజనం అన్నా...!

వెంకటరమణ : ఆ పుస్తకం(పార్శిల్) నాకు ఎంతో అవసరం అని నీకు తెలుసుకదా! నువ్వు అప్పుడు నాయనతో చెప్పలేదు అంతే! నా విషయంలో నీకు శ్రద్ధేలేదు.

కమల : నువ్వు ఉత్తిగనే కోపం చేసుగొంటే ఉపయోగం ఏముంటదన్నా... ఆడపిల్లను. నాకు ఇవన్నీ ఎలాగున గుర్తౌతవి?

వెంకటరమణ : అయ్యోపాపం... నువ్వు చంటిపిల్లవే కదా...! ఏమి తెలియని ముగ్ధరాలువే కదా...!! కాదు.. కాదులే!!! వారానికి రెండుసార్లు భర్తకు (భావకు) ఉత్తరాల్ని వ్రాసేది మాత్రం గుర్తు!!!! నీ మొగుడ్నుంచి ఉత్తరం రానీ... నేను ఈ సారి చించి చదువుతానులే.

కమల : అలా చేస్తే నాయనవద్ద నీ మీద ఫిర్యాదు చేస్తా...

వెంకటరమణ : సరి... సరి! ఎందుకు వి.పి. (పార్శిల్) ను తీసుకోలేదో చెప్పు?

కమల : ఎందుకంటే? ఎందుకంటే?... ఉత్తిగనే నా మీద ఎందుకు గుర్రుగా చూస్తావు? విషయం నీకు తెల్వదా...! నాయన వద్ద డబ్బు లేదు.

వెంకటరమణ : ఈ వి.పి. (పార్శిల్) గురించి ఎనిమిదిరోజుల ముందే నాయనకు చెప్పాను కదా! బొంబాయికి లెటర్ రాసే ముందే విషయాన్ని సవివరంగా తెల్పాను. అలాగే కానీయ్, డబ్బును సిద్ధం చేస్తానని నాయన చెప్పిన మీదటే నేను ఆ పుస్తకాన్ని పార్శిల్ మూలంగా పోస్ట్‌లో పంపమని పబ్లిషర్‌కు వ్రాసాను. ఇప్పుడు డబ్బు లేదంటే నేనేమి చేయాలి? నాకు ఆ పుస్తకం అత్యవసరంగా కావాల్సి ఉంది. రేపైనా వి.పి.ని (పార్శిల్‌ను) తీసుకోవచ్చేమో?

కమల : రేపు గౌరీవ్రతం. సెలవు ఉంటదేమో పోస్టాఫీసుకు?

వెంకటరమణ : రేపు పోస్టాఫీసుకు సెలవు లేదు. అది సెంట్రల్ గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్ కదా...!

కమల : రేపైనా నాయన చేతిలో డబ్బు ఉంటదని నాకైతే కనబడదేది లేదులే.

వెంకటరమణ : నా నుదుటిరాతే అంతేనేమో! నాచదువులోని ప్రగతికి ఏదో ఒక తొందరను భగవంతుడు కల్పిస్తున్నాడు కదా! నాయన పడుతున్న కష్టాల్ని ప్రతిరోజూ కళ్ళారా చూస్తున్నా... ఎలాగున నేను ఇప్పుడు డబ్బుకోసమని నాయన వద్ద అడిగేది...! ఈసారి నేను పాసైతే, ఆ తర్వాత మన ఇంట్లో ఎవరికీ ఏ కష్టాలు ఉండవులే. నేను ఉద్యోగంలో చేరి చేతినిండా జీతాన్ని తెస్తాను. భగవంతుడు కరుణను చూపించొచ్చులే!



కమల : నువ్వు కష్టపడి చదువుతుంది మా అందరికీ గుర్తే అన్నా! అమ్మ, నాయన... ఇద్దరూ నువ్వే తమ పెన్నిధి అని భావిస్తున్నారులే. ఇప్పటిదాకా అనేక కష్టాల్ని ఓర్చుకొని నీ చదువుకు తోడ్పడ్డారు కదా!పోయిన సంవత్సం నీ బి.ఏ. ఫైనల్ పరీక్ష ఫీజుకని అమ్మ తనకున్న రెండు బంగారుగాజుల్ని అమ్మి నీకు డబ్బును ఒనగూర్చిందికదా! అప్పుడు పొరుగింటి కోమలమ్మగారు 'అయ్యయ్యో... గాజుల్ని ఎందుకు అమ్మారు?' అని అమ్మను అడిగితే "నాకేమి తక్కువైందమ్మా ఇప్పుడు? నా కొడుకు బి.ఎ. పాసవ్వనీ..., పది జతల గాజుల్ని కొంటాడులే" అని సమాధానంగా చెప్పింది కదా...! మూడునాలుగు రోజులు ఓపిక పడితే నాయన ఎక్కడో ఒక చోటినుంచి డబ్బును త్రెచ్చి నీకు అప్పగిస్తాడులే. నువ్విప్పుడు తలను వేడెక్కించుగోకు. నువ్వు సివిల్ సర్వీస్ (ఐ.సి.ఎస్) పరీక్షను పాసు అవ్వాలనే అమ్మ – నాయనలలో ఆలోచనగా ఉంది కదా... మా అందరికీ నీమీదే ఆశకదా...!

వెంకటరమణ : బజారునుంచి ఏమైనా సరుకులు తీసుకురావాలా? నాయన ఎక్కడ?

కమల : నాయన బట్టల దుకాణంకు వెళ్ళారన్నా... ఈసారి గౌరి వ్రతానికి చీరను కొనుక్కోమని అమ్మ పుట్టింటినుంచి ఇరవై ఐదు రూపాయలు వచ్చినవి. నాయన ఆడబ్బును అమ్మకు ఇస్తానని అన్నారు. ఆ డబ్బునుంచి అమ్మ ఒక ధర్మవరం చీరను కొని రేపటి గౌరీవ్రత సామూహిక పూజకు కట్టుకొని వెళ్ళాలను కొంటుంది. ఒక ధర్మవరం చీరను కట్టుకోవాలని నాల్గైదు సంవత్సరాల్నించి అమ్మ ఆశె పడుతుంది. ఒక నెలక్రితం అమ్మమ్మ – తాతయ్యగార్లు వచ్చినప్పుడు తన మదిలోని కోరికను వెల్లడించింది. ఆమె కోరినట్లుగానే తాతగారినుంచి డబ్బు వచ్చింది. నాయన చీరను కొనేందుకని బట్టల దుకాణంకు వెళ్ళారులే.

వెంకటరమణ : వెళ్తున్నా బయటకు. బజార్నుంచి ఏమైనా సరుకుల్ని తేవాలా?

కమల : ఔనన్నా.... సరుకులు ఉన్నవిలే. పూలు మాత్రం తీసుకురావాల్సి ఉంది. ఇదిగో రెండు అణాలు.

వెంకటరమణ : రెండు అణాలకు ఎన్ని పూలు వస్తవి? నీ గౌరిపూజకు, మేము చేయబోయే ఉపకర్మ పూజకు, ముత్తైదువులకు ఇవ్వటానికి, ఇంకా నీ బారు జడకు ఎన్నో పూలు కావాల్సి ఉంటవి. ఈ పండగ హడాహుడిలో రెండు అణాలకు ఎన్నిపూలు వస్తవి చెల్లి?

కమల : ఎలాగోలా పూజకు సరిపోయేంతగా పెద్దమార్కెట్‌లో రెండు అణాలకు ఎన్నిపూలు వస్తవో అన్నే తీసుకురా...ఇదిగో అన్నా, మరొక నాలుగు అణాలను (పావలాను) తీసుకొని చామంతి పూలు, కనకాంబరాలు, కలువపూలను వేరేగా తీసుకొనిరా...

వెంకటరమణ : నా డబ్బు నీ వద్ద ఉంది కదా! దాన్నుంచి ఒక అణా వేరేగా ఇవ్వు.

కమల : ఎందుకు? ఎందుకు అన్నా... నువ్వు డబ్బును దుందువెచ్చంగా ఖర్చు చేస్తున్నావు? ఎందుకో చెప్పు? బి.ఎ పాసైనా నీకు డబ్బు విలువ తెలిసేది లేనట్లుగా ఉంది.

వెంకటరమణ : పద్నాలుగు సంవత్సరాల నా చిట్టి చెల్లి కమలకు డబ్బు విలువ బాగా తెలుసు. ఇరవై సంవత్సరాల గ్రాడ్యుయేట్ అయిన నాకు డబ్బు విలువ ఏమీ తెల్వదు. ఆహా! నీకు సరైన లోభి మొగుడే దొరికాడులే చెల్లీ! నా డబ్బు నాకు ఇవ్వమని నేనడిగితే ఏదో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ చెప్పినట్లుగా ఉపన్యాసంను ఇస్తున్నావు కదా!

కమల : డబ్బు కావాలనుకొంటే తీసుకొని వెళ్ళు! మధ్యలో మీ బావగార్ని ఏమి అనకండి! ఒక అణా ఇప్పుడు తీసుకో! అది సరే... దేనికి ఆ డబ్బు?

వెంకటరమణ : మహిళలకు అన్నీ తెల్సుకోవాలనే చపలం ఎల్లప్పుడూ ఉంటదిలే. అమ్మకు మొగలిపూలను తేవాలని అనుకొంటున్నానులే!



కమల : అలాగైతే నా డబ్బు నుంచే కొనుక్కొని రా.. మంచి ఘుమఘుమల వాసనతో ఉన్న రెండు గుత్తుల మొగలి రేకుల్ని ఖరీదించుకొని రా అన్నా.

వెంకటరమణ : వద్దు... వద్దు... నీ డబ్బు. నా డబ్బులతోనే తీసుకొద్దామని అనుకొంటున్నానులే. నేను బజారుకు వెళ్ళి త్వరగానే వాపస్తై వస్తా చెల్లి...!

కమల : అన్నా... అన్నా...

వెంకటరమణ : (తిరిగివచ్చి) ఏమిటి?

కమల : నీ ఎమౌంట్ నా వద్ద ఇక ఒక రూపాయి ఐదు అణాలు మాత్రమే ఉంది. లెక్కను జాగ్రత్తగా మదిలో జ్ఞాపకంగా పెట్టుకో..!

అలాగున మధ్యగదిలో సంభాషించుకొంటున్న అన్నా చెల్లెలి మాటలన్నీ, లోన కూర్చుని రేపటి రోజున జరగబోయే గౌరిపూజకు సన్నాహాల్ని చేసుకొంటున్న లక్ష్మీదేవమ్మకు ప్రతియొక మాట బాగానే వినిపిస్తుంది.

కొద్దిసేపైన మీదట వెంకట సుబ్బశాస్త్రి, నాల్గైదు చీరల్ని పట్టుకొని ఇంట్లోకి వచ్చారు. శాస్త్రి తన ప్రియసతిని పిలుస్తూ "రావోయ్... ఇక్కడికి. ధర్మవరం చీరలను తెచ్చానోయ్! నీకు ఏది నచ్చుతదో తీసుకో" అని అన్నాడు. కమల పరిగెత్తుకొని వచ్చి అన్ని చీరెలను చూసి "అమ్మా... ఈ రంగుచీర ఎంతో బాగుందే! నేతపని కూడా చిక్కగా ఉందే!! దీన్నే తీసుకో" అంది జోరుగా.

లక్ష్మీదేవమ్మ : ప్రస్తుతానికి నాకు చీర ఇప్పుడు వద్దులే!
ఆ తండ్రి కూతురు ఇద్దరూ ఆమె జవాబునుంచి అవాక్కైయ్యారు.

కమల : ఇదేంటమ్మా ... ఇలాగున అంటున్నావు. ఎన్నో నెలలనుంచి ఆశపడి ఆశపడి కోరుకున్న చీరను చూసిన తక్షణమే వద్దంటున్నావు కదా! రేపు గౌరీదేవి పండుగ. కూతురు కొత్త చీరను కట్టుకోవాలని... తాతగారు డబ్బును పంపారు కదా! నువ్వూ ఒప్పుకొన్నావు. ఇప్పుడు చూస్తే నీ మాటలు అర్థం గావట్లేదు. సలక్షణంగా క్రొత్త ధర్మవరం చీరను కట్టుకొని రేపు సామూహిక గౌరి వ్రతానికి వెళ్ళమ్మా. ఇప్పుడు నిరాకరించకమ్మా.

లక్ష్మీదేవమ్మ : ఇప్పుడు నాకు చీర వద్దులే. బతికుంటే వచ్చే సంవత్సరం ఆ గౌరమ్మ తల్లి దయనుంచి నాకు కోరుకొన్న చీర దక్కుతదిలే పుత్రి. ఈ సంవత్సరం నాకు నా పుట్టింటోళ్ళు కానుకగా పంపిన డబ్బు ఏదో నా ఒక అక్కరకు వస్తది. కచ్చితంగా ధర్మవరం చీర ప్రస్తుతానికి వద్దే వద్దు. త్రెచ్చిన చీరలన్నిట్నీ బట్టల దుకాణంకు వాపస్సుగా ఇచ్చి రండి.

శాస్త్రి : ఇలాగెందుకోయ్... వ్యతిరేకంగా అంటున్నావు?

లక్ష్మీదేవమ్మ : నాకు ఇప్పుడు చీర వద్దని అంటున్నాను కదా....!

శాస్త్రి : ఏదో నిగూఢమైన కారణం నీ మదిలో ఉందిలే! నువ్వు ధర్మవరం చీరను కట్టుకోవాలని ఎన్నో నెలలనుంచి అంటున్నావు కదా..!

లక్ష్మీదేవమ్మ : ఔనండి... నిరాకరించినందుకు కారణం ఉందిలే. రేపు చెపుతాను. ఇప్పుడు నన్ను బలవంతం చేయకండి... అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

శాస్త్రి చిన్నబోయిన మోముతో బట్టల దుకాణంకు మరలా తిరిగి వెళ్ళి చీరలన్నిట్నీ వాపస్సుగా ఇచ్చి ఇంటికి చేరాడు.

మరుసటిరోజున పండుగ హడాహుడి. శాస్త్రి ఇంట్లో రెండు పండుగలు. సామశాఖాధ్యాయి అయినందున ఉపకర్మ చేసేదుంది. మహిళలకేమో గౌరివ్రతం. ఒకొక సంవత్సరం మూడు పండుగలు ఒకే రోజున వచ్చేదుంది... సామగోపాకర్మ... గౌరిపూజ... గణపతి పూజ. ఈ సంవత్సరం గణపతి పూజ వేరేగా వచ్చేదుంది.

ఆ తండ్రి కొడుకులిద్దరూ స్నాన సంధ్యావందనంలను చేసుకోవాలని పెద్ద చెఱువు వద్దకు వెళ్ళారు. కమల అలంకారం చేసుకొని పురోహితుడైన రంగయ్యభట్టు అర్ధాంగి జతగా గౌరి పూజకని సంభ్రమంతో బయటకు వెళ్ళింది. లక్ష్మీదేవమ్మ పండుగకని అన్ని వంటల్ని ముగించి, చివరిగా బొబ్బట్లను అద్దుతూ కూర్చొనియుంది. 11 గంటలైంది. వీధి ద్వారం వద్ద ఎవరో పిలిచినట్లైంది.

"తల్లీ... మాతా... జననీ"

లక్ష్మీదేవమ్మ : ఎవరయ్యా అది?



"నేనే తల్లి... ఊరికి చెందని తళవార్ (కాపలాదారుడు) బోరయ్యను. తలుపు నెట్టుకొని వచ్చాను తల్లి"

లక్ష్మీదేవమ్మ తలుపును విశాలంగా తెరిచి అతను త్రెచ్చిన అడవిపూలను పూజాగదికి తీసుకొని వెళ్ళి ఆ కాపలాదారుడికి ఒక కొబ్బరికాయను, ఆకువక్కల్ని ఇచ్చి 'వెళ్ళిరా' అని మనసారా దీవించి పంపింది. అంత ప్రొద్దుకు సరిగా పోస్ట్‌మ్యాన్ జవరయ్య వి.పి.ని తెచ్చాడు. లక్ష్మీదేవమ్మ పూజాగృహంలోనే దేవుడిముందున్న ఆరతి పళ్ళెంలో ఉంచిన ఇరవైమూడు రూపాయిల్ని త్రెచ్చి, ఆ పోస్ట్‌మ్యాన్‌కు ఇచ్చి ఆ పార్శిల్ లోని పుస్తకాన్ని తీసుకొని వెంకటరమణ చదువుకొనేందుకు ఉపయోగిస్తున్న చిన్నగదిలోకి వెళ్ళి అతడి పుస్తకాల పెట్టెలో ఆ పార్శిల్‌ను దాబెట్టి, మరలా స్నానం చేసి మడివస్త్రాన్ని ధరించి బొబ్బట్లను తట్టుతూ కూర్చుంది.

పన్నెండు గంటలైంది. ఆ తండ్రీకొడుకు లిద్దరూ ఉపకర్మను ముగించుకొని ఇంటికిచేరారు. కమల కూడా సామూహిక గౌరిపూజ నుంచి వచ్చింది. శాస్త్రి లక్ష్మీదేవమ్మను పిల్చి "ఇక నువ్వెళ్ళి గౌరిపూజను చేసుకొని రా...." అని చెప్పాడు. అలాగే అంటూ మరొకసారి భార్యను చూసి "ఇదేమిటోయ్... పాత పట్టుచీరను కట్టుకొన్నావు?" అని ప్రశ్నించాడు.

లక్ష్మీదేవమ్మ : మా మామగారు మన వివాహం అయిన తొలినాళ్ళలో కానుకగా ఇచ్చింది ఈ చీరనే కదా! నేనిప్పుడు గౌరివ్రతానికి కట్టుకొనేందుకు దానికన్నా మీరిన వేరే చీర అవసరమా? మీరంతా ఇక లేచి వస్తే మీ అందరికీ వడ్డన చేసి, మీ భోజనాలు ముగిసిన మీదటే గౌరిపూజకు నిధానంగా వెళ్తానండి.

భోజనం చేసేదాని గురించి కొద్దిగా చర్చ నడిచింది. చివరికి లక్ష్మీదేవమ్మ కోరినట్లుగానే ఆమె త్రప్ప మిగిలిన ఆ కుటుంబ సభ్యులందరూ భుజించారు. ఆ తర్వాత లక్ష్మీదేవమ్మ పూజాసామగ్రిని తీసుకొని పూజకు వెళ్ళేందుకు సిద్ధమైంది.

వెంకటరమణ : అమ్మా... పూలు, ఫలాలున్న బుట్టను తీసుకోలేదేంటి?

లక్ష్మీదేవమ్మ : ఈ బుట్టను మొదటగా ఋత్విక్కులైన రామశాస్త్రిగారి ఇంట్లో జరిగే గౌరిపూజలో గౌరిదేవి ముందు పెట్టి మరలా వెనుదిరిగి వచ్చి నువ్వు చెప్పే ఆ మిగిలిన బుట్టను తీసుకొని వెళ్తాను పుత్రా...

వెంకటరమణ : అమ్మా... నేను పట్టుకొని నీ తోడుగా వస్తాను. నువ్వెందుకు మరలా మరొకసారి అంతదూరం నుంచి రావాలి?

లక్ష్మీదేవమ్మ : వద్దులే నాయనా... నేనే శ్రమిస్తానులే! అంటూ వెళ్ళిపోయింది.

లక్ష్మీదేవమ్మ భక్తిగా శాస్త్రోక్తంగా సాంగోపాంగంగా పూజను చిత్తశుద్ధితో నెమ్మదిగా చేసుకొంది. చివరిగా పురోహితుడైన రంగయ్య భట్టు 'మనసోద్దిష్ట ప్రార్థనాం సమర్పయామి" అని చెప్పి "మీ మనస్సులో ఉన్నదాన్ని ప్రార్థనగా చేసుకొని నమస్కారం చేయండి అమ్మా" అని చెప్పాడు. లక్ష్మీదేవమ్మ గౌరి మాతముందు లేచి నిలబడి మంత్రాక్షతల్ని పుష్పాలను చేతిలో పెట్టుకొని అనాదిగా వస్తున్న ఒక గౌరి స్తోత్రాన్ని ఉచ్చరించి అనంతరం "అంబా! జగదంబా!! గౌరిమాతా!!! నా మాంగల్యాన్ని చిరకాలం కాపాడుతల్లి.నా కుమారుడు ఇప్పుడు వ్రాయబోయే సివిల్ సర్వీస్ పరీక్షలో ఉత్తమ ఫలితాన్ని ప్రసాదించు తల్లీ" అని మనస్సులో అనుకొని పూజను ముగించి చివరిసారిగా నమస్కారంను పెట్టింది. నమస్కరించి లేచిన తక్షణమే లక్ష్మీదేవమ్మ సమర్పించిన ఒక చామంతిపువ్వు గౌరిదేవి కుడిభాగంనుంచి క్రిందకు జారిపడింది. దీన్నిచూసిన రంగయ్యభట్టు ఆశ్చర్యపోతూ "అమ్మా గమనించారా... దేవి చిత్తాన్ని! మీ ప్రార్థన సఫలమైంది..దేవి వరాన్ని అనుగ్రహించింది. దేవికి కుడి ప్రక్కన మీరు సమర్పించిన పుష్పం క్రిందకు పడింది" అని అంటూ ఆ చామంతి పువ్వును తీసుకొని మంత్రాక్షలతో కలగలిపి "దీర్ఘ సుమంగళీభవ" అని ఆశీర్వదించి లక్ష్మీదేవమ్మకు ఆ పుష్పాన్ని ఇచ్చారు.

ఇంటికి చేరిన తల్లిని చూసి వెంకటరమణ "అమ్మా....నువ్వు భోజనంకు కూర్చో... నేను ఉత్తరీయం కప్పుకొని నీకు వడ్డిస్తాను"అని అడుగుతుంటే ఆ తల్లి పుత్రుడి మాటలకు సంతోషపడి భోజనంకు కూర్చుంది. తల్లి భుజిస్తుంటే...

వెంకటరమణ : అమ్మా, ఈసారి నేను సివిల్ సర్వీస్‌లో పాసైతే.... నేనేమో ఎంతో కష్టపడి బి.ఎ. ఫస్ట్‌క్లాసులో పాసైయ్యాను. ఇప్పుడు ఈ సివిల్ సర్వీస్ పరీక్షలో పాసైతే.. నా మొదటి నెల జీతంతో నీకు బంగారు జరీ ఉండే ధర్మవరం పట్టుచీరను తెస్తాను కానుకగా. నువ్వేమి ఆలోచన చేయొద్దు. మాతృపూజను ఏ రీతిలో చేస్తానో ముస్ముందు నీకే గుర్తు అవుతదిలే.

లక్ష్మీదేవమ్మ : ఎక్కువగా ఆలోచించకు నాయనా... అంతటికీ ఆ సర్వేశ్వరుడు ఉన్నాడులే.



వెంకటరమణ : మరొక బొబ్బట్టును వడ్డించుతాను అమ్మా...

లక్ష్మీదేవమ్మ : వద్దు! వద్దు బిడ్డా!! ఇదేంటిది వద్దు వద్దంటున్నా వడ్డించావు కదా నాయనా..!

ఆ తల్లి – కొడుకు లిద్దరూ ఒకరి మోమును మరొకరు చూసుకొంటూ నవ్వారు మనసారా.

లక్ష్మీదేవమ్మ : ఇక నువ్వు వెళ్ళు నాయనా! కమల నుంచి మజ్జిగను పోయించుకొంటానులే.

వెంకటరమణ తన గదికి వెళ్ళి తన పుస్తకాల పెట్టెను తెరిచిన తక్షణమే ఒక క్రొత్త పుస్తకం కళ్ళలో పడింది. సంతోషంతో ఆ పుస్తకాన్ని చేతిలోకి తీసుకొని తిరిగి సభా గృహం వద్దకు వచ్చి "నాయనా....! పార్శిల్‌ను ఎవరు తీసుకొన్నారు? డబ్బు ఎక్కడ్నుంచి వచ్చింది?" అని అడిగాడు.

శాస్త్రి : నాకు తెల్వదు.

వెంకటరమణ : కమలా... వి.పి.కి డబ్బులు ఎవరు కట్టారు?

కమల : నాకు తెల్వదు అన్నా...!

వెంకటరమణ : అమ్మా... నువ్వేమైనా ఇచ్చావా....?

లక్ష్మీదేవమ్మ : హ్హుం.

వెంకటరమణ : నువ్వు ధర్మవరం చీరను వద్దని అంది దీని కోసమేనా....?

లక్ష్మీదేవమ్మ : ఔను బిడ్డా..!

వెంకటరమణకు ఏమీ తోచలేదు. తల్లి చెంతకు వెళ్ళి ఆమె చేతిని పట్టుకొని కూర్చున్న తక్షణమే నిగ్రహించుకోలేని ఏడుపు వచ్చింది. అలాగే కొద్దిసేపు తల్లి వద్ద కూర్చుని తల్లి ఘనతను మదిలో పదిలంగా స్థాపన చేసుకొని మరలా తన స్టడీ రూమ్‌కు చేరుకొని, తన తల్లి చేసిన త్యాగంలోని ఋణాన్ని ఏ రీతిలో తీర్చుకోవాలో అని యోచిస్తూ, దీనికి పరిష్కారం ఒకటే...అది జరగబోయే సివిల్ సర్వీస్ పరీక్షలో ప్రథముడిగా నిల్చేందుకని ప్రతిన పూనాడు.

❀ ❀ ❀

(సోసలె గరళపురి శాస్త్రి (ఎస్.జి.శాస్త్రి) గారు 1913 ఉన్నతవిద్యకని లండన్‌లో ఉన్నప్పుడు రచించిన 'హబ్బద ఉడుగొరె' అనే కన్నడ మూలకథకు తెలుగు అనువాదంను చేసాను. శాస్త్రిగారు పట్టుమని పది కథలను మీరి రచించలేదు. వీరి జీవితకాలం

1890–1955. వీరి నుంచి జాలువారిన ఈ దిగువ మధ్యతరగతిలోని సనాతన కుటుంబ కథను చదివి ప్రేరణ పొందిన ఎంతోమంది యువకులు కథలోని వెంకటరమణ లాగ తమ చదువును అలాగే భారత ప్రభుత్వంలోని ఉద్యోగ నియామకాలలో ప్రవేశం కొరకు ప్రయత్నాంచారని పలువురు ఇప్పటికీ చెప్పుకొంటారు ఈ కథాకథనంలోని వైశిష్ట్యాన్ని.

కన్నడ సాహితీలోకంలో దిగ్గజంగా నిల్చిన గిరెడ్డి గోవిందరాజు గారు 'మరెయ బారద హళెయ కతగళు' (మరిచిపోలేని పాత కథలు) అనే వాట్ని ఒక సంకలనంగా తీసుకురాగా, నేను ఈ భాగ్యనగరిలో ఉన్న సిటీ సెంట్రల్ లైబ్రరీలో చదవగా ఈ కథ నన్ను మోహవివశుడ్ని చేసినందున తెనిగించాను. 11-01-2010)

- 0 -

శాఖమూరు రామగోపాల్



# ఉద్ధారం (బాగుపడటం)

పతితురాలైన ఒకామె 'విధవాశ్రమం' ముందు నిలబడగా 'సోదరి సంకోచించకు. రా తల్లి.. లోనికేరా....; ఇది నీ ఇల్లే అని భావించుకో; సమాజమే సృష్టించిన భయంకర నరరూప రాక్షసులనుంచి మీలాంటి అబలను రక్షించాలనే ఈ ఆశ్రమం స్థాపించబడింది తల్లీ'.

పతితురాలి కళ్ళలో నీళ్లు నిండినవి. ఆహా! తన బుద్ధినుంచి కానిది... తనదొకటైన చిన్న తప్పునుంచే ఇంటినుంచి బయటపడి, వీధిలోకి భికారిణిగా చేసిన తన రక్త సంబంధీకులు ఎక్కడ? సహోదర భావంనుంచి అనాథగా ఉన్న తనను ఆశ్రమంలోకి ఆహ్వానించుతున్న ఈ మహాత్ముడు ఎక్కడ?

ఇప్పుడామె ఆ భావనల నుంచి ఆ 'విధవాశ్రమం' లోని వ్యవస్థాపకుడ్ని అనుసరించింది. విశాలమైన గది. ఆశ్రమంలోని కార్య నిర్వహణకని ప్రత్యేకించబడిన ఆ గదిని చూసిన తక్షణమే ఆ వ్యవస్థ గొప్పగా కన్పించింది ఆమెకు. వ్యవస్థాపకుడు తన ఆసనం(కుర్చీ)లో కూర్చుని, టేబిల్ మీదున్న రిజిస్టర్ బుక్‌ను తెరిచాడు.

'మీదేవూరు తల్లి?'

'చింతామణి'

'పేరేంటమ్మా?'

'గోపిక అండి'

'వయస్సు?'

'ఈ భాద్రపదమాసంకు ఇరవై రెండు నిండి ఇరవై మూడు వచ్చిందండి'

'పిల్లలు ఉన్నారా?'

'.......'

'చెప్పమ్మా. సంకోచం వద్దు తల్లి'

'ఈ విధవ స్థితికి వచ్చి, పదిసంవత్సరాలు అయినవండి. నా భాగ్యం పాడైపోయినప్పుడు (పసుపు-కుంకుమలు పోయినప్పుడు) నేనింకా రజస్వరాలినే కాలేదండి'

'సరి, సరి; బాల విధవరాలివే కదా! అయితే, ఇప్పుడిక ఇంట్లోవారు బయటకు గెంటేసిన దానికి కారణం తెల్పు తల్లి?'

'.... మా భావగారు... మధోన్మత్తుడై చెరచగా... నాకిప్పుడు ఏడు నెలలు.'

'మా ఆశ్రమం గురించి మీకెట్లా తెలిసింది తల్లీ?'

'దినపత్రికలోని ప్రకటనల మూలంగా'

'మీకు చదివేది వ్రాసేది వస్తదా సోదరి?'

'పాఠశాలకైతే వెళ్ళలేదండి. అయినా చదివి అర్థం చేసుగొనేంతగా పరిమితజ్ఞానం ఉందండి'.

'సరి, సరి. ఏ చింతా (దిగులూ) లేకుండా మీరిక్కడ ఉండొచ్చు. ప్రకృతి మాత మందిర విభాగంలో మిమ్మల్ని చేర్చుతాను. అక్కడుంటే, మహామాతే మిమ్మల్ని నిస్సంశయంగా ప్రీతిస్తది.'

## 2

విదురుడైనోడొకడు (భార్యను పోగొట్టుకొన్నోడొకడు) విధవాశ్రమం ముందు నిలిచాడు. 'లోనికి ప్రవేశించండి; పురుషోత్తమా! ఈ ఆశ్రమం తమదేనని భావించుకోండి. సందేహించకండి. లోనికే సుఖంగా రండి' అన్నాడు వ్యవస్థాపకుడు ఆదరంగా.

ఇక ఇప్పుడు ఆ విదురుడు వ్యవస్థాపకుడ్ని అనుసరించాడు. ఆ ఇద్దరూ ఏకాంతులుగా లోనికి చేరారు.

'ఒక ప్రశిద్ధమైన పత్రికా ప్రకటన నుంచే నేనిక్కడకు వచ్చాను. నేను గొప్ప శ్రీమంతుడ్ని. భవ్యమైన పెద్ద ఇల్లొకటి (భవనం) నాకుంది. ఎంతో సంపదున్నా సంతాన హీనుడిగా ఉన్నాను. నా కళత్రం (అర్థాంగి) కాలధర్మం చెంది ఒక సంవత్సరం అయ్యింది. ఆమె జీవించినంత కాలం రోగిష్టిగానే ఉండేది. సంసార సుఖం నాకు లేదప్పుడు. ప్రాయం మీరినా (వయస్సు పైబడినా) ఒక ఆశె– ఒక భ్రాంతి– ఒక శిశువునైనా సంపదకు వారసుడిగా దొరుకుతాడేమో; పితృఋణాన్ని తీర్చుతాడేమో అనేది నాలో ఉందిలే! ప్రాయం (పడుచుదనం)లో ఉన్న ఒక సోయగాలున్నదాన్ని (సొగసులాడిని) పెళ్ళి చేసుకొనే వయస్సు (ప్రాయం) నాలో మీరిపోయింది కదా... నన్ను చూస్తే!'

'ఛీ... ఛీ... ఏమిటండి ఆ మాటలు రావ్‌గారు! తమకు ప్రాయం (వయస్సు) మీరిందని ఎవరు అంటున్నారండి? ఎక్కువ తక్కువగా అనుకొంటే ఏభై సంవత్సరాలు ఉండొచ్చు మీకు! నా మాటలలో ఏ సందేహాన్ని పెట్టుగోకండి. ఇక పశ్చిమ దేశాలోళ్ళను



(యూరోపియన్స్‌ను) చూడండి....ఏభై సంవత్సరాలు మీదబడితేనే యౌవ్వనోదయం అని వారు అంటున్నారు కదండి. మీ అంతోళ్ళకు సహాయపడాలనే... అనాథ స్త్రీలకు బతుకు దారిని చూపించాలనే మేము ఈ ఆశ్రమాన్ని ఎంతగానో శ్రమపడుతూ నిర్వహిస్తూ వస్తున్నామండి. తమలాంటి ఎంతోమంది సద్గృహస్తులు మా నుంచి సేవల్ని పొంది సంతోషపడుతుంది మీకు తెలుసుకదా! ఎంతోమంది అనాథులైన విధవరాండ్రు మరు వివాహాలను చేసుకొని పిల్లా – పాపల్ని పొంది, సమాజంలో గౌరవస్థానంను పొందియున్నారులే మానుంచి! అంతా ఈశ్వరుడి కృపేనండి! తమలాంటి వదాన్యుల ఔదార్యం నుంచేనండి! తమ సుఖంకని, తాము ఇష్టపడే ప్రాణిని (విధవను) ఎంచుకోవచ్చు. బాల విధవరాండ్రు, ప్రౌఢ విధవరాండ్రు, అక్రమసంతానంను పొందిన విధవరాండ్రు, ప్రస్తుతం గర్భిణీలుగా ఉన్న విధవరాండ్రు... వీరిలో ఎవరైనా తమ కంటి చూపులకు నచ్చితే తమ భావిపత్నిగానే భావించుకోండి'.

'అదంతా సరే; నాకిప్పుడు ప్రాయంకు వచ్చిన, పిటపిటలాడుతున్న, ఒంటరి స్త్రీ కావాల్సియుంది నాకు భార్యగా. మీ ఖర్చు ఎంత తగలొచ్చు నాకు?'

'తమలాంటోళ్ళు ఎంత ఖర్చు ఉండగలదని అడగకూడదండి? అనాథ మహిళలకని చేసే డబ్బు అది. అది తమరు ఎంతిస్తే ఏమిటి? తాము ఇష్టపడిన మొత్తంలోనే అని భావించుకోండి'

'ఐదువందలా?'

'ఏమిటండి.... ఏమిటండి రావ్‌గారూ!'

'పోనీయండి, ఒక వేయి రూపాయలా'

'మీరు మా గోపికను చూడండి.ఆమె సురసుందరి; సద్గుణవతి; అగ్రహారం నుంచి వచ్చినామె; స్వంత బిడ్డలాగ సంవత్సరాల్నించి సాకాను. ఆమె కొప్పుముడి (కాలిగోటి)కి సరిసమానం కాదు రావ్‌గారు... మీ ఒక వేయి రూపాయిల విలువ! అదిగో, ఇటువైపున ఈ కిటికీ వద్దకు రండి, ఇదిగోనండి... ఇప్పుడు చూడండి; తులసీ వృక్షానికి నీళ్ళను పోస్తుంది కదా! ఆమేనండీ... రేపటినుంచి తమ గృహిణి (భార్య)గా అయ్యేందుకు అర్హురాలు. తమలాంటి శ్రీమంతుడ్ని చేరుకొని, పాడైపోయిన ఆమె భాగ్యంనూ వృద్ధి చెందనీయండి!'

'ఏమిటీ...! ఆమేనా? నా అర్థాంగి? అలాగే కానీయండి' మరొకమాటను ఎత్తకనే ఐదువేలకు సంధి చేసుకొన్నాడు (ఒప్పుకొన్నాడు). 'మీ ఆశ్రమం చిరస్థాయిగా వర్ధిల్లాలని కోరుకొంటున్నానండి. ఇటువంటి స్త్రీలు ... మీ ఆశ్రమంలో ఇంకా ఎక్కువ సంఖ్యలోనే వృద్ధి చేయండి. ఆర్యా... విధి విధానాలతో రేపే శుభముహూర్తంగా చేయండి..!'

'తమ ఆజ్ఞకు మానుంచి విరోధమా రావ్‌గారు?'

'నమస్కారం!'

'నమస్కారం!'

## 3

ఆశ్రమంలోని ఉద్యానవనంలో వాళ్ళిద్దరూ మాట్లాడుకొంటున్నారు.

'పుత్రీ...! నువ్వు దుఃఖించేది ఎందుకు తల్లి?'

'ఆర్యా; నన్ను ఇక్కడే ఉండనీయండి. ఏదో, బలప్రయోగం వలన నేను పతితురాలైనాను మాత్రమే త్రప్పితే, ఆత్మసాక్షిగా నాకు మా అగ్రహారంలోని పూర్వ సాంప్రదాయాలలో నమ్మకం, భక్తి, గౌరవం త్రికరణశుద్ధిగా ఎంతగానో ఉన్నవండి! ఆత్మతః నేను పరిశుద్ధరాల్ని... అలాగే చనిపోయేవరకూ ఉండాలని నాలో ఆకాంక్షగా ఉంది. నా ఈ మహత్తరమైన ఆకాంక్షను (ఆశెను) ఎందుకు చెడుపుతారు? ఇన్ని రోజులూ... తల్లిదండ్రులుగా మీరు నన్ను సాకి (పోషించి) చివరికి నన్ను వదిలేస్తారా? కోరుకొంటేనే త్రప్పితే బలప్రయోగం చేసేది ఈ ఆశ్రమంలో లేదని నేను విన్నాను కదా! నేను విన్నదంతా అబద్ధమేనా?

'ఎంత పిచ్చితల్లివి...అమ్మా నువ్వు! నీ ప్రాయం ఎంతో చిన్నది కదా! ప్రపంచమంతా ఆనందసాగరంలో తేలాడుతుందిలే! ఇంతగా ఉన్న సుందరరూపం వ్యర్థం కారాదు! భర్తనుంచి లభించే ప్రీతిలోని కల్పన కూడా లేని పిచ్చితల్లివి నీవు! ఇలాగున చిన్నవయస్సుకే వైరాగ్యభావంను పెట్టుకోకూడదు. పెద్ద ఇంటికి చేరే సుసమయం ఆసన్నమైంది సోదరి! కావాల్సినంత సంపదకు నిన్ను మెచ్చినోడు అధిపతిగా ఉన్నాడులే. పైపెచ్చు మంచి గుణసంపద ఉన్న గృహస్థుడు. అంతేగాకుండా ఒంటరోడు. అత్తమామల ఆటుపోట్లు లేవు; సవతి పిల్లల ఉపద్రవం లేదు. స్వతంత్ర జీవివి నీవు ఆ ఇంట్లో. నువ్వు సుఖసంతోషాలతో అక్కడుంటే మా అందరికీ ఆనందమే కదా! మీ అంతోళ్ళ ఉద్ధారమే మా ఆశ్రమ స్థాపనలోని ధ్యేయం కదా! అంతేగాకుండా ఆజన్మాంతం మీలాంటోళ్ళందరూ ఇక్కడే స్థిరనివాసం చేసుకొంటే మానుంచి సాకేది సాధ్యపడుతదా తల్లి? క్రొత్తనీరు వచ్చేది; పాత నీరు పోయేది ప్రకృతి ధర్మం కదా! గతిలేనోళ్ళకు గతిని కల్పించే (చూపించే) దే ఈ ఆశ్రమంలోని ఉద్దేశం కదా పుత్రీ! కాదుకూడదని నువ్వు అంటే మేము కఠినాత్ములుగా అవుతామని తెల్సుకో సోదరి?'



'అలాగైతే మాతాజి (అమ్మాజి) గారి ఉపదేశాలలోని అర్థం ఏమిటండి?'

'చెప్పేందుకే ఉపదేశాలు మానుంచి ఎన్నో వస్తువిలే తల్లి! ఒకటి మాత్రం నేను ఖచ్చితంగా చెపుతాను... వ్యభిచారం మాత్రం దోషం తల్లి. ఒకడితో కూడి (కల్సి) జీవన నిర్వాహకంకని సంసారంను చేసేది త్రప్పు కాదులే తల్లి. నీకు కాబోయే పెనిమిటి (భర్త) తో పతివ్రతల తత్వాన్ని అనుసరించితే అప్పుడు నీకు మోక్షం కచ్చితంగానే దొరుకుతదిలే.'

'నా బిడ్డ గతేంటి?'

"ఎక్కడ నీ బిడ్డ తల్లి? ఆ బిడ్డ అనీతి (కునీతి) లోని సాక్షి. ఒక కాముకుడి నుంచి ఉద్భవించిన వాసనతో ఉన్న పిండం (పేగుబంధం) అది కదా! ఆ బిడ్డను ఆశ్రమంలోనే ఉండనీయ్! అనాథ బాలబాలికలతో పెరిగి కళాశాలలో చదివి, పేరు ప్రఖ్యాతుల్ని పొందనీ! ఆ బిడ్డను నేను కన్నానని నువ్వెక్కడా ఎవరివద్దా ప్రస్తాపించకు. నీ జీవితంలో ఆ బిడ్డను (కర్ణుడిలాగ) అజ్ఞాతంలోని సంభవంగానే ఉండనీ తల్లి!"

ఆమెకు ఇంకేమి మాట్లాడేందుకు సాధ్యపడుతది? ఆమె నుంచి ఏ ప్రతిభటన జరగగలదు? మరుసటిరోజునే ఆశ్రమంలోని వ్యవస్థాపకుడి ఎడంచేయి గుట్టుగా ఐదువేల రూపాయల గంటును పట్టుకొన్నప్పుడు, ఆ గోపికలోని కుడిచేయి ముసలోడి చేతిని పట్టుకొంది.

## 4

క్రొత్త సంసారం సాగుతున్నప్పుడు ఒక రోజు నడిరాత్రిలో 'సొగసులాడి! చాలు చాలు నీ మాటలన్నీ... త్రాగొద్దని అంటున్నావు... త్రాగితే చెడిపోతానా? నేను సంపాదించిన డబ్బును, నేను భోగిగా ఉపయోగించుగోకుంటే ఇంకెవరికి ఇచ్చేది? నిన్ను కట్టుకొని సంవత్సరం అయ్యింది. ఒక శిశువైనా పుట్టి యుంటే సార్థకం అయ్యేది నా బతుకు! బతుకులోని విషాదంను మరిచేందుకే త్రాగుతుంటే నీకేంటి నష్టం? అధిక ప్రసంగంను చేస్తే తన్నుల్ని తింటావు?'

'అయ్యా... మీ మీద నేనేమి జులుం చేయట్లేదండి... త్రాగుడు మంచిదికాదనే చెప్పానండి. డబ్బు పాడైపోతే పోనీయండి; ఇప్పటికే మీ దేహమంతా కృశించి (క్షయించి) పోయింది కదా! ఇంకా త్రాగి, ఆత్మను ఎందుకు చంపుకొంటున్నారు అని మాత్రమే నేను అన్నానండి... మరలా మీ అంతోళ్ళకు చెప్పేందుకు నాకెక్కడ అధికారం ఉందండి?'

'నాలోని ఆత్మ అదెన్నడో పాడై వెళ్ళిపోయింది నానుంచి. పైగా నీలాంటి గొడ్రాలితో సంసారం! ఇంకేమి కావాలి నా ఆత్మ పాడైపోవటానికి? త్రాగుడు నాకేమి క్రొత్తకాదు. ఎక్కువగా లొల్లి (గొడవను) పెట్టకు. పో అవతలికి! నిన్ను పారద్రోలుతాను శాశ్వతంగా నా నుంచి... నువ్వెవరివే నాకు ఉపదేశించేందుకు? నాకేంటి? డబ్బు ఉంది మస్తుగా... నీలాంటోళ్ళను పదిమందిని పోషించగలను శాశ్వతంగా! నీలాంటి గొడ్రాలికి (బంజరుదానికి) ఐదువేలను ఖర్చుచేసాను కదా...!

'నిర్దయగా ఎందుకు నన్ను గొడ్రాలు అంటున్నారు? ఈ మీ మాటల్ని మీ ఆత్మ ఒప్పుకొంటదా? లేకపోతే ఇరుగు పొరుగున ఉండే వాళ్ళకు నేను గొడ్రాలినని (బంజరుస్త్రీ అని) చెపుతుండేందుకు నాటకాన్ని ఆడుతున్నారా? నేను గొడ్రాల్నని అనేందుకు బలమైన సిద్ధాంతం మీ వద్ద ఉందా? బయట ప్రపంచంకు మనం మొగుడు పెళ్ళాం తరహాగా కనబడుతుంటే; నిజంగా మన సంబంధం తండ్రి – కూతురు లాంటిదే కదా! చెప్పండి సత్యంగా... నా దేహాన్ని పత్ని (భార్య) రూపంతో స్పర్శించాల్సిన రీతిలో ఏనాడైనా స్పర్శించారా ఇప్పటిదాకా? ఏనాడైనా నన్ను భోగించారా? అలాగున మీరు ఉండగా నన్ను గొడ్రాలని ఎలాగున నిర్ణయించారు? నేను ఎలాగూ పతిత (కళంకిత) రాల్ని అన్నమీదట నాకేంటి సిగ్గు (లజ్జ)? నేను గొడ్రాలిగా మిగిలిపోయినా సమాజంలో నాకు భద్రస్థానం ఉంటదో ఏమో! అలాగున బంజరు స్త్రీ (గొడ్రాలు)గానే ఉండుంటే నన్నెందుకు ఆశ్రమ వ్యవస్థాపకుడు మీ వద్దకు చేర్చాడు? అగ్రహారంలో నా భావ మదోన్మాదంకు బలైనందుకు నేను గర్భవతినైన దోషానికి నన్ను పతిత స్థానంలోకి నెట్టింది ఈ సమాజం... నేను మరొకమారు చెపుతున్నా... నేను గొడ్రాలు (బంజరు) మహిళనైతే కాదు... నా కుమారుడు ఆశ్రమంలో పెరుగుతున్నాడు... ముద్దుకృష్ణుడిలాంటి సుందర బాలుడు నా పుత్రుడు.'

'ఏమిటీ! నువ్వు పిల్లల తల్లివా... అలాగైతే వ్యభిచారిణివే కదా! భలే భలే... నీలాంటి వేశ్యకు (జారిణికి) నేను ఐదువేల రూపాయల్ని ఖర్చు చేసాను కదా! ఆ.... బ్రోకర్‌గాడు నువ్వు పిల్లల తల్లివని తెల్పనేలేదు కదా! పాపాత్మురాలా ... నా ఐదువేలు..!'

'ఎవర్ని అడుగుతున్నారు మీరు? మీ వద్ద నేనే నా విలువ ఐదువేలని తెల్పానా? ఎవరికి ఇచ్చారు ఆ డబ్బును? ఎందుకు ఇచ్చారు? నాకేమి తెల్సు ఆ లోగుట్టులు? నన్ను తిట్టిపోస్తే ఇప్పుడు ఫలితం ఏమిటి? నేను అనాథను... పతితను.. అదృష్టహీనురాల్ని.. తమ చెంతకు చేరినా సుఖంగా, గౌరవంగా ఉండేందుకు భాగ్యమే లేని భికారిణిని..."

రెండు పిడిగుద్దులు... నాలుగు బలమైన తన్నులు!



'సుఖం? ఇంకేమి సుఖం కావాలి నీకు? నువ్వు మంచిగానే ఇప్పటివరకూ నా చెంత తినలేదా? మంచిగానే పీతాంబరాల్ని కట్టుకోలేదా? పైపెచ్చు నామీద మాటల యుద్ధాన్ని చేస్తున్నావు కదా! నపుంసకుడ్నని గేలి చేస్తున్నావు కదా! రాక్షసి... కులటా... నడువ్... వెళ్ళు నాఇంటి నుంచి... వెళ్ళిపో నా నుంచి శాశ్వతంగా!

'పతిరాయా! ఉన్నపళంగా నేనెక్కడికి వెళ్ళేది...!! ఈ అపరాత్రిలో...!!!

'అక్కడికే, నీ బిడ్డకు జన్మనిచ్చినోడి వద్దకే, వెళ్ళు... వెళ్ళిపో... పరిగెత్తు ... నా ఐదువేలు! సూర్యోదయంకానీ, వాడి అంతాన్ని చూస్తాను!'

ఆ త్రాగుబోతు నపుంసక మొగుడు ఆమెను శాశ్వతంగా నిర్దయతో బయటకు దొబ్బి (నెట్టి) తలుపుల్ని వేసుకొన్నాడు. ఆమె మరలా (పునః) నిరాశ్రితురాలిగా అయ్యింది.

## 5

అదే రాత్రి, దారిలో ఆమె గమ్యం గురి లేకుండా పోతున్నప్పుడు

'ఏయ్, అమ్మా, ఎవరు నువ్వు?.. ఈ నడిరాత్రిలో ఎందుకు వీధిలో ఒంటరిదానివిగా ఎక్కడికి వెళ్తున్నావు?'

'విధిలీల నాయనా, విధిలీల! దాన్నంతా ఏమి వింటావ్... నేనేమి చెప్పేది ఇప్పుడు?

'నువ్వు బాగానే ఉన్నావ్ కదమ్మా...'

'................'

'ఏమిటమ్మా మాట్లాడుటలేదు. నిన్ను చూస్తుంటే, ఇంట్లో చెప్పకుండా బయటకు వచ్చినట్లుగా కనబడుతున్నావు; అలాగైతే చింతించకు. నిన్ను చూస్తే మెహబూబి (బూబమ్మ) భలేగా సంతోషపడుతది. వస్తావా... అక్కడికి వెళ్ళేందుకు?'

'ఎవరయ్యా ఆమె? మెహబూబి (బాబమ్మ) అంటే?'

'అదంతా ఇప్పుడెందుకమ్మా నీకు? రా... భలేగా రంగుల లోకంలో కాలాన్ని గడిపేయవచ్చులే.'

'నడువ్ నాయనా; నిండా మునిగిన నాకు చలేంటి? జరగాల్సిందంతా జరగనీ. ప్రపంచంలోని నిజస్వరూపాన్నైనా ఎలాగుందో చూస్తాను!'

'భలే తెలివి, ధైర్యం కలదానివమ్మా నువ్వు; ఇలాగున నాతో రా...'

❁ ❁ ❁

మెహబూబి (బూబమ్మ) ఇంటికి వెళ్ళిన తరువాత:

'ఖుబాజాన్, చూడు నీకొక రామచిలుకను తెచ్చాను!'

'ఎవర్రోయ్ అది! ఏమిటి ఈ నడిరాత్రిలో కేకలు... ' అంటూ, ఆమెను (చిలుకను) చూస్తూనే : 'ఆహా, ఎవరీమె! భలే సురసుందరిగా ఉంది కదా! రామ్మా.... నువ్వు నా పుత్రికవి ! రామ్మా, ఇలాగే రా...'

ఆమె (చిలుక) ఏమనగలదు? అలంకృతమైన ఆ ఇంటిని విషాదమైన చూపులతో చూసింది. ఆమెకు తన ముమ్ముందు రోజులు అక్కడ ఎలాగున గడపాలనే దానిమీద కూలంకషంగా అర్థమైపోయింది. మరుసటిరోజు నుంచే ఆమె నుంచి గానా బజానా ప్రారంభమైంది విటుల సుఖ -సంతోషాలకని.

ఆమె ఉద్ధారం 'విధవాశ్రమం' నుంచి అయ్యింది ఇదేనేమో?

❁ ❁ ❁

అవిభజిత దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన ఈమెకు మహిళా రచయిత్రిగా ఎంతోపేరు ఉంది. మహిళా రచయితల క్రమంలో, ఆ పట్టికలో మూడో రచయిత్రిగా గుర్తుంచుకో బడింది. ఈమె నుంచి మహిళాభ్యుదయంకని జాలువారిన కథలను కర్నాటక ప్రభుత్వం ప్రకటించింది. ఈమె జీవితకాల వివరాలు నాకు దొరకలేదు. 1930 ప్రాంతంలో ఈ కథ వెలుగులోకి వచ్చింది.

శ్రీమతి సరస్వతిబాయి రాజవాడె గారి కథలలో మహాత్మా జ్యోతిరావ్ పూలె గారి సంఘసంస్కరణ ప్రభావం ఎంతగానో ఉందని పరిశీలకులు తెల్పుతారు.

- 0 -

మూలభాష : కన్నడం

మూలరచయిత్రి : సరస్వతిబాయి రాజవాడె

మూలకథలోని పేరు : అవళ ఉద్ధార

తెలుగు యథాతథ అనువాదం : శాఖమూరు రామగోపాల్ (12-02-2010)



# రణ రణ మ్రోగే అలారం వాచ్

అలారం వాచ్ అనేది మీకు గుర్తేకదండి! అవసరపడే టైమ్‌కు ఆ గడియారం లోపల ఉండే మూడో ముల్లును త్రిప్పి, కీఇచ్చి వదిలిపెట్టే, మనం కోరుకొన్న సమయంకు రణ రణ శబ్దాల్ని చేసి, నిద్రనుంచి మేల్కొనేందుకు ఎచ్చరించే గడియారం అదేకదా! ఇంటింటికి అటువంటి అలారం గడియారం ఉంటే, సూర్యచంద్రుల సావాసం అక్కరలేదులే; వాళ్ళు ఉదయించనీ- అస్తమించనీ... కాలచక్రం తిరగనీ, తిరగకుండా ఉండనీ; అది ఆ అలారం ఘంటను కొట్టకుండా మిన్నకుండి పోతదా?

సరె సరే... నేను మీకు చెప్పే నా గడియారం షోరూంలలో విక్రయించే వస్తువైతే కాదులే. అది (ఆ గడియారం) ఎన్నో జన్మల పుణ్యఫలం నుంచి దొరుకుతది; ఏదో నాలాంటోళ్ళకు మాత్రమే దొరుకుతది. పుణ్యంను మూటగట్టుకొన్నోళ్ళు కొద్దిమందే కదా ఈ పుడమి(భూమి)లోన! కొందామనుకొంటే ఎంత రేటుకైనా దొరికేది లేదండి; అమూల్యమైన వస్తువు అది కదా! లోహపు గడియారం కొట్టే మ్రోత ఎంతగానో ఉన్నా, మనం కావాలని ఆపేక్షించినప్పుడు మాత్రమే అది మ్రోగగలదు. రోజులోని ఇరవై నాలుగుగంటలలోని ప్రతినిమిషంలోనూ అడ్డు అదుపులేకుండా మ్రోగేదొకటుందిలే; అదేనండి పాఠకులారా... ఆ మ్రోగే అలారం అంటే 'నా భార్యామణేనండి!' నా భార్యైన వెంకమ్మ గురించే నేను ప్రస్తావించుతున్నాను ఈ కథ మూలంగా... ఇటువంటి వస్తువులు (ఆమెలాంటోళ్ళు) లోకంలో ఎన్ని ఉన్నవి?

పెళ్ళైనప్పుడు వెంకమ్మకు (నా అర్థాంగికి) మాటల శక్తిని పరమాత్మ ఇచ్చాడో లేదో? అనే విషయంలో నాకు సందేహం ఉంటుండేది. పెళ్ళైన క్రొత్తలో, ఎవరూ లేని సమయాన్ని చూసి, ఆమె చుబుకం(గడ్డం)ను సవరిస్తూ "ఏమేవ్... నాతో సరససల్లాపాల్ని ప్రారంభించవే" అని ప్రేమను వ్యక్తపరచే ప్రశ్నను వేస్తే, ముఖాన్ని ఎటెటో తిరిగిస్తుండే మూగప్రాణిగా ఆమె ఉండేది. పిల్లలు ఒకరి తర్వాత ఒకరు కలుగుతుంటే (పుట్టుంటే) ఆమెలోని మాటల బలం ఎక్కువగాసాగింది. సంతానవృద్ధి సంఖ్య జతగా మాటలలోని రభస గడుసు గాసాగింది. ఏడుగురు పిల్లల్ని కానుకగా ఇచ్చిన మీదట మూగతనం నాకు; గడుసరితనం

ఆమెకూ చేరుకొన్నవి! నా చెవులలోని వినికిడిశక్తిని మిగుల్చుకొనేది ఎలాగున అనేది పెద్ద యోచనగా నాలో జనించసాగింది. ఒక్కొక్కసారి వెంకమ్మకు ఆవేశం వచ్చిందంటే, సూరులో ఉండే పెంకులూ లేచి నాట్యాల్ని చేసే ఆసక్తిని తోర్చుతున్నవేమో అన్నట్లుగా నాకు అన్పిస్తుండేది. బయటుండే చరాచర ప్రపంచమూ ఆమె సన్నిధి నుంచి పలాయనం చేస్తున్నవన్నట్లుగా కనబడుతుండేవి నా కళ్ళకు. నేను బయటన ఉండే ప్రపంచంలోని స్వతంత్ర్య ప్రాణినైతే కాదు అని అనిన మీదట, నేను పారిపోయేది ఎలాగున? ఎక్కడికి పారిపోగలను? అప్పుడప్పుడు ఆమె మీద నా మనస్సులో అసహ్యం, హింస, సహించుకోలేని కోపం వస్తుండేవి. కోపాన్ని నా నాలుక నుంచి బయటకు పడేసే ధైర్యం వచ్చినా, అది నా ప్రవృత్తిలో లేదుకదా! త్రికరణ శుద్ధిగా అహింసే నా పెట్టుబడి అండి. ఇందువలనే 'అలారం వాచ్' అనే తమాషా పేరును పెట్టి వెంకమ్మమీద ప్రతీకారంను తీర్చుకొంటుండేవాడ్ని!

నేను మౌనంగా ఇంట్లో సంచరిస్తున్నా (తిరుగుతున్నా) ఆమె ఒక్కతే ఎలాగున... ఏ కారణంకని... మాట్లాడుతుంది అనే సహజమైన ప్రశ్నె నాలో జనిస్తుండేది. వెంకమ్మ నడతను తెల్సుకొన్నోళ్ళకు జవాబు సులభమేలే. నేను ప్రభాత కాలంలో తొందరగానే లేస్తే "ఏమిటండి.... పిల్లల తరహాగా? మంచు పడుతుంది; చలిగాలి రివ్వున వీస్తుంది; బాగా రగ్గును కప్పుకొని పడుకోండి" అనేవి వెంకమ్మ నుంచి ప్రీతి పూర్వకమైన కట్టు ఆజ్ఞెలుగా ఉండేవి. ఒకవేళ బద్ధకిస్తూ లేస్తే, "సూర్యనారాయణ పై కొచ్చి రెండు గంటలైంది; ఇంకా కుంభకర్ణుడిలాగ నిద్రేనా?" అనే ఉపమాలంకార ఘోషణ ఆమె నుంచి వచ్చేది. ఉత్తిగనే కూర్చుంటే పొదుగుతో ఉన్న కోడిలాగ ఏమిటి ఆ భంగిమ అనో; లేచి వంటా – వార్పుకు సహాయపడుతానంటే.... భార్య నుంచి ఏ వంటలు కుదరవు; అన్నీ నా నుంచే వంటలు జరుగుతవి అని బయట వ్యక్తులనుంచి సానుభూతిని గిట్టించుకొనేందుకే ఈ తంతు అని అంటుండేది. మౌనంగా కూలబడి కాఫీని త్రాగుతుంటే పొడి ఎక్కువైందా.... చక్కెర ఎక్కువా? తక్కువా అని అడుగుతుంటే, ఏమి చెప్పేందుకు కుదరకు నేను తడబడగా "అయ్యయ్యో నోట్లో వేలేసుకొన్న బాలుడండి" అని అంటుండేది. ఆమె నుంచి వచ్చే ప్రశ్నెకు ఏదో జవాబును చెప్పేందుకని చక్కెర ఎక్కువైంది... డికాక్షన్ తక్కువగా ఉందని అంటే, ఆహా... అలాగండి; నాకు కాఫీని కాసేందుకు రాదులే. బాగా కాఫీని తయారు చేసే కొత్తామె నొకదాన్ని అర్థాంగిగా చేసుకోండి అని మూతి విరుపుల్ని చేస్తుండేది. వెంకమ్మ వాక్కులలోని జాలాన్ని ఎంతగానో నేను వర్ణించొచ్చు. కథకు సరిపడేంత మట్టంలోనే నేను చెపుతున్నానండి. ఆమె నుంచి విసిరిన జాలం (వల) లో ఇరుక్కొన్న ఒక భీతహరిణి(జింకను)ని నేను కదా?...!



వెంకమ్మకు మడి, మైల.... ఈ ఆచరణలలో విశ్వాసం ఎంతగానో ఉంది. దుకాణం నుంచి సరుకుల్ని తెస్తే అవి ముట్టుకోటానికి వీలుగాని జాతి జనుల సర్శెనుంచి అశుద్ధమైనవనే కారణంతో నేను శుచి స్నానంను చేసే ఇంటి లోపలికి ప్రవేశించాలనే కట్టుబాటు; ఒక వేళ స్నానం నాకు కుదరకపోతే నీళ్ళనుంచి ప్రోక్షణ అయినా చేయాల్సి వస్తుండేది. ఆ సరుకుల కన్నా ఎంతో ఎక్కువగా విలువ ఉన్న సరుకైన నేను, బజారు నుంచి వచ్చి స్నానం చేయకముందే నా గది నుంచి ఆమె సామ్రాజ్యంలోని భాగంకు కాలు పెట్టగూడదు; వంటగదికంటూ ఎంతో దూరానే నిలబడాలి. నెల నెలా అశౌచంలోని మూడు రోజులు (ముట్టు దినాలు) గడిచి, నాల్గో రోజంతా వెంకమ్మలోని శుద్ధికీ... ఇంటిలోపల ఉండే సకల పదార్థాల అశుద్ధికీ పోటాపోటీగా సమరం నడుస్తుండేది. ఆమె ముట్టులో ఉన్నానని బయటనే కూర్చున్నప్పుడు నాలాంటి ఆచార భ్రష్టుడు ఏమి చేసేందుకు కుదిరేదిలేదు? అనే సందేహం (డౌట్) నుంచి మొత్తం ఇంటి మీదంతా యుద్ధాన్ని చేసేది ఆమెకు సాంప్రదాయంగా ఉందిలే. నాలుగో రోజున ఆమె శుచి స్నానం అయిన మీదట ఇంట్లో ఉన్న అన్ని వస్తువులమీద, అటకమీద, పొయ్యి మీద, అంట్లుతోమే జాగా మీద, పడకగది మీద.... ఇలాగున అన్ని చోట్లా ఆమె నుంచి సంశోధనం జరగాల్సే ఉంది. వీటి మధ్యన ఇరుక్కొని జీవిస్తుండే పిల్లులు, ఎలుకలు, పంది కొక్కులకు మంచం, మేజాబల్ల, కుర్చీల సంధులలో భద్రంగా దేరాను వేసుకొన్న నల్లులకు వేడి నీళ్ళ శుద్ధోదక స్నానం జరిగేది ఆమె నుంచి నెరవేరుతుందిలే. ఇలాగున నేను చెపుతున్నాను అని పాఠకులారా.... మీరు నన్ను ఆడిపోసుగోకండి; వెంకమ్మలోని తీక్షణ చూపుల ముందు ఏ అశుద్ధం ఎలాగున తనంతటతానే ఉండిపోగలదు? "మీ చేష్టలన్నీ అధికమండి.... ఒక విధంగా పిచ్చేనండి..." అని తోటి మహిళలు నా ప్రీతి పాత్రమైన వెంకమ్మను అపహాస్యం చేస్తున్న దాన్ని నా చెవుల నుంచీ విన్నానండి. పిచ్చిదో, మొండిదో.... ఎవరికి తమ కర్తవ్యంలో వెంకమ్మకు ఉండేంత అచలమైన నిష్ఠ ఉంటదో, అటువంటోళ్ళకు అపజయం వచ్చేది లేదులేండి. వెంకమ్మకు ఉండే శ్రద్ధ ఇతరులకు పిచ్చిగా కనబడితే ఏమిటట? ఈ పిచ్చి పనుల సాధనకని పడే కష్టం, చేసే శ్రమ త్యాగంను చూసేది అదొక అదృష్టమే కదా! ఇంతటి అచలమైన నిష్ఠనే స్మరించుకొంటూ బయట జనంకు పిచ్చిగా కనబడే ఆమె వికల్పాన్ని నేను మరిచిపోయేదే మంచిది కదా! ఈ గుణాలనుంచే నేను వెంకమ్మ జతగా కొంగుచాటు మొగుడుగా సంసారం సాగిస్తూ బతుకు బండిని నెట్టుకొస్తున్నానండి.

ఇంట్లోని వ్యవహారాలలో చెప్పేపనులు, చేసే పనులు.... అనే రెండు కర్తవ్యాలుగా మనం వాటిని విభజించుగోవచ్చు. మన హిందూ సమాజంలోని క్రూర పద్ధతి ఫలంగా

చెప్పేవాడు మొగుడు.... వినేవారు భార్య అనే సాంప్రదాయం మనలో అనాదికాలం నుంచి చాల్తీగా ఉంది కదండి! ఈ అనాదికాలం నుంచి జారీ అయ్యే పద్ధతిలోని హక్కులను పాలించే బుద్ధి ఒక పక్షం (పార్టి) నుంచి లేనట్లైతే, ఇంట్లో రౌరవ నరకమే ఉద్భవిస్తది. నేను ఈ అకార్యానికి స్థానం కల్పించే మనిషినైతే కాదులే. చెప్పేది, చేసేది.... ఈ కర్తవ్య భారాల్ని మార్పు చేసుకొన్నాము. చెప్పేది ఆమె నుంచే; ఆమె చెప్పినట్లే (చేసేది) నడుచుకొనేది నేను... అనే గృహ సూత్రం నన్ను సజీవ స్థితిలో ఉంచిందండి. ఆమె వడ్డించితేనే భోజనం; ఆమె త్రాగండి అంటేనే కాఫీ; ఇవిగో ఇవి కట్టుకోండి అంటేనే ఆ క్రొత్త బట్టలు; చిరుతిండికి జిహ్వ వేస్తుందా మీకు అని అడిగితేనే నాకు జిహ్వా చాపల్యం అండి! ఆమె అడగకపోతే లేదులేండి! ఆమెలోని మనోప్రవృత్తి విచిత్రం ఎలాగున ఉన్నా, అది నాకొక విధంగా సంయమ శక్తిని ఇచ్చిందనేది నేను నేరుగా మర్చిపోకుండా చెప్పగలనండి మీకు! ఇంటి నుంచి బయటకు అడుగుల్ని వేస్తే, నేరుగా ఆఫీస్‌కే వెళ్తాను. స్నేహితులతో సరస విరసాలు ఆఫీస్‌లో ఉంటవి. రాతకోతల నుంచి కాగితాలు నలుపుకు మార్పు చెందుతవి నా శ్రద్ధ నుంచి. చెవి మీద విశ్రాంతిని పొందాలని ఆరాటపడే కలం (పెన్) సాయంత్రం ఆఫీస్‌లోని డెస్క్‌లోపలికి భద్రంగా చేరుకొంటది. ఇక ఇంటి దారినే మరలా పట్టుతాను. ఇంటికి ఎదురుగా ఉండే రోడ్‌కు చేరే వరకూ నేను సర్వతంత్ర సార్వభౌముడ్నే. స్వచ్ఛంద జీవినే. ఇంట్లోకి అడుగు పెట్టిన తక్షణమే పూర్తిగా సంయమ జీవిగా మారుతాను. ఈ రీతిగా పరస్పర విరుద్ధమైన గుణాలను కలగాపులగంగా ఉంచేసుకొని బతుకును సాగించాలి అని నేర్పింది నా అర్ధాంగైన వెంకమ్మేనండి! 'మహాసాధ్వి' అండి! ఈ ప్రపంచంలోని గాలి వెలుతురులలో ఊపిర్ని పీల్చుకొంటూ, రోజు రోజుకూ పెరుగుతూ శ్రమించేదానికి మాత్రం దేవుడు నాకు శక్తిని ఇచ్చాడులే. మిగలిన దంతా వెంకమ్మ అనుగ్రహం నుంచే నండి! అని ఒకొకసారి అనుకొంటుండేవాడ్ని. తెచ్చిన నెల జీతాన్ని ఆమె పాద మూలంలో దేవికి భక్తుడు కానుకగా అర్పించుకొన్నట్లుగా నేను సమర్పించుకొంటుండేవాడ్ని! ఇలాగున చేస్తేనే నా కడుపు నిండేందుకు ఏ కష్టమూ వెంకమ్మ నుంచి వచ్చేది లేదులే. ఉదరం (కడుపు) నిండే సమస్య ముగిసిన మీదట మరిక ఏ సమస్య ఉంటదండి కొంగుచాటు మొగుడికి? మీరే చెప్పండి పాఠకులారా....!

దేవుడి దయ నుంచి నా అర్ధాంగి వెంకమ్మకు మొట్ట మొదలు ఆరోగ్యం బాగానే ఉండేది. ఆమెకు తల నొప్పి అయిన సందర్భంలోని జ్ఞాపకం కూడా నాకు లేదులే. 'నా అలారం గడియారంకు వంద సంత్సరాలు గ్యారంటీ' అని గర్వ పడుతుండేవాడ్ని. పిల్లలకు (వారసులకు) చిన్నా చితకా రోగాలు వస్తే ఆమె పోషణ నుంచే అవి పారిపోయేవి. పిల్లలలో ప్రవేశించి విజృంభించాలి అనే రోగాలు కూడా ఆమె గడుసుదనానికి బెదిరి దూరం నుంచే పలాయనం చేసేవి. "కనిష్టుడు (చివరోడు) నారాయణకు ఈ రోజు తలనొప్పి ఉంది; డాక్టర్ నుంచి మందు త్రెచ్చాను. రెండు రోజులు స్నానంను చేయించకు" అని ఆమెతో అంటే ఆ చంటోడికి నలుగు పెట్టి కుంకుడు కాయల రసంతో తలస్నానం చేయించి, త్రెచ్చి ఇచ్చిన ఔషధాన్ని అటెటో బయటకు విసిరేసి, కరక్కాయ రసంను త్రాగించి, కడుపు నిండా ఆవు నెయ్యి – కరివేపాకు కారంను వేడి అన్నంలో కలగలిపి వాడికి తిండిని పెట్టింది ఆమె పద్ధతిగా ఉందిలే. "రోగాలకు బెదరగూడదు; పిరికోళ్లలాగా బెదిరి అన్నపానాల్ని వదిలి మంచాన పడితే శరీరం కృశించిపోదా! శరీరం బక్కగా అయితే రోగం ఉత్తిగనే కూర్చుంటదా? దాని నుంచి ఆ కీటాణువుల ప్రతాపం ఎక్కువౌతది కదా" అనే తర్కం వెంకమ్మ నుంచి వస్తుండేది. డాక్టర్ల మాటలో ఆమెకు నమ్మకం ఉండేదిలేదు. జనంకు రోగాలు రాకపోతే, మందులు ఖర్చుగాకపోతే డాక్టర్లు ఎలాగున బతుకుతారు? అందుచేతనే రోగాల్ని సృష్టించేదే డాక్టర్ల పని. ఉపవాసాల్ని చేయించి ఒకటికి రెండు మాయమాటల్ని చెప్పి, ఆ రోగం వచ్చినోళ్ళను కృశింపజేసి, వాళ్ళనుంచి డబ్బును వలిచేది (పీకేది) ఆ డాక్టర్లకు వృత్తిగా ఉంటది లేండి! తమ సంపాదనా వృత్తికి విరుద్ధంగా ఆ డాక్టర్లు నడుచుకొంటారా? డాక్టర్లు అలాగున ఎందుకు వలలను విసురుతారు జనం మీద? అనే ప్రశ్నలను వేస్తుండేది ధాటిగా వెంకమ్మ. ఈ ప్రశ్నలకు నాలాంటోడి నుంచి ఎలాగున జవాబులు వస్తవండి?

పిల్లలకు వచ్చే రోగాలలో ఒకటి (టైఫాయిడ్) వెంకమ్మలోకి ప్రవేశించింది. నేను ఆఫీస్‌కు వెళ్ళే సమయంలో వెంకమ్మ నా చెంతకొచ్చి 'తలనొప్పి' అని అంది.

ఆమె అలాగున చెపుతుందంటే శిరోవేదన (తలనొప్పి) ప్రబలంగానే ఉండొచ్చని నేను ఊహించుకొన్నాను. మంచిగా మిరియాలు, జీలకర్ర, శొంఠి.... కలగలిపి చేసిన రసంలోని ధాటి నుంచి కొట్టుకొని పోనటువంటి బాధ (నొప్పి) వెంకమ్మను పరాజితురాలికి చేసియుండొచ్చు. "డాక్టర్ గారి నుంచి ఔషధం తీసుకురానా?" అని అడిగాను. "ఔషధమే? ఏదేదో గొడ్డు మాంసాన్నో, స్పిరిట్ (మొలాసిస్)నో కలగలిపి చేసిన ఇంగ్లీష్ ఔషధాన్ని త్రాగే బదులు శుచిగా ప్రాణం వదలటమే లేసు (మంచిది) కదా...." అని మరు (ప్రతి) ప్రశ్నను వేసింది వెంకమ్మ. ఇంగ్లీష్ ఔషధంను తీసుకొని ఆచారంను చెడగొట్టుకొని చచ్చే గొర్రె మందలు (పిచ్చిరోగులు) మీద కనికరంను చూపించే భావం ఆమె ముఖంలో కనబడుతుంది.

సాయంకాలం ఇంటికి యథాప్రకారం చేరుకొన్నాను. ఠణ ఠణ మంటూ మ్రోగే నా జీవన గడియారం సప్పుడ్ను చేయట్లేదు. గదిలోపల చాప మీద ముసుగు వేసుకొని పడుకొని ఉంది వెంకమ్మ. భయంగా లోనికి జొరబడ్డాను.

“మైల బట్టల్ని విడిచి శ్రద్ధగా శుచి స్నానం చేసి లోనికి అడుగుల్ని వేయండి. ఇలాగున నానాదారులలోని మైలతో ఇంట్లోకి ప్రవేశిస్తే ఇంటి దేవుడికి అశుద్ధం కలుగతదికదా” అని ఆమె అరిచింది.

మనుషుల ధార్మిక మనోభావాలకు విరుద్ధంగా చేసేది మహా పాపమని ఇండియన్ పీనల్ కోడ్ ఒత్తి చెపుతుండగా, నేను సర్కారులోని విధేయుడైన (ఉద్యోగి) వ్యక్తి అయినందున, శాసనంను ఉల్లఘించేది నా నుంచి అవుతదండీ? ఆమె విధించిన ఫర్మానాకు అనుగుణంగానే నేను స్నానం చేసి ఆమె చెంతకు చేరాను. రోగిణి (వెంకమ్మ) చేతిని ముట్టుకొని చూడగా జ్వరం సలసల కాలిపోతున్నట్లుగా కనబడింది నాకు.

“డాక్టర్ గారి వద్దకు వెళ్ళి మందు తెస్తాను వెంకమ్మా... నీ వళ్ళు విపరీతంగా కాలిపోతుంది.”

నాకొచ్చిన జ్వరానికి వైద్యుడి మందు పని చేయదండి. అప్పుడొకసారి నారాయణుడికి జ్వరం వచ్చినప్పుడు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేస్తామని మ్రొక్కుకొన్నాను. ఆ వ్రతాచరణ నెరవేరలేదు. సత్యనారాయణ స్వామి కోపం ఇలాగున నా మీద దాడి చేసింది. ముందు వ్రతాన్ని చేయించండి. వేరే ఏ మందులూ వద్దు. మనుషులకు ఇలాగున విపత్తులు రాకుంటే దేవుడు గుర్తుకు వస్తాడా? అంది వెంకమ్మ. దేవుడికి తినే ఆశె పుట్టినప్పుడు, అతను (దేవుడు) మనుషులను వ్యాధి గ్రస్తులుగా చేస్తాడు. అర్పించిన నైవేద్యాన్ని స్వాహా చేసి సమర్పించిన కానుకల్ని తన హుండీలో నింపుకొన్న మీదటే తన నుంచి వ్యాపింపజేసిన రోగాన్ని మరలా వెనక్కి లాక్కొంటాడు అనేది వెంకమ్మ లోని స్థిరమైన విశ్వాసంగా ఉండగా, ఆమె విశ్వాసాన్ని నేనెందుకు భగ్నం చేయాలి? డాక్టర్‌కు ఇచ్చే ఫీజులో ఒక పావు భాగం దేవుడికి ఇస్తే అదే మంచిదేమోలే! మనుషులలోని రోగ నివారణకని ఖర్చు బెట్టే డబ్బులో కొద్ది భాగాన్ని దేవుడి ప్రసాదం కని వినియోగించుతానులే. రోగం మటుమాయమైయ్యేది; దేవుడి పూజ... ఈ రెండూ లభిస్తవేమో చూడాలి వెంకమ్మ హఠం నుంచి.

మరుసటి రోజే సత్యనారాయణ స్వామి పూజ. మహాలింగ శాస్త్రిగారు మైసూరు పట్టు పీతాంబరంను కట్టుకొని, చంకలో దర్భల కట్టను ఇరికించుకొని వచ్చారు. ముక్కోటి దేవదేవతల మీద విశ్వాసమున్న వెంకమ్మ పిలుపును మన్నించేదాంట్లో శాస్త్రి గారికి ఎంతో ఆసక్తి ఉందిలే.

రాత్రి పది గంటలకు పూజ ముగిసింది. ప్రసాదంను పంచటం జరిగింది. పూజ జరుగుతున్నంతసేపూ, కథను వింటూనూ రుచికరమైన సువాసనలను వెదజల్లుతున్న పిండి వంటల మీదే వెంకమ్మ నుంచి దృష్టి పడుతున్నందున ‘ప్రసాదంను వెంకమ్మకు ఇవ్వకండి’ అని నేను చెప్పితే శాస్త్రి గారు నా మాటను ఒప్పుగొంటారా? వెంకమ్మ అయితే ‘వద్దు.... వద్దులే’ అని అంటదా? శాస్త్రిగారికి నా లాంటి మూగ ప్రాణి (కొంగుచాటు మొగుడు) మీద దయ ఉందో లేదో చూద్దామని ఇలాగున అడిగాను.

“శాస్త్రిగారూ.... ఆమెకు జ్వరం విపరీతంగా ఉంది; మూర్ఛే రావచ్చని నాకు అన్పిస్తుంది; రుచికరమైన భక్ష్యాల్ని (పిండి వంటల్ని) ఆమె తింటే ఏమౌతుందో?”

“దేవుడి ప్రసాదం అపథ్యమని ఏ వైద్య శాస్త్రం చెప్పగలదు? జ్వరం నయమవ్వాలనే కదా పూజ చేయించింది? ప్రసాదంను స్వీకరించకుండా ఉంటే పూజా ఫలం కలుగుతదా? ఎంతో లోకానుభవం ఉన్న మీరూ నాస్తికులు లాగ ప్రవర్తిస్తే అది పద్ధతేనా? తిననీయండి; ఒక ముద్ద తిననీయండి; రేపే రోగం నుంచి విముక్తి పొందుతది” అంటూ శాస్త్రిగారు వెంకమ్మ తరుపునే మాట్లాడారు.

“శాస్త్రిగారూ.... ఈ చదువుకొన్నోళ్ళందరికీ పిచ్చేనండి! జీవితంలో ఊపిర్ని బిగబట్టి ఎంతో హైరాణా పడ్తూ శ్రమించి సంపాదించిన డబ్బంతటిన్నీ డాక్టర్ల పాదాల వద్ద కుమ్మరించటమే వీరి నుదుటన బ్రహ్మ లిఖితంగా ఉంది కదండీ. చూడండి.... డాక్టర్, విశ్వేశ్వరరావ్‌గారిని ఊరికి ఊరే పొగుడుతది. అయితే ఆయన ఏకైక పుత్రుడు జ్వరం నుంచి స్పృహ కోల్పోయి, నోటి నుంచి ఔషధమే జారనప్పుడు వైద్యం ఆ బాలుడ్ని బతికించిందో లేక ధర్మస్థళంకు మ్రొక్కిన మ్రొక్కు బతికించిందో.....” అంటూ తన నడతకు, వాదంకు సరైన ఆధారాన్నే ఇచ్చింది నా ఇల్లాలు.

శాస్త్రిగారు వెంకమ్మ నుంచి జాలు వారిన ఈ మాటలకు ఉత్తేజితుడై, ఆమె నుంచి జ్వరం తొలగిపోవాలని ప్రసాదంను ఇవ్వనే ఇచ్చాడు.

“నారాయణ.... సత్యనారాయణ.... జగద్రక్షక.... సర్వాంతర్యామి.... రేపే నా రోగాన్ని నయం చేయ్యి....” అంటూ ఆ భక్ష్యాల్ని తీసుకొని, ఒక లోటా పంచామృతంను త్రాగి అక్కడే పడుకొంది వెంకమ్మ. నా మనస్సంటూ అల్లకల్లోలమైంది. ఒకవేళ దేవుడి ప్రసాదమైన

ఈ భక్ష్యాలు, పంచామృతం నుంచి రోగ నివారణ అవుతదని ఒప్పుకొన్నా, ఇప్పుడు వెంకమ్మ తీసుకొన్న డోస్ (పరిమాణం) అత్యధికమైందని నా అభిప్రాయంగా ఉంది. అయితే నా ఈ అభిప్రాయాన్ని చెప్పేది ఎవరికి?

మరుదినంలో నేను మేల్కొన్న తక్షణమే వెంకమ్మలోని నాడిని పరీక్షించాను. నాడి పరీక్షలో నాకు పరిణితి అంతగా లేకున్నా, వెంకమ్మలోని జ్వరం మితిమీరింది అనేటట్లుగా తెలిసింది. ఆమె దేహంలోని రక్తం కాసిన సీసంలాగ కుతకుతలాడుతుంది. ఆమె గుప్పిటిలో నాన బెట్టిన వడ్లగింజల్ని ఉంచితే అవి పేలాలుగా మారుతవి అన్నట్లుగా ఆమె వంట్లో వేడి అలాగున ఉంది. నేను భయపడ్డాను. ఆమె దేహాన్ని కదిలించి "ఏమోయ్.... ఎలాగున్నా వోయ్" అని అడిగాను.

"ఆ.....హా.... బాగానే ఉందిలే. 'పూజ అయిన నాలుగు రోజుల లోపు గుణం చెందగలను' అని శాస్త్రిగారు చెప్పారుకదా! మీకెందులకు సంశయం?" అనే క్షీణ స్వరంతో ఆమె నుంచి జవాబు వచ్చింది.

"ఇకనైనా హఠం వద్దు.... వెంకమ్మా! రోగాల బారిన పడినోళ్ళు, చిన్న పిల్లలు ఒకటే స్వభావం వాళ్ళు అనే లోకోక్తి ఉంది కదా! నామాటను విను సుమీ; డాక్టర్‌ను పిల్చుకొస్తాను".

"అయ్యో పిచ్చి నాథుడా... సత్యనారాయణ స్వామికన్నా ఈ డాక్టరు బుద్ధివంతుడా?"

"దేవుడి వ్రతం ఫలితాన్ని ఇచ్చినట్లులేదు వెంకమ్మా... నీకు నయమయ్యే లక్షణం కనబడుటలేదు"

"అంతటికీ కాలం కల్సిరావాలండి. మ్రొక్కును చెల్లించిన తక్షణమే గుణంను పొందితే దేవుడు ఎంతో చౌకగా అవుతాడు కదా! ఈ వ్రతం నుంచి ఫలితం దొరకకపోతే ధర్మస్థళంకు ముడుపునో.... తిరుపతి వెంకన్నకు తలనీలాలనో...." ఇలాగున ఒక న్యాయస్థానం నుంచి మరొక పైనున్న న్యాయస్థానంకు అపీల్ చేసుకొన్నట్లుగా మ్రొక్కుమీద మ్రొక్కుల్ని మ్రొక్కుకొంటూ, రోగాలు.... వాటితో పాటుగా వైద్యులందరి గర్వాల్ని క్రిందకు కుగ్గించాలనే నైజమైన ఆస్తిక బుద్ధిని సరిగానే తెలిపింది వెంకమ్మ. ఆమెలోని భక్తి అపారం. ఆమె తన భక్తిని పదిలంగానే అట్టి పెట్టుకోనీయండి. ఆమె భావాలు జతగా నా భావమైన డాక్టర్‌ను పిల్చుకొస్తే నష్టం ఏమిటట? ఆ వచ్చే డాక్టరు సత్యనారాయణస్వామైతే కాదు; అదేనండి డాక్టర్ నారాయణరావ్ గారే కదా! పెద్ద పరిమాణంలో(గాత్రంలో) ఉండే భక్ష్యాల్ని ఇవ్వడు; ఒక చిన్న మాత్రను మాత్రమే ఇస్తాడు. లోటా ప్రమాణం(సైజ్)లో



పంచామృతంను ఇచ్చేది లేదు ఆయననుంచి; అయితే ఒక చెమచా కొలతలో మిశ్రణమైన ద్రవాన్ని (టానిక్) ఇవ్వగలడు. ఆయన నుంచి వైద్యం జరగాలనేది నాలో కోరికగా ఉంది. ఈ రోజు నేను ఆఫీస్ కంటూ వేళ్ళేది అసాధ్యం. సత్యనారాయణస్వామి ఇంత ఘనకార్యంను చేసాడు. సెలవు చీటీని వ్రాసి పంపించాలని వెంకమ్మను వదిలి నా గది లోపలికి నడిచాను.

సెలవు చీటీని వ్రాసి కవర్‌లో వేస్తుంటే "నాయనోయ్.... నాయనోయ్! అమ్మలేచి పరిగెత్తుతుంది. వెర్రి వెర్రిగా!" అనే అరుపులు పిల్లల (సంతానం) నోటి నుంచి వచ్చినవి.

లోపలికి వెళ్ళి చూడగా వెంకమ్మ రూపం భయంకరంగా ఉంది. గట్టిగా (బిగుసుకుపోయి) నిలబడి పెదాల్ని కొరుకుతూ, కళ్ళను మిటకరిస్తూ "సత్యనారాయణ.... జగద్రక్షకా.... నువ్వే నా బంధువు... నువ్వే నా ప్రాణ రక్షకుడివి.... నీ ప్రసాదం నుంచే బతుకుతాను.... ఇవ్వుస్వామి.... మణుగు మణుగుల భారంగా భక్ష్యాల్ని.... గుండిగె నిండా పంచామృతంను ఇవ్వు...! శాస్త్రిగారూ రండి... సత్యనారాయణ స్వామి ప్రసాదంను ఇవ్వండి.... ఇవ్వకపోతే మీ ముప్పై రెండు దంతాల్ని రాలగొట్టాను" అని అరుస్తూ ముష్టిని బిగించి నిలబడింది వెంకమ్మ. ఆమెలోని ఈ భ్రాంతి విషయంలో నాకేమి భయం కలగలేదు. ఆమెలోని స్వాభావిక ప్రకృతికీ ఈ భ్రాంతికి ఎంత వ్యత్యాసం ఉందనేది తెల్సుకొని చెప్పేది కష్టమేనండి! మిటకరించిన ఆ చూపులు, ఉబ్బిన ఆమె చెంపలు, అస్తవ్యస్తమైన ఆమె కురులు (శిరోజాలు).... మొదలైన రెండు మూడు చిహ్నాలు (గురుతులు) తప్పితే మిగిలినవన్నీ యథాస్థితిలోనే ఉన్నవి. ఆమె నుంచి జాలువారుతున్న మాటలు దారి తప్పినవని కొందరైతే అనొచ్చు. అయితే ఆమె వాగ్ధాటిలోని అంచులలో నిలిచి చూసిన అనుభవం నాకు రెండు దశాబ్దాల నుంచి ఉన్నందున, ఆమె ఇప్పటి మాటలలోని వరస పిచ్చిదానిలాగ నాకు కనబడలేదు. పిచ్చి అనేదే విచిత్ర స్వభావంగా భావించి, ఆ పిచ్చిని, ఆపిచ్చిని పొందిన వెంకమ్మను ఇప్పుడు సురక్షితంగా వెనకటి స్థానంలోకి త్రెచ్చేది ఎలాగున? అనేది నాకు తోచట్లేదు. ఇరవై సంవత్సరాలనుంచి నాకు సహచరిగా ఉన్నామె... నా అర్థాంగైన వెంకమ్మే కదా! ఆ భావన రాగా నా కళ్ళలో నీరు తొణికిసలాడింది.

జ్వరంలోని ఘోరం అనే విషయంలో నాకేమి సందేహం (డౌట్) లేదిప్పుడు. "అమ్మను జాగ్రత్తగా చూసుకోండి.... తొందరగానే తిరిగి వస్తాను... గది లోపలే మీ అమ్మను ఉంచి బయట తలుపుకు గొళ్ళెం(చిలకం)ను వేసి వెళ్తాను... భయపడకండి.... జాగ్రత్త.... బయటకు రాకండి.... ఇక్కడే మీ అమ్మ చెంతే కూర్చోండి" అంటూ పిల్లలకు చెప్పి కళ్ళను తుడుచుకొని రోడ్‌కు చేరాను.

డాక్టరు గారు వచ్చారు. ఇంటి ప్రాంగణంలోకి వస్తుండగా భయంకరమైన గర్జన విన్పించింది. ఇంతకు మునుపు శాస్త్రిగారి దంతాలకు మాత్రమే అపాయం ఉంది. ఇప్పుడు నారాయణరావ్‌గారి దంతాల అపాయం వచ్చేది కనబడసాగింది.

మెల్లగా తలుపుకు పెట్టిన గొళ్ళెం తీసి లోపలికి ప్రవేశించాను.

"ఎవరది.... పర పురుషులు?"

"ఎవరూ కాదు, నేను.... నీ నాథుడ్ని.... వీరు...."

"వీరెవరు?"

"డాక్టర్‌గారు..."

"డాక్టర్‌గారా.... వారికి ఇక్కడేమి పని?"

"ఔషధం ఇచ్చేపని....."

"ఎవరికి?"

"ఇంకెవరికీ.... వెంకమ్మకే"

"వెంకమ్మకు మందు ఇచ్చే డాక్టరేనా ఈ పిట్టలదొర?... నన్ను బతికించే వైద్యుడు అదిగో అక్కడున్నాడు సత్యనారాయణ స్వామి... హ హ్హా హ్హా.. ఈ పిట్టలదొర..." అంటూ డాక్టర్ గారి సాలంకృత వేషాన్ని చూసి నవ్వింది.

డాక్టరుకూ వెంకమ్మ నుంచి వచ్చిన మాటలకు నువ్వు వచ్చింది. ఆయన తన తల మీదున్న యూరోపియన్ హ్యాట్‌ను తీయలేదు. ఆ టోపీని చూసి ఏదో ఒక వీధి భాగవతంలోని పిట్టల దొరవేషం గుర్తుకొచ్చి హ హీ హీ అంటూ వెంకమ్మ నవ్వి ఉండొచ్చని ఆ డాక్టర్ గారు భావించుకొన్నాడు.

"అమ్మా! మీకు బాగా ఉన్నట్లులేదు... జ్వరం ఉన్నట్లుంది... శరీరాన్ని పరీక్షించాలి. నేను డాక్టర్‌ను..."

"మూర్ఖా! పర స్త్రీని పరీక్షించేందుకు వచ్చావా?" అని గర్జించింది నా పతివ్రత. నా కళ్ళలో గంగోద్భవం అయ్యింది.

"అమ్మా... మీ చేతిని ఇటు ఇవ్వండీ! నాడిని పరీక్షించాలి"

"మూర్ఖా... నేను చేతిని ఇచ్చింది ఇదిగో వీరికి మాత్రమే; మీ పళ్ళు (దంతాలు) గట్టిగా ఉన్నవేమో చూసుకొని.... నన్ను పరీక్షించేందుకు ముందుకురండి"

ఈ మాటల్ని పలికి తక్షణమే తలుపునుంచి బయటకు పోయేందుకు ప్రయత్నించింది.



"వెంకమ్మా... వెంకమ్మా...! వీరు ఘనాపాఠి అయిన డాక్టర్‌గారు. నీకు మందును ఇచ్చేందుకు వచ్చారు. నిన్ను బ్రతికించేందుకే వచ్చారు... అంటూ గడప వద్ద అడ్డుగా నిల్చి చెప్పాను.

"పట్టణంలో దొంగ చాటుగా మాంసం తినేవాడ్ని.... వైద్యం చేసే నెపంతో వీధి వీధి తిరిగి జనం నుంచి డబ్బుల్ని వలుచుకొనే ఈ దొంగ డాక్టర్ని.... ఈ ఇంటి లోపలికి పిల్చుకొచ్చారు కదా! ఇక్కడ దేవుడు కొలువైయున్నాడు. వీరి నుంచి నా దేవుడు పారిపోతాడు.... నేనూ పారిపోతాను... బావిలో దూకి, ఆ చల్లటి నీటిలో మునిగి, శుచిగా చనిపోతాను..." అంటున్న ఆమె మాటలలోని ఆచార నిష్ఠను, శరీరం మీద ఆమెకున్న శుచిత్వ భావనలోని ఆసక్తిని కొద్దిగా ఒక ప్రక్కకు నెట్టి, ఆమె భ్రాంతిలోని మూర్తరూపంను పరిపూర్ణంగా ఎక్కడో ఒక చోటకు నెట్టి, యథారూపంగానే ఆమెను చూడసాగాను.

డాక్టరుగారు నవ్వుతూ "కృష్ణయ్యా! నేను ఇక పరీక్షించే అవసరం ఏమి లేదయ్యా. ఆమె ముఖం చూడగానే గుర్తైంది.... స్పృహ కోల్పోటం.... విషం ఆమె నెత్తికి ఎక్కటం.... ఈ చేష్టలు జ్వరంలోని తీవ్రత నుంచే గాని ఆమె బుద్ధి నుంచైతే మాత్రం కాదులే. నేను ఔషధాన్నైతే ఇవ్వగలను; ఆమె ఆ ఔషధాన్ని త్రాగాలి కదా... శుశ్రూషను ఎంతగానో చేయాల్సి ఉంది; బెడ్ రెస్ట్ ఎక్కువగా ఉండాలి; బెడ్ మీద నుంచి దిగేందుకు ఒప్పుగో కూడదు. ఇవన్నీ ఇక్కడ ఈ ఇంట్లో ఆమెకు చేసేందుకు కుదిరేది లేదు? మహిళల ఆస్పత్రికి తీసుకెళ్ళండి... స్పృహ కోల్పోయే ఈ టైపాయిడ్ జ్వరం నుంచి చివరివరకూ కచ్చితంగా రోగి గుణం చెందాడు అని చెప్పేందుకు వీలేలేదు. నాడి ఆగింది అని చెప్పిన మీదటా బతికినోళ్ళు ఉన్నారు.... అపాయం తప్పిందిలే అని చెప్తే గుటుక్ మని పరలోకంకు వెళ్ళినోళ్ళు ఉన్నారులే..." అని చెప్పుకు పోసాగాడు.

ఆ మాటల్ని విన్న నాకు, జ్ఞానం వచ్చిన మీదట చిన్న శిశువులాగ ఏడ్చింది ఆ రోజున మాత్రమే.

వెంకమ్మలోని పిచ్చి మరింతగా ప్రకోపంను పొందింది. ఆస్పత్రికి తీసుకెళ్ళాలని మోటార్ బండిని తెచ్చేటప్పటికి ఆమె స్మృతి తప్పింది అనేది కనబడసాగింది. ఏవేవో అవ్యక్త శబ్దాలు ఆమె నోటి నుంచి బయటపడుతున్నవి. "కాలం.... కలియుగం.... మడి.... మైల... దేవుడు... ధర్మం...నీతి..." ఇలాగున ఒకొక శబ్దం స్పష్టంగా ఆమె నోటి నుంచి బయటపడుతున్నందున, కలికాలంలోని కల్మషం నుంచి పాడైపోయిన ప్రపంచాన్ని చూసి ఆ జీవి (వెంకమ్మ) హృదయం మరుగుతుండొచ్చు అనేది నాకు స్పష్టమైంది.

ఆ మహిళాస్పత్రిలోని పెద్ద డాక్టర్ ఎంతో సేపు వెంకమ్మను పరీక్ష చేసి ఇలాగున తీర్పు ఇచ్చాడు. "టైర్ పగిలిపోయిన మోటారు చక్రం ఎలాగుంటదో చెప్పండి కృష్ణయ్యగారు.....? అలాగుననే మీ శ్రీమతి స్థితి ఉందని భావించుకోండి. కాలహరణంను చేయొచ్చు అంతే. ఇక ఇప్పుడు మేము చేసేది ఏమిలేదు. మొదలు (ప్రాథమిక దశలో) డాక్టర్ నుంచి ఆమె ఔషధం స్వీకరించలేదు. ఎండిన చెట్టుకు పట్టిన అగ్ని జ్వాలలాగ ఆమెలో ఉన్న ఆ టైఫాయిడ్ లోని క్రిముల విషం వేగంగా పెరుగుతుంది. ఇప్పుడేమి చేసేది లేదు" అని తీర్పును చేసాడు (ఇచ్చాడు).

ఇక ఇప్పుడు నేను చేయాల్సిన కర్తవ్యాన్ని ఎవరూ ఉపదేశించక్కరలేదు. ఆమెలోని ధర్మ విశ్వాసం అచలమైంది; దాన్ని పాలించేందుకే ఆమె ఈ పార్థివ ప్రపంచంలోని ఏ కష్టాల్ని ఎదురించటానికి వెనుకంజె వేయలేదు. ప్రాచీన పద్ధతిలోని బాహ్యావరణంలోకి యోగసిద్ధమైన మనస్సు ఒకటి ఆమెలోని విలక్షణ స్వభావంకు ఒక విధంలోని పూజ్యతను ఇస్తుంది. తన అభిప్రాయాల్ని వ్యవహారాల్ని మహిళా స్వేచ్ఛకని ఆమె ఏమిట్ని చేయలేదు? ఎవరి చెంతనూ పోరాడలేదు? నాతో జీవితాన్ని గడిపినప్పుడు తన కర్తవ్యంలోని సనాతన ప్రీతి నుంచే అలాగున వ్యవహరించింది. ఆమె నోటినుంచి జారే ఆ సనాతన పదాలలోని వాసనను (వరుసను) దూరంగా చేసేందుకు నాకు మనస్సు ఒప్పలేదు. ఎటువంటి సుందర జీవం ఆమెది...? ప్రపంచంలో ఇటువంటి స్త్రీల సంఖ్య ఎంత ఉండొచ్చు? ఈ రోజు నేను గుర్తు, గురి లేనటువంటి పిశాచంలాగ ఉన్నాను. వెంకమ్మ ఎలాగున ధైర్యం నుంచే ఈ ప్రపంచంలో గడిపింది; చనిపోయే అంత్యకాలంలోనూ అదే ధైర్యంతో ఉన్న దాన్ని నేను ఇప్పుడు గ్రహించి (తెల్సుకొని), ఒకవేళ ఆమె నా నుంచి దూరమైతే ఆమె లాగనే నేనూ గడపాలని సంకల్పించుకొన్నాను. ఆస్పత్రిలోని మడి, ఆచారం లేని జనం స్పర్శ నుంచి ఆమె శరీరం మైల పడకూడదని ఆ రాత్రే ఆమెను మరలా ఇంటికి తీసుకొని వచ్చాను. ఇంటిని శుద్ధి చేసి కొత్త జంపఖానాను మంచం మీద పరిచి దాని మీద ఆమె (వెంకమ్మ) శరీరాన్ని భద్రంగా పడుకోబెట్టాను.

ఇప్పటికీ ప్రజ్ఞరాని ఆమెకు అదేమి ఘడియో కొద్దిగా స్పృహ వచ్చింది. పాడైన.... ప్రపంచం... మడి మైల.... జాతి నీతిలను తెలియని ప్రపంచం.... వీటిలో జుగుప్సను పొంది ఎంతో దూరం నడిచిన ఆమె వెనుదిరిగి చూసినట్లుగా నా వైపుకు ముఖాన్ని త్రిప్పుకొంది. ఆమె అంతిమ ఘడియల లోనైనా ఆమె శుద్ధాచారంలోని తత్వాన్ని నేను అంగీకరించినందున కలిగిన తృప్తి ఆమెలోని అరె ప్రజ్ఞావంతమైన మసకు బుద్ధికి తృప్తిని కలిగించియుండొచ్చు. తనకి తన ఇంట్లోనైనా కలిగిన తాత్వికమైన గెలుపు నుంచి ఆమెలో



దాగిన సుప్త జీవం(ప్రాణం)ను కదిలించియుండొచ్చు. ఆమె మెల్లగా కదిలి ఏమేమో చెప్పసాగింది.

"దగ్గరే ఉన్నారా...."

"చెంతనే ఉన్నాను సుమీ...."

"స్నానం చేసారా....."

"ఔను.... చేసాను...."

"వారసులు (పిల్లలు) జాగ్రత్త...."

"అలాగే.... నీ ఆజ్ఞే లాగే.... కాపాడుకొంటాను"

"వెళ్ళి వస్తాను.... ముత్తైదువును నేను... నోట్లో తులసి మాత నీరును పోయండి"

"ఎక్కడికి వెళ్ళి వస్తావు వెంకమ్మ?" అంటూ నేను విలపించసాగాను (ఏడ్వసాగాను)

"అదేనండీ... దేవుడు ఉండే చోటుకు...."

"భార్యకు భర్తే దేవుడు కదా....."

"ఔను.... అయితే ఏ స్త్రీ అలాగున భావిస్తుంది ఈ కలికాలంలో? ఏ భర్త తన విధుల్ని సరిగా నిర్వహిస్తున్నాడు.... అర్థనారీశ్వరుడి తత్వాన్ని ఎవరు నిష్కర్షగా పాటిస్తున్నారు? మీ పురుష జాతి చెప్పేది ఒకటి.... చేసేది వేరొకటి...."

'ఔనౌను వెంకమ్మా....! అనేక తత్వాల్ని మేము చెపుతాము. నాలుక నుంచి జారిన మాటలకు, మా బాహ్య ప్రవర్తనకు పొంతన ఉండదు" అని అన్నాను.

వెంకమ్మ రీతే వేరు. ఆమెలోని మాటలు, నడవడిక ఒకటై ఉండేవి. ఇరవై సంత్సరాలు నాకు సహచరిగా ఉంది. తన నడవడికను మెచ్చని ఈ లోకంలో ఆమె ఇంకెంత కాలం జీవించగలదు....?

"ఎవరో వస్తున్నారు.... మడితో శుచిగా ఉన్నారు.... గంధాక్షతల్ని, పుష్ప మాలల్ని వేసుకొనియున్నారు....! దేవలోకంలోని దూతలు.... పిలుస్తున్నారు నన్ను.... వెళ్తా...ను ఇక" నాలిక ఏమేమో అంటుంది.

నా శరీరం మొత్తం కంపించసాగింది.

"చివరోడు నారాయణ.... ఏడు సంవత్సరాల ప్రాయం ఉన్నోడు.... ఉపనయనం సంధ్యావందనం... సంస్కృతాభ్యాసం.... ఇలాగున నాకేమేమో తెలియజేయాలని ప్రయత్నించుతుంది.

"నీ నుంచి వచ్చిన ఆదేశంలోని ఏ ఒక్క అక్షరాన్ని మరిచేది లేదు వెంకమ్మా" – అంటూ బిగ్గరగా ఏడ్వసాగాను.

"అ...లా...గే... సుఖంగా ఉండండి...." అనే చివరి మాటలను పలుకుతున్నట్లుగా వెంకమ్మ పెదాలు కంపించసాగావి. మరలా రెండు నిమిషాల శ్వాస సంచారంలోని రభస ఎక్కువైంది. చివరికి తన నుంచి తనే నిల్చిపోయింది ఊపిరాట.

"వెంకమ్మ... వెంకమ్మ.... వారసుల్ని(పిల్లల్ని), నన్ను వదిలి ఎక్కడికి వెళ్ళావు?" అంటూ బోరున ఏడ్చాను.

జవాబు లేదు; మ్రోగుతుండే గడియారం మ్రోగట్లేదు; మూగ బోయింది. నా గుండె అదిరింది. మూడో ముల్లు జారి పడిపోయినట్లుగా ఉంది. నా మటుకు నాకు మొత్తం ఈ ప్రపంచానికే హృదయస్తంభన అయినట్లుగా తోచింది.

కొన్ని రోజుల క్రితం ఇంట్లో శబ్దాల్ని చేసే గడియారం ఉండేది; ఆమె ఉన్నప్పుడు ఒక సుందర గృహం ఉండేది. ఆ గృహంలోని గదులలో జీవంలోని ప్రీతి ఉండేది. ప్రతి యొకటి కచ్చితంగా, నయంగా, నాజూకుగా నడుస్తుండేవి. ఇప్పుడైతే ఆ సప్పుడే లేదు! అంతా శూన్యం.... ఆఫీస్ నుంచి ఇంట్లోకి అడుగుల్ని పెట్టినప్పుడు.... నడవండి మొదలు స్నానం గదికి; ఆ మీదట ఫలహారంకు రండి.... అనే గర్జనను ఎక్కడ్నుంచి వినేదుంది ఇప్పుడు. ఇప్పుడు ఏదైనా కావాలని కోరుకొంటే అటువంటి గర్జన నుంచి నన్ను ఎచ్చరించే వాళ్ళు ఎవరున్నారు? నేనొక మూగ మనిషినని మాట్లాడించేందుకు ఆపేక్షించే ప్రాణి (నా జీవిత సహచరిణి) ఇంట్లో లేదు కదా... ఇప్పుడు ఇల్లు శూన్యం; మనస్సు శూన్యం; శూన్యమూ శూన్యంతోనే మాట్లాడుతుంది.

కాదు.... కాదులే అలాగున. పది సంవత్సరాలలో ఏడుగురు పిల్లల్ని కని పెంచి నాకు తోడుకని వదిలేసిపోయిన నా వెంకమ్మ స్మృతి చిహ్నంగా ఆ నా (మా) వారసుల్ని పెంచి సుశిక్షితులుగా చేసేదే ఇప్పుడు నాకు కర్తవ్యంగా ఉందిలే. ఈ కర్తవ్య నిర్వహణలో మరొక స్త్రీ నా జీవితంలోకి ప్రవేశించేది లేదులే. అంతిమంగా నా నుంచి దూరమై దేవుడి పాదాల్ని తల్పిన (ముట్టిన) నా వెంకమ్మకు ఇచ్చే నివాళి ఇదేనండి పాఠకులారా....!

❁ ❁ ❁

1934 లో 'హొడెయువ గడియార' అనే పేరుతో కడంగోడ్లు శంకర భట్టుగారి నుంచి కన్నడ భాషలో ఈ కథ రచించబడింది.



ఇంగ్లీషు భాషలో షేక్స్‌పియర్ (Shakspear) గారి రచనలు ఏ విధంగా విస్తృతంగా విశ్లేషణలకు గురైనవో, అలాగుననే శంకర భట్టు గారి నుంచి జాలు వారిన ఈ అమృత కథ కన్నడ భాషాలోకంలో విస్తృత చర్చలకు లోబడింది.

హైస్కూల్, ఇంటర్, డిగ్రీ స్టూడెంట్‌లకు ఈ కథ కన్నడ భాషా అధ్యయనంలోని పాఠ్యకథల విభాగంలో చేర్చబడింది అప్పటి నుంచి ఇప్పటి వరకు.

గిరడ్డి గోవిందరాజు గారి నుంచి 'మరెయ బారద హళెయ కతగళు' (మరచిపోలేని పాత కథలు) అనే పుస్తకం నుంచి ఈ కథను అనువాదంకని స్వీకరించాను.

ఈ కథను గురించి గోవిందరాజు గారి విశ్లేషణ అద్భుతంగా ఉంది. మొదలే అనువాదం నా ప్రక్రియ. పై పెచ్చు అంతటి వ్యక్తి విశ్లేషణను నేను తీసుగోకుండా, తెలుగు పాఠకుల విశ్లేషణకే నేను మొగ్గు చూపుతున్నాను. పాఠకుల మేధస్సుకు ఈ కథ ఒక వస్తు మూలంగా ఉంటదని భావించుతున్నాను.

– 0 –

13-02-10
శాఖమూరు రామగోపాల్